# శ్రీమతి వేమూరి(దాసు) శారదాంబ గారు

**(మే 3, 1881-డిసెంబర్ 26, 1899)**



## జీవితం మరియు సాహితీ వైభవం



## పుస్తకాలు, పత్రికలు మరియు ఇతర ప్రచురితమైన వ్యాసములు

(వ్యాసము కొరకు శీర్షిక (Title) మీద Click చేయండి)

1. వేమూరి శేషమాంబగారు (శారదాంబ) **('ఉభయ భాషా ప్రవీణ' ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ).** ఆంధ్రకవయిత్రులు, P.99-102, 1958, (3-6).
2. Late Smt Vemuri Saradamba, D/o Mahakavi Dasu Sreeramulu - Compiled by **Dr. Madiraju Subbarao.** Yendaro Mahanubhavulu, pp 79-80, 2009 (7)
3. Vemuri Saradamba **by B.Suguna.** (Women's Movements, Chapter 7. P .132-155. New Delhi, Discovery Pub.2009.
4. స్త్రీజన క్షేమార్థి శ్రీమతి వేమూరి శారదాంబ **(డా. దాసు అచ్యుతరావు).** వార్త, డిశెంబరు 26, 2014
5. అలనాటి అభ్యుదయవాది స్త్రీవిద్యాహితైషి: శ్రీమతి వేమూరి శారదాంబ. **(డా.దాసు అచ్యుతరావు).** సాహితీ కిరణం మాసపత్రిక, మే 2015
6. Vemuri Saradamba: Champion of Girl's Education **(Dr. Dasu Atchuta Rao)** TRIVENI, Vol.84, No.3, Jul-Sept. 2015
7. వివక్షపై గళమెత్తిన ధీరవనిత వేమూరి శారదాంబ **(డా.దాసు అచ్యుతరావు).** ఆంధ్రభూమి, మే 3, 2016
8. సంస్కరణోద్యమ భావజాలానికి, మహిళా ఉద్యమ ఆకాంక్షలకు లంకె వేమూరి శారదాంబ **(ఆచార్య కాత్యాయనీ విద్మహే).** నవ తెలంగాణా, డిశెంబరు 2017
9. సాహస బాలకవయిత్రి – శ్రీమతి వేమూరి (దాసు) శారదాంబ - **(డా. దాసు మధుసూదన రావు).** Facebook Post, డిశెంబరు 26, 2021
10. మహిళామూర్తులు - రాజ్యాంగ స్ఫూర్తులు - **(డా. జె. కనక దుర్గ).** ఆంధ్ర జ్యోతి, మార్చ్ 08, 2020
11. ఆధునిక యుగానికి ప్రథమ కవయిత్రి వేమూరి శారదాంబ - **(డా.జె. కనక దుర్గ).** ఆంధ్రజ్యోతి 21.3.2022
12. అభ్యుదయ సాహితీ సరోవరంలో సౌగంధికం - శ్రీమతి వేమూరి (దాసు) శారదాంబ. **(డా.దాసు మధుసూదన రావు).** Facebook Post, డిశెంబరు 26, 2022
13. వనితా వికాసానికి విద్యయే వరము అని వక్కాణించిన విదుషీమణి శ్రీమతి వేమూరి (దాసు) శారదాంబ. **(డాక్టర్ ఆర్.వి.కుమార్).** మార్చి 8, 2023 ('రసజ్ఞ భారతి' వారి సౌజన్యంతో).

## పుస్తక సమీక్షలు

### (ముందు మాటలు, పీఠికలు)

మాధవశతకము

1. ముందుమాట (మాధవశతకం) - ఆచార్య కాత్యాయనీ విద్మహే. మాధవశతకం, 15.1.2017
2. సమీక్ష (మాధవశతకం) - ఆచార్య బేతవోలు రామబ్రహ్మం. మాధవశతకం, 29.1. 2017
3. ప్రణిధి. ప్రసన్న కవి ఉన్నం జ్యోతి వాసు. మాధవశతకం, సెప్టెంబర్ 26, 2018

నాగ్నజితీ పరిణయము

4. ఆధునిక యుగ ఆలోచనలకు తెర తీసిన వేమూరి శారదాంబ "నాగ్నజితి పరిణయం" - ఆచార్య కాత్యాయనీ విద్మహే. నాగ్నజితి పరిణయం, ఫిబ్రవరి 17, 2017
5. కల్యాణ వీణ - ప్రసన్న కవి ఉన్నం జ్యోతి వాసు. నాగ్నజితి పరిణయం, జనవరి 1, 2018

### (పత్రికలలో సమీక్షలు)

6. మహిళా సంక్షేమమే మాధవశతకము - డా. పూసల రజనీ గంగాధర్. సాహితీ కిరణం, నవంబర్ 2019
7. చారిత్రక ప్రాధాన్యం కలది ఈ మాధవ శతకము - ఆచార్య ముదిగొండ శివప్రసాద్. ఆంధ్రభూమి, నవంబర్ 30, 2019
8. నాటి స్త్రీ జీవితానికి దర్పణం - ఆచార్య ముదిగొండ శివప్రసాద్ ఆంధ్రభూమి, డిసెంబర్ 2, 2019
9. 'మాధవ శతకం' మహిళా విద్యకు శతమానం - డా. జె.కనకదుర్గ
10. అరుదైన పద్యరచనలు: మాధవశతకము, నాగ్నజితీ పరిణయము. ఆంధ్రజ్యోతి, 18.10.2019
11. నాగ్నజితీపరిణయము - డా. జె. నరసింహ ప్రసాద్. ఆంధ్రభూమి, డిసెంబర్ 18, 2019

---

వ్యాసాల సేకరణ **(Source)**

**డా. దాసు అచ్యుత రావు**

వ్యాసాల సంకలనం **(Formatting)**

**డా. వి.జె. సుశీల**

**1. వేమూరి శేషమాంబ గారు (శారదాంబ) - ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ**

**ఆంధ్రకవయిత్రులు, 1958 P.99-102.**

# ఆం ధ్ర క వ యి త్రు లు

ఉభయభాషాప్రవీణ

## శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

1958

## 30. వేమూరి శేషమాంబగారు

నాగ్నజితీస్వయంవర, మాధవశతకకర్త్రి యగు శ్రీ వేమూరి శారదాంబ కృష్ణామండలములోని గుడివాడతాలూకా, విన్నకోట పరగణా, అల్లూరు అగ్రహారమున దాసు శ్రీరాములుగారి పుత్రికయై 3-5-1881 వ తేదీనాడు జనన మందినది. సంగీత సాహిత్యములలో అభిరుచియు, అభినివేశము కలిగి తన ఆరవయేటనే వినిన గీతములు వినినట్లు పాడ నేర్చిన ప్రజ్ఞయు, పదునొకండవయేటనే పద్యములు జేయగల్గిన ప్రతిభయు నార్జించినది,

వీరి తండ్రిగా రగు దాసు శ్రీరాములుగారు సుప్రసిద్ధకవులు. దేవీభాగవతము మున్నగు నుత్తమరచనలు సాగించిన యుత్తములు వీరు. వీరి "తెలుగునాడు" చక్కని ఖండకావ్యము. ఆనాటి సాంఘికజీవితమున కది తళుకుటద్దము. వారు స్వయముగ నాట్యకళాభిమానులే కాక, తానై గజ్జె కట్టిన దిట్ట. వీరివి జావళీలు కూడ కలవు. అట్టి రసికకవిసత్తముని

కడుపున పోడమి, తొమ్మిదవయేటనే గుంటూరుమండల బాపట్లతాలూకా తహసీలుదారుగా పనిచేసిన వేమూరి కామన్న పంతులుగారి కుమారుడు రామచంద్రునిగారితో పెండ్లి గావింపబడినది.

అటనుండి ఉద్యోగిగా చెన్నపురి వెడలు భర్తతో వెడలి, యట తన సహజపాండిత్యముకతమున పెల్లుబికిన కవితాధోరణితో నాగ్నజితీ పరిణయమును దన 11 వ యేట కూర్చినది. ఇంతియ కాక, యీమె యపుడపుడు నుడివిన పద్యములు, వ్రాసిన వ్యాసములు, జనానాపత్రిక యందును, జ్ఞానోదయపత్రికయందును ప్రచురింపబడుచుండెడివి. భర్త యేమంత సరసుడు కానివాడై, భార్యను వీణావాదనాది విషయముల బాధలు పెట్టెడివా డట. అయినను, భారతస్త్రీ సహజమగు నోర్పుతో నన్నింటెని సహించి, మెల్లగా గ్రంథరచనము కూడ నొనర్చినది. 1899వ సంవత్సరము లోపుగానే యిరువురు బిడ్డల గని తలిదండ్రులను, బంధు జనులను శోకసాగరమున ముంచి, రెండవ ప్రసవసమయముననే యుసు రుల బాసినది. ఇట్లు కడు బాల్యముననే అలవోకగా ప్రశస్తకావ్యము రచించిన యీ ప్రజ్ఞామతి కావ్యమునకు కృష్ణుని యష్టమహిషలలో నొకతె యగు నాగ్నజితి నాయిక. ఇది మూడాశ్వాసముల ప్రబంధము. కావ్యము పూర్వప్రుఢక్కినె యున్నను, వెఱ్ఱిమొఱ్ఱి విరహావర్ణనలును, అనుచిత స్త్రీవర్ణనలును లేవు. కాని, నాయికా నాయకులు పరస్పర గుణాకర్ణనమున ప్రేమించుకొనుట, నాయికచేటి కుహనాయోగివేష ధారిణియై దూత్యము నడుపుట మున్నగున వన్నియు ప్రావద్ధతులే. ఇయ్యది చెన్నపురి పార్థసారధిదేవున కంకితము.

మద్రపురివాసి యగుట—

"పూపనెలదారి పిళ్ళారి ప్రోచు మమ్ము" అని పిళ్ళారిపదమును సంభావించినది.

నగరవర్ణనమున:—

"వీరులు, నీతిచారులు, గభీరులు, ధీరులు, నర్థికోటిమం
దారులు, ఖడ్గధారులును, ధర్మవిచారులు, వజ్రహారులున్,
శూరులు, ప్రేయసీహృదయచోరులు, నింక గడు న్మనోహరా
కారులు తత్పురంబునను గల్గిన రాజకుమారు లెంతయున్."

ఉదారులై, యమకాలంకారమున నీయమచే ప్రస్తావింపబడి మొల్లయొక్క 'రాజులు కాంతియందు, రతిరాజుల" స్ఫురింపజేసిరి. ఇంకను శైలికి:—

"కనలుచు నెంతయుం గినిసి కన్నులు నెఱ్ఱగ జేసి, మమ్ములన్
గని కడు నీచగోవులయి కానపసీమల సంచరింపుచున్,
మనుజుల నెల్లరన్ భువిని బాధల బెట్టగ బుట్టి డింక మీ
రనుచు శపింప, మే మపుడు హా! యని దీనతతోడ వేడగన్."

ఇట్లుదారమై యున్నది.

ఆశ్వాసాంతమున:—

భాసుర మైన నీ వెడదవక్షమునందున శ్రీ వెలుంగగా,
దాసుల కే కొఱంత? సతతమ్మును సంతసమూర్తి శోభితా
వాసులు గారె విశ్వపరిపాలన! సుందరరామ! శారదా
భాసమకీర్తి పూరిత! దిగంతరవైభవ! చంద్రమాధవా."

అను రథబంధ మగు నుత్పలమున దననాథుని నామాక్షరముల నలువరుసల గూర్చి తన కవితాశక్తిని పతిభక్తిని వెల్లడించినది.

మాధవశతకమునం దనేకవిషయములు ప్రస్తావింపబడినవి ముఖ్యముగ స్త్రీవిద్యావిహీనతగూర్చి యెక్కువ ప్రస్తావింపబడినది.

"గొల్లది చల్ల వాడు కిడ, గోడల గీతలు గీసి లెక్కలన్
దెల్లముసేయు, జాకలిది తెచ్చిన బట్టలు వైచు బట్టలున్

బల్లవపాణి త్రాడునకు బాగుగ నైచును విప్పుముళ్ళ దా
సల్లలితంబుగా జదువజాలని చిన్నియ లెన్న మాధవా."

గోడల గీతలు గీయుట, త్రాడున ముళ్ళు వైచి విప్పుట, మొద లగు చదు వెఱుగని చానలపోకడల నింత చక్కగా వర్ణించి "యోరా! విద్యావిహీనల దుస్థితి" యని యొకపరి ముక్కుపై వ్రేలిడ జేయు చున్న దీ యమ.

"భళిరే! యెట్టిది వింజమూరికుల తిమ్మాంబిఖ్యనుం జూడ, నా
లలనారత్నము రామణీయకము డోలాయాత్ర యను గ్రంథ మీ
వలనే జేసె నటందు రే ద్విపదలో బాండిత్య మింపార, నీ
చెల్వులుం దద్గతి విద్య నేరగ భువిం జేయంగ దే మాధవా."

ఈ పద్యమునం దీమె పేర్కొనిన వింజమూరి తిమ్మక్క యెవరో? ఆమె కృత మగు "డోలాయాత్ర" యెచటనో!


కడు పిన్నవయసుననే మృతిచెందియు, జాతికుసుమసౌరభమట్లు ప్రట్టగనే పరిమళించి, స్వచ్ఛ మైన జీవితసౌందర్య రేఖతోడను, అచ్ఛ మైన కావ్యశోభనశ్రీ తోడను, యశశ్చంద్రికల నలుగెలంకుల వెలయిం చిన యీమె శుభచరిత్రము ఆంధ్రులకు గర్వకారణము!

**2. Vemuri Saradamba - Compiled by Madiraju Subbarao**
**Yendaro Mahanubhavulu, pp 79-80, 2009**

## 48. Vemuri Saradamba :-

Smt. Saradamba (a poetess even in her very teens) was born in a village called Alluri Agraharam in Gudivada taluq of Krishna District. Her father was Dasu Sree Ramulu, a famous poet and actor in those days. Perhaps the poetess inherited the talents of writing poetry from her father. When she was nine, Saradamba was wedded to Vemuri Ramachandra Pantulu, son of Kamanna Pantulu who was the then Tahasildar of Bapatla taluq. It is gathered that Saradamba had unquenchable thirst for music as well as literature even from her early childhood. As a child of six years, she was able to sing songs very melodiously after having heard only once. She possessed such an extraordinary mental make up that she started writing verses when she was barely eleven. At that age she came to be recognized as the authoress of a 'Kaavyam' known as '*Nagnajithi Swayamvaram*'. Besides this, she penned many articles and minor poems which appeared in Journals like '*Jnaana Patrika*' and '*Jnaanodaya Patrika*'. She dedicated her poetry to the glory of God. It is said that she used to play exquisitely nice on Veena. It is a pity that she was married to a person who woefully lacked taste for fine Arts. Consequently Smt. Saradamba had to face unpalatable situations and discouragement resulting in suffering as she could not give vent to her emotional spontaneity. Despite these impediments Smt. Saradamba managed to make a name in her literary field. It is really regrettable that this rare poetess experienced the icy hand of death in her 18th year. Her '*Kaavyam*' - 'Nagnajiti Swayamvaram' consists of three Cantos. It deals with the matrimony of the Heroine Nagnajiti (one of the eight wives of Lord Sri Krishna). She seems to have treaded on the foot prints of 'Molla'. Her '*Maadhava Sathakam*' is another literary piece wherein she depicts the deplorable conditions of illiteracy of the women of her times. Common features of unlearned women are graphically described in her lucid and sweet style while composing the verses.

**Life of Smt. Vemuri Saradamba d/o Mahakavi Dasu Sreeramulu**
**('Yendaro Mahanu bhavulu' PP 79-80, Compiled by Dr.Madiraju Subba Rao,2009**




# 3

**EXTRACTED FROM**

**CHAPTER 7 – P .132-155.**

**PUBLISHED BY DISCOVERY PUBLISHING HOUSE, NEW DELHI, 2009.**



## Vemuri Saradamba (1881-1898)

She was born in Alluru Agraharam of Gudivada Taluk in 1881. Even at the age of 11 years she wrote the book *Nagajiti Parinayam*. In her '*Madhavi Satakam*' of hundred verses, she portrayed the unenviable condition of women condemned to illiteracy. In those times women used to keep accounts in respect of milk and clothes entrusted to washer-women by signs. She opined in her book that women could attain brilliance not by ornaments but education. She castigated several superstitions. She pleaded for autonomy to women. It was very unfortunate that such an illustrious woman breathed her last at a young age of seventeen.

## 4. స్త్రీజన క్షేమార్థి శ్రీమతి పేమూరి శారదాంబ

(వార్త, డిసెంబరు 26, 2014)

**- డా. దాసు అచ్యుతరావు**

ఒక  శతాబ్దము వెనుకకు వెళ్లి అప్పటి సమాజంలో స్త్రీలు నిరక్షరాస్యత వల్ల ఎలాంటి దుర్భరస్థితిలోఉండేవారో తెలుసుకుంటే ఆక్రోశంతో కూడిన ఆశ్చర్యం కలుగుతుంది. ఆడపిల్లలు  చదువు నేర్చుకోవడం మహాపాపం. చదువుకుని ఊళ్లేలాలాయేమిటి. పెళ్లయ్యాక మొగుడికి ఉత్తరం ముక్క రాయగలిగితే చాలు అనుకునే రోజులు. ఇంక సంగీతం, నాట్యం వంటి కళలు నేర్చుకొని పాడటం, ఆడటం సంగతి వేరే చెప్పేపనేలేదు. అలాంటి స్త్రీలు వేశ్యలే అనే భావంలో ఉన్నది అప్పటి సమాజం. అటువంటి సాంఘిక వాతావరణంలో దాసు శ్రీరాములు గారి ఏకైకపుత్రిక, సార్థక నామధేయ శారదాంబ, మే 3, 1881న కృష్ణాజిల్లా ప్రస్తుతం ముదినేపల్లి మండలంలోని అల్లూరులో జన్మిచింది. తల్లి జానకమ్మ. న్యాయవాదులుగా, సాహితీవేత్తలుగా, సంఘసేవకులుగా పేరు ప్రతిష్టలు పొందిన ఆరుగురు అన్నలు కేశవ, నారాయణ, గోవింద, మాధవ, విష్ణు, మధుసూదన రావుల గారాబు చెల్లెలు శారదాంబ. బాల్యం నుండే సంగీత, సాహిత్య పిపాసి. ఏకసంథాగ్రాహి. ఆరేళ్ల చిన్న వయస్సులో ఒకసారి వినే పాటలను అత్యంత శ్రావ్యంగానూ పాడేది.

19వ శతాబ్దం ఉత్తరార్థంలో ఆంధ్రదేశంలో సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ రంగాలను ప్రభావితం చేసిన బహుముఖ “ప్రజ్ఞాశాలి మహాకవి దాసు శ్రీరాములు (1846-1908). వృత్తిపరంగా ఏలూరులో ప్రముఖ న్యాయవాదిగా పనిచేసారు. శ్రీరాములు అవి ఎంతమాత్రమూ దూష్యములు కావని సంగీతము పాడటానికి పురుషులకంటే స్త్రీలే తగినవారని ప్రచారం చేసారు. ఇతరులకు చెప్పడంతో సరిపెట్టుకోకుండా స్వయంగా ఆచరించి చూపెట్టాడు. తన యేడేళ్ల కుమార్తె శారదాంబకు ఆంధ్ర, సంస్కృతాలు, సంగీతవిద్య నేర్పించాడు. లోకనిందను ఎంత మాత్రమూ లక్ష్యం చేయలేదు. మంచి వైణికురాలుగా తీర్చి దిద్దారు. తొమ్మిదవయేట ఆత్యంత నైవుణ్యంగా వీణ వాయించింది. బెంగళూరు, మైసూరు వంటి నగరాలలో కచేరీలు కూడా చేయించారు. ఈమె సంగీతం కోనం కొందరు గాయకులను  పోషించారు. నంగీత ప్రియులైన శ్రీరాములు ఆ ప్రాంతంలో గానవిద్య నుద్ధరించడానికి ఏలూరులో ఒక సంగీతపాఠశాల కూడా నెలకొ'ల్పారు. సంస్కరణోద్యమాలు జరుగుతున్నా సమాజంలో ఆశించినంత మార్పురాలేదు. శ్రీరాములు తన కుమార్తైను. విద్యావంతురాలను చేయడం అనాటి పరిస్తుతులలో ఆమె వివాహానికి ఒక విధంగా అవరోధమే అయింది. శ్రోత్రియ సంఘాల నుంచి వచ్చిన ఆటంకాలను అధిగమించి, ఎంతో శ్రమవడిన తర్వాత సంబంధం కుదర్చగలి గారు. 1888 మే లో బందరు లోని పేమూరి రామన్న, నాగమ్మ గార్ల రెండవ కుమారుడు పేమూరి రామచంద్రరావుతో వివాహం జరిగింది. శారదాంబకు వివాహనంతరం మెట్టినింట తన ఆశయాలకు,

ఆకాంక్షలకు. తగిన ఆదరణ కరువైంది. అటువంటి ఇంట్లో అనిష్టమైన  నిరుత్సాహపూరిత వాతావరణమును ఎదుర్కొంటూ కృషి సాగిస్తూ సాహిత్య జగత్తులో పేరు సంపాదించుకుంది.

పద్నాల్గవ యేట పద్యాలు రాయడం ప్రారంభించింది. పదహారేళ్ల  వయస్సులో రచించిన 'నాగ్నజితి పరిణయము' అను ప్రబంధ కావ్యరచనల వల్ల రచయిత్రిగా, కవయిత్రిగా గుర్తింపు వచ్చింది. శ్రీ కృష్ణ భగవానుని అష్ట భార్యలలో ఒకరైన నాగ్నజితి వివాహ కథ 'నాగ్నజితి పరిణయము' మహాకవయిత్రి మొల్ల రచనాశైలి ఈ కావ్యంలో కనిపిస్తుందని కొందరి పండితుల అభిప్రాయం. ఇదే కాకుండా అనాటి కుటుంబ వ్యవస్థలో స్త్రీలు అనుభవిస్తున్న వివక్ష ముఖ్యంగా వారికి చదువు నేర్పించకపోవడం, బయటకు రానియ్యకుండా ఇంటికే పరిమితం చేయడం వంటి విషయాలపై విమర్శనాత్మక కవితలు, వ్యాసాలు రాసింది. దేవీస్తుత కీర్తనలు కూడా రాసింది. అవి ఆ రోజుల్లోని "జనాన పత్రిక", "జ్ఞానోదయపత్రిక" వంటి ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. తన కవితలన్నిటిని  భగవదంకింతం చేసింది. ఆ కాలంలో నిరక్షురాస్యులైన స్త్రీల యమ 'దుర్భరస్థితిని' కళ్లకు కట్టినట్లు తేటతెల్లంగా వర్ణిస్తూ 'స్త్రీల దుస్థితి సద్వితంబుగ బాపి యిద్భువిన్ బన్నుగ సద్బుధుల్ తగినపట్టున విద్యను ముద్దరాండ్రకున్ గ్రన్నన నేరిపించి మరి జ్ఞానము బుట్టగంజేయుమంటూ' దైవాన్ని వేడుకుంటూ శారదాంబ మాధవ శతకములో స్త్రీ జనక్షేమార్థిక భగవత్ప్రార్థన పద్యములు కూర్చి హృద్యంగముగా చిత్రీకరించింది. పురాణేతహాస, చారిత్రక కాలాలలో లేని ఇట్టి దౌర్భాగ్య వివక్ష స్త్రీలపై ప్రస్తుత కాలంలో ఎందుకు చూపిస్తున్నారు అని ప్రశ్నించి ఉదాహరణలు చూపించి సరిచేయమంటూ ఈ శతకంలో మాధవుడిని ఆర్థించింది.

ఒక శతాబ్దం క్రిందట అనాటి దురాచార సాంప్రదాయాలకు లోబడి కట్టడి చేయకుండా శారదాంబ తల్లిదండ్రులు ఆమెకు స్వేచ్ఛనిచ్చి విద్య నేర్పించారు. 21వ శతాబ్దంలో ప్రవేశించిన స్త్రీల పట్ల 'వివక్ష చూపడంలో మార్పు వచ్చినట్లు కన్పించడం లేదు. కాని బాలికలు ధైర్యంతో పట్టుదలతో అవరోధాలు ఎదుర్కొటానికి సిద్ధమవుతున్నాడు. దీనికి నిదర్శనం ఇటీవల 2014 సంవత్సరం నోబెల్ శాంతి పురస్కార గ్రహీత బాలికల దుస్థితిని వివరిస్తూ 17 సంవత్సరాల 'మలాల' ఆవేదనతో అన్న ఈ మాటలు 'ముందుగా నన్ను కట్టడి చేయకుండా స్వేచ్ఛనిచ్చిన నా తల్లిదండ్రులకు రుణవడి ఉంటాను. చదువు ఆత్యంత ముఖ్యమైనది. తరగతి గదుల్లోనే భవిష్యత్తు ఉంది. యావత్రపంచంలో ఈతరం తల్లిదండ్రులు తమ ఆడపిల్లలని 'శారదాంబ' 'మలాల' తల్లిదండ్రుల వలె కట్టడి చేయకుండా స్వేచ్ఛనిచ్చి విద్యావంతుల్ని చేసి లోకకళ్యాణానికి దోహద పడతారని ఆశిద్దాం.

# 5. అలనాటి అభ్యుదయవాది స్త్రీవిద్యాహితైషి: శ్రీమతి వేమూరి శారదాంబ
## డా. దాసు అచ్యుతరావు - సాహితీ కిరణం మాసపత్రిక, మే 2015



వ్యాసం

మే 3, 2015న వేమూరి శారదాంబ 134వ జయంతి

## అలనాటి అభ్యుదయవాది, స్త్రీవిద్యాహితైషి: శ్రీమతి వేమూరి శారదాంబ

ప్రకృతి సిద్ధమైన బలహీనతలను ఆసరాగా చేసుకొని, స్త్రీలను అబలలుగా చిత్రీకరిస్తూ, వారికి వివాహం అయిన తర్వాత గృహనిర్వహణ బాధ్యతలు తప్ప ఇక ఏ ఇతర విద్యలకి పనికిరారనే భావన శతాబ్దాల క్రితం ఎక్కువగా ఉండేది. స్త్రీలకు స్వతంత్రంగా ఆలోచించుకునే అవకాశం ఉండేది కాదు. పెద్దవాళ్ళ అదుపు ఆజ్ఞలు స్త్రీల విద్యావికాసానికి, అభ్యుదయానికి అవరోధాలుగా ఉండేవి. 'చదువుకొని ఊళ్ళేలాలా యేమిటి. పెళ్ళయ్యాక మొగుడికి ఉత్తరం ముక్క రాయగలిగితే చాలు' అనుకునే రోజులు. ఆడపిల్లలు చదువు నేర్చుకోవడం మహాపాపం. ఇంక సంగీతం. నాట్యం వంటి కళలు నేర్చుకొని పాడటం సంగతి వేరే చెప్పేపనేలేదు. అలాంటి స్త్రీలు వేశ్యలే అనే భావంలో ఉండేది అప్పటి సమాజం.

అటువంటి సాంఘిక వాతావరణంలో దాసు శ్రీరాములుగారి ఏకైక పుత్రిక, సార్థక నామధేయ, శారదాంబ, మే 3, 1881న కృష్ణాజిల్లా, ప్రస్తుతము ముదినేపల్లి మండలంలోని అల్లూరులో జన్మించింది, తల్లి జానకమ్మ, న్యాయవాదులుగా, సాహితీవేత్తలుగా, సంఘసేవకులుగా పేరు ప్రతిష్టలు పొందిన ఆరుగురు అన్నలకు గారాబు చెల్లెలు శారదాంబ. బాల్యంనుండే సంగీత, సాహిత్య పిపాసి. ఏకసంథాగ్రాహి. ఆరేళ్ళ చిన్న వయస్సులో ఒకసారి వినే పాటలను అత్యంత శ్రావ్యంగా పాడేది.

19వ శతాబ్దం ఉత్తరార్ధంలో ఆంధ్రదేశంలో సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ రంగాలను ప్రభావితం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలిమహాకవి దాసు శ్రీరాములు (1846-1908). వృత్తిపరంగా ఏలూరులో ప్రముఖ న్యాయవాదిగా పనిచేశారు. శ్రీరాములుగారు స్త్రీ విద్య అత్యంత ఆవశ్యకమని, సంగీత, సాహిత్యములు స్త్రీలు నేర్చుకోవటం మిక్కిలి అవసరము అని, ఎంతమాత్రము దూష్యములు కావని, సంగీతము పాడుటకు పురుషులకంటే స్త్రీలే తగినవారని ప్రచారం చేశారు. ఇతరులకు చెప్పటంతో సరిపెట్టుకోకుండా స్వయంగా ఆచరించి చూపెట్టారు. తన యేడేళ్ళ కుమార్తె శారదాంబకు ఆంధ్ర, సంస్కృతాలు, సంగీత విద్య నేర్పించారు. లోకనిందను ఎంతమాత్రము లక్ష్యపెట్టలేదు. మంచి వైణికురాలుగా తీర్చిదిద్దారు. అతి పిన్న వయసులోనే అత్యంత నైపుణ్యముగా వీణవాయిస్తూ మైసూరు వంటి నగరాలలో కచేరీలు చేశారు శారదాంబగారు. ఈమె సంగీతమునకై శ్రీరాములుగారు కొమండూరి నరసింహాచార్యులు, ఈమని వెంకటరత్నం వంటి సంగీత విద్వాంసులని పోషించారు. సంగీత ప్రియులైన శ్రీరాములు గారు, ఆ ప్రాంతంలో గాన విద్యనుద్ధరించుటకు ఏలూరులో ఒక సంగీత పాఠశాలకూడా నెలకొల్పారు.

సంస్కరణోద్యమాలు జరుగుతున్నా సమాజంలో ఆశించినంత మార్పు రాలేదు. శ్రీరాములు గారు తన కుమార్తెను విద్యావంతురాలిని చేయటం ఆనాటి పరిస్థితులలో ఆమె వివాహానికి ఒక విధంగా అవరోధమే అయింది. శ్రోత్రియ సంప్రదాయాలనుంచి వచ్చిన ఆటంకాలను అధిగమించి ఎంతో శ్రమపడిన తర్వాత సంబంధం కుదర్చగలిగారు. 1888 మేలో బందరులోని వేమూరి రామన్న, నాగమ్మ గార్ల రెండవ కుమారుడు వేమూరి రామచంద్రరావుతో వివాహం జరిగింది. పుట్టినింట ప్రేమానురాగాలతో, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తన సంగీత, సాహిత్యాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్న శారదాంబకు వివాహానంతరం మెట్టినింట తన ఆశయాలకు, ఆకాంక్షలకు తగిన ఆదరణ కరువైంది. అటువంటి ఇంట్లో అనిష్టమైన, నిరుత్సాహ పూరిత వాతావరణమును ఎదుర్కొంటూ సాహితీకృషి సాగిస్తూ సాహిత్యజగత్తులో పేరు సంపాదించుకుంది.

పద్నాల్గవ యేట పద్యాలు రాయటం ప్రారంభించింది. పదహారేళ్ళ వయస్సులో రచించిన 'నాగ్నజితీ పరిణయము' అను ప్రబంధకావ్య రచనలవల్ల రచయిత్రిగా, కవయిత్రిగా గుర్తింపు వచ్చింది. శ్రీ కృష్ణ భగవానుని అష్ట భార్యలలో ఒకరైన నాగ్నజితి యొక్క వివాహ కథ 'నాగ్నజితీ పరిణయము'

డా. దాసు అచ్యుతరావు, హైదరాబాద్, సెల్: 9490023947

మహాకవయిత్రి మొల్ల రచనా శైలి ఈ కావ్యంలో కనిపిస్తుందని కొందరి పండితుల అభిప్రాయం. ఇదేకాకుండా, ఆనాటి కుటుంబ వ్యవస్థలో స్త్రీలు అనుభవిస్తున్న వివక్షత, ముఖ్యంగా వారికి చదువు నేర్పించకపోవటం, బయటకు రానియ్యకుండా ఇంటికే పరిమితం చేయడం వంటి విషయాలూ విమర్శనాత్మక కవితలు, వ్యాసాలు, వ్రాసింది. దేవీస్తుతి కీర్తనలు కూడా వ్రాసింది. అవి ఆ రోజుల్లోని 'జనాన పత్రిక' మరియు 'జ్ఞానోదయ పత్రిక' వంటి ప్రముఖ పత్రికలలో ప్రచురించబడ్డాయి. తన కవితలన్నీ భగవదంకితంగా చేసింది.

ఆ కాలంలో నిరక్షరాస్యులైన స్త్రీల అతిదయనీయ, శోచనీయ, దుర్భర స్థితిని, కళ్ళకికట్టినట్లు తేటతెల్లంగా వర్ణిస్తూ 'స్త్రీలదుస్థితి సద్వితంబుగ బాపి యిద్భువిన్, బన్నుగ సద్బుధుల్ తగిన పట్టున విద్యను ముద్ధరాంద్రకున్, గ్రన్ననసేరిపించి మరిజ్ఞానము బుట్టగ జేయు' మంటూ దైవాన్ని వేడుకుంటూ శారదాంబ 'మాధవ శతకము' లో స్త్రీ జనక్షేమార్థిక భగవత్ప్రార్థన పద్యములు' కూర్చి హృద్యంగమముగా చిత్రీకరించింది. పురాణేతిహాస, చారిత్రక కాలాలలో లేని ఇట్టి దౌర్భాగ్య వివక్షత స్త్రీలపై ప్రస్తుత కాలంలో ఎందుకు చూపిస్తున్నారు అని ప్రశ్నించి, కొన్ని ఉదాహరణలు చూపించి, సరిచేయుమంటూ ఈ శతకంలో మాధవుడిని అర్థించింది.

మన పూర్వీకులు తమ ఆడపిల్లలని చదివించ లేదా? ఆ చదువు వల్లనే గదా సీత, చంద్రమతి మొదలైన పతివ్రతలు వినయ, వివేకములతో నడుచుకొంటూ అనుపమాన కీర్తిమంతులయ్యారు అని ఈ పద్యంలో ఎలా చెప్పిందో చూడండి.

**'చ.మునుపటివారలెల్ల తను ముద్దియలం జదివించలేదొకో/వినయ పతివ్రతాత్వ సువివేకములం జరియించినట్టియా/జనకజం జూడరేమరియుఁ జంద్రమతింగనరే యింకెందరో/యనుపమబుద్ధిగీర్తిలదలందిరి విద్యలవల్ల మాధవా'**

మన దేవతలందరూ వారి సతీమణులను అత్యంత గౌరవంగా చూసుకున్న వారే. పరమేశుడు గంగను ఏకంగా తన శిరస్సు పైనే పెట్టుకున్నాడు. బ్రహ్మదేవుని ఇల్లాలు సరస్వతీదేవి ఎల్లప్పుడూ తన నాలుకమీదే నర్తిల్లుతుంది. ఇక నీవైతే నీ సతీమణిని హృదయమందే వదిలపరుచుకొన్నావు. అదేమివింతో కానీ మనవాళ్ళు స్త్రీలను ఇళ్ళలోనే బంధిస్తారు అంటుంది ఈ పద్యంలో.

**'చ. వినఁగ మహేశుఁ డెప్పుడును వీడక గంగశిరంబునందునుం/చెనుగద బ్రహ్మతాను దనజిహ్వను బెట్టెను గా సరస్వతిన్/ అనవరతంబు నీ హృదయమందుననిల్పితి నీదుకోమలిన్/గనవదియేంలకో జనులు కారలవైతురు స్త్రీల మాధవా.**

గణిత శాస్త్రకోవిదురాలు భాస్కరాచార్యుని పుత్రిక లీలావతి, విద్యావతియైన భోజరాజు భార్య భానుమతి, విద్యలకే దేవతయైన సరస్వతీదేవి ఆడువారు కాదా అంటుంది.

**ఉ. పావననామ్ని సద్గణిత పద్ధతిఁ దెల్పదెబోటికాదె లీ/లావతి భాస్కరార్యు నంతరామయు కాదె సరస్వతింగనన్/ దేవతయయ్యె విద్యలకు దేజముగ మీరగ భోజుభార్య వి/ద్యావతియైన భానుమతి యారయ నాఁడుది కాదె మాధవా**

స్త్రీలు నాట్యము కూడ నేర్చుకోవచ్చు అనే భావన వ్యక్తీకరిస్తూ మహాభారతంలోని విరాటపర్వంలో ఒక ఘట్టాన్ని ఉటంకించి ఎంత చక్కగా చెప్పిందో చూడండి. విరాటు రాకుమారి ఉత్తర, బృహన్నల వద్ద నాట్యం అభ్యసించి కీర్తి పొంది పొగడ్తలనందుకొని తదుపరి ఆ పరమపతివ్రతామణి పరీక్షిత్తుని కనలేదా అని గుర్తు చేసింది.

**చ. అరమరలేక నిచ్చలు బృహన్నల యొద్దను నాట్యశాస్త్రమున్/విరటుని కూఁతు దాగరచి విస్తృతకీర్తివహింపలేదె యు/త్తర కదు యోగ్యురాలని సదా పొగడంబడలేదె చూడ నా/ పరమపతివ్రతామణి శుభాంగు బరీక్షితుఁగాంచె మాధవా.**

అతి పిన్నవయసులోనే, తాను స్వయంగా విద్యావంతురాలై, స్త్రీలందరూ విద్యనేర్చుకోవలసిన ఆవశ్యకతను తెలుపుతూ అభ్యుదయ భావాలను వ్యక్తీకరిస్తూ, భావితరాలను ఆలోచింపజేసే ఈ విధమైన అద్భుత రచనలు ఈ శతకంలో కోకొల్లలుగా దర్శనమిస్తాయి. బాలమేధావిగా శారదాంబ ధన్యురాలు, మార్గదర్శి శ్రీమతి శారదాంబ! శారదాంబకు కుమార్తె దుర్గాంబ, కుమారుడు పార్థసారథి. ఈమె డిసెంబరు26, 1899న చిన్నవయసులోనే ఏలూరులో పరమపదించింది.

స్త్రీలు అభ్యుదయభావాలతో పురోగతి చెందడం చూసి ఓర్వలేనివారు కట్టుబాట్ల నెపంతో వారిని సాధ్యమైనంతవరకు గృహాలకే పరిమితం చేయడం, సంప్రదాయం ముసుగులో మభ్యపెట్టడం, స్వతహాగా విజ్ఞానవంతులైన స్త్రీలు నిరసిస్తూనే ఉన్నారు. వారు చైతన్యపూరితమైన రచనలుచేస్తే, తిరుగుబాటు చేస్తున్నారనో, వ్యతిరేకిస్తున్నారనో వక్రీకరించి వారిపై అభాండాలు వేయడం కుహనాసంప్రదాయవాదుల పన్నాగం. అయితే స్త్రీల దృక్పథం తిరుగుబాటుకాదు. విద్యావంతురాలైన శారదాంబ భగవంతుడు అందరికీ సమానంగా ఇచ్చిన తెలివితేటలు, కుశాగ్రబుద్ధి, ధర్మచింతన, న్యాయదృష్టి స్త్రీలకుకూడా సమానంగా వర్తిస్తాయని, సోదాహరణాలతో తమ కవితల ద్వారా వివరించింది. న్యాయదృష్టిగలవారు న్యాయం చెప్పడానికి వెనుకాడరు. శారదాంబ సాక్షాత్తు సరస్వతీ అవతారమే అనిపిస్తుంది. ఆమె నోట పలికిన ప్రతి అక్షరమూ వేదవాక్కుగా సమాజహితమైనది. కాలానుగుణంగా ఆమె కవితలలోని అంతరార్థం చైతన్యవంతులైన స్త్రీలు గ్రహిస్తూ అభ్యుదయపథంలో ప్రయాణిస్తున్నారు. వారిని ఆటంకపరిచే శక్తులు మాత్రమే అవరోధాలు సృష్టిస్తున్నాయి. ఎప్పటికైనా స్త్రీల పట్ల వివక్షత పోగొట్టడానికి ఏ యుగంలోనైనా ఉద్యమించడానికి 'స్త్రీవిద్యాహితైషి' శారదాంబవంటి స్త్రీలు ఉద్భవిస్తూనే ఉంటారు. ❖

# VEMURI SARADAMBA
## Champion of Girl's Education

**Dr. Dasu Atchuta Rao***

More than a century before Malala Yousufzai, the Nobel Peace Laureate started her campaign for girls' education, more than a century before slogans *Bachi bachao, bachi padhao* became current coin, a teenaged Telugu Brahmin girl espoused women's education and prayed God for good sense to prevail upon both men and women to recognize its value. The girl was Vemuri Saradamba (1881-1899) who, in a short span of life, exemplified herself as an advocate and votary of women's development. She strongly believed that literacy and education were pivotal for the empowerment of women and voiced these sentiments through her writings. That we are still debating these terms in 21st century is a sad commentary on the world at large. Like Malala, Saradamba did whatever she did in her brief life, against several odds, with the blessings of her parents. One has to go back in time and understand the prevailing social climate then, in order to appreciate the achievements of Saradamba.

If you take a look at the Indian society of a century or a century and a half ago, you would be astounded and would not help but be angry. Shock and surprise because of the oppressive conditions in which women lived, and anger because society had kept them in perpetual ignorance by denying education to them. People considered it a 'sin' to school their girls. The common belief then was that education was necessary only to earn money to support the family. "Do they (girls) have to take up a job to support the family? Or do they have to be administrators (rulers)?" was the general refrain those days. Many believed that it was enough if a girl could keep an account of clothes going to the laundry or write a few lines to her husband. If giving the girl-child basic education was undesirable, teaching fine arts like music and dance was considered a cardinal sin by high caste families, because they believed that such activities behoved the lowly nautch girls and courtesans. Saradamba was born in such a society on May 3, 1881, as the only daughter, after six sons, of Dasu Sreeramulu and Janakamma at Alluru, a village in the present Mudinepalli Mandalam, Krishna District of Andhra Pradesh. Both her parents and her six elder brothers doted on Saradamba as she was the youngest child in the family.

Dasu Sreeramulu (1846-1908) was a multifaceted genius. He was not only a well known lawyer but also a renowned litterateur - poet, dramatist, lyricist and composer of music. He was hailed as a *Vaaggeyakaara*, a great composer, and earned the title *Mahakavi*, a great poet. He was an educationist and a social reformer. He left behind an indelible mark on whatever activity he chose. He was interested in the politics of the day in the Telugu region of the Madras

* Scientist NGRI (Retd.) and freelance writer, Hyderabad

Province and also in the then nascent Nationalist movement during the late 19th and early 20th centuries. Dasu Sreeramulu was a staunch believer in women's education and its importance for the betterment of society. He maintained and declared that women were not forbidden learning music or studying literature.

Growing up in such an enlightened and vibrant atmosphere, it was natural for the young Saradamba to yearn for learning. From her early childhood Saradamba evinced keen interest in music and literature. She was endowed with a 'photographic memory.' It was said that one reading was enough for her to understand and learn any subject. She had a mellifluous voice with which she rendered songs after listening to them once. Recognizing her talent and thirst for knowledge Sreeramulu began to teach her Sanskrit and Telugu from an early age. He encouraged her to learn music, notwithstanding condemnation and possible ostracism by the society. He invited eminent musicians, like Komandoori Narasimhacharylu and Eemani Venkataratnam, from distant places and housed them in his place to train her. Saradamba picked up the nuances of music and in a short time became an expert *Veena* player; she gave public concerts at places as far away as Mysore.

Although social reform movements dominated that period (late 19th century), the conservative society was not ready to accept an educated woman. Sreeramulu found it hard to find a suitable boy for his daughter because few parents dared to welcome an 'educated' girl, that too trained in music, as their daughter-in-law. After considerable struggle, her father married off Saradamba in 1888. Unfortunately, at her in-law's home Saradamba failed to get as much love, affection and support for her literary and musical pursuits as she received from her parents and brothers. Nevertheless, undeterred by the stifling atmosphere at her in-law's place (she was forced to abandon her *veena*) Saradamba, persevered and continued her literary activity. Her genius soon blossomed. At fourteen she began writing poetry and within two years, at sixteen produced a *kaavyam* (poetical composition) *Nagnajiti Parinayam*, the story of the divine wedding of Nagnajiti, one of the eight consorts of Lord Krishna. Scholars acclaimed her work as a *prabandham* and her style was as engaging as that of great 15th century poetess Molla. She also composed songs in praise of various Goddesses (*devi stuti keertanalu*). Legend has it that she wrote *Nagnajiti Parinayam* sitting in Parthasarathi temple, Madras (Chennai) and in the manner of great poets like Pothana, Saradamba dedicated her works to the glory of the Lord. She, however, did not limit her writings to mere *Puranic* and devotional subjects, but extended them to social comment. Aware of the discrimination faced by women, herself a victim, she published critical assays on how contemporary society controlled women's lives, confining them to household chores, not allowing them to go out and denying education to them. Many of those articles appeared in reputed journals like *Janana Patrika* and *Jnanodaya Patrika*. In *Madhava Satakam*, a book of hundred verses, she depicted the pitiable state of women who were unlettered and ignorant and sought autonomy for women. In this work she supplicates Lord Krishna (Madhava) to give good sense to the people to educate their womenfolk.

In fact, the tagline of this book reads 'a prayer for the welfare of womankind'. She questioned boldly 'why this discrimination and neglect of women today, which were absent in ancient times'. In another verse, she said that women like Sita and Chandramati became legends and only because they were allowed to gain knowledge through education.

To emphasize that women in Vedic times were held in high esteem, Saradamba invoked the Hindu Trinity, and said that Siva viewed Ganga as an adornment and wore her on his head, Brahma slotted Saraswati on his 'tongue' (i.e., he made her his voice), while Vishnu placed Lakshmi in his heart. At the same time she lamented - 'why people in her time were treating women as prisoners'.

She cited the great mathematician Leelavati, daughter of Bhaskaracharya and highly learned Bhanumati, wife of King Bhoja, to support her argument that women were not barred in ancient times from educating themselves.

Reinforcing her argument that high caste women too can learn music and dance, she cited the epic *Mahabharata* and said that Princess Uttara, daughter of King Virata, learnt dance from *Brihannala* (Arjuna in disguise) without any qualms, and at the same time was praised as a great woman who also gave Pandavas a heir, Parikshit.

She also referred to one of the great devotional poetesses Tarigonda Vengamamba to illustrate that women were encouraged to study as late as 18th century.

Criticizing the contemporary society for depriving women of education, she satirically chided her ilk and asked them to spare a fraction of their time, spent on personal dressing and makeup, for (self) education.

Saradamba shone like a bright star over the world of literature, though briefly. She made a mark in traditional poetry and came to be known as a woman with progressive ideas, a woman who proclaimed education as an essential prerequisite for women's welfare. After a short but purposeful life of nineteen years Saradamba died (after the delivery of her son) on 26th December, 1899 at Eluru leaving behind her husband and two children, a daughter Durgamba and a son Pardhasaradhi.

Malala Yousufzai's adventurous story tells us that even more than a century after Vemuri Saradamba's times the situation, as far as women's rights are concerned, remains the same, in many parts of the world. However, it is a happy augury that women have started asserting themselves and Governments also are drawing up schemes for empowerment of women. Let us hope that this generation of parents (of girls) who are still mired in old superstitious dogmas will "educate their daughters giving them freedom" like the parents of Saradamba and Malala.

The twentieth century saw the rise of feminism in India. Suppressed for long by a society that had turned quite patriarchal more than a millennium ago, Indian women woke up and looked for role-models to reshape their lives.

***

## 7. వివక్షపై గళమెత్తిన ధీరవనిత పేమూరి శారదాంబ

(ఆంధ్రభూమి, మే 3, 2016)

**- డా.దాసు అచ్యుతరావు**

శ్రీ కృష్ణునకు రుక్మిణి, సత్యభామ, జాంబవతి, మిత్రవింద, భద్ర, నాగ్నజితి, కాళింది, లక్షణ అనువారు ఎనిమిది మంది (అష్ట) భార్యలుగా కీర్తించబడుతున్నారు. అష్టభార్యలు సృష్టిలో అష్టవిధ ప్రకృతులకు ప్రతీకలు. అష్టమహిషులతో శ్రీకృష్ణ కళ్యాణ వైభవాన్ని మహాకవి పోతన తమ భాగవతంలో అత్యంత మనోహరంగా వర్ణించారు. తరువాతి కాలంలో ప్రసిద్ధ కవులు కొందరు వ్రాసారు. వాటిలో రుక్మిణి, భద్ర, నాగ్నజితీ మరియు లక్ష్మణ పరిణయ గాథలే ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నాయి. ఉన్నవ జ్యోతివాసు గారి పరిశోధనలలో లభ్యమైన సమాచారం వరకు 17-19 శతాబ్దాల మధ్యకాలంలో ఏడుగురు కవులు 'నాగ్నజితీ పరిణయ" కావ్యాన్ని రచించారు. వారిలో శ్రీమతి పేమూరి శారదాంబగారు ఒకరు (19వ శతాబ్దం).

శ్రీమతి శారదాంబ, మే 8, 1881న, ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, మచిలీపట్నం దగ్గరి అల్లూరు గ్రామంలో జన్మించారు. తండ్రి మహాకవి దాసు శ్రీరాములు, తల్లి జానకమ్మ. తల్లిదండ్రులకు ఏకైక పుత్రికగా, తోడబుట్టిన ఆరుగురు అన్నల ముద్దుల చెల్లెలిగా గారాబంగా పెరిగింది. శారదాంబ బాల్యం నుండే సంగీత, సాహిత్య పిపాసి. ఏకసంథాగ్రాహి. ఆరేళ్ళ చిన్నవయస్సులో పాటలను ఒకసారి వినే అత్యంత శ్రావ్యంగా పాడేవారు.

అది స్త్రీల పట్ల దుర్భరమైన్న దుర్మార్గమైన వివక్ష చూపిస్తున్న కాలం. సంగీతం, నాట్యం వంటి కళలు నేర్చుకునే స్త్రీలు వేశ్యలే అని భావించే సాంఘిక వాతావరణం. 19వ శతాబ్దం ఉత్తరార్థంలో ఆంధ్రదేశంలో సంగీత, సాహిత్య, సాంస్కృతిక సాంఘిక, రాజకీయ రంగాలను ప్రభావితం చేసిన శ్రీరాములుగారు (1846-1900) స్త్రీలు సంగీత, సాహిత్యములు నేర్చుకొనేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని దృఢంగా నమ్మినవారు. సమాజ అభ్యుదయానికి, వికాసానికి స్త్రీలు విద్యావంతులై స్వశక్తి సాధించటము అత్యంత అవసరమని ప్రచారం చేసిన సంస్కరణాభిలాషి. ప్రచారంతో సరిపెట్టు కోకుండా స్వయంగా ఆచరించి చూపెట్టారు. సంగీత, సాహిత్యాలలో శారదాంబ ఆసక్తి గుర్తించి చిన్న వయసులోనే ఆమెకు తెలుగు, సంస్కృతము నేర్పారు. సంగీత విద్య నేర్చుకునటాన్ని ప్రోత్సహించారు. లోకనిందను ఎంతమాత్రము లక్ష్యము చేయలేదు. మంచి వైణికురాలుగా తీర్చిదిద్దారు. బెంగుళూరు, మైసూరు వంటి నగరాలలో కచేరీలు కూడ చేయించారు.

శారదాంబకు 1888 మేలో పేమూరి రామచంద్రరావుతో వివాహం జరిగింది. అప్పటి సాంఘిక పరిస్థితులలో మెట్టినింట తన ఆశయాలకు, ఆకాంక్షలకు, అభ్యుదయ భావాలకు తగిన ఆదరణ కరువైనా, నిరుత్సాహానికి లోను కాకుండా సాహితీ కృషి సాగిస్తూ పద్నాల్గవ ఏటనే పద్యాలు రాయడం ప్రారంభించారు. విద్యావంతురాలైన శారదాంబ, ఆనాటి స్త్రీలు అనుభవిస్తున్న వివక్ష, ముఖ్యంగా వారికి చదువు నేర్పించకపోవటం, బయటకు రానియ్య కుండా ఇంటికే పరిమితం చేయటం వంటి దురాచారాలపై విమర్శనాత్మక కవితలు, వ్యాసాలు రచించారు. ఆనాటి "జనాన పత్రిక" మరియు "జ్ఞానోదయ పత్రిక" వంటి ప్రముఖ పత్రికలలో ఆ రచనలు

ప్రచురింపబడ్డాయి. స్త్రీలను ఈ దుస్థితి నుంచి విముక్తి కలిగించమని దైవాన్ని వేడుకుంటూ శారదాంబ 'మాధవ శతకము'లో 'స్త్రీ జనక్షేమార్థిక భగవత్ప్రార్థన పద్యములు" రచించారు. పదహారేళ్ళ వయస్సులో 'నాగ్నజితీ పరిణయము' అను ప్రబంధ కావ్యరచనతో రచయిత్రిగా, కవయిత్రిగా గుర్తింపువచ్చింది. మహాకవయిత్రి మొల్ల రచనా శైలి ఈ కావ్యంలో కనిపిస్తుందని పండితుల మన్ననలను పొందారు.

కోసల దేశాన్ని పరిపాలిస్తున్న నగ్నజితు కుమార్తె సుదంత. ఆమె నాగ్నజితి, సత్యగా కూడా ప్రసిద్ధి. నగ్నజితుని పశుసంపదలో పొగరుబోతైన ఏడు వృషభాలు మదమణచి లొంగదీసి బంధించిన వీరునకిచ్చి వివాహము చేస్తానని ప్రకటించిన స్వయంవరంలో శ్రీ కృష్ణుడు విజయుడై నాగ్నజితిని పరిణయమాడిన కథ 'నాగ్నజితీ పరిణయము'. వేమూరి శారదాంబ రచించిన 'నాగ్నజితీ పరిణయము' మూడు ఆశ్వాసాల ప్రబంధము. ఈ కావ్యంలో శారదాంబ "కవితాకౌశల్యం, సౌరభం వెల్లడించే కొన్ని పద్య కుసుమాలను ఉటంకించుకొని ఆస్వాదిద్దాం.

శుకమహర్షి పరీక్షిత్తునకు చెప్పినట్లుగా నేను చెప్పబోవు నాగ్నజితీ స్వయంవరానికి కథాక్రమం ఇట్లా ఉంటుందని ప్రథమాశ్వాసంలో కోసల నగర పౌరుల విశిష్టతని ఎంత అందంగా ఈ పద్యంలో వర్ణించిందో చూడండి.

ఉ. వీరులు నీతిచారులు గంభీరులు ధీరులు నర్థి కోటిమం
దారులు ఖడ్గధారులును ధర్మవిచారులు వజ్రహారులున్
శూరులు ప్రేయసీ హృదయ చోరులు నింకంగడున్మ నోహరా
కారులు తత్పురంబునను గల్గిన రాజకుమారులెంతయున్ .

'పై పద్యం చదివాక మొల్ల రామయణంలో యమకాలంకార నియమంలో సాగిన "రాజులు కాంతియందు రతిరాజులు..." పద్యం కవిసూరులకు స్ఫురించకుండాఉండదు.

శ్రీమతి వేమూరి శారదాంబకు ఒక కుమార్తె దుర్గాంబ, కుమారుడు పార్థసారధి. డిసెంబరు 26, 1809న, కుమారుడు. పార్థసారధిని ప్రసవించి ప్రసూతి సమయంలో 19 సంవత్సరముల చిన్నవయస్సులో ఏలూరులో పరమపదించారు.

## సంస్కరణోద్యమ భావజాలానికి, మహిళా ఉద్యమ ఆకాంక్షలకు లంకె

# వేమూరి శారదాంబ 'మాధవ శతకం'



– కాత్యాయనీ విద్మహే
9440550579

తెలుగునాట సంస్కరణోద్యమం, ప్రత్యేకించి స్త్రీ విద్యాఉద్యమం స్త్రీలలో మేల్కొలిపిన చైతన్యం వాళ్ళను మహిళా ఉద్యమ నిర్మాతలను చేసింది. ఉద్యమ ఆశయాల ప్రచారానికి రచయితలుగా మలిచింది. కొటికలపూడి సీతమ్మ, భండారు అచ్చమాంబ ఆ కోవలోవారే. వారివలె సామాజిక జీవితం, కార్యాచరణ లేకపోయినా తనకున్న పరిమితులలో సాంస్కృతిక భావజాల రంగంలో స్త్రీవిద్యకు ఒక అనుకూల వాతావరణాన్ని నిర్మించటానికి పనిచేసిన చరిత్రకెక్కని మహిళ వేమూరి శారదాంబ. 1881 మే 3 వ తేదీన పుట్టింది. ఆంధ్రదేశంలో సాహిత్యసామాజిక సాంస్కృతిక రంగాలలో అభ్యుదయ దృక్పథంతో కృషి చేసిన దాసు శ్రీరాములుగారి కూతురు కావటం వల్ల సంగీత సాహిత్య శిక్షణ లభించింది. పద్దెనిమిదేళ్ల లేత వయసులో రెండవ బిడ్డకు జన్మనిస్తూ మరణించింది. అప్పటికి ఆమె మాధవ శతకం, నాగ్నజితీ పరిణయం రాసింది. నాగ్నజితీ పరిణయం ఆమె సంప్రదాయ పాండిత్యానికి నిదర్శనమైతే మాధవ శతకం ఆమె ఆధునిక దృక్పథానికి అద్దం పడుతుంది.

కథ తో నిమిత్తం లేకుండా ఎక్కడికక్కడ ఒక భావాన్ని, అభిప్రాయాన్ని పూర్తి చేయటానికి వీలుగా చేసే వ్యస్త పద్య రచన శతకం. పద్య రచనాభ్యాసానికి అనువైన ప్రక్రియ. 'స్త్రీజన క్షేమార్థక భగవత్ప్రార్థన' లక్ష్యంగా చేసి సంప్రదాయ శతక ప్రక్రియను ఆధునిక దృష్టితో సారవంతం చేసింది శారదాంబ. అందువల్ల మాధవ శతకాన్ని భక్తి శతకం అనటం కన్నా సంస్కరణ భావ ప్రచార శతకం అనటం సముచితం.

ఈ శతకంలో మొదటి ఆరు పద్యాలూ పీఠిక వంటివి. దయతో తనను కాపాడమని శ్రీ రాముడిని స్తుతిస్తూ కోరటం ఆ పద్యాల సారం. "శ్రీ రమణీ మనోహర సుశీల నిజాశ్రిత కష్టభంజనా" అని ప్రారంభం అయ్యే మొదటి పద్యంలో నాలుగవ పాదం "సారస నేత్ర నాదగు విచారములెల్లను దీర్చి మాధవా". ఇందులోని 'నాదగు' అనే మాట ఉత్తమ పురుష ఏకవచనమే. కానీ ఆమెకు వ్యక్తిగత విచారాలు ఉన్నట్లు తరువాతి పద్యాలలో ఎక్కడా కనబడదు. ఆమె విచారం అంతా స్త్రీలందరి కోసం. అందువల్ల ఆమె విచారం వ్యక్తిగతమైంది కాదు అన్నది స్పష్టం.

నాలుగవ పద్యం నాలుగవ పాదం ముగింపులో "నీవగతి మాకిల వేక లేరు మాధవా" అన్న వాక్యంలోని 'మాకు' అన్న ఉత్తమ పురుష బహువచనం ఆమె విచారాలన్నీ సమూహానికి సంబంధించినవే అని రూఢి చేస్తున్నది. అందువల్ల శారదాంబ 'నేను' అన్నా 'మేము' అన్నా ఆ మాటలన్నీ తనను తాను స్త్రీ జన ప్రతినిధిగా సంభావించుకొని అన్నవే. నాదగు విచారాలు అంటూ స్త్రీల విచారాల గురించి తపన పడిన శారదాంబ కవిత్వం – నాగొడవ అంటూ లోకం గొడవను తన గొడవగా కవిత్వం చేసిన కాళోజిని, ప్రపంచపు బాధను తన బాధగా చేసుకొని మరో ప్రపంచాన్ని కలగంటూ కవిత్వం రాసిన శ్రీశ్రీని ఏక కాలంలో గుర్తు చేస్తుంది.

సాధారణంగా భక్తి శతకాలలో మోక్ష కాంక్ష ఉంటుంది. కానీ శారదాంబ తనను బుద్ధిశాలినిగ బ్రోవుమని(6) కోరింది. వ్యక్తిగత పారలౌకిక విలువలకన్నా లౌకిక సామాజిక విలువల కోసం ఆలోచించగలిగే బుద్ధిని ఆకాంక్షించటంలో వుంది ఆమె విశిష్టత. ఈ శతకంలోఎక్కువ పద్యాలు ఆనాటి స్త్రీవిద్యా వివాదానికి సంబంధించినవి. స్త్రీవిద్య అవసరం, ప్రాధాన్యత, ప్రయోజనం – నిరూపించటం, అందుకు మద్దతుగా చారిత్రక పౌరాణిక స్త్రీలను ఉదాహరణగా పేర్కొనటం, స్త్రీవిద్య వ్యతిరేక వాదనలను తిప్పికొట్టటం, స్త్రీవిద్య సాధనకు పూనుకొనమని పురుషులను ఉద్బోధించటం –లక్ష్యంగా శారదాంబ ఈ శతక పద్యాలు రాసింది.

శారదాంబ దృష్టిలో విద్య అంటే అక్షరాస్య విద్య. స్త్రీలను రోకటి పాటలు పాడుకొనే స్థితి నుండి రామాయణ భారతాది పురాణ కథలను గ్రంథ పరిశీలన చేత అర్థం తెలిసి చదువుకునే దశకు చేర్చే విద్య (33). బాల చికిత్స, చరిత్ర, భూగోళ సమాచారం, లెక్కలు, దేశ భాషలో చక్కగా రాయగల నైపుణ్యం స్త్రీవిద్యకు ఆమె ఇచ్చిన సిలబస్(57). సంగీత నాట్య చిత్రలేఖనాది లలితకళలు కూడా స్త్రీలు నేర్వవలసినవే అన్నది ఆమె అభిప్రాయం. ఈ క్రమంలోనే స్త్రీలకు విద్య అంటే పురాణ శ్రవణం, నోములునోచటం అనే సంప్రదాయ భావనను శారదాంబ తిప్పికొట్టింది. పురాణ శ్రవణం వల్ల బోధ కలగదని (54), నోములు నోచటం వృథాగా పొద్దు పుచ్చుటమేనని(66) అంటుంది. సంగీత నాట్యాలు భోగం వేషాలుగా తిరస్కరింప బడుతున్న తరుణంలో శారదాంబ సంగీత నాట్య విద్యలు నేర్చుకొనే అవకాశం మహిళలకు ఉండాలి అనటం సాహసమే. స్త్రీలసృజన శక్తి సామర్థ్యాలను వెలికి రానీయకుండా చేస్తున్న సంప్రదాయం పట్ల, పురుష బుద్ధుల పట్ల ఆమె విమర్శ దృష్టి ఈ శతకంలో కనబడుతుంది.

స్త్రీలకు విద్య ఎందుకు అవసరం? భర్తకు ఇంటి నిర్వహణలో చేదోడు, వాదోడు కావటానికి, లేఖలు చదువుకొనటానికి, రాయటానికి, వార్తా పత్రికలు చదివి వినిపించడానికి, పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పి పెంచటానికి, ఇరుగు పొరుగు స్త్రీలతో కలహాలు మాని జీవించటానికి –ఇట్లా ఆనాటి సంస్కరణోద్యమం ఏమి చెప్పిందో దాదాపు వాటినే శారదాంబ తన పద్యాలలో ప్రస్తావించింది. కార్యేషు మంత్రి అంటారు కదా, విద్య లేని మహిళ మంత్రి ఎలా కాగలుతుంది అని ప్రశ్నించి పడతులు విద్య నేరిస్తే పతులకు సహాయపడతారని అంటుంది(27). మగవాడికి అర్ధ శరీరమైన ఆడది చదువు లేనిదైతే మగవాడి సగభాగం చచ్చు పడిపోయినట్లే అని ఆమె భావించింది. ఆడది చదువుకుంటేనే

మగవాడు సంపూర్ణుడు సుందరుడు అవుతాడని చెప్పింది. అందువల్లనే స్త్రీ విద్యకు సుముఖులయ్యే సద్బుద్ధిని పురుషులకు ఇమ్మని భగవంతుడిని వేడుకొన్నది. స్త్రీలను జ్ఞానవంతులను చేసే పనికి పూనుకొనమని పురుషులకు ఉద్బోధించింది. ఆడవాళ్లు చదువుకుంటే చెడిపోతారు, భర్తను గౌరవించరు, స్వాతంత్ర్యం కోరతారు –అనే విద్యా వ్యతిరేక వాదుల అభ్యంతరాలను తగిన తర్కంతో తోసి పుచ్చింది శారదాంబ.

శారదాంబ దృష్టిలో జ్ఞానం జ్ఞానం కోసం కాదు. జ్ఞానం సకల సృజన మేధో శక్తుల వికాసనానికి, ఆవిష్కరణకు. మహిళల చదువుకు సమాజంలో ఒక ఆమోదాన్ని సంపాదించటానికి చరిత్ర నుండి, పురాణాలనుండి ఉదాహరణలుగా తెచ్చి చూపిన లీలావతి వంటి శాస్త్రవేత్తలు, దేవహూతి వంటి వేదవేత్తలు, మొల్ల, తరిగొండ వెంగమాంబ వంటి కవులు, కైక, సత్య వంటి యుద్ధ వీరులు – బహుముఖీనమైన శక్తి సామర్ధ్యాలు చూపగల స్త్రీల అస్తిత గురించిన శారదాంబ ఆత్మ గౌరవ చేతనకు ప్రబల సాక్షులు.

ఈ శతకంలో శారదాంబ ప్రస్తావించిన స్త్రీల జాబితా తయారు చేసి చూస్తే స్త్రీవిద్యకు స్ఫూర్తిని ఇచ్చే మహిళా శక్తుల సమీకరణకు ఆమె తీసుకున్న శ్రద్ధ అర్ధం అవుతుంది. సమకాలపు జనవ్యవహారం నుండి సేకరించి చెప్పిన విద్యావంతులైన మహిళల గురించిన సమాచారం మరీ ఆసక్తికరంగా ఉన్నది. వింజమూరి తిమ్మక్క ద్విపద ఛందస్సులో డోలాయాత్ర అనే గ్రంథం రాసినట్లు (65) ఆమె చెప్పినది ఏ సాహిత్య చరిత్రలోనూ నమోదు అయిన విషయం కాదు. పెద్దిభొట్లు సతి వంటి స్వంత పేరు లేని అంచులకు నెట్టివేయబడిన స్త్రీల పాండిత్యం గురించి ఎక్కడ విన్నదో కానీ ఆలోచించమని మనలను ప్రేరేపిస్తుంది(21). అల్లసాని పెద్దన మనుచరిత్ర రాస్తూ గర్భిణి స్త్రీని ఎలా వర్ణించాలా అని ఆలోచిస్తుండగానే ఆయన కూతురు ఆ పని విజయవంతంగా పూర్తి చేసి పెట్టిందని(44) చెప్పి శారదాంబ వినియోగంలోకి రాని స్త్రీల శక్తి సామర్ధ్యాల వైపు మన దృష్టిని మళ్ళించింది. అంతే కాదు స్త్రీల ప్రత్యేక శారీరక మానసిక సంస్పందనలను, జీవితానుభవాలను వర్ణించటం ఎంత పెద్ద కవికి అయినా అంత సులభం కాదని, స్త్రీలు కవులైతే అలవోకగా ఆపని చేయగలుగుతారని ఏక కాలంలో చెప్పినట్లయింది. పంథొమ్మిదివందల ఎనభైలలో తెలుగు సాహిత్యలోకంలో వ్యాప్తిలోకి వచ్చిన ఈ స్త్రీవాద భావనను వంద సంవత్సరాల క్రితమే ఒక తెలుగు కవయిత్రి పలికించ గలిగిందంటే స్త్రీవాదం విదేశీయం కాదని, తరతరాల ప్రపంచ స్త్రీల మనోభావాల అనుభవాల కోణం నుండి అభివృద్ధి చెందిన సిద్ధాంతమని రూఢి అయినట్లే కదా!

లింగ వివక్ష వల్ల జీవితంలో భాగమవుతున్న ద్వంద్వ విలువల గురించిన ఆవగాహన కూడా శారదాంబకు ఉంది. 'వలదనుటెట్లు విద్య మగవారాల కెట్టుల నట్టులే కదా' అని(19) ఆడవాళ్లు మగవాళ్ళతో సమానమేనన్న సాధారణ సూత్రాన్ని సౌకర్యవంతంగా మరచిపోయిన పురుష సమాజానికి చురక వేసింది. లలనలు నాలుగక్షరములు చదివినంత మాత్రాన అది చదువు కాదు అని కూడా ఆమెకు తెలుసు. పురుషులతో పాటు సమంగా తెలివి పొందే అవకాశాల గురించిన స్వప్నం ఆమెది (19).

ఆడపిల్లలకు ద్రౌపది వంటి పేర్లు పెడితే భోగం కులం పేర్లు అని అంటారు కదా! మగవాళ్లకు కృష్ణుడి పేరు ఎలా పెడతారు అని ఆమె వేసిన ప్రశ్న లైంగిక ద్వంద్వ విలువల మీద ఎక్కు పెట్టిన బాణమే(81). ఐదుగురు భర్తలు ఉన్నందున ద్రౌపది పేరే అపవిత్రం అయిపోతే పదహారువేల భార్యలు ఉన్న కృష్ణుడు ఎలా పూజ్యుడైనాడన్నది ఆమె ఆంతర్యం. అంతే కాదు, స్త్రీలకు గొడుగు పట్టుకొని వీధులలో నడవటాన్ని నిషేధించి, తలుపులు మూసిన పల్లకీలలో, బండ్లలో, బంధించి ప్రయాణాలు చేయించటంతో ఆగక బురఖా కూడా వేసి ఊపిరి ఆడనీయకుండా చేస్తున్న విధానాలమీద ఘాటైన విమర్శపెట్టింది(82, 83). బాల్య వివాహాలను, వృద్ధులకు ఇచ్చి చేసే వివాహాలను వ్యతిరేకించింది. తగిన వయసు వచ్చాక నచ్చినవాడిని పెళ్లాడే వెసులు బాటునిచ్చే స్వయంవర వివాహపద్ధతిని విస్మరించటం పట్ల విచారం వ్యక్తం చేసింది (86).

శారదాంబ కోటికెలపూడి సీతమ్మ వలెనే వీరేశలింగం పంతులు గారి సంస్కరణోద్యమ భావజాల వారసత్వానికి సమకాలంలో మొగ్గ విచ్చుతున్న మహిళా ఉద్యమ ఆకాంక్షలకు మధ్య బలమైన లంకె. ఈ శతకం చదువుతుంటే ఆ తరువాత పదిహేనేళ్లకు 1914 ఏప్రిల్ 11,12 తేదీలలో బెజవాడలో జరిగిన అయిదవ ఆంధ్ర మహిళా సభ ఉపన్యాసాలు, తీర్మానాలు గుర్తుకు వస్తాయి. ముఖ్యంగా శారదాంబ తన పద్యాలలో స్త్రీల విద్యకు అభ్యంతరాలుగా వేటిని సంబోధించిందో ఖండించిందో అవన్నీ మోటుపల్లి రాజబాయమ్మ ఉపన్యాసంలోనూ కనిపిస్తాయి. రాజాబాయమ్మ విద్యావంతులైన స్త్రీల వారసత్వాన్ని చెప్పటంలో భాగంగా – దేవహూతీ లీలావతులను పాండిత్యాన్ని, ఉత్తరా చిత్రరేఖల కళా కౌశలాన్ని, గర్భిణీ స్త్రీ వర్ణన చేసిన పెద్దన కూతురి కవన నైపుణ్యాన్ని ప్రస్తావించటంలో శారదాంబ శతక పద్య ప్రభావం వుండే ఉండాలి.

అలాగే ఆ సభలో దాదాపు అందరి ప్రసంగాలలోను చర్చకు వచ్చిన మరొక అంశం నగలపై మహిళల వ్యామోహం. దానిని మూఢత కింద జమకట్టి తిరస్కరించారు సంస్కరణాభిలాషులైన స్త్రీలు. అందుకు కూడా ఒరవడి పెట్టిన మహిళ శారదాంబ. స్త్రీలలో నగల మోజు, అలంకరణ ప్రీతి అభ్యుదయ కారకాలు కావని ఆమె అభిశంసించింది. నగల కోసం చెవులు, ముక్కులు కుట్టించుకొని శరీరాన్ని హింస పెట్టుకొనటం కన్నా చదువుపై శ్రద్ధ పెడితే ప్రయోజనమని స్త్రీలకు హితవు చెప్పింది(70). నగలపట్ల అలంకరణల పట్ల స్త్రీలు విముఖులు కావాలని స్త్రీజన క్షేమార్ధం శారదాంబ ఏదైతే ఆశించిందో, దానితో పాటు ఆడవాళ్లు వీధుల్లో గొడుగులు వేసుకొని నడవరాదన్న నాటి సామాజిక వివక్షను దేనినైతే నిరసించిందో(82) ఈ రెండూ కూడా ఐదవ ఆంధ్ర మహిళా సభలో తీర్మానాలుగా ప్రవేశపెట్టబడి ఆమోదం పొందాయి. అది సమకాలపు స్త్రీల సహజ న్యాయ ఆకాంక్షలకు సాంస్కృతిక భావజాల రంగంలో సమ్మతిని సమకూర్చటంలో శారదాంబ వంటి వాళ్ళు చేసిన సాహిత్య కృషి ఫలితం.

తెలుగు నాట తొలినాళ్ళ మహిళా ఉద్యమానికి సంస్కరణోద్యమ వారసత్వాన్ని స్త్రీల కోణం నుండి అందించిన శారదాంబ మనకిప్పుడు స్మరణీయురాలు.

**(డిసెంబర్ 26 శారదాంబ 108 వ వర్ధంతి )**

★★★

# 9. మహిళామూర్తులు - రాజ్యాంగ స్ఫూర్తులు

(ఆంధ్ర జ్యోతి, మార్చ్ 08, 2020, అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

**- జె. కనక దుర్గ**

రాజ్యాంగం *70* ఏండ్లుగా అమలులో ఉన్నా, స్త్రీలు పురుషులతో సమానంగా జీవించలేని దశలో ఉండటానికి కారణాలు విశ్లేషించుకుంటూ స్త్రీలు తమ హక్కుల పరిరక్షణకై మరింతగా కృషిచేసే దిశగా సాగాలి. అందుకు, స్వాతంత్ర్యోద్యమం నాటి స్త్రీల సాహిత్య పఠనం అవసరం. వివిధ సాహిత్య ప్రక్రియల రూపంలో పాత తెలుగు పత్రికలలో నిక్షిప్తమై విస్మృతంగా ఉన్న నాటి స్త్రీ సాహిత్య చైతన్యం నేటికీ స్ఫూర్తిదాయకం. అనాటి స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన స్వతంత్ర జీవన చైతన్యం, స్వరాజ్యహక్కుల పోరాటం కలిసిమెలిసి భారతదేశ ప్రజాస్వామిక రాజ్యాంగ నిర్మాణానికి దారి దీపాలుగా ఉపకరించాయని అర్థం చేసుకోవాలి.

***************

ఏడు దశాబ్దాలు పూర్తి చేసుకున్న భారత రాజ్యాంగానికి మహిళా హక్కుల పరిరక్షణ దిశగా జరుగుతున్న నేటి మహిళా దినోత్సవానికి అవినాభావ సంబంధం ఉంది. స్వాతంత్ర్య సాధనతో పాటుగా సాగిన స్త్రీల స్వతంత్ర జీవన సమాలోచనలు. రాజ్యాంగ నిర్మాణానికి సోపానాలు వేశాయి. తెలుగునాట 1896 నుండి స్త్రీ జనం చేసిన ప్రాథమిక హక్కుల పోరాటం మన రాజ్యాంగానికి రహదారులు పరిచింది. స్వాతంత్ర్యోద్యమం నాటి స్త్రీల వాఙ్మయం/సాహిత్యం ఈ సత్యావిష్కరణకు భూమిక స్త్రీల స్వతంత్రత పట్ల పెరిగిన ఆలోచనలకు 1896 నుండి 1941 వరకు తెలుగు పత్రికలలో వచ్చిన స్త్రీల సాహిత్యమే నిదర్శనం.

రాజకీయ స్వాతంత్ర్యానికై దేశమంతా పోరాటం చేస్తూంటే, తమ వ్యక్తి స్వాతంత్ర్యానికై స్త్రీలు పోరాడారు. తమ అస్వతంత్ర జీవనానికి అవిద్యకు ఉన్న లంకెను గుర్తించి తమ హక్కుల సాధన కోసం విద్యావంతులు కావల్సిన అవసరాన్ని గుర్తించారు. స్త్రీకి స్వతంత్రం ఉంటేనే దేశ స్వాతంత్రానికి ప్రయోజనమని భావించిన కందుకూరి వీరేశలింగం స్త్రీ విద్యకు పునాదులు వేసారు. వేమూరి శారదాంబ 1896 లోనే తన 'మాధవశతకం'లో మహిళల అక్షరాస్యతకు నిరోధకంగా ఉన్న సామాజిక కుటుంబ అసమాన సంస్కృతిని ప్రశ్నకు పెట్టి స్త్రీవిద్య పట్ల ఆలోచనలను రేకెత్తింపజేసింది. ప్రజాస్వామిక రాజ్యాంగ సమాన హక్కులకు, లింగవివక్షలేని విద్యాహక్కుకు దీనితోనే పునాదులు పడ్డాయని చెప్పుకోవచ్చు. 1902లో విద్యావంతులైన స్త్రీలు, విదేశీ స్త్రీల జీవితాలు, వారి రాజకీయ హక్కులను తెలుసుకుంటూ తమ కుటుంబంలో తమ అస్తిత్వాలను గురించిన ఆలోచనలను పెంచుకున్నారు. అందుకే భండారు అచ్చమాంబ స్త్రీవిద్య అభివృద్ధి చెందటానికి స్త్రీల సమాజాలను ఏర్పాటు చేశారు. 1902-03 నాటికే విద్య ద్వారా జ్ఞానాన్ని పొందిన స్త్రీలు తమ బానిసత్వాన్ని తొలగించుకునే స్వతంత్ర ఆలోచనలను కొనసాగించినట్లు ఆమె రచనలలో కనపడుతుంది. స్త్రీలు పత్రికా రంగంలో ప్రవేశించారు. విద్య స్త్రీలలో ధైర్య స్థైర్యాలను పెంచుతుందని, అప్పుడే తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించగలం అనుకోవటం మన రాజ్యాంగం నిర్వచించిన ఆలోచనల స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు ప్రతీకలు. స్త్రీలకు ఉన్నత విద్యావకాశాలు

పెరగాలనీ, వారి సామూహిక స్వేచ్ఛ, స్త్రీ స్వతంత్రానికి ప్రేరకమవుతుందనీ భావించారు. మహిళలు చదువుకోవడానికి వివాహ సంస్కృతి ఆటంకంగా ఉన్నదని గుర్తించి బాల్య వివాహాలను నిరసించారు, స్త్రీ పునర్వివాహ హక్కునూ, గౌరవప్రదమైన జీవన హక్కులను గుర్తించారు.

దేశ స్వతంత్రం కోసం స్త్రీ, పురుషులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని గుర్తిస్తూనే, తమ స్వతంత్రం కోసం స్త్రీలే ఐకమత్యంతో పోరాటం చేసుకోవాల్సిన కర్తవ్యాన్నీ గుర్తించారు. 1905 లో బెర్లిన్ ప్రపంచ స్త్రీల సభలో పాల్గొన్న భారతీయ స్త్రీలు తమ దేశ అస్తిత్వాన్ని చాటడానికి తమ చీర చెంగులను చించి జెండాను తయారు చేయడం వారి స్వతంత్ర నిర్ణయాలకు నిదర్శనం. 1906లో లండన్ నుంచి వచ్చిన దాదాభాయ్ నౌరోజి కోసం ఏర్పాటు చేసిన సభలో ఒక పారసీక స్త్రీ పతాక అవిష్కరణ చేశారు. 1910 నాటికే స్త్రీల సాహిత్యంలో స్త్రీ పురుషుల స్వతంత్ర జీవనంలోని తేడాలను గుర్తించే భావనలకు పెద్ద పీట వేశారు. అవిద్య, ఆస్తిహక్కు లేమి స్త్రీ పురుషుల అసమానత్వానికి కారణమనీ, స్రీలు అదనంగా సాంఘిక, అర్థిక స్వాతంత్ర్యాల కోసం పోరాడాలని చర్చలు సాగేవి. స్త్రీలు భౌతిక, బౌద్ధిక మానసిక స్వేచ్ఛను అనుభవించగలిగినప్పుడే దేశ స్వాతంత్ర్య సాధన సులభతరం అవుతుందని భావించారు. అ దిశగా స్త్రీలలో ఆలోచనలు పంచటానికి పత్రికా స్వాతంత్ర్యాన్ని పొందారు. ఆర్థిక స్వావలంబన కోసం గృహపరిశ్రమలతో ఆదాయాన్ని పొందాలనుకున్నారు. తిలక్ ప్రస్తావించిన స్వదేశీ వస్తుతయారీలో భాగంగా స్త్రీలు నూలు వడకటం, సబ్బుల తయారీవంటివి నేర్చుకున్నారు. విద్య సాధించిన స్త్రీలు పాశ్చాత్య ప్రపంచాన్ని అధ్యయనం చేయగలిగారు. ఓటు హక్కు విలువనుగుర్తించి రాజకీయ చైతన్యాన్ని పెంచుకున్నారు. స్త్రీలు రజస్వలా నంతరమే వివాహం చేసుకొనే స్వతంత్రతను పొందాలనుకున్నారు. 1911 నాటికి ఆరోగ్య భద్రత గురించి ఆలోచించారు. బహుభార్యాత్వపు సంస్కృతిని నిరసిస్తూ కుటుంబంలో సమాన సంస్కృతి గల లైంగిక హక్కు ఉండాలని భావించారు. పుట్టుకతో సమానమే కానీ, ఇటు తండ్రి ఆస్తిలో గానీ అటు భర్త ఆస్తిలో గానీ హక్కులేని తనాన్ని గుర్తించి వారసత్వపు ఆర్థిక హక్కుల దిశగా ఆలోచనలు పెంచుకున్నారు. 1914 నాటికే 'విడాకుల' ప్రస్తావన తెచ్చారు. హిందూ వివాహ చట్టం గురించి ఆలోచనలు చేశారు. 1916 లో స్త్రీలకు సమాన ఆర్జనావకాశాల అవ్వశ్యకతను గుర్తించారు. అ తరువాత రాజకీయ స్వాతంత్రానికి తామూ అర్హులమనే భావనలు పెరిగి, లింగవివక్ష కారణంగా తాము రాజకీయాల్లోకి వెళ్లలేక పోతున్నామని గ్రహించారు. ఉద్యోగాలలోనూ సమాన అవకాశాలు  ఉండాలనుకున్నారు. నియోజకవర్గ స్వాతంత్ర్యం గురించి ఆలోచించారు. ఆ కారణంగానే స్త్రీలు 1920లో గాంధీజీ పిలుపుతో సత్యాగహోద్యమంలో భాగస్వాములై సహాయ నిరాకరణోద్యమాన్ని ముందుండి నడపగలిగారు. స్త్రీలు ఎదుర్కొనే కుటుంబ హింసను చట్టానికి పట్టించే స్థితికి వారి ఆలోచనలు పెరిగాయి. 1925 నాటికి స్వరాజ్య సాధన స్త్రీల విధ్యుక్త ధర్మమని భావించారు. 1920లో స్త్రీని నిర్వచిస్తూ ఆమెకు శరీరముంది, మెదడుంది, హృదయముందనీ స్త్రీ పురుషుని సొత్తుకాదనీ, స్త్రీల స్వతంత్ర జీవన హక్కు మానవహక్కు అనీ ప్రకటించారు. 1929 నాటికి విద్యావంతులైన స్త్రీలకు ఓటుహక్కు లభించింది. మున్సిపాలిటీలు, బోర్డులు ఏర్పడ్డ నేపథ్యంలో స్త్రీలు పరిపాలనా రంగంలోకి అడుగుపేయటం, క్రమంగా నామనిర్దేశంగా పదవిని పొందటంకాక, ఎన్నుకోబడి స్వతంత్ర జీవనానికి బాటలు వేయాలనుకున్నారు. ఆ రకంగా తమకు రాజ్యధికారంలోని పాలనాహక్కులను 'పొందాలనుకున్నారు.

1930లో చట్ట ప్రయోజనాలను తెలుసుకుంటూ స్త్రీల హక్కులను సద్వినియోగం చేసుకోవాలనుకున్నారు. రాజకీయ స్వాతంత్రం కోసం ఉప్పు సత్యాగ్రహంలో పోరాడుతూనే, తమ భావస్వేచ్ఛకు సంబంధించి చట్టపరమైన హక్కులను విశ్లేషించుకున్నారు. గ్రామస్వరాజ్యంలో స్త్రీల భాగస్వామ్యం ఉండాలనుకున్నారు. 1932 శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని బాధలు పడటంతో పాటు, తాము ఎదగగలిగి తోటివారికి సహాయపడగల స్థితికి చేరుకోవాలనీ, వ్యాపారపు 'మెలకువలు గ్రహిస్తూ ఆర్థికశక్తిగా ఎదిగితేనే దేశ స్వాతంత్ర్యానికి పాటుపడగల సమర్థత స్త్రీలకు ఉంటుందని భావించారు.

1935లో నే స్త్రీలు తమ సామాజిక అస్తిత్వాలకు సంబంధించి ఆలోచనలు పెంచుకొని సామాజిక సంస్కృతిని నిరసించే విధంగా స్వతంత్ర నిర్ణయాలు చేసుకోవాలని భావించారు. 1935 నాటికి ఎన్నికల ద్వారా శాసన సభ్యత్వానికై సమాన ప్రాతినిధ్యం ఉండాలనే చైతన్యం అభివృద్ధి చేసుకున్నారు. ఉన్నత విద్యావంతులైన స్త్రీలకే కాక సంతకం చేయగలిగిన స్త్రీలకు ఓటుహక్కును, ఎన్నికల హక్కును విస్తరింప జేయాలనుకున్నారు. స్త్రీల హక్కులకై శాసనసభలో బిల్లును పెట్టాలనుకున్నారు. సంపూర్ణ స్వేచ్ఛ కోరుకున్నారు. 1936లో సాంఘిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో స్త్రీ పురుష సమానత్వపు ఆవశ్యకతను గుర్తించి, ఎన్నికకాబడే హక్కు స్త్రీ ఆత్మహక్కని భావించారు. తాము చేసే ఇంటి చాకిరికి వేతనాలు కావాలన్నారు. 1937లో ఉద్యమంలో పాల్గొనటానికి గర్భధారణ ఆటంకంగా ఉన్నదని భావించిన సందర్భంలో, స్త్రీలు సంతానాన్ని కనే యంత్రాలు కాదనీ, తల్లికావడం, గర్భస్రావం వంటి విషయాలలో నిర్ణయాధికార హక్కు ఉండాలని గుర్తించారు. స్త్రీలు సైన్యంలో చేరాలనే ఆలోచనలూ పెరిగాయి. స్త్రీ వ్యక్తిత్వాన్ని అగౌరవపరిచే పత్రికా ప్రకటనలను, చిత్రాలను, నిరసించారు. 1937 నాటికి స్త్రీలు శాసనసభ్యులుగా ఎన్నికై రాజకీయ హక్కులను పొందారు. పెళ్ళిళ్ళు రిజిష్టర్ చేయాలని కోరుకున్నారు. 1998 నాటికి స్త్రీలు చట్టాల్లో ఉన్న లింగవివక్షను, గుర్తించడంతో సాంఘిక, ఆర్థిక న్యాయాలను ప్రశ్నకు పెట్టారు. స్త్రీలు పురుషునితో సమానంగా జీవించే హక్కు కలిగి ఉంటేనే స్త్రీ స్వతంత్ర జీవనహక్కుకు రక్షణ ఉంటుందని భావించారు. ఆర్థిక విధానం మారాలని స్త్రీలకు ఆర్థిక, సాంఘిక, రాజకీయ హక్కులు కావాలనీ భావించారు.

1947 ఆగష్టు 15వ తేదీన ఎగురవేయబోయే భారతదేశ స్వాతంత్ర్య జెండాను తెలుగింటి కోడలైన సరోజనీ నాయుడు నెహ్రూకు అందించింది. తెలుగు వనిత దుర్గాబాయి దేశముఖ్ డా.అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ నిర్మాణ సంఘ సభ్యురాలిగా ఉన్నది. ఇవన్నీ స్త్రీలకు సమాన హక్కులు, సమాన న్యాయం ఉండాలన్న సూచనలే. దేశస్వాతంత్ర్యానికీ, స్త్రీ హక్కుల చైతన్యానికీ, దేశరాజ్యాంగ నిర్మాణానికీ గల అవినాభావ సంబంధం నుంచి స్ఫూర్తిపొందటం నేటి అంతర్జాతీయమహిళా దినోత్సవం లక్ష్యం కావాలి. భారత రాజ్యాంగం 70 ఏండ్లుగా అమలులో ఉన్నా, స్త్రీలు పురుషులతో సమానంగా జీవించలేని దశలో ఉండటానికి కారణాలు విశ్లేషించుకుంటూ స్త్రీలు తమ హక్కుల పరిరక్షణకై మరింతగా కృషిచేసే దిశగా సాగటానికి స్వాతంత్రోద్యమం నాటి స్త్రీల సాహిత్య పఠనం అవసరం. వివిధ సాహిత్య ప్రక్రియల రూపంలో పాత తెలుగు పత్రికలలో నిక్షిప్తమై విస్మృతంగా ఉన్న నాటి స్త్రీ సాహిత్య చైతన్యం నేటికీ స్ఫూర్తిదాయకం. అనాటి స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన

స్వతంత్ర జీవన చైతన్యం, స్వరాజ్య హక్కుల పోరాటం కలిసిపెరసి భారతదేశ ప్రజాస్వామిక రాజ్యాంగ నిర్మాణానికి దారిదీపాలుగా ఉపకరించాయని అర్థం చేసుకోవాలి.

## 10. సాహస బాలకవయిత్రి – శ్రీమతి వేమూరి (దాసు) శారదాంబ

### (123వ వర్ధంతి సందర్భంగా నివాళి)

(Facebook Post: December 26, 2021)

- **డా. దాసు మధుసూదన రావు**

*"వరుసను మున్ను స్త్రీలఁ దగుప్రాయము వచ్చినపిమ్మటం స్వయం*
*వరములఁ జాట బంపి తమ వాంఛకు వచ్చిన వారి బెండ్లి గా*
*బరపిరటంచు విందు మన బాలల బెండ్లి యనంగ నేమొ వా*
*రెరుఁగక యుండఁ బెండ్లి దమరింపుగ జేయుదు రేల మాధవా!"*

(ఇది వేమూరి శారదాంబ (మే 3, 1881 – డిసెంబరు 26, 1899) వ్రాసిన 'మాధవశతకం'లోని ఒక పద్యం.)

ప్రేమ వివాహాలను ఆమోదించలేక కుటుంబ/కుల గౌరవానికి హాని చేస్తున్నారని అటువంటి పెళ్ళి చేసుకున్న వారిని హింసిస్తూ, హత్య కూడా చేయటానికి వెనుకాడని మనుషులున్న ఈ 21వ శతాబ్దంలో ఉన్న మనకు, పురుషాధిక్య భావంతో ఆడువారిని ఇంటికే పరిమితం చేసిన నూటపాతిక సంవత్సరాల క్రిందటి సమాజంలో పదమూడు పధ్నాలుగేళ్ళ బాలిక వివాహ విషయంలో స్త్రీలకు (ఒకప్పుడున్న) స్వయంనిర్ణయాధికారం ఉండాలని తలచటమే ఊహించరానిదైతే, దానిని ప్రోత్సహించి ఆచరణలో పెట్టాలని పద్యరూపంలో వ్రాసి ప్రచారంజేయబూనడం విప్లవాత్మకమైన చర్య కాదా? ఇటువంటి అలోచన ఉండటమే పాపమైతే ఆ భావాలను బాహాటంగా చెప్పబూనటం నియంత ఎదుట స్వాతంత్ర్యం ప్రకటించటమంత సాహసంకాదా? ఆనాటి సంఘసంస్కర్తలుగా ఖ్యాతిపొందినవారు కూడా వివాహ విషయంలో ఆడువారికి స్వయంనిర్ణయాధికారం ఉండాలని అన్నట్లు నేను వినలేదు.

సాధారణంగా సామాన్యులు చేయలేనివో, చేయవెరచేవో అయినటువంటి పనులు చేసేవాళ్ళను సాహసవంతులుగా వర్ణిస్తూ ఉంటారు. కొన్ని సందర్భాలలో ప్రమాదకర పరిణామాలుండవచ్చని తెలిసినా లెక్కజేయక ధైర్యంతో ఆపనులు చేస్తూ ఉంటారు. ఇటువంటి సాహస కృత్యాలు చాలావరకు తమకో, తమతోటివారికో ప్రాణాపాయం ఎదురైనప్పుడు మొండిధైర్యంతో వాటిని తప్పించే యత్నాలే అయివుంటాయి. అటువంటి పనులు చిన్నపిల్లలు చేస్తే వారిని 'సాహస బాలురు' లేదా 'సాహస బాలికలు' అని పొగడుచూ బహుమతులిచ్చి సన్మానిస్తారు.

సమకాలీన సమాజంలో చాలాకాలంగా వేళ్ళూరుకుపోయిన నమ్మకాలు, కట్టుబాట్లు ఒక వర్గాన్ని వివక్షకు గురిచేస్తూ వారిని అజ్ఞానాంధకారంలో ఉంచుచున్నాయని తలచి అ కట్టుబాట్లకు/ఆచారలకు వ్యతిరేకంగా

భావ వ్యక్తీకరణతో పాటు నిషేదించిన వాటిని స్వయంగా ఆచరించి ప్రచారం చేయటం ఏ యుగంలో అయినా సాహస చర్యే. ఆ పనుల వలన సమాజ బాహుళ్యానికి మేలు కలిగితే అవి చేసిన వారిని సంఘ సంస్కర్తలుగా ప్రజలు గుర్తించి సన్మానిస్తారు. అదే యుక్తవయస్సు పూర్తిగా రాని ఒక ఆడుపిల్ల చేస్తే ఆమెను సాహస బాలిక అని అభివర్ణించడం అతిశయోక్తికాకపోగా సమంజసం కూడా. ఆకోవకు చెందినదే 19వ శతాబ్దపు చివరి దశకంలో సంగీత సాహిత్య గగనంలో తళుక్కున మెరసి కనుమరుగైపోయి ఆతరువాత వినమరుగైపోయిన తార శ్రీమతి పేమూరి శారదాంబ. ఈరోజు(డిసెంబర్ 26) ఆమె 123వ వర్ధంతి.

స్త్రీలు విద్యార్హులుకారని, కులస్త్రీలు లలితకళలనభ్యసించడం ఘోరపాపమని భావిస్తూ వారిని వంటయింటి కుందేళ్ళుగా పరిగణమిస్తున్న కాలంలో ఆమె మహాకవి, వాగ్గేయకారుడు, సంఘసంస్కరణాభిలాషి అయిన తండ్రి శ్రీ దాసు శ్రీరాములు (1846-1908) ప్రోత్సాహంతో లోకనిందకు వెరవక సంస్కృతాంధ్రములతో పాటు సంగీతము, వీణావాదనలోనూ ప్రావీణ్యం సంపాదించి చిన్నవయస్సులోనే పద్యములల్లటమూ, కచేరీలు ఇవ్వటము చేసింది. సాహిత్యం ఒక్క మానసికోల్లాసమివ్వటానికే పరిమితం కాకుండా సమాజాభ్యుదయానికి కూడా దోహదపడాలని శారదాంబ దృఢాభిప్రాయం. తానున్న కాలంలో మహిళలు పడుచున్న కష్టాలను, ఆవేదనను పద్యరూపంలో వ్యక్తపరుస్తూ ఒక శతకమే వ్రాసింది. అందరి శతకకారులలాగా మోక్షగామి కాకుండా మహిళాభ్యుదయంకోసం వంద పద్యాలలో 'మాధవు'ని ఆమె వేడుకుంది. "మాధవ శతకము – స్త్రీజనక్షేమార్థక భగవత్ప్రార్థన పద్యములు" అని తన గ్రంథానికి పేరు పెట్టడంలోనే ఆమె ఆకాంక్ష ఎంత బలమైనదో తెలుస్తుంది. మహిళల మానసిక, సామాజిక అభ్యుదయానికి, సాధికారతకు విద్యయే ప్రథమ సోపానమని విశ్వసించిన శారదాంబ శతకారంభంలోనే "పొందుగ బద్ధిశాలినిగc బ్రోవుము శ్రీధర, శూరమాధవా" అని ప్రార్థిస్తూ ధైర్యంగా ఆడువారికి (కూడా) చదువు నేర్పించు బుద్ధి సమాజంలోని పెద్దవారికి కలిగేట్లు చేయమని శతక ఆరంభంలోనే ఈ విధంగా చెప్పింది.

*"నిన్ను మదిం దలంచి యిటు నిచ్చలు వేcడుటదేలయన్న స*
*త్సన్నుత, స్త్రీల దుస్థితిని సద్వ్రతంబుగ బాపి యిభువిన్*
*బన్నుగ సద్బుధుల్ తగిన పట్టున విద్యను ముద్దరాండ్రకున్*
*గ్రన్నన నేరిపించి మరి జ్ఞానము బుట్టగc జేయు మాధవా."*

భాస్కరాచార్యుని కూతురు లీలావతిని, భోజరాజు భార్య భానుమతిని, తరికొండ వెంగమాంబని ఉదహరిస్తూ స్త్రీవిద్యకు ముందు లేని అభ్యంతరాలు ఇప్పుడు ఎందుకని ఈశతక పద్యాలలో వాదించింది. ఆడవాళ్ళు చదువుకుంటే (ఇప్పటికీ కొంతమందికున్న అభిప్రాయం) చెడిపోతారన్నది ఉత్తిమాట అని అంటూ

మహిళలకు విద్యగరపించే బాధ్యత సమాజానికి ఉన్నదని దానికి తోడు స్త్రీలు కూడా తమవంతుబాధ్యతగా ఏమి చెయ్యాలో (అక్కడక్కడ ఘాటుగా, కొన్నిచోట్ల మెత్తగా) కూడా చెప్పింది. ఉదాహరణకు,

*“కోరిక మూగనోము, దయకుంకుమ మీమొదలైన నోములన్*
*గూరిమి నోచుచుంద్రు కద కోమలు లందరు గూడి ప్రొద్దు ని*
*ట్లూరక బుచ్చుకంటె తమరొప్పుగ విద్యలనిట్టి తీరికన్*
*నేరంగవచ్చు గాదె కడు నేరుపు మీరంగ వేగ మాధవా.”*

ఇంత ధైర్యంగా, తాను స్త్రీ అయివుండి కూడా, నోములకు వ్రతాలకు వెచ్చించే సమయాన్ని చదువుకోటానికి ఉపయోగిస్తే మంచిదని ఎవరు చెప్పగలరు. ఈమాటే ఈరోజులలో అంటే పర్యవాసానం ఎలా ఉంటుందో ఊహించవచ్చు. అందుకే శారదాంబ ఒక సాహస కవయిత్రి. అలాగే ఆడువారు తమ సింగారానికి వెచ్చించే రెండు మూడు గంటల సమయంలో కొంచెంసేపు చదువుకోసం కేటాయించమని ఎలా చెప్పిందో చూడండి.

*“తలద్రువ్వంగను నొక్క గంట మరిపెట్టంబొమ్మ లంగంట చీ*
*రెలంగట్టంగను బొట్టుబెట్ట నగునీ రెండుందగన్ గంట యీ*
*యిలలో నెందరు స్త్రీలు తీరుబడిగా నీలీలగావింతు రిం*
*దులలో గొంచెముసేపు విద్యకొరకుం జూపట్టదే మాధవా.”*

నగలకోసం చెవులు ముక్కులు కుట్టించుకొని శరీరాన్ని బాధపెట్టుకొనటం కన్నా చదువుపై శ్రద్ధ చూపితే మంచిదని ఇంకో పద్యంలో బోధ చేసింది. ఇలా ప్రతి పద్యంలోనూ విద్యయే స్త్రీల అభ్యున్నతికి ముఖ్యమార్గమని చెప్పటానికి అమె తపన వ్యక్తమవుతూ ఉంటుంది. నూటపాతిక సంవత్సారలకు పూర్వం ఈ బాలకవయిత్రి లేవనెత్తిన సమస్యలు గొప్పగా అభివృద్ధి చెందిననదనుకుంటున్న ప్రస్తుత కాలంలో ఇంకా చాలాచోట్ల సమస్యలుగానే ఉండి కేవలము చర్చాంశాలుగా మిగిలిపోవటం బాధాకరం.

ఈమె పధ్నాలుగేళ్ళకు ఆరంభించిన తన కవితా వ్యాసంగం  ఒక్క అభ్యుదయభావశతక రచనతో సరిపెట్టక పదహారేళ్ళ వయస్సులో ‘నాగ్నజితీ పరిణయము’ అనే ప్రౌఢకావ్యం రచించింది. ఈ కావ్య రచనా శైలిని చూసి పండితులు శారదాంబను 15వ శతాబ్దపు కవయిత్రి మొల్లతో సరిపోల్చారు. ఇంతటి విదుషీమణి పూర్తికాలం జీవించి ఉంటే ఇంకా ఎన్ని రచనలు చేసి, కవయిత్రిగా, సంస్కర్తగా పేరుగణించి ఉండేదో! కాని భగవన్నిర్ణయం వేరుగావుండి పందొమ్మిదవయేటనే శారదాంబ కన్నుమూసింది.

అకాలమరణం వలన శారదాంబకు “చిన్నారి పొన్నారి చిఱుత కూకటి నాడు రచియించితి మరుత్తరాట్చరిత్ర, నూనూగు మీసాల నూత్న యౌవనమున శాలివాహన సప్తశతినొడివితి ...” అని శ్రీనాథ కవి చెప్పుకున్నట్లు తన రచనాకాలక్రమం (chronology) చెప్పుకోవటానికి అవకాశం లేకపోయింది. కాని అభినవ శ్రీనాథుడని

పేరుపొందిన ఆమె తండ్రి మహాకవి దాసు శ్రీరాములు తన బృహత్కావ్యం 'దేవీభాగవత' అవతారికలో పంతొమ్మిదవయేటనే శివశాయుజ్యం పొందిన తన కుమార్తెను తలచుకుంటూ ఆలోటు తీర్చారు. ఆ ప్రస్తావనతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

*"తనతొమ్మిదవయేట ననుపమానప్రజ్ఞ నింపుగా వీణ వాయింప నేర్చె*
*తన పదియవయేట సునిశితంబగు బుద్ధి దాగొల్పె నేకసంతగ్రహణము*
*తన చతుర్దశ శ్రత్తున ముద్దుముద్దుగా నల్లిబిల్లిగ బద్యమల్లనేర్చె*
*తనదు పదార్వ వత్సరమున నగ్నజిజ్ఞా వివాహప్రబంధంబు సెప్పె"*
*"తనదు పందొమ్మిదవ వర్షముననె మర్త్య భావమునుమాని శాశ్వత బ్రహ్మలోక*
*సిద్ధిఁగనె శారదాంబ నాచిన్నికూతు ననుదినంబును మఱువక యాత్మనుంతు."*

*ఓం శాంతి!*

ఆంధ్రజ్యోతి

సోమవారం 21 మార్చి 2022

వివిధ

సాహిత్య వేదిక vividha@andhrajyothy.com

# ఆధునిక యుగానికి ప్రథమ కవయిత్రి

వేమూరి శారదాంబ (1881-1899) 'మాధవ' అనే మకుటంతో అల్లిన 101 పద్యాల కూర్పును 'మాధవశతకం'గా 'కలావతి' పత్రిక 1901 సంవత్సరం మార్చి నుంచి మే నెల వరకు ప్రచురించింది. ఆధునిక యుగ ప్రారంభంలో పాత, కొత్త తరాల స్త్రీల సాహిత్యానికి వారధి వంటిది ఈ మాధవశతకం. 125ఏళ్ల క్రితం శారదాంబ తన 14 ఏటనే ఇంతటి వైదుష్యంతో, ఎంతో సామాజిక స్పృహతో ఈ రచన చేసింది. ఆమె తన 16వ యేటనే 'నాగ్నజితీ పరిణయం' అనే ప్రబంధాన్ని కూడా రాసింది. భాగవతంలోని కృష్ణుని అష్టభార్యలలో ఒకరైన నాగ్నజితిని అప్పర్థకంగా మాత్రమే కాక ఆమెకొక స్వతంత్ర వ్యక్తిత్వం ఉండాలనే భావనతోనేమో- ఆమెను 'సుదంత' అనే పేరుతో పరిచయం చేసింది. అంతేకాదు, ఆమెను సంగీత, సాహిత్య, చిత్రలేఖన కళా కోవిదురాలిగా తీర్చిదిద్దింది. నాగ్నజితిలో సంగీత, సాహిత్య కళానిధియైన శారదాంబ వ్యక్తిత్వం ప్రతిఫలిస్తూ ఉంటుంది. 1860-70ల తర్వాతి కాలంగా పరిగణించే ఆధునిక యుగంలో వేమూరి శారదాంబనే ప్రథమ కవయిత్రిగా గుర్తించాలి.

స్త్రీ విద్యకు దిక్సూచి వంటిది మాధవ శతకం. ఇందులో స్త్రీ విద్యా విషయాన్ని శతకమంతా అంతస్సూత్రంగా కొనసాగిస్తూనే స్త్రీవిద్యాభివృద్ధికై ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి దిశానిర్దేశం చేసింది శారదాంబ. సమాజంలోని విద్యావంతులను సంస్కరించటం, సమాజ సంస్కృతిని ప్రశ్నించటం, స్త్రీ విద్య వల్ల కుటుంబాలకు ఎంతటి ప్రయోజనం ఉంటుందో చెప్పటం, భర్తలకు ఎంతటి సుఖమో తెలియజెయ్యటం, భార్య చదువు వల్ల భర్తలలో కలిగే భయాందోళలను పోగొట్టటం, స్త్రీలలో కూడా తమ విద్యాభివృద్ధికై కాలాన్ని సద్వినియోగపరచుకొనే చైతన్యాన్ని కలిగించటం... ఇది ఈ శతకంలో శారదాంబ కార్యాచరణ ప్రణాళిక అనుకోవచ్చు.

స్త్రీల దుస్థితి పట్ల తనలో కలిగిన విచారాన్ని పోగొట్టుకోవటానికి శతకం రాస్తున్నానని చెబుతూ, తన మాటలను 'చెవిని రిక్కించు' కొని స్త్రీజాతిని బ్రోవటానికి 'చయ్యన' రమ్మని తన దైవం మాధవుణ్ణి వేడుకొంటుంది శారదాంబ. ఇందులో ఆమెకు స్త్రీజాతిని కాపాడే ఆరాటమే తప్ప స్వార్థం లేదు. స్త్రీల దుస్థితిని పోగొట్టాలంటే ముందుగా విద్యనేర్పించాలని, అప్పుడే వారికి జ్ఞానం కలుగుతుందని ఆమె భావించింది. ప్రతి మనిషికి తనని తాను అంచనా వేసుకోవటానికి గాని, మిగిలినవారితో సమానమైన గౌరవం తన పుట్టుకకు ఉన్నదో లేదోనన్న ఎరుక కలగటానికి గాని చదువే ఉపయోగపడుతుంది.

స్త్రీలకు విద్య అనవసరమనే కరుడుగట్టిన భావజాలంతో ఉన్న సమాజాన్ని సంస్కరించాలని తన దైవమైన మాధవుడ్ని మధ్యవర్తిగా చేసుకొని, ఆ మాధవుడికి కర్తవ్యాన్ని సూచించింది. దానికై సద్బుధులవద్ద స్త్రీలకు విద్యను నేర్పించమంది. అయితే అది అంత సులువైన విషయం కాదు. అందుకని ముందుగా విద్యావంతుల మనస్సు ప్రక్షాళన అయ్యే విధంగా వారిని సన్మార్గవర్తనులుగా చేయమని అడిగింది. అంతేకాదు, పురుషులలోని లోపాలను సరిదిద్దమనీ, ముఖ్యంగా స్త్రీలను హింసించేవారి మనస్తత్వాన్ని మార్చమని అడుగుతుంది. స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన సామాజిక మనస్తత్వానికి తగిన చికిత్స అవసరమని భావించింది. అప్పుడే పురుషులలో స్త్రీవిద్యను అంగీకరించే మనస్సు సిద్ధమవుతుతుంది.

మనువు కూడా స్త్రీలను పూజించమనే 'ముచ్చట' చెప్పాడుగాని స్త్రీలను బాధపెట్టే విషయాలను గురించి పేర్కొనలేదన్న విషయం గుర్తించమంటుంది శారదాంబ. స్త్రీవిద్య పట్ల వ్యతిరేకతగల సమాజాన్ని సామ దాన భేద దండోపాయాలతో సంస్కరించాలంటుంది. స్త్రీ పురుషులలో మేధోశక్తులు సమానమనే భావనను కలిగిస్తూ ఇలా రాస్తుంది:

"వలదనుటెట్లు విద్య మగవారలకెట్టులనట్లేకదా
పొలతులు విద్యయందు రుచి పూనకయుండుట తప్పిదంబుగా
లలనలు నాలుగక్షరములం జదవంగనె విద్య కాదుగా
తెలివి సమమ్ము పూనగను స్త్రీపురుషుల్ధరయందు మాధవా!"

స్త్రీలు చదువుకుంటే వారిలో చెడ్డగుణాలు ఏర్పడతాయనే అపప్రథకు చెంపదెబ్బకొడ్తూ మగవారు చదువుకుంటేకూడా చెడ్డవారైనట్లేకదా అంటుంది:

"చదివిన దుర్గుణంబులను జాలగబొందుదురంద్రుగాని య
య్యది చెడుబుద్ధులన్ గరపునట్లయినన్మగవారు నేర్వ చె
ల్లదుగద విద్యనెట్లు మది రంగుగ నేరుచుచున్నవారలి
య్యదనున నందరున్ జెడగునందిరి జూడగదయ్య మాధవా!"

- అని సమాజానికి చురకవేస్తుంది.

స్త్రీలు చదువుకుంటే కుటుంబానికి ఎంత ప్రయోజనమో చెప్తూ- విద్యావంతులైన స్త్రీలు కుటుంబంలోని వ్యక్తులతో సత్సంబంధాలతో మెలుగుతారనీ, పిల్లలను మంచిబుద్ధులతో పెంచుతారని అంటుంది. ఆడపిల్ల చదువుకు ఖర్చుపెట్టడం యిష్టంలేని వాళ్లకు స్త్రీల చదువు కూడా లాభదాయకమే అని చెపుతూ- ఒకసారి ఖర్చుపెట్టి ఆడపిల్లను చదివిస్తే తరువాత వచ్చే తరతరాల ఆడపిల్లలు తమ తల్లులదగ్గరనే చదువుకోగలరని అంటుంది. చదువుతో స్త్రీలకు శాస్త్రజ్ఞానం ఏర్పడుతుందనీ, దానితో అవసరమైనప్పుడు శిశువులకు స్వయంగా చికిత్సచేసి బిడ్డలను కాపాడుకోగలుగుతారని చెప్పింది. పితృస్వామ్య కుటుంబాల్లో యింటికి పెద్ద అయిన మామకు కోడలు చదువు పట్ల నిరసన భావం ఉంటుంది. కాబట్టి మామలకు స్త్రీ విద్యా ప్రయోజనాన్ని రుచి చూపించాలనుకొని- మామ లవణంతెచ్చి వడ్డించమంటే కోడలికి అర్థంతెలియక ఆవుపేడతెచ్చిన విషయాన్ని ఉదాహరిస్తుంది.

ఇక భార్య చదువుకొంటే- 'పడతులు విద్యనేర్చినను భర్తలకెంత సహాయులౌదురెయ్యెడలనునైన' అంటూ భర్తకు సహాయకురాలిగా ఉంటుందనీ, 'స్త్రీలకు విద్యనేర్చినను జేకురు సౌఖ్యములెల్ల' అని చెప్పి భర్తకు అది ఎంతో సుఖాన్ని కలిగిస్తుందనీ చెప్పి వారి మనస్తత్వానికి కావలసిన చికిత్స చేయాలనుకొంది. మనువు చెప్పినట్లుగా భార్య 'కరణేషుమంత్రి' కావాలంటే, 'ధైర్యము పూని విద్య ప్రమదామణి నేరక మంత్రి యెట్లగున్' అంటూ మంచి మంచి ఆలోచనలు యివ్వటానికైనా భార్య చదువుకొని ఉండాలంటుంది. ఇంటి వ్యవహారాల్లో సొమ్ములెక్కలు ఆమే చూసుకోగలిగితే భర్తకు సుఖంగా ఉంటుందంటుంది. తీరికలేని పనుల మీద బయటకువెళ్లి అలసివచ్చిన భర్తకు వార్తాపత్రిక చదివి వినిపించి దేశ సమాచారాన్ని తెలియజేస్తుందని చెబుతుంది. 'అంగనలెల్లరుం సహజమౌ తెలివిం దగబొందియుండగా రంగుగ విద్యనేర్చిననె రాజిలుగా తెలివెందుమాధవా' 'ముద్దరాంద్రకింపలరగ నాల్గురెట్లు మగవారలకన్నను బుద్ధియెక్కుడంచిలదెలుపంగ' స్త్రీలకు చదువెందుకని మాట్లాడకూడదని చెప్పింది. స్త్రీలకు చదువే హస్తభూషణం అయినప్పుడు భార్యలకు నగలమీది వ్యామోహంతగ్గి నగలకై ధనాన్ని అడగరని చెప్పింది. చదువుకున్న స్త్రీలు దుష్ప్రవర్తనతో ఉంటారనే భావం ఆనాటి మగవారిలో నరనరాల్లో జీర్ణించుకొని ఉండేది. కాబట్టి దానికి విరుగుడుగా మగవాళ్ళు భార్యలలో కోరుకొనే సత్ప్రవర్తన, నాగరికత స్త్రీలకు విద్యాజ్ఞానంవల్లనే వస్తుందని చెప్పింది. భర్తలు అంత సులభంగా ఈ విషయాలను అంగీకరించరనే భావంతో కవయిత్రి వారిని నయానా భయానా కూడా ఒప్పించే పయత్నం చేస్తుంది. స్త్రీలకు విద్య లేకుంటేనే, భార్య మూఢురాలిగా ఉంటేనే నయమనుకొనే భర్తలు మూగ అమ్మాయిలను పెళ్ళిచేసుకోవాలంటుంది. అంతేకాదు చదువుకొన్న భర్తలు చదువులేని అమ్మాయిని అర్ధాంగిగా చేసుకొంటే అతని శరీరంలో సగభాగం చచ్చుపడినట్లయి శక్తిహీనుడు అవుతాడని, అదే అతనికి పెద్ద శిక్ష అని అర్థం వచ్చేటట్లుగా రాస్తుంది.

పితృస్వామ కుటుంబాల్లో భర్తలకు స్త్రీలు చదువుకుంటే తమ పురుషాధిక్యతకు ముప్పు వస్తుందనే భయం ఉంటుంది. శారదాంబ ఈ భయానికి మనోవిజ్ఞాన చికిత్స చేయాలనుకొంది. తనని దేవుడంటూ పూజించాల్సిన భార్య చదువుకుంటే ఇక గౌరవించదనీ, ఇంటి చాకిరీ కూడా తన నెత్తి మీద పడుతుందనీ, ఆమెలో దుర్గుణాలు ఏర్పడతాయనే అపోహలు భర్తల్లో ఉంటాయనీ, కానీ దానికి భిన్నంగా, స్త్రీలు విద్యావంతులైతే భర్తలను మరింతగా గౌరవిస్తారని చెపుతుంది:

"ముదితలకెల్ల యోగ్యతలు మున్మును గష్టముచేసి యాభువిన్
చదువుటవల్ల రావు సహజంబులుగానె లభించునందుర
య్యది నిజమైన శాస్త్రములనన్నియు నేల నిరర్థకంబులే
మదిగనట్టులైన మగవారలకుం జదువేల మాధవా!"

స్త్రీలు విద్యావంతులైతే స్వతంత్రులవుతారనీ, తమ మాటలను పట్టించుకోరనే భయం వారిలో ఉంటుంది కాబట్టి వారి నాడిని పట్టుకొన్న కవయిత్రిగా-

"తరుణులు విద్య నేర్చిన స్వతంత్రములిమ్మటంచుంద్రటంచునం
దురే యది కల్ల దాము దగునో యెవి పూనగనెవ్వి గూడదో
యెఱింగియె పొందుచుంద్రుగద యెప్పుడు గూడను బాగవిద్యలన్
గరచినవారు గాననిది న్యాయమె జెప్పగచూడ మాధవా!"


- అని సామాజిక సంస్కృతిని ప్రశ్నకు పెట్టింది. స్త్రీలకు స్వాతంత్ర్యం యిచ్చేందుకు పురుషులకేమి హక్కు ఉందని ఈ నాడు స్త్రీలు చర్చించుకొనే విషయాన్ని ఆనాడే శారదాంబ చెప్పింది. స్త్రీలు తన స్వతంత్రాన్ని తామే పొందుతారని, దాన్ని బాధ్యతతో ఏమేరకు వినియోగించుకోవాలో వారికి తెలుసని చెప్పిన క్రాంతదర్శి శారదాంబ. స్త్రీలు కూడా తీరిక సమయాల్లో పొరుగింటి అరుగుమీద కూర్చొని భారత కథలను తోచినట్లు చెప్పుకోవటం కాక గ్రంథ పఠనంచేసి జ్ఞానాన్ని పొందాలంటుంది. నోములు, వ్రతాలకు వెచ్చించే సమయాన్ని చదువుకి వాడమంటూ సాంస్కృతిక విప్లవ భావాలను వారిలో రేకెత్తిస్తుంది. గర్భిణి, ప్రసవ సమయాల్లో తప్ప మిగిలిన కాలంలో స్త్రీలు ధైర్యంతో, పూనికతో విద్యార్జన చేయాలంటుంది.

మన స్త్రీలలో అవిద్య ఎంత ప్రాచీనమైనదో కూడా ఈ మాధవశతకం వల్ల అర్థమవుతుంది. క్రీ.శ.1వ శతాబ్దానికి చెందిన గాథాసప్తశతిలో స్త్రీలు తమ భర్తలు పొరుగూళ్ళకు వెళ్లిన తరువాత రోజులు లెక్కపెట్టటానికై గోడల మీద గీతలు గీసే వారని ఉంది. మాధవశతకంలో కూడా స్త్రీలు పాల లెక్కలకై గీతలు గీసేవారని కవయిత్రి పేర్కొంటుంది. దీన్ని బట్టి, 19 శతాబ్దానికి కూడా స్త్రీ విద్య అదే స్థితిలోనే ఉన్నట్లుగా అర్థమవుతుంది.

125 సంవత్సరాలక్రితం రాయబడిన ఈ మాధవశతకం మహిళావిద్యలో ఒక మైలురాయి. స్త్రీ విద్యకు సంబంధించి సమాజంలోని తప్పిదాలను తర తరాలకు పాఠక హృదంతరాళాల్లో నాటుకొనేటట్లుగా చెప్పిన రచన కూడా. ఈ శతకంలో వ్యక్తమయ్యే స్ఫూర్తిని విస్మరించటంవల్లనే- ప్రభుత్వాలు స్త్రీల విద్యా శాతాన్ని గురించి ఎన్ని కాకిలెక్కలను కాగితంమీద చూపించుకొంటున్నా-- ఇంకా గ్రామీణ, బలహీనవర్గాల స్త్రీలలో అవిద్య తాండవిస్తున్నది. మహిళావిద్యకు మాధవశతకాన్ని భద్రాసనంగాచేసి తన 18వ యేటనే నింగికెగసిన వేమూరి శారదాంబ నేటికీ, ఎన్నటికీ స్త్రీవిద్యకు వేగుచుక్కగా ప్రకాశిస్తూనే ఉంటుంది.

■ జె. కనకదుర్గ
94911 40299

> **125 సంవత్సరాల క్రితం రాయబడిన ఈ 'మాధవశతకం' మహిళావిద్యలో ఒక మైలురాయి . ఈ శతకంలో వ్యక్తమయ్యే స్ఫూర్తిని విస్మరించటంవల్లనే- ప్రభుత్వాలు స్త్రీల విద్యా శాతాన్ని గురించి ఎన్ని కాకిలెక్కలను కాగితంమీద చూపించుకొంటున్నా- ఇంకా గ్రామీణ, బలహీనవర్గాల స్త్రీలలో అవిద్య తాండవిస్తున్నది. మహిళావిద్యకు మాధవశతకాన్ని భద్రాసనంగా చేసి తన 18వ యేటనే నింగికెగసిన వేమూరి శారదాంబ నేటికీ, ఎన్నటికీ స్త్రీవిద్యకు వేగుచుక్కగా ప్రకాశిస్తూనే ఉంటుంది.**



## 12

## అభ్యుదయ సాహితీ సరోవరంలో సౌగంధికం - శ్రీమతి వేమూరి (దాసు) శారదాంబ

(Face book Post: December 26, 2022)

**-డా.** దాసు మధుసూదన రావు

ఎంతకాలం బ్రతికామన్నదానికంటే స్వల్పజీవితమైనా ఎంత అర్థవంతంగా గడిపామన్నదే జన్మ సార్థకతకు కొలమానమని ఆంగ్లకవి బెన్ జాన్సన్ "ఉదాత్త గుణము" (The Noble Nature) అనే కవితలో అంటాడు. తాను జీవించినది ఒక్కరోజే అయినా ఆస్వల్పకాలంలోనే 'కాంతి కుసుమం' (flower of light) కలువ పువ్వు ఎలా అందరికీ కనువిందు చేసి ఆహ్లాదపరుస్తుందో వర్ణిస్తాడు. ఆవిధంగానే కవితా సరోవరంలో మొలచి వికసించి మకరందాన్ని వెదజల్లి అంతలోనే వీడి రాలిపోయిన కుసుమం శ్రీమతి వేమూరి(దాసు) శారదాంబ. ఆమె 123వ వర్ధంతి సందర్భంగా నివాళి.

స్త్రీలకు విద్యార్హత లేదని, కులస్త్రీలు లలితకళలనభ్యసించడం పాపమని పరిగణిస్తూ వారిని వంటయింటికే పరిమితం చేస్తున్న కాలంలో, బెన్ జాన్సన్ కవితలో లిల్లీ పువ్వులాగానే (శబ్దార్ధన్యాయంగా) శారదాంబ మే మాసంలో (3, మే 1881) మొగ్గతొడిగింది. మహాకవి, వాగ్గేయకారుడే కాక సంఘసంస్కరణభిలాషి కూడా అయిన శ్రీ దాసు శ్రీరాములు (1846-1908) కుమార్తెగా జన్మించడం ఆమె చేసుకున్న పుణ్యమో లేక మన అదృష్టమో. స్త్రీలు విద్యార్హులేనని, సంగీతసాహిత్యములు నేర్వదగినవారేనని గట్టిగా నమ్మిన శ్రీరాములుగారు వాటి ప్రచారంతోనే సరిపెట్టక తన కుమార్తె అయిన శారదాంబకు పిన్న వయసునుండే సంస్కృతాంధ్రములు బోధించడం మొదలుపెట్టరు. అంతేగాక లోకాపవాదుకు వెరవక ఆనాటి ప్రముఖ విద్వాంసులతో ఆమెకు సంగీతము కూడా నేర్పించారు. తండ్రి ప్రోత్సాహంతో నేర్చిన సంగీతము వలన శ్రావ్యకంఠముతో పాడటమేగాక శారదాంబ, ఆమె తండ్రి చెప్పినట్లు, "తన తొమ్మిదవయేట అనుపమాన ప్రజ్ఞచే ఇంపుగా వీణ వాయింపనేర్చి" మైసూరు వంటి నగరాలలో కచేరీలు కూడా చేసిందట.

ఏకసంతాగ్రాహి అయిన శారదాంబ అనతికాలంలోనే ఉభయభాషలలో ప్రవీణురాలై పద్యాలల్లుచూ కవితా సౌరభాన్ని సమకూర్చుకున్నది. సాహిత్యం కేవలం మనసునానందపరచడానికే కాదని బుద్ధిని ప్రేరేపించి సంఘశ్రేయస్సు దిశగా ఆలోచింపజేసేటట్లు కూడా ఉండాలని శారదాంబ దృఢాభిప్రాయం. ఆమె తన ఆశయాలను ప్రతిబింబిస్తూ వ్రాసిన కవితలు, వ్యాసాలు ఆనాటి 'జనాన', 'జ్ఞానోదయ' వంటి పత్రికలలో ప్రచురించబడ్డాయి.

తెలుగున వున్న అనేక సాహిత్య ప్రక్రియలలో శతకం ఒకటి. ఇష్టదైవాన్ని సంబోధిస్తూ మోక్షేచ్ఛతో వ్రాసినవి భక్తిశతకాలని, ప్రజాజీవితంలో ఉపయోగపడే అనేకానేక నీతులను ఆకట్టుకునేలా పద్యరూపంలో వ్రాసిన

వాటిని నీతిశతకాలని అంటారు. ధూర్జటి కాళహస్తీశ్వరశతకం, కంచర్ల గోపన్న(రామదాసు) దాశరధీశతకం భక్తి శతకాలకు, బద్దెన సుమతీ శతకం, మారవి భాస్కర శతకం నీతిశతకాలకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. సమాజంలో ఉన్న దురాచారాలను, మూఢనమ్మకాలను ఎత్తిచూపుతూ వ్రాసిన వేమనశతకం వంటివి కూడా ప్రసిద్ధి చెందాయి. ఆ ప్రముఖ కవుల బాటలోనే మన బాల కవయిత్రి శారదాంబ భక్తి భావంతో 'మాధవా' అని సంబోధించినా మోక్షకాంక్ష కాకుండా మహిళాభ్యుదయం కోసమే ఒక శతకం వ్రాసింది. "మాధవ శతకము – స్త్రీజనక్షేమార్థక భగవత్ప్రార్థన పద్యములు" అని తన గ్రంథానికి పేరు పెట్టడంలోనే ఆమె ఆశయమెంత బలమైనదో తెలుస్తుంది. మహిళల ప్రగతికి, సాధికారతకు విద్యయే మొదటి మెట్టని నమ్మిన శారదాంబ "పొందుగ బుద్ధిశాలినిగ బ్రోవుము శ్రీధర, శూరమాధవా" అని ప్రార్థిస్తూ తనతోటి ఆడువారికి కూడా చదువు నేర్పించు బుద్ధి నాటి సమాజంలోని పెద్దవారికి కలిగేట్లు చేయమని శతక ఆరంభంలోనే కోరింది. ఆ చదువును పురాణేతిహాస జ్ఞానానికే పరిమితంచేయకుండా నిజ జీవితంలో ఉపయోగపడే చారిత్రిక, భౌగోళిక విషయాలు, గణితం, గృహవైద్య చిట్కాలు మొదలైనవాటికి కూడా విస్తరింపజేయాలని చెప్పింది. అంతే కాకుండా తన తండ్రివలెనే సంగీతం, నాట్యం మొదలైన లలితకళలు స్త్రీలు నేర్వదగినవేనని గట్టిగా చెప్పింది. భాస్కరాచార్యుని కుమార్తె లీలావతి, కవయిత్రి తరికొండ వెంగమాంబ మొదలైన వారిని దృష్టాంతాలుగా చూపుచూ నాడు లేని అభ్యంతరాలు స్త్రీవిద్యకు ఈనాడెందుకని బలంగా వాదించింది. విద్యవంతురాలైన ఆడదానివల్ల తన కుటుంబానికే కాక సమాజానికి కూడా మేలేనని ఆమె చెప్పింది. అంతటితో ఆగకుండా తమబాగుకి మహిళల బాధ్యతేమిటో కూడా ఈ మాధవ శతకంలో చెప్పడం విశేషం. నోములకు, వ్రతాలకు, శరీరాలంకరణకు వెచ్చించే సమయంలో కొంత చదువులో గడిపితే మంచిదని ఉద్బోధించింది. ఈ విషయంలో శారదాంబ వేమనను స్ఫురింపచేస్తుంది. అంతేగాక స్త్రీకి పదిమందిలో తిరిగే స్వేచ్ఛ, వివాహ విషయంలో స్వయంనిర్ణయాధికారం ఉండాలని కూడా ఇప్పటికి నూటనలభై సంవత్సరాలకు ముందే శారదాంబ వాదించింది. శారదాంబ లేవనెత్తిన సమస్యలు నేటికీ చర్చనీయాంశాలుగానే ఉండడం ఆశ్చర్యం.

తన పధ్నాలుగేళ్ళకు ఆరంభించిన కవితా వ్యాసంగాన్ని అభ్యుదయభావాలతో కూడిన మాధవశతకం వంటి వాటికే పరిమితం చేయకుండా పదహారేళ్ళ వయస్సులో 'నాగ్నజితీ పరిణయము' అనే ప్రౌఢకావ్య రచన చేసి గొప్పకవుల వరుసలో శారదాంబ స్థానం సంపాదించుకుంది. శ్రీకృష్ణుని అష్టభార్యలలో ఒకరైన నాగ్నజితితో ఆస్వామి పెళ్ళి వృత్తాంతమే ఈ గ్రంథాంశం. మూలకథలోని 25 శ్లోకాలను 250 గద్యపద్యాలకు పెంచి, కథకు కొన్ని మార్పులు చేర్పులు చేసి అనువాదమనిపించకుండా దాదాపు స్వతంత్ర రచనలాగా అనిపించే ఈ కావ్యం ఆనాటి కవుల ప్రశంశలనందుకుంది. ఈ కావ్య రచనా శైలిని చూసి పండితులు శారదాంబను 15వ శతాబ్దపు కవయిత్రి మొల్లతో సరిపోల్చారు.

ఇంతటి ప్రజ్ఞగల కవయిత్రి కలంనుండి మరిన్ని కమనీయ రచనలు రాగలవని ఆశిస్తున్న తరుణంలో శారదాంబ 18 యేళ్ళకే (26 డిశెంబర్,1889) కుమారునికి జన్మనిస్తూ ప్రసవసమయంలో మరణించడం సాహితీ లోకానికే కాక సమాజానికి కూడా తీరని లోటు. పద్దెనిమిదేళ్ళ జీవనకాలంలో ఆమె రచనాకాలం కేవలం

మూడు/నాలుగు సంవత్సరాలు మాత్రమే. ఆ స్వల్పకాలంలోనే సంప్రదాయ రీతిలో ఒకవైపు అభ్యుదయభావాలను ప్రకటన చేస్తూ మహిళావికాసానికి స్ఫూర్తినిచ్చి, మరొక పార్శ్వంలో ప్రౌఢకావ్య రచనతో పండితలోకాన్ని మెప్పించిన శారదాంబ బెన్ జాన్సన్ లిల్లీ పువ్వువలే సార్థకజీవియై ఆదర్శవంతురాలుగా నిలచింది. ఆమె వ్రాసినవి రెండు గ్రంథాలే అయినా బెన్ జాన్సనే ("In small proportions we just beauties see") చెప్పినట్లు స్వల్పంలోనే సౌందర్యం చూడగలం.

*******************

## **13.** వనితా వికాసానికి విద్యయే వరము అని వక్కాణించిన విదుషీమణి శ్రీమతి వేమూరి (దాసు) శారదాంబ

(అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మార్చి 8, 2023 - రసజ్ఞ భారతి' వారి సౌజన్యంతో)

- డా. ఆర్.వి.కుమార్, **NIMS,** హైదరాబాద్*

"బేటీ బచావో బేటీ పఢావో" అని అంటే ఇప్పటికీ ముక్కుమీద వేలు వేసుకుని చూస్తున్నాంగాని,దాదాపు 150 సంవత్సరాల క్రింద తన ఏకైక కుమార్తెను శ్రీ దాసు శ్రీరాములు గారు ఎలా పెంచారో చూస్తే *స్త్రీ సాధికారత* కు అసలైన అర్థం తెలిసి వస్తుంది.

వేమూరి శారదాంబ

సంస్కృతాంధ్రములనభ్యసించి, సంగీత సాహిత్యములలో ప్రావీణ్యత సాధించి, అభ్యుదయ దృక్పదముతో విద్యాభ్యాసముచేయనీయని సాటి మహిళల దుర్భరస్థితిగతులను వెలిబుచ్చి చరిత్ర సృష్టించి స్త్రీలకువిద్యాబోధన అవసరమని ఉద్యమం ఆరంభించిన 19 వ శతాబ్దపు మహిళలు వెలుగులోకివచ్చినవారు బహుకొద్దిమంది మాత్రమే. అట్టి మహిళారత్నములలో నొకరు వేమూరి శారదాంబ (1881-1899). సాంప్రదాయనెపముతో నిబంధనలు, నియమములు విధించి స్త్రీలను గృహబంధితులగ యుంచుట 19వశతాబ్దమునాటి సర్వసాధారణమైన విషయం. అప్పటిసాంఘిక పరిస్థితులలో బాలికలు విద్యనభ్యసించనవసరములేదనీ, సంగీతసాహిత్యములు మొదలగు లలితకళలు స్త్రీలకు తగనివన్న భావనయుండెను. 19 వ శతాబ్దమధ్య కాలములో ప్రవేశించిన సంఘసంస్కరణోద్యమములు తెలుగునాట క్రమేపి ఆదరణపొందెను. సామాజిక నియమ ఉల్లంఘనలకు సంఘబహిష్కరణ, వెలి ప్రాయశ్చిత్తము మొదలగు ఆంక్షలు ఆశతాబ్దపు చివరినాటికింకనూ సాగుచునేయుండెను. స్త్రీలకు విద్యాభ్యాసము, సంగీత సాహిత్యములలో ప్రవేశము అప్పటికింకనూ అరుదుగనేయుండెనని చరిత్రలో కనబడుచున్నది. ఆమె జీవితకాలము కేవలము 19 సంవత్సరములు మాత్రమే. బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్పపలుకుబడిగల్గి పురప్రముఖుడైన తన తండ్రి, దాసు శ్రీరాములు గారి ప్రోత్సాహముతో ఆమె సంస్కృతాంధ్ర విద్యనభ్యసించెను. అంతేగాక సంగీత సాహిత్యములలో బాల్యములోనే అతీతమైన ప్రవీణ్యత సాధించెను. చిననాట పితృపరిరక్షణలోనే సంగీత కచేరీలు చేసి గాయకురాలుగా గుర్తింపుపొందినది.

ఆనాటి పరిస్థితులకెదురీది మెట్టింటివారి నిరుత్సాహక వాతావరణములో సహితము ప్రబంధకావ్యరచనలు చేసి కవయిత్రిగా పేరుపొందినది. స్త్రీలపట్లగల వివక్షతకు వాపోయి వారి దుర్భర స్థితిగతులుమెరుగు పరచుటకు విద్యాభ్యాసము అనివార్యమని ఘోషించి భగవత్ప్రార్థనా రూపములో కావ్యరచనలు చేసి సాహసించి

ప్రచురించిన శారదాంబగారు చిరస్మరణీయులు. 10 వ సంవత్సరములో పద్య రచన ప్రారంభించి,14 వసంవత్సరములో శతక రచన చేసిన బాలమేధావి శ్రీమతి శారదాంబ!

స్వల్పజీవితకాలం, సాహిత్యకృషి

1888 సంవత్సరములో వివాహామైనతరువాత శారదాంబ-వేమూరి రామచంద్రరావు దంపతులకు మొదటి సంతానం కుమార్తె, దుర్గాంబ. రెండవ సంతానం, కుమారుడు పార్థసారథి. 19వ ఏట, 1899 సంవత్సరం డిసెంబరు 26వ తేదిన ఏలూరులో రెండవ సంతానం, కుమారుడైన పార్థసారథినికని శారదాంబ పరమదించెను. వివాహనాంతరం మిట్టింటివారింట సంగీతాభ్యాసమునకు అవరోధములు కలిగినప్పటికినీ భగవత్ప్రార్థన రూపములో సాహిత్య కృషిసాగించెను. 1887 సంవత్సరములో తన 16 వ ఏట ఆమె రచించిన ప్రబంధము 'నాగ్నజితీ పరిణయము'. ఆనాటి పత్రికలు జ్ఞానోదయ పత్రిక, జనానా పత్రికలలో ఆమె రచించిన దేవీస్తుతి కీర్తనలు ప్రచురించబడినట్లు తెలియుచున్నది.

మాధవశతకము

ఆకాలమునాటి స్త్రీలపై గల వివక్షత ఆమెను చిన్న వయస్సునుండీ కలవర పరచినదని తెలుపుటకు నిదర్శనము ఈ మాధవమ శతకము. మాధవా అను మకుటముతో 101 పద్యములు గల ఈ శతకము భక్తి శతకము గాదు. ఆనాటికి దేశములో స్త్రీలపై చూపుతున్న వివక్షతకు విద్యారహితలుగానుంచి చేయుచున్న అన్యాయమును మానమని పూరాణేతిహాసములలో విద్యనభ్యసించిన స్త్రీలు, స్త్రీవిద్యకు గల ప్రాముఖ్యతను చాటు అనేక ఐతిహాసిక ఉదాహరణల తో పెద్దలను వేడుకుంటూ వ్రాసిన 101 పద్యములు శారదాంబ తన చిననాట పదులాల్గేండ్లు ప్రాయంబున రచించిన పద్యగ్రంధము, మాధవ శతకము. అలనాటి స్త్రీలకు విద్యాభ్యాసములేమిచే కలుగుచున్న దుర్భరస్థితి పట్ల వ్యాకులత వ్యక్తముచేయుచు విద్యను ప్రసాదింపుమని భగవంతుని ప్రార్థన రూపములో శారదాంబ రచించిన పద్యగ్రంధము మాధవ శతకము.దేవలోకములో దేవతా స్త్రీలకు విద్యనభ్యసించుటకెట్టి ఆటంకములేనప్పుడు ఈ భూలోకములో ఎందుకని స్త్రీలను గృహబందితులగా చేసి విద్యాభ్యాసరహితులుగ నుంచెదరనియూ అంతే కాక విద్యాభ్యాసముచేసినంతమాత్రము స్త్రీలు తమ గృహనిర్వాహణ బాధ్యతలు గానీ పాతి వ్రత్యములోగాని ఎట్టి లోపము రాన్నివరని చెప్పుటకు ప్రామాణికముగా విద్యావంతులైన దేవతా స్త్రీలు వినయవిధేయతలుగల గొప్ప పతివ్రతలే గదాయని మాదవ శతకము లోని పద్యాల ద్వారా అప్పటి సమాజమున స్త్రీల విద్యావిషయములో అవరోదములు, అభ్యంతరములు ఉపసంహరించుకోమని శారదాంబగారు నైపుణ్యముగా అభ్యర్థించిరి. ఆయా పద్యములలో శారదాంబ ఉదహరించిన దేవతలలో విద్యలకు దేవతైన సరస్వతితోసహా సీత, లీలావతి, భానుమతి, మొదలగు ఐతిహాసికంగా విద్యావంతులైన పతివ్రతలను ఉదహరించిరి. శారదాంబ గారు కావ్యరూపములో స్త్రీల విద్యాభ్యాసమునకు సామాజికాభ్యంతరములు దూరముచేయుటకు తన కావ్యములో విద్యాభ్యాసముచేసిన దేవతలు, దేవతాస్త్రీల ప్రామాణిక సాక్షాధారములుచూపుతు రచించిన కొన్ని పద్యములు అర్థముతో పాటు డా.

దాసు అచ్యుతరావు వ్యాసములో ప్రచురించిరి.[3] స్త్రీలదుస్తితినద్భుతంబుగా బాపి యిద్భువిన్ బన్నుగ నద్భుదుల్ తగినపట్టున విద్యను ముద్దరాండ్రకున్ గ్రన్నన నేరిపించి మరిజ్ఞానము బుట్టగ జేయుమంటూ ప్రార్ధించినది."

చ: మునుపటివారలెల్ల తనుముద్దియలం చదివించలేదోకో
 వినయం పతివ్రతాత్వు సువివేకములం జరియించినట్టి యా
 జనకజజంజూడరే మరియుం జంత్రమతింగనరే యింకెందరో
 యనుపమబుద్ధిగీర్తిలందిరి విధ్యవల్ల మాధవా

చ: వినంగమహెశుమడెప్పుడును వీడక గంగశిరంబందునుం
 చెనుగడ బ్రహ్మ తాను తన జివ్హను పెట్టెనుగా సరస్వతిన్
 అనవరతంబు నీహృదయమందున నిలిపితి నీదు కోమలిన్
 గననదియేలకో జనులు కారలపైతురు స్త్రీల మాధవా

ఉ: పావననామ్ని సద్గణితదెల్పదేటోటికాదె లీ
 లావతి భాస్కరార్యునుతరామయ కాదె సరస్వతింగనన్
 దేవతయయ్యె విద్యలకు దేజమగ మీరగ భోజభార్య వి
 ద్యావతియైన భానుమతి యారయా నాందుతి కాదె మాధవా

అప్పటి సమాజములో స్త్రీలు నాట్యశాస్త్రమభ్యసించరాదన్న అభిమతమును మార్చుటకు మహాభారతము లోని ఉత్తరను ఉదహరించెను.

చ: అరమరలేక నిచ్చెలు బృహన్నలయొద్దను నాట్యశాస్త్రమున్
 విరటుని కూంతుదాగరచి విన్నుతకీర్తి వహింపలేదె యు
 త్తర కడు యోగ్యురాలని సదా వొగడంబడలేదె చూడనా
 పరమ పతివ్రతామణి శుభాంగు పరీక్షితుంగాంచె మాధవా"

ఆవిధముగా శారదాంబగారు భారతభాగవతాలనుండి పురాణేతిహాసములనుండి అనేక ప్రమాణికములు చూపెట్టి స్త్రీల విద్యాభ్యాసముపట్ల అప్పటి సమాజమునకల దురభిప్రాయము దూరముచేయ ప్రయత్నించిరి.[1]

నాగ్నజితీ పరిణయము

వేమూరి శారదాంబ 1896 లో 16 వ ఏట నాగ్నజితీ పరిణయమను ఒక ప్రబంధమును రచించెను. [5]. ఆ ప్రభంధమును ఇప్పటి చెన్నై పట్టణమందలి పార్ధసారథి మందిరములో కూర్చుని రచించినటుల డా. అచ్యుత

రావు తమ వ్యాసములో వ్రాశారు.[6] అష్టమహిషులు శ్రీకృష్ణుని ఎనిమిది భార్యలని భాగవవత కథలు చెప్పుచున్నవి. నాగ్నజితి ఆరవ భార్యగా శ్రీకృష్ణని పరిణయమాడుటను గూర్చినది ఈ కావ్యము. పండితులు కొనియాడి మన్ననలందుకున్న ఆ ప్రబంధ కావ్య రచనా శైలి ఆమె సంస్కృతాంధ్ర పాండిత్యమునకు మరొక నిదర్శనము.

1881 మే నెల 3 తారీకున ఇప్పటి కృష్ణాజిల్లాలోని ముదినేపల్లి మండలములోని అల్లూరు గ్రామంలో జానకమ్మ-దాసు శ్రీరాములు దంపతులకు ఆరుగురు కుమారులతరువాత కలిగిన ఏకైక కుమార్తె సార్థక నామధేయ దాసు శారదాంబ. విజయవాడలో 19 వ శతాబ్దాంతరములో వాణీప్రస్స్ అను ప్రముఖ ప్రచురణాలయమును స్థాపించిన దాసు కేశవరావు, ప్రముఖ న్యాయవాదులైన దాసు నారాయణరావు, మాధవరావు, గోవిందరావు, దాసు విష్ణు రావు, మధుసూదనరావుల సోదరీమణి. వివాహానంతరము సాహిత్యకృషివల్ల వేమూరి శారదాంబగా ప్రసిద్ధి చెందెను. తండ్రి దాసు శ్రీరాములు (1846-1908) వృత్తిరీత్యా ఏలూరులో న్యాయవాదేగాక, జ్యోతిశాస్త్రపారంగతుడు, సంగీత సాహిత్యములలో అపారమైన పాండిత్యము కలిగియుండి 'దేవీభాగవతము'రచించి మహాకవిగా ప్రసింద్ధిచెందెను. బహుముఖ ప్రజ్ఞాశాలి, సంఘసంస్కరణాభిలాషి. ఆధునికదృష్టితో స్త్రీలకు విద్యాభ్యాసమనివార్యమని ప్రచారముచేయుటయెగాక ఆనాటి సమాజమందు అటువంటి ఉల్లంఘున వల్ల కలుగు లోకనిందలకు లెక్కచేయక తన కుమార్తెకు స్వయముగా విద్యాభ్యాసముచేసి చూపి సంఘసంస్కరణకు మార్గదర్శకుడైయ్యెను. ఏలూరులో సంగీత పాఠశాలకూడా నెలకొల్పెను. రాజమహేంద్రవరములోని సుప్రసిద్ధ సంఘసంస్కరణకర్త, కందుకూరి వీరేశలింగం పంతులు, విజయనగరంలోని మహాకవి గురజాడ అప్పారావు గారు సమకాలీకులు. ఏక సంతాగ్రాహి అయిన శారదాంబ అతి చిన్నవయస్సులోనే పుట్టింట సంగీత విద్వాంసులైన కోమండూరి నరసింహాచారి, ఈమని వెంకటరత్నం వద్ద సంగీతము నేర్చుకుని వీణావాయిద్యములో అశేష ప్రవీణ్యత సంపాదించెను. తండ్రిగారి పర్యవేక్షణలో సంగీతముతోపాటు విద్యాభ్యాసముచేసి సంస్కృతాంధ్రములో పాండిత్యము గడించెను. మైసూరు, బెంగుళూరు పట్టణములందు జరిగిన సంగీత సమ్మేళణములలో వీణా వాయిద్య కచేరీ చేసెను. ఆనాటి సాంప్రదాయప్రకారము 7వ ఏటనే శారదాంబ వివాహం 1888 మే నెలలో బందరువాస్తవ్యులు వేమూరి రామచంద్రరావుతో జరిగెను. సంగీత సాహిత్య విద్య అభ్యసించుటవల్ల ఆమె వివాహము బహుప్రయత్నానంతరము జరిగినటుల తెలియుచున్నది.

*****************

# పుస్తక సమీక్షలు

# ముందుమాట

**– ఆచార్య కాత్యాయనీ విద్మహే**

తెలుగునాట సంస్కరణోద్యమం, ప్రత్యేకించి స్త్రీ విద్యా ఉద్యమం స్త్రీలలో మేలుకొల్పిన చైతన్యం వాళ్ళను మహిళా ఉద్యమ నిర్మాతలను చేసింది. ఉద్యమ ఆశయాల ప్రచారానికి వారిని రచయితలుగా మలిచింది. కొటికలపూడి సీతమ్మ, భండారు అచ్చమాంబ ఆ కోవలోని వారే. వారివలె సామాజిక జీవితం, కార్యాచరణ లేకపోయినా తనకున్న పరిమితులలో సాంస్కృతిక భావజాల రంగంలో స్త్రీ విద్యకు ఒక అనుకూల వాతావరణాన్ని నిర్మించటానికి పనిచేసిన చరిత్రకెక్కని మహిళ వేమూరి శారదాంబ.

1881 మే 3వ తేదీన పుట్టిన వేమూరి శారదాంబ కొటికలపూడి సీతమ్మ, భండారు అచ్చమాంబల కన్నా ఏడేళ్లు చిన్నది. కొటికలపూడి సీతమ్మ వీరేశలింగం గారి ప్రత్యక్ష శిష్యురాలు. భండారు అచ్చమాంబ ప్రసిద్ధ చరిత్రకారుడు, తెలంగాణా సాంస్కృతిక ఉద్యమ నిర్మాత అయిన కొమర్రాజు లక్ష్మణరావు సోదరి. ఇద్దరూ వీరేశలింగం ప్రభావాలకు లోనైనవాళ్ళే. స్త్రీల అభ్యుదయాన్ని ఆశించి పని చేసినవారే. సాహిత్య సృజన చేసినవారే. ఇక శారదాంబ ఆంధ్రదేశంలో సాహిత్యసామాజిక సాంస్కృతిక రంగాలలో అభ్యుదయ దృక్పథంతో కృషి చేసిన దాసు శ్రీరాములు గారి కూతురు. భండారు అచ్చమాంబ వలెనే ఈమెది కూడా అకాల మరణమే. ఆమె 21 ఏళ్ళ వయసులో మరణిస్తే ఈమె 19 ఏళ్లకే (1899 డిసెంబర్ 26) రెండవ బిడ్డకు జన్మనిస్తూ మరణించింది.

వేమూరి శారదాంబ పుట్టిన 1881 వ సంవత్సరానికి ఒక చారిత్రక ప్రాధాన్యత ఉంది. వీరేశలింగం దంపతులు మొదటి వితంతు వివాహం జరిపించిన సంవత్సరం అది. అప్పటికే ఆయన స్త్రీవిద్యకు అనుకూల భావప్రచారం ప్రారంభించాడు. వివేకవర్ధని పత్రిక ప్రారంభించి అందుకు స్వంత వేదికను ఏర్పాటు చేసుకున్నాడు. స్త్రీ విద్య శాస్త్ర సమ్మతమేనని ప్రజలలో నమ్మకం కలిగించటానికి పట్టుదలతో పనిచేస్తున్న కాలం అది.

శారదాంబ పుట్టిన రెండేళ్లకు అంటే 1883లో స్త్రీల జ్ఞాన చైతన్యాల వికాసాన్ని ఆశించి స్త్రీల కొరకు ప్రత్యేకంగా సతీహితబోధిని అనే పత్రికను కూడా ప్రారంభించాడు

వీరేశలింగం. ఆ క్రమంలో 1875 నుండి 1885 మధ్య కాలంలో స్త్రీ విద్యపై ఆయన చేసిన ప్రధాన ఉపన్యాసాలు ప్రచురించబడి బుద్ధిజీవుల మధ్య చర్చకు వచ్చాయి. అదే సమయంలో వధూవరుల మధ్య వయో తారతమ్యం కల వివాహాలు దాంపత్యంలో స్నేహానికి అవరోధమని, కన్యాశుల్క వివాహాలు నరమాంస విక్రయ వ్యవహారమేనని ఏవగించుకున్నాడు వీరేశలింగం. ఆయన ఆదర్శాలు సామాజిక మానవీయ సంస్కారాలలో, సంబంధాలలో ప్రతిఫలించే వాస్తవంగా పరిణమించటాన్ని కలగంటూ 1887 నాటికి గురజాడ కన్యాశుల్క నాటకంతో రంగంలోకి వచ్చాడు.

అప్పటికి శారదాంబ ఐదారేళ్ళ పిల్ల. ఆడపిల్లల విద్యా వ్యాసంగం పట్ల, స్త్రీల స్వశక్తి సాధన పట్ల శ్రద్ధాసక్తులు గల తండ్రి దాసు శ్రీరాములు గారి పెంపకంలో ఆమె సంగీతసాహిత్య విద్యాభ్యాసం అప్పటికే గొప్ప క్రమశిక్షణతో ప్రారంభం అయి ఉండాలి. లేకపోతే తొమ్మిదవయేట అనుపమాన ప్రజ్ఞతో వీణ వాయించటం గానీ, పదునాలుగేళ్లకే పద్య మల్లటం గానీ, పదహారవ సంవత్సరంలో నాగ్నజితీ పరిణయ ప్రబంధ రచన గానీ సాధ్యమయ్యేవి కావు. పదునాలుగేళ్ళ వయసులో అంటే 1895లో ఆమె అల్లిబిల్లిగా అల్లిన ఆ పద్యాలే మాధవ శతకం అయి ఉంటుంది. అప్పటికి తెలుగు జనానా, స్త్రీ హిత బోధిని, శ్రీ బాలిక అనే మరో మూడు స్త్రీల పత్రికలు ప్రారంభం అయ్యాయి. సతీహితబోధిని తో కలిపి ఈ పత్రికలన్నీ ప్రధానంగా స్త్రీవిద్య, పాతివ్రత్యం, బాల్యవివాహాలు గృహనిర్వహణ, స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మొదలైన అంశాలను చర్చించేవి. ఆ చర్చల ప్రభావం నుండి రూపొందిన వ్యక్తిత్వమే మాధవ శతకం రాయటంలో శారదాంబకు చోదక శక్తి అయింది. ఈ శతకం ఆమె మరణానంతరం రెండేళ్లకు 1901లో కలావతి అనే మాసపత్రికలో ప్రచురించబడింది.

కథతో నిమిత్తం లేకుండా ఎక్కడికక్కడ ఒక భావాన్ని, అభిప్రాయాన్ని పూర్తి చేయటానికి వీలుగా చేసే వ్యస్త పద్య రచన శతకం. పద్య రచనాభ్యాసానికి అనువైన ప్రక్రియ. అయితే మాధవ శతకంలో వ్యస్త పద్యాల మధ్య 'స్త్రీజన క్షేమార్థక భగవత్ప్రార్థన' అనే ఏక సూత్రతను ఏర్పరచుకున్నది శారదాంబ.

శతకం అంటే వంద. కానీ సాధారణంగా తెలుగు సాహిత్య సంప్రదాయంలో శతకం అంటే నూట ఎనిమిది పద్యాల రచన అన్న రూఢి ఏర్పడిపోయింది. మాధవ శతకంలో పద్యాల సంఖ్య నూట ఒక్కటి (101). మాధవా అన్న సంబోధన మకుటం.

ఏక వృత్త నియమం పాటించలేదు. ఉత్పలమాల చంపక మాల వృత్తాలు ఎక్కువ. అక్కడక్కడా శార్దూల మత్తేభ వృత్తాలు కూడా ఉన్నాయి. మొదటి ఆరు పద్యాలూ, చివరి దశావతార స్తుతి పద్యాలతో కలిపి పదకొండు పద్యాలు మినహా మిగిలినవన్నీ 'స్త్రీజన క్షేమార్థక భగవత్ప్రార్థన పద్యాలు'. కనుక మాధవ శతకాన్ని భక్తి శతకం అనటం కన్నా సంస్కరణ భావ ప్రచార శతకం అనటం సముచితం.

ఈ శతకంలో మొదటి ఆరు పద్యాలూ పీఠిక వంటివి. దయతో తనను కాపాడమని శ్రీ రాముడిని స్తుతిస్తూ కోరటం ఆ పద్యాల సారం. "శ్రీ రమణీ మనోహర సుశీల నిజాశ్రిత కష్టభంజనా" అని ప్రారంభం అయ్యే మొదటి పద్యంలో నాలుగవ పాదం "సారస నేత్ర నాదగు విచారములెల్లను దీర్చి మాధవా". ఇందులో నాదగు విచారములెల్లను దీర్చమని మాధవుడిని కోరింది కవయిత్రి. నాదగు అనే మాట ఉత్తమ పురుష ఏకవచనమే. కానీ ఆమెకు వ్యక్తిగత విచారాలు ఉన్నట్లు తరువాతి పద్యాలలో ఎక్కడా కనబడదు. ఆమె విచారం అంతా స్త్రీలందరి కోసం. అందువల్ల ఆమె విచారం వ్యక్తిగతమైంది కాదు అన్నది స్పష్టం.

నాలుగవ పద్యం నాలుగవ పాదం ముగింపులో "నీవ గతి మాకిల వేఱిక లేరు మాధవా" అన్న వాక్యంలోని 'మాకు' అన్న ఉత్తమ పురుష బహువచనం ఆమె విచారాలన్నీ సమూహానికి సంబంధించినవే అని రూఢి చేస్తున్నది. అందువల్ల శారదాంబ 'నేను' అన్నా 'మేము' అన్నా ఆ మాటలన్నీ తనను తాను స్త్రీ జన ప్రతినిధిగా సంభావించుకొని అన్నవే. నాదగు విచారాలు అంటూ స్త్రీల విచారాల గురించి తపన పడి కవిత్వం రాసిన శారదాంబ నాగొడవ అంటూ లోకం గొడవను తన గొడవగా కవిత్వం చేసిన కాళోజీకి ఒక తరం వెనుకటి మనిషి. ప్రపంచపు బాధను తన బాధగా చేసుకొని మరో ప్రపంచాన్ని కలగంటూ శ్రీశ్రీ కవిత్వం రాసిన కాలం కంటే ముందే వివక్షకు గురి అవుతున్న మహిళల బాధను తన బాధగా చేసుకొని కవిత్వం అల్లిన మహిళ శారదాంబ.

సాధారణంగా భక్తి శతకాలలో మోక్ష కాంక్ష ఉంటుంది. కానీ శారదాంబ తనను బుద్ధిశాలినిగ బ్రోవుమని (6) కోరింది. వ్యక్తిగత పారలౌకిక విలువలకన్నా లౌకిక సామాజిక విలువల కోసం ఆలోచించగలిగే బుద్ధిని ఆకాంక్షించటంలో వుంది ఆమె విశిష్టత. అలాగే ఆమె స్త్రీ కావటం వల్లనే భగవంతుడు కాపాడిన పురుషులు ఎంతమందో ఉండగా ద్రౌపదిని, అహల్యను మాత్రమే ప్రస్తావించిందనిపిస్తుంది.

ఈ శతకంలో ఎక్కువ పద్యాలు ఆనాటి స్త్రీవిద్యా వివాదానికి సంబంధించినవి, స్త్రీవిద్య అవసరం, ప్రాధాన్యత, ప్రయోజనం – నిరూపించటం, అందుకు మద్దతుగా చారిత్రక పౌరాణిక స్త్రీలను ఉదాహరణగా పేర్కొనటం, స్త్రీవిద్య వ్యతిరేక వాదనలను తిప్పికొట్టటం, స్త్రీవిద్య సాధనకు పూనుకొనమని పురుషులను ఉద్బోధించటం – లక్ష్యంగా శారదాంబ ఈ శతక పద్యాలు రాసింది.

శారదాంబ దృష్టిలో విద్య అంటే అక్షరాస్య విద్య. స్త్రీలను రోకటి పాటలు పాడుకొనే స్థితి నుండి రామాయణ భారతాది పురాణ కథలను గ్రంథ పరిశీలన చేత అర్థం తెలిసి చదువుకునే దశకు చేర్చే విద్య (33). బాల చికిత్స, చరిత్ర, భూగోళ సమాచారం, లెక్కలు, దేశ భాషలో చక్కగా రాయగల నైపుణ్యం స్త్రీ విద్యకు ఆమె ఇచ్చిన సిలబస్ (57). సంగీత నాట్య చిత్రలేఖనాది లలితకళలు కూడా స్త్రీలు నేర్వవలసినవే అన్నది ఆమె అభిప్రాయం. ఈ క్రమంలోనే స్త్రీలకు విద్య అంటే పురాణ శ్రవణం, నోములునోచటం అనే సంప్రదాయ భావనను శారదాంబ తిప్పికొట్టింది. పురాణ శ్రవణం వల్ల బోధ కలగదని (54), నోములు నోచటం వృధాగా పొద్దు పుచ్చటమేనని (66) అంటుంది. సంగీత నాట్యాలు భోగం వేషాలుగా తిరస్కరింప బడుతున్న తరుణంలో శారదంబ సంగీత నాట్య విద్యలు నేర్చుకొనే అవకాశం మహిళలకు ఉండాలి అనటం సాహసమే.

బోగపు సానుల పాట వింటూ ఇటువంటి పాట ఎక్కడా వినలేదని మెచ్చుకునే పెద్దమనుషులను గృహిణులకు ఆ సంగీత జ్ఞానం ఇచ్చే పనికి ఎందుకు ముందుకు రారని నిలదీసింది (29). ఉత్తర నాట్యం నేర్చుకోలేదా, యోగ్యురాలని కీర్తి పొందలేదా? స్త్రీలు నాట్యం నేర్చుకొనటానికి అభ్యంతరాలు ఎందుకు అంటుంది (32). ఉషా అనిరుద్ధుల కథలో చిత్రరేఖను ప్రస్తావించి ఆ నేర్పు ఉన్న స్త్రీలకు చిత్రలేఖనం నేర్పవచ్చు కదా అంటుంది (48). ఈ అన్ని సందర్భాలలోనూ స్త్రీలసృజన శక్తి సామర్థ్యాలను వెలికి రానీయకుండా చేస్తున్న సంప్రదాయం పట్ల, పురుష బద్ధుల పట్ల ఆమె విమర్శ దృష్టి కనబడుతుంది.

స్త్రీలకు విద్య ఎందుకు అవసరం? భర్తకు ఇంటి నిర్వహణలో చేదోడు, వాదోడు కావటానికి, లేఖలు చదువుకొనటానికి, రాయటానికి, వార్తా పత్రికలు చదివి వినిపించడానికి, పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పి పెంచటానికి, ఇరుగు పొరుగు స్త్రీ

లతో కలహాలు మాని జీవించటానికి ఇట్లా ఆనాటి సంస్కరణోద్యమం ఏమి చెప్పిందో దాదాపు వాటినే శారదాంబ తన పద్యాలలో ప్రస్తావించింది. కార్యేషు మంత్రి అంటారు కదా, విద్య లేని మహిళ మంత్రి ఎలా కాగలుగుతుంది అని ప్రశ్నించి పడతులు విద్య నేరిస్తే పతులకు సహాయపడతారని అంటుంది (27). మగవాడికి అర్ధ శరీరమైన ఆడది చదువు లేనిదైతే మగవాడి సగభాగం చచ్చు పడిపోయినట్లే అని ఆమె భావించింది. ఆడది చదువుకుంటేనే మగవాడు సంపూర్ణుడు సుందరుడు అవుతాడని చెప్పింది. అందువల్లనే స్త్రీ విద్యకు సుముఖులయ్యే సద్బుద్ధిని పురుషులకు ఇమ్మని భగవంతుడిని వేడుకొన్నది. స్త్రీలను జ్ఞానవంతులను చేసే పనికి పూనుకొనమని పురుషులను ఉద్బోధించింది.

ఆడవాళ్లు చదువుకుంటే చెడిపోతారు, భర్తను గౌరవించరు, స్వాతంత్ర్యం కోరతారు – అనే విద్యా వ్యతిరేక వాదుల అభ్యంతరాలను తగిన తర్కంతో తోసి పుచ్చింది శారదాంబ. స్వతంత్రం ఇమ్మంటే ఇచ్చేది కాదు, తమకు ఏది తగునో ఏది తగదో ఎరిగి పొందేదీ అన్నది ఆమె భావం. బాగా చదువుకున్న స్త్రీలకే ఆ వివేకం ఉంటుందని ఆమె నమ్మకం (79). మహిళల చదువుకు ఉన్న అభ్యంతరాలలో మగవాళ్ల వద్ద చదువుకోవాల్సి వస్తుందన్నది మరొకటి. ఆడవాళ్లు నోములు చేస్తున్నప్పుడు పూజ చేయించే పురోహితుడు పురుషుడు కాదా అప్పుడు లేని సందేహం ఇప్పుడు ఎందుకు వచ్చింది అని నిలదీసిన పదునున్న లౌకిక జ్ఞానం ఆమెది. మహిళలు చదివి ఉద్యోగాలు చెయ్యాలా ఊళ్లేలాలా అని ఎద్దేవా చేసేవాళ్లకు సమాధానం ఇచ్చేక్రమంలో విద్య అంతిమ ప్రయోజనం జ్ఞానం పెరగటమే నని (71) ప్రకటించింది.

అయితే శారదాంబ దృష్టిలో జ్ఞానం జ్ఞానం కోసం కాదు. జ్ఞానం సకల మేధో శక్తుల వికాసనానికి, ఆవిష్కరణకు, మహిళల చదువుకు సమాజంలో ఒక ఆమోదాన్ని సంపాదించటానికి చరిత్ర నుండి, పురాణాలనుండి ఉదాహరణలుగా తెచ్చి చూపిన లీలావతి వంటి శాస్త్రవేత్తలు, దేవహూతి వంటి వేదవేత్తలు, మొల్ల, తరిగొండ వెంగమాంబ వంటి కవులు, కైక, సత్య వంటి యుద్ధ వీరులు – బహుముఖీనమైన శక్తి సామర్థ్యాలు చూపగల స్త్రీల అస్మిత గురించిన శారదాంబ ఆత్మ గౌరవ చేతనకు ప్రబల సాక్షులు.

ఈ శతకంలో శారదాంబ ప్రస్తావించిన స్త్రీల జాబితా తయారు చేసి చూస్తే స్త్రీ విద్యకు స్ఫూర్తిని ఇచ్చే మహిళా శక్తుల సమీకరణకు ఆమె తీసుకున్న శ్రద్ధ అర్థం అవుతుంది. సమకాలపు జనవ్యవహారం నుండి సేకరించి చెప్పిన విద్యావంతులైన మహిళల గురించిన సమాచారం మరీ ఆసక్తికరంగా ఉన్నది. వింజమూరి తిమ్మక్క ద్విపద ఛందస్సులో డోలాయాత్ర అనే గ్రంథం రాసినట్లు (65) ఆమె చెప్పినది ఏ సాహిత్య చరిత్ర లోనూ నమోదు అయిన విషయం కాదు. పెద్ది భొట్లు సతి వంటి స్వంత పేరు లేని అంచులకు నెట్టివేయబడిన స్త్రీల పాండిత్యం గురించి – ఎక్కడ విన్నదో కానీ – ఆలోచించమని మనలను ప్రేరేపిస్తుంది (21). అల్లసాని పెద్దన మనుచరిత్ర రాస్తూ గర్భిణీ స్త్రీని ఎలా వర్ణించాలా అని ఆలోచిస్తుండగానే ఆయన కూతురు ఆ పని విజయవంతంగా పూర్తి చేసి పెట్టిందని (44) చెప్పి శారదాంబ వినియోగంలోకి రాని స్త్రీల శక్తి సామర్థ్యాల వైపు మన దృష్టిని మళ్ళించింది. అంతే కాదు స్త్రీల ప్రత్యేక శారీరక మానసిక సంస్పందనలను, జీవితానుభవాలను వర్ణించటం ఎంత పెద్ద కవికి అయినా అంత సులభం కాదని, స్త్రీలు కవులైతే అలవోకగా ఆ పని చేయగలుగుతారని ఏక కాలంలో చెప్పినట్లయింది. పందొమ్మిదివందల ఎనభైలలో తెలుగు సాహిత్య లోకంలో వ్యాప్తిలోకి వచ్చిన ఈ స్త్రీవాద భావనను వంద సంవత్సరాల క్రితమే ఒక తెలుగు కవయిత్రి పలికించ గలిగిందంటే స్త్రీవాదం విదేశీయం కాదని, తరతరాల ప్రపంచ స్త్రీల మనోభావాల అనుభవాల కోణం నుండి అభివృద్ధి చెందిన సిద్ధాంతమని రూఢీ అయినట్లే కదా!

స్త్రీలపట్ల సమాజంలోని వివక్ష పట్ల శారదాంబకు ఒక అవగాహన ఉంది. శివుడు గంగను నెత్తిన పెట్టుకుంటాడు. బ్రహ్మ సరస్వతిని నాలుక యందు, విష్ణువు లక్ష్మిని గుండెల్లోనూ పెట్టుకొంటే ఈ లోకంలో మగవాళ్ళు వాళ్ళను ఎందుకు చిన్న చూపు చూస్తారన్నది ఆమె వేదన (9). లింగ వివక్ష వల్ల జీవితంలో భాగమవుతున్న ద్వంద్వ విలువల గురించిన అవగాహన కూడా శారదాంబకు ఉంది. 'వలదనుటెట్లు విద్య మగవారల కెట్టుల నట్టులే కదా' అని (19) ఆడవాళ్ళు మగవాళ్ళతో సమానమేనన్న సాధారణ సూత్రాన్ని సౌకర్యవంతంగా మరచిపోయిన పురుష సమాజానికి చురక వేసింది. లలనలు నాలుగక్షరములు చదివినంత మాత్రాన అది చదువు కాదు అని కూడా ఆమెకు తెలుసు. పురుషులతో పాటు సమంగా తెలివి పొందే అవకాశాల గురించిన స్వప్నం ఆమెది (19). చదువు వల్ల ఆడవాళ్ళు చెడి

పోతారనే వాదాన్ని నిరసిస్తూ చదువు వల్ల చెడిపోతారంటే మగవాళ్ళు కూడా చెడిపోతారు కదా, మరి వాళ్ళెందుకు చదువుతున్నారు అని ప్రశ్నించింది (72).

ఆడపిల్లలకు ద్రౌపది వంటి పేర్లు పెడితే బోగం కులం పేర్లు అని అంటారు కదా! మగవాళ్లకు కృష్ణుడి పేరు ఎలా పెడతారు అని ఆమె వేసిన ప్రశ్న లైంగిక ద్వంద్వ విలువల మీద ఎక్కు పెట్టిన బాణమే (81). ఐదుగురు భర్తలు ఉన్నందున ద్రౌపది పేరే అపవిత్రం అయిపోతే పదహారువేల భార్యల ఉన్న కృష్ణుడు పూజ్యుడైనా డన్నది ఆమె ఆంతర్యం. అంతే కాదు, స్త్రీలకు గొడుగు పట్టుకొని వీధులలో నడవటాన్ని నిషేధించి, తలుపులు మూసిన పల్లకీలలో, బండ్లలో బంధించి ప్రయాణాలు చేయించటంతో ఆగక బురఖా కూడా వేసి ఊపిరి ఆడనీయకుండా చేస్తున్న విధానాలమీద ఘాటైన విమర్శపెట్టింది (82&83). బాల్య వివాహాలను, వృద్ధులకు ఇచ్చి చేసే వివాహాలను వ్యతిరేకించింది. తగిన వయసు వచ్చాక నచ్చినవాడిని పెళ్ళాడే వెసులు బాటునిచ్చే స్వయంవర వివాహపద్ధతిని విస్మరించటం పట్ల విచారం వ్యక్తం చేసింది (86).

శారదాంబ కొటికెలపూడి సీతమ్మ వలెనే వీరేశలింగం పంతులు గారి సంస్కరణోద్యమ భావజాల వారసత్వానికి సమకాలంలో మొగ్గ విచ్చుతున్న మహిళా ఉద్యమ ఆకాంక్షలకు మధ్య బలమైన లంకె. ఈ శతకం చదువుతుంటే 1914 ఏప్రిల్ 11 & 12 తేదీలలో బెజవాడలో జరిగిన అయిదవ ఆంధ్ర మహిళా సభ ఉపన్యాసాలు, తీర్మానాలు గుర్తుకు వస్తాయి. ముఖ్యంగా శారదాంబ తన పద్యాలలో స్త్రీల విద్యకు అభ్యంతరాలుగా వేటిని సంబోధించిందో, ఖండించిందో అవన్నీ మోటుపల్లి రాజబాయమ్మ ఉపన్యాసంలోనూ కనిపిస్తాయి. రాజా బాయమ్మ విద్యావంతులైన స్త్రీల వారసత్వాన్ని చెప్పటంలో భాగంగా దేవహూతీ లీలావతులను పాండిత్యాన్ని, ఉత్తరా చిత్రరేఖల కళా కౌశలాన్ని, గర్భిణీ స్త్రీ వర్ణన చేసిన పెద్దన కూతురి కవన నైపుణ్యాన్ని ప్రస్తావించటం శారదాంబ శతక పద్య విషయాలే.

అలాగే ఆ సభలో దాదాపు అందరి ప్రసంగాలలోను చర్చించబడిన మరొక అంశం నగల పై మహిళల వ్యామోహం. దానిని మూఢత కింద జమకట్టి తిరస్కరించారు సంస్కరణాభిలాషులైన స్త్రీలు. అందుకు కూడా ఒరవడి పెట్టిన మహిళ శారదాంబ. స్త్రీలలో నగల మోజు, అలంకరణ ప్రీతి అభ్యుదయ కారకాలు

కావని ఆమె అభిశంసించింది. సహజమైన తెలివి ఉండాలి కానీ నగలు ఎందుకు అంటుంది (53). నగల మీద పెట్టె శ్రద్ధ చదువు మీద పెట్టమని మహిళలను హెచ్చరించింది (69). నగల కోసం చెవులు, ముక్కులు కుట్టించుకొని శరీరాన్ని హింస పెట్టుకొనటం కన్నా చదువు పై శ్రద్ధ పెడితే ప్రయోజనమని హితువు చెప్పింది (70). తల దువ్వు కొనటానికి, బొట్టు దిద్ది చీర కట్టటానికి, నగలు పెట్టుకొనటానికి -- ఇలా అలంకరణకు గంటలు గంటలు కాలాన్ని వ్యయం చేసేవాళ్ళు అందులో కొంత సమయం విద్య కొరకు కేటాయిస్తే బాగుంటుందని సూచించింది (68). నగలపట్ల, అలంకరణల పట్ల స్త్రీలు విముఖులు కావాలని స్త్రీజన క్షేమార్థం శారదాంబ ఏదైతే ఆశించిందో, దానితో పాటు ఆడవాళ్ళు వీధుల్లో గొడుగులు వేసుకొని నడవరాదన్న నాటి సామాజిక వివక్షను దేనినైతే నిరసించిందో (82) ఈ రెండూ కూడా ఐదవ ఆంధ్ర మహిళా సభలో తీర్మానాలుగా ప్రవేశపెట్టబడి ఆమోదించబడిన తీరు గమనిస్తే స్త్రీల ఆకాంక్షలు ఆచరణాభిముఖమైన ఉద్యమ రూపాన్ని తీసుకొంటున్న దృశ్యం దర్శనమిస్తుంది.

ఆ ఐదవ ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షురాలు కొటికెలపూడి సీతమ్మ. ఆమె తన ఉపన్యాసం ముగిస్తూ స్త్రీ విద్యా ద్వేషుల వాదములను జయించి, పుస్తకాలను రచించి, పాఠశాలలు స్థాపించి, తోడి పురుషులలో స్త్రీ విద్యాభిమానము పురికొల్పుటకు సభలలో ఉపన్యాసములు ఇచ్చిన పూర్వీకులను కృతజ్ఞతతో ప్రస్తావించింది. ఆ పూర్వీకులలో శారదాంబ ఒకరు. ఆ కృతజ్ఞతలలో వాటా ఆమెకు కూడా ఉంది.

తెలుగు నాట తొలినాళ్ళ మహిళా ఉద్యమానికి సంస్కరణోద్యమ వారసత్వాన్ని స్త్రీల కోణం నుండి అందించటం ద్వారా తన వంతు చారిత్రక పాత్రను నిర్వహించిన శారదాంబను తెలుసుకొనటానికి నాకు ఈ విధంగా అవకాశం కల్పించిన దాసు అచ్యుత రావు గారికి కృతజ్ఞతలు.

పశ్యంతి
15-1-2017

**కాత్యాయనీ విద్మహే**

# సమీక్ష

**– ఆచార్య బేతవోలు రామబ్రహ్మం**

మాధవా అని మకుటం ఎంచుకోవడంలోనే ఉంది గడుసుదనమంతా. చంపకోత్పలాలకూ, శార్దూల మత్తేభాలకు ఇంకా అనేక వృత్తాలకూ సరిపోయే మకుటమిది. ఛందస్సు పరంగా చాలా స్వేచ్ఛ లభిస్తుంది. ఆ స్వేచ్ఛను శారదాంబగారు సద్వినియోగం చేసుకున్నారు.

నిండా పదహారేళ్ళయినా రాకముందే 'నాగ్నజితీ పరిణయము' అనే ప్రౌఢ కావ్యాన్ని, ఈ శతకాన్నీ ఇంకా కొన్ని కీర్తనలనీ వీరు రచించగలిగారంటే ఎంతటి ప్రతిభా సంపన్నురాలో ఎంతటి కుశాగ్రబుద్ధియో గ్రహించవచ్చు. కనుకనే 'బాలేందు తుల్యాళికా' (3), 'దురితకుంజర సింహ' (5), 'శారదా భాసను కీర్తిపూరిత దిగంతర వైభవ చంద్ర' (101) లాంటి సంబోధనలు కట్టగలిగినారు.

స్త్రీజన సంక్షేమంకోసం భగవంతున్ని ప్రార్థించడం ఈ శతకంలోని ప్రధానాంశం. ఇది భక్తిశతకం కాదు. సాంఘిక శతకమే. ఏదైనా ఒక సామాజిక అంశంకోసం భగవంతున్ని ప్రార్థించడమంటే సమాజం బండబారితనాన్ని చాటి చెప్పడమే. స్త్రీలను గౌరవించడం స్త్రీలను చదువుకోనివ్వడం – వీటికి అనుకూలంగా పురుషుల చిత్తవృత్తుల్ని మార్చమని మాధవున్ని ప్రార్థించారు వీరు. అంటే, ఆ మేరకు పురుష సమాజానికి వాత పెట్టడమే.

పురాతనకాలంలో పురుషులతో సమంగా విద్యావంతురాండ్రయిన స్త్రీలున్న ఈసమాజంలో ఎందుకో మధ్యయుగాలలో పురుషులకు విపరీత బుద్ధులు పుట్టుకువచ్చాయి అంటూ, స్త్రీవిద్యను వ్యతిరేకించేవారికి చాలా ఘాటుగా సమాధానాలు చెప్పారు ఈ కవయిత్రి.

చదువుకున్న మగవాడు చదువురాని మగువను మనువాడితే ఆ సంసారం ఒక బండికి గుఱ్ఱాన్నీ దున్నపోతును కట్టి తోలుతున్నట్టు ఉంటుందట. అందుకని మగువలు అందరూ చదువుకుంటేనే చదువుకున్న మగవాళ్ళకు తగిన జోడి దొరుకుతుందని హెచ్చరించడం మగవాళ్ళను ఒప్పించే గడసరి ప్రయత్నం!

యోగ్యతలు చదువువల్ల రావు, పుట్టుకతోనే రావాలి అనేట్టయితే మగవాళ్ళు మాత్రం చదువుకోవడమెందుకు? (60). గవ్వలాటలూ దంపుడు పాటలతో కాలంగడపదంకనన్నా వనితలు ఆ సమయాన్ని చదువుకి వినియోగించడం మంచిది గదా! (64). ఆడపిల్లలకు ద్రౌపది అని పేరు పెడితే తప్పుపడతారు, మగవాళ్ళు కృష్ణుడు అని పేరు పెట్టుకుంటే తప్పు లేదా మరి? (81). ఇల్లాలు చదువుకుంటే తనకు పుట్టిన ఆడపిల్లలకు తానే చదువు నేర్పుతుంది. ఇది మగవాడికి ఆర్థికంగా లాభమే కదా! (84). ఇంకొక్క అడుగు ముందుకు వేసి - సీతాదేవిని కానిబోట్లకు కసరమ తెచ్చితార (97) అనిరామున్ని సైతం ఆక్షేపించేశారు.

ఇప్పటికి నూట ఇరవై సంవత్సరాల క్రితం ఆంగ్లభాష ఏమీ నేర్వని ఒక కవయిత్రి, రెండుపదులైనా నిండకుండానే కన్ను మూసిన వేమూరి శారదాంబగారి విప్లవాత్మక రచన ఈ మాధవశతకము. దీన్ని కాలగర్భంలో కలసిపోనివ్వకుండా పునర్ముద్రించి లోకానికి అందిస్తున్న మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి వారిని కృతజ్ఞతాపూర్వకంగా అభినందిస్తున్నాను.

సెలవు

హైదరాబాద్ భవదీయుడు

29-1-2017 **బేతవోలు రామబ్రహ్మం**

# ప్రణీధి

– 'ప్రసన్న కవి' **ఉప్పలం జ్యోతివాసు**

పూర్వం ఒక కన్యఉంది. ఆమె సంస్కృతం బాగా చదువుకుంది. తనకు కాబోయే భర్తకూడా బాగా చదువుకొని ఉండాలని కోరుకుంది. ఆమె తండ్రి ఒక వరుడిని వెతికి తెచ్చాడు. అతనితో ఆమె సంభాషించింది. దాంతో అతని భాషా పాండిత్యాలు బయటపడ్డాయి. అప్పుడామె తన తండ్రితో ఇలా అంది.

**యస్య షష్ఠీ చతుర్థీ స్యా ద్విహస్యేచ విహాయచ ।**
**అహం కథం ద్వితీయాస్యాత్ ద్వితీయాస్యా మహం కథమ్ ॥**

'నాన్నా! 'విహస్య' అన్నది షష్ఠీ విభక్తి అనీ, 'విహాయ' – అన్నది చతుర్థీ విభక్తి అనీ, 'అహం', 'కథం' – అన్న పదాలు ద్వితీయావిభక్తి అనీ ఈ వరుడు చెబుతున్నాడు. ఇతనిని నేనెలా పెండ్లి చేసుకొనేది' – అని అంది.

ఇక్కడ విహస్య, విహాయ – అనేవి అవ్యయాలు. అహం – అనేది ప్రథమా విభక్తి. కథమ్ – అవ్యయం. ఆ వరునికి రామ శబ్దం మాత్రమే తెలుసు. ఆ రామ శబ్దం పోలికను పట్టి పైన చెప్పిన పదాల విభక్తులను చెప్పి నవ్వుల పాలయ్యాడు. ఆ తండ్రి ఎవరో కాదు మహాపండితులు అప్పయ్యదీక్షితులవారు. ఆ కన్య అతని కూతురు. ఆ విదుషీమణి పేరు కూడా మనకు తెలియకపోవడం మన దురదృష్టం.

ఇది క్రీ.శ. 16వ శతాబ్దం నాటి సంఘటన. అప్పటికి స్త్రీల పట్ల వివక్ష తీవ్రంగా ఉంది. కాని వేదకాలం (క్రీ.పూ. 1200 ప్రాంతాల)లో స్త్రీ, పురుషులకు సమానహక్కు లుండేవి. స్త్రీ వ్యక్తిత్వం విశిష్టతను సంతరించుకున్న కాలమది. వేదకాలంలో జనక మహారాజు కొలువులో యాజ్ఞవల్క్య పండితుడు ఉండేవాడు. అశ్వలుడు, కహోళుడు, ఉషస్యుడు – వంటి కొమ్ములు తిరిగిన పండితులు అతనితో వాదంలో ఓడిపోయారు. అటువంటి మహావిద్వాంసుడితో 'గార్గి' – అన్న విదుషీమణి అతనితో వేదాంత వాదంలో తలపడింది. చిత్తు చిత్తుగా ఓడించింది. ఆ కాలంలోనే కక్షీవానుడనే రాజర్షి తాను ఋక్కులు వ్రాయడమే గాక, తన కూతురైన 'ఘోషా' చేత కూడా కొన్ని ఋక్కులు వ్రాయించిన విశిష్ట నాగరిక యుగమది.

పూర్వ కల్పాలలో స్త్రీలకు వేదాభ్యాసం ఉండేది. గోధ, ఘోష మొదలైన స్త్రీలు వేద మంత్రాలను దర్శించినట్లుగా వైదికవాఙ్మయం చెబుతుంది. అప్పటి స్త్రీలు సద్యోవధువు లని, బ్రహ్మవాదినులని రెండురకాలు. బ్రహ్మవాదినులకు ఉపనయన,

వేదాధ్యయనా లున్నాయి. సద్యోవధువులకు లేవు. సద్యోవధువులకు వేదం వద్దంటే అసలు మొత్తం వేదం వద్దని కాదు. వైదిక కర్మలకు సంబంధించిన మంత్రాలను వాళ్లు నేర్చుకోవాల్సిందే.

మధ్యయుగంలో కాలమాన పరిస్థితులు మారిపోయాయి. మహ్మదీయులు, థగ్గులు, పిండారీలు మొదలైనవారి దాడులు, దురాగతాల కారణంగా స్త్రీలకు రక్షణ అవసర మయింది. అందుకోసం రూపొందించిన అనాగరిక చట్టాలు, ధర్మాలు స్త్రీ స్వేచ్ఛను హరించివేశాయి. అందువలన స్త్రీలు చైతన్యానికి దూరమయ్యారు. దానికి తోడు మూఢనమ్మకాలు ముమ్మరమై వాళ్లు అజ్ఞానాంధకారంలో బానిస బ్రతుకులు బ్రతికారు.

మనుధర్మ శాస్త్రం, మహాభారతం వంటి ప్రామాణిక ధర్మశాస్త్ర గ్రంథాలలో స్త్రీల పట్ల, కులాలపట్ల ఆంక్షలు రుద్దుతూ నాటి పండితులు ప్రక్షిప్త శ్లోకాలు చేర్చారు. ఇది వాళ్ల స్థితిని దిగజార్చింది. స్త్రీలు చపలురు కనుక అప్పు వంటి నేరాల విచారణలో వాళ్ల సాక్ష్యం పనికిరాదన్నారు. సాహిత్యం కూడ వాళ్లను చిన్నచూపు చూసింది. నాటక సాహిత్యంలో ఉన్నత వంశ స్త్రీ పాత్రలకు కూడ నీచపాత్రలకు వాడే ప్రాకృతాలను వాడి వాళ్ల స్థాయిని మరింత దిగజార్చింది.

తాను లేనిదే లోకంలో ధర్మశాస్త్ర వాఙ్మయమే లేదని, ప్రపంచ సాహిత్యం లోనే తనవంటి మనస్తత్వశాస్త్ర పారంగతుడు లేడని కొనియాడబడ్డవాడు వ్యాసుడు. అతని భారతంలో స్త్రీని చులకన చేసిన ప్రక్షిప్త శ్లోకాలు టోలెడు కన్పిస్తాయి.

**చలస్వభావా దుస్సేవ్యా దుర్గ్రాహ్యా భావతస్తథా ।**
**ప్రాజ్ఞస్య పురుషస్యేహ యథావాచస్తథా స్త్రియః ॥ – అనుశాసనికపర్వం**

స్త్రీలు చపలచిత్తం కలవాళ్లు. అతి కష్టంతో కూడ సేవించడానికి అలివికాని వాళ్లు. వాళ్ల స్వభావం అర్థం కాదు. పండితుల మాటల్లాగే వాళ్లు కూడా అర్థం కారనీ –

**'మత్స్యపాదం జలేషశ్చైన్న నారీ హృదయ స్థితమ్' ।**

నీటిలోని చేప పాదాన్నైనా చూడగలంగాని స్త్రీ హృదయం అర్థం కాదనీ – అన్నాడు. క్రీ.శ. 17వ శతాబ్దం వాడైన షేక్స్పియర్ కూడ మానవ మనస్తత్వశాస్త్ర కుశలునిగా ప్రసిద్ధుడు. అతడు కూడ స్త్రీని గురించి –

*'Frailty thy name is woman'*. (చపల చిత్తమా! నీ పేరు స్త్రీ. అంటే బుద్ధి నిలకడలేదని అర్థం) అని తన ప్రసిద్ధ నాటకం 'హామ్లెట్'లో ఒక పాత్ర చేత అన్పిస్తాడు. తన మరొక రచన *The winter's tale'* లో కూడ –

*For every inch of woman in the world*
*Ay, every dram of woman's flesh is false.*

– ఈ ప్రపంచంలో ఆడదాని అణువణువూ అబద్ధమే నంటాడు. కాని ఇవన్నీ కాలదోషం పట్టిన నిర్వచనాలు. ఆధునిక స్త్రీ ఈ అవరోధాలను విజయవంతంగా అధిగమించి ప్రశంసా పాత్రమయింది.

కాని ఇది ఒక్కనాడు వచ్చిన చైతన్యం కాదు. కందుకూరి వీరేశలింగం పంతులు గారు, రాజారామోహనరాయ్, జ్యోతీరావుఫూలే వంటి మహనీయులు స్త్రీ సర్వతోముఖాభివృద్ధికి చేసిన కృషి ఫలితమిది. స్త్రీలు అహింసావాదులని, ఉదాత్త స్వభావులని ఆ మహనీయులు ప్రబోధించారు. స్త్రీ విద్యకు బీజాలు నాటారు. అలా మొలకెత్తిందే మన బాల విదుషీమణి దాసు శారదాంబ.

ఆమె 1881 మే 3వ తేదీన కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలో ఉన్న అల్లూరు గ్రామంలో జన్మించింది. దాసు జానకమ్మ, శ్రీరాములు గార్లు ఆమె తల్లిదండ్రులు. దాసు శ్రీరాములు మహాకవి, పండితుడు, వాగ్గేయకారుడు, న్యాయవాదే కాక సంఘసంస్కరణాభిలాషి కూడా. ఆయనకు ఆరుగురు మగబిడ్డల తర్వాతపుట్టిన బిడ్డ శారద. అందరి కంటే చిన్నది కావడంతో బాగా గారాబంగా పెరిగింది. పసివయస్సులోనే సంగీత సాహిత్యాలపట్ల మక్కువ పెంచుకుంది. అది సంగీత, సాహిత్యాలు భోగంవారి విద్యలుగా పరిగణించిన కాలం. కాలానికి ఎదురునిల్చి శ్రీరాములుగారు ఆమెకు సంగీత, సాహిత్యాలు నేర్పించారు. విదుషీమణిని చేసారు. కచ్చేరీలు చేయించారు. కావ్యాలు వ్రాయించారు. ఈ తండ్రీ తనయుల చరిత్రను శారదగారు వ్రాసిన నాగ్నజితీ పరిణయ కావ్యపీఠికలో విపులంగా కథనం చేసాను. ఔత్సాహికులు వాళ్ళ ఉదాత్త చరిత్రను అందులో అరయవచ్చును.

ఈ బాలకవయిత్రి పదవ ఏటనే పద్యసాధన ప్రారంభించింది. 14వ ఏట (క్రీ.శ. 1895) మాధవశతకం వ్రాసింది. 16వ ఏట (1897) నాగ్నజితీపరిణయ కావ్యం వ్రాసింది. 1888 మే నెలలో వేమూరి రామచంద్రరావుతో ఆమె వివాహం జరిగింది. అత్తగారింట్లో బహుసమస్యల మధ్య ఆమె కోడరికం భారంగా నడిచింది.

అక్కడ ఆమె అభ్యుదయ భావాలకు చుక్కెదురైంది. 1896లో ఆమెకు దుర్గాంబ అన్న పాప పుట్టింది. 1899 డిసెంబరు 26న కొడుకును కన్నది. ఆ ప్రసూతి సమయంలోనే తన 19వ ఏట శాశ్వతంగా కన్ను మూసింది.

లబ్ధప్రతిష్ఠులైన దాసు శ్రీరాములుగారి కూతురి సాహిత్య భవిష్యత్తు పట్ల ఆనాటి సాహిత్యలోకం ఎన్నో నమ్మకాలు పెట్టుకుంది. వాటన్నింటిని వమ్ము చేస్తూ ఆమె అర్థాంతరంగా కాలం చేసింది. పూర్ణాయుష్కురాలై ఉంటే ఆమె మరో వీరేశలింగమై ఉండేది.

వీరేశలింగం, తండ్రి దాసు శ్రీరాములు గార్ల ప్రభావంతో బాలశారద వ్రాసిన గ్రంథం మాధవ శతకం. ఇందులో స్త్రీ అభ్యుదయం, స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ విద్యల పట్ల ఆమె పిడికిలి బిగించి చేసిన నినాదాలు ఆమె గతించిన తర్వాత ఒక దశాబ్ద కాలం పాటు ఆంధ్రదేశంలో ప్రతిధ్వనించాయి. నిజానికి 19వ శతాబ్దినాటికి దాదాపు అన్ని దేశాలు స్త్రీకి ఓటు హక్కు తప్ప స్త్రీ సమానత్వం, స్త్రీ హక్కులు సంపాదించు కొన్నాయి. అందుకు పరోక్షకారణమైన ఫ్రెంచి విప్లవానికి మహిళల తరఫున మనం కృతజ్ఞతలు చెప్పాలి.

ఫ్రెంచ్ విప్లవం (క్రీ.శ. 1789) కారణంగా భూస్వామ్య, బానిసత్వ వ్యవస్థలు రద్దయ్యాయి. స్వేచ్ఛ, సమానత్వం పునాదులపైన మానవహక్కుల ప్రకటన జరిగింది. కాని అది స్త్రీ వివక్షపట్ల మౌనం వహించింది. పురుషులతో పాటు స్త్రీలకు కూడ సమాన హక్కులు కావాలని ఓలంపిడి గొగస్, మేరి వులస్టన్ క్రాఫ్ట్ వంటి విద్యావంతులైన మహిళలు ఫ్రాన్సు, ఇంగ్లండులలో ఉద్యమాలు చేసారు. తర్వాత కార్ల్‌మార్క్స్ (1864), ఎంగిల్స్ (1884) వంటి మేధావుల ప్రవేశంతో స్త్రీ హక్కులు, విద్య ప్రపంచవ్యాప్త ఉద్యమంగా మారింది. అది భారతదేశంలోకి కూడ ప్రవేశించింది. రాజారామమోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు, జ్యోతీరావుపూలే వంటి మహనీయులు ఆ ఉద్యమాన్ని తమతమ ప్రాంతాలలో స్త్రీ సమస్యలకు అన్వయించి పోరాడారు. కవికోకిల సరోజినీనాయుడు వర్ణాంతర వివాహం చేసికోవాలనుకొన్నప్పుడు నాటి కట్టుబాట్లకు భయపడి ఆమె తండ్రి అఘోరనాథ ఛటోపాధ్యాయ కన్యాదానం చేయలేదు. వీరేశలింగం ఆమెను దత్తత తీసుకొని కన్యాదానం చేసారు. ఇటువంటి సంస్కరణలను మొదట్లో దాసుశ్రీరాములు వంటి వారు వ్యతిరేకించినా, తర్వాత అందలి సత్యాన్ని గ్రహించారు. ఆ ఉద్యమంలో

భాగమయ్యారు. బాల్యంలోనే బాలశారద కూడ అందులో భాగమయింది. అక్షరం ద్వారా దాన్ని జగద్వ్యాపితం చేయాలనుకుంది. మాధవశతకం వ్రాసింది. ఇందులో మొత్తం 101 పద్యాలున్నాయి.

మొదటి ఆరు పద్యాల ఇష్టదేవతాస్తుతి, చివరి 11 పద్యాల దశావతార స్తుతిని మినహాయిస్తే తక్కిన 84 పద్యాలు స్త్రీ విద్య, అభ్యుదయం గురించే ఆక్రోశిస్తాయి. స్త్రీ అభ్యుదయం గురించి మొత్తం తెలుగు సాహిత్యంలోనే వ్రాయబడ్డ మొట్టమొదటి శతకం మాధవ శతకం (1896). అంతకు (1895)కు ముందు, చంద్రగిరి శేషమ్మ (నీతిశాస్త్రపద్యాలు), కాకరపర్తి బాయమ్మ, నందివాడ సరసమ్మ (వైద్యశాస్త్రవేత్త), అనపర్తి కృష్ణవేణమ్మ (కీర్తనలు) మొదలైన రచయిత్రులున్నారు కాని వారి చదువులన్నీ సతీధర్మప్రకాశిక తరగతిలోనివి. స్త్రీ అభ్యుదయానికి వాళ్ల చదువులు తోకచుక్కలే కాని శారదాంబ వలె వేగుచుక్కలు కావు.[1]

తొలి పద్యంలోనే ఆ చిఱుత కవయిత్రి స్త్రీ చైతన్యాన్ని సర్వగర్భంగా స్వామికి విన్నవించుకుంది. చూడండి.

**ఉ. శ్రీరమణీ మనోహర! సుశీల! నిజాశ్రిత కష్టభంజనా!**
**మార సమానదేహ! యనుమానములేక ముదంబుచే నినుం**
**గోరి భజించినందులకుఁ గూరిమి బ్రోవగ రాదె నన్నిలన్**
**సారసనేత్ర! నాదగు విచారములెల్లను దీర్చి మాధవా.** (1వ)

ఇది స్థూల దృష్టికి ప్రార్థనాపద్యం. కాని, ఇందులో – 'నాదగు విచారము లెల్లనుఁ దీర్చి' – అన్నదాంట్లో చాలా అర్థం ఉంది. స్త్రీలు చదువు సంధ్యలు లేక చవటలుగా ఉన్నారు. అదే నా విచారం. వాళ్లను చదివించి, జ్ఞానవంతులను చేసి నా బాధ నివారించమని స్వామికి ఆమె నివేదించుకుంది. ప్రబంధకన్యల

[1] స్త్రీ విద్యావ్యాప్తి కోసం ఆనాడు వీరేశలింగం గారి ప్రభావంతో రాయసం వేంకట శివుడు 'జనానా' – అన్న పత్రిక స్థాపించారు. అందులో స్త్రీ విద్య గురించి శారదాంబ వ్రాసిన పద్యాలు అచ్చయ్యేవి. కొమర్రాజు వేంకట లక్ష్మణరావు గారి అక్క బండారు అచ్చమాంబ (1874–1905) స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షిస్తూ వ్రాసిన రచనలు కూడ అందులో అచ్చయ్యేవి. వెయ్యేండ్ల స్త్రీల చరిత్రలను కథనం చేస్తూ ఆమె వ్రాసిన 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అన్న గ్రంథం ఆమె అగాధ పరిశోధనకు అద్దం పడుతుంది. స్త్రీల చరిత్రను అద్భుతంగా ఆవిష్కరించిన ఆ గ్రంథం 3 భాగాలుగా వీరేశలింగం గారి చింతామణి ప్రెస్సులో అచ్చయింది. 1905లో అచ్చమాంబ ప్లేగు వ్యాధికి గురై మరణించింది.

విరహానలంతో సాహిత్యక్షేత్రాన్ని చవిటిపర్రలను చేస్తున్న మహాపండితులున్న కాలంలో ముక్కుపచ్చలారని ఈ 14 ఏండ్ల పాప - స్త్రీ జాతిని చదువుతో సంస్కరించమని కార్చిన ఆ వేడికన్నీటి బిందువు - ఆ చవిటి పర్రను సస్యశ్యామలం చేయడానికి కురిసిన తొలి వర్షబిందువు.

నిజానికి శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి వంటి పండితులు స్త్రీ విద్యను అంగీకరించారు. కాని వాళ్ల సభాప్రవేశాన్ని, అభ్యుదయాన్ని గర్హించారు. వాళ్లు అంగీకరించిన స్త్రీ విద్య అంతా నాల్గుగోడల మధ్య పురాణపఠనానికి, సతీధర్మ ప్రకాశికలను వల్లించడానికే కాని, సృజనాత్మక ఆలోచనలను రేకెత్తించేది కాదు. కాని సీత, చంద్రమతి, దమయంతి వంటి స్త్రీలు చదివిన విద్య - కష్టకాలంలో వివేకంతో తమ వ్యక్తిత్వం తాము కాపాడుకోడానికి, తమ ప్రియుల సాన్నిధ్యాన్ని తిరిగి చేరడానికి ఉపకరించింది. అటువంటి విద్యకావాలని బాలశారద (8వ పద్యం) మాధవుడికి మొరపెట్టుకుంది.

శివుడు భార్యను (గంగను) నెత్తిన పెట్టుకున్నాడు. బ్రహ్మ నాల్కపై నిలుపుకున్నాడు. నీవు గుండెల్లో పెట్టుకున్నావు. మీరంతా భార్యలను ఇంతగా ప్రేమిస్తుంటే ఈ మనుషులేంటి స్వామీ! కూసుముండా అంటూ భార్యలను చిన్నచూపు (9వ పద్యం) చూస్తారు. వాళ్ల బుద్ధులను మార్చు తండ్రీ (10వ పద్యం) - అని నిట్టూర్చింది.

పూర్వకాలంలో స్త్రీలు పెండ్లి తర్వాత కూడ తమ భర్తల దగ్గర చదువుకున్నట్లు తెలుస్తుంది. ఇందుమతీదేవి తన భర్త అజునివద్ద లలిత కళలను అభ్యసించినట్లు, రఘువంశం 'ప్రియశిష్యా లలితే కళావిధౌ' (రఘువంశం 8-67) అని చెబుతుంది. 'మాళవికాగ్నిమిత్ర' కథానాయిక గణదాసుడనే నాట్యాచార్యుని వద్ద సంగీతాభి నయాలను నేర్చుకుంటుంది. అటువంటి దేశంలో ఈనాటి మగాళ్లే స్త్రీ విద్యకు అడ్డుపడుతున్నారని (12వ పద్యం) ముక్కున వేలు వేసుకుంది.

చదువు వద్దంటే ఎలా? చదువు మగవాళ్లకు ఎలాగో ఆడవాళ్లకు కూడ అలాగే కదా! స్త్రీలకు చదువంటే ఇష్టం లేకపోతే అది చాలా తప్పు. మొక్కుబడిగా నాల్గక్షరాలు నేర్చుకుని పురాణాలు వల్లెవేస్తే అది చదువు (19వ పద్యం) కాదు. ఆలోచనాత్మకమైన విద్యే విద్య కదా! అలాంటి చదువులు చదివిన భాస్కరాచార్యుని పుత్రిక లీలావతి, భోజుని సతి భానుమతుల చరిత్రను ఇలా ప్రస్తావించింది.

**ఉ. పావన నామ్ని సద్గణిత పద్ధతిఁ దెల్పదె బోటి కాదె లీ**
**లావతి భాస్కరార్యు సుత రామయ కాదె సరస్వతిం గనన్**
**దేవతయయ్యె విద్యలకు దేజము మీఱగ భోజభార్య వి**
**ద్యావతియైన భానుమతి యారయ నాఁడుది కాదె మాధవా!**

లీలావతి గణితశాస్త్రవేత్త. 'లీలావతీ గణితం' వ్రాసింది. ఆమెదొక చిత్రమైన గాథ. జాతకంలో ఆమెకు వైధవ్యం ఉంది. ఆయుష్మంతుడైన వరుణ్ణి వెతికి తండ్రి బలమైన ముహూర్తంలో లగ్నం నిర్ణయించాడు. ఆ కాలంలో కాలాన్ని వాలుకా యంత్రాలతోను, ఘటికాయంత్రాలతోను నిర్ణయించేవాళ్లు. ఇసుక – సూర్యుని నీడ ఆధారంగా కాలాన్ని నిర్ణయించే వాలుకా యంత్రం కన్నా, ఘటికా యంత్రమే కాలాన్ని ఖచ్చితంగా నిర్ణయిస్తుంది.

ఘటికాయంత్రంలో ఒక లక్కపిడత ఉంటుంది. దానికొక చిన్న బెజ్జం ఉంటుంది. ఆ పిడతలో నీళ్లు పోస్తారు. అందులోంచి ఒక్కొక్క బొట్టు క్రింద పాత్రలో పడుతుంది. అది నిండగానే ఒక గంట అయిందని కాలాన్ని నిర్ణయిస్తారు.

ముహూర్తం కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఇంతలో వధువు లీలావతి ఆ లక్క పిడతలోకి తొంగి చూసింది. ఆమె ముక్కెర రత్నం రాలి అందులో పడింది. అది లక్కపిడత రంధ్రాన్ని కొంతమేర మూసివేసింది. ఎవరూ దాన్ని గమనించలేదు. ముహూర్తం దాటిపోయింది. దుర్లగ్నంలో తాళికట్టడం, వరుడు మరణించడం, లీలావతి విధవకావడం వరుసగా జరిగిపోయాయి. ఆమె జీవితం వ్యర్థం కాకూడదని భాస్కరుడామెను గణితశాస్త్ర ప్రవీణగా శిక్షించాడు. ఆమె వ్రాసిన 'లీలావతి గణితం' ఇంగ్లీషు, పర్షియా, ఉర్దూ మొదలైన భాషలలోకి అనూదితమయింది. స్త్రీలావిధంగా తమ జీవితాలను ధన్యం చేసుకోవాలని మన బాలసరస్వతి ప్రబోధించింది.

ఈ పద్యంలోనే మరొక విద్యావతి అయిన భోజుని భార్య భానుమతిని కూడ ప్రస్తావించింది. భానుమతికి సంస్కృత ప్రాకృతాలలో చక్కని వైదుష్యం ఉంది. భోజ కాళిదాసుల మైత్రికి పండితులు అసూయపడ్డారు. వాళ్లను విడదీయడానికి కుయుక్తులు పన్నారు. దాసీచేత లీలావతీ కాళిదాసులకు 'సంబంధం' ఉందని భోజుడు వినేటట్లు చెప్పించారు. అనుమానం పెనుభూతం. ఆ భూతం పట్టి భోజుడు చిదుముడి పడ్డాడు. దొంగజ్వరం నటించాడు. కాళిదాసును, లీలావతిని పిలిపించాడు. లీలావతితో – నేనిప్పుడు పథ్య భోజనం చెయ్యాలి అన్నాడు. ఆమె వెండి పళ్లెంలో

భోజనం తెచ్చింది. పెసరపప్పు వడ్డించింది. రాజు వాళ్లిద్దరినీ ఓరకంట చూసాడు. పరీక్షించాలనుకొన్నాడు. కాళిదాసుతో –

**'ముద్గదాళీ గదవ్యాళీ కవీంద్ర వితుషాం కథం' –**

కవీంద్రా! రోగాల పాలిటి సర్పమైన పెసరపప్పు పొట్టు లేకుండా ఉంది. విశేషమేంటి? – అని అడిగాడు. అప్పుడు కాళిదాసు –

**'అంధో వల్లభ సంయోగే జాతా విగత కంచుకా' –**

అన్నము అనే ప్రియునితో సంగమిస్తున్నప్పుడు రవిక ఎందుకు మహారాజా! అన్నాడు. అక్కడే ఉన్న సాహిత్యధురీణ భానుమతి అందలి శృంగార స్వారస్యాన్ని అర్థం చేసికొంది. భర్తతో తన స్వానుభవం గుర్తుకు వచ్చి నవ్వింది. భోజునికి అనుమానం బలపడింది. కాళిదాసును దేశం నుండి బహిష్కరించాడు. తర్వాత లీలావతి తన పాతివ్రత్యాన్ని నిరూపించుకునే కథ కొంత ఉంది. ఇదంతా భల్లాలకవి భోజప్రబంధం (అందులో భోజుని భార్య పేరు భానుమతి కాదు లీలావతి) లోని కథ. పదేళ్ల ప్రాయంలోనే ఇలాంటి రసవత్ ప్రబంధాలను అవలోడించి మన శారదాంబ సారస్వతామృత ప్రవాహంలో సుస్నాత కావడం ముచ్చట గొల్పుతుంది.

అతని కంటే ఘనుడు అచ్చంట మల్లన్న – అన్నట్లు మరొక ప్రజ్ఞాధురీణ అయిన పెద్దిభట్టు భార్య పాండిత్యాన్ని కూడ ప్రస్తావించింది.

**ఉ. భాసిలు పెద్ది భట్టుసతి వచ్చిన శిష్యులఁగాంచి వారిలో**
**వాసి గనంగనెంచి మృదువైఖరిఁ దెల్పెఁగదా! "గురోస్తు క**
**ర్ణే సరటః ప్రవిష్ట" యని నేరుపు మీఱఁగ సట్లు జెప్పఁగా**
**నా సతి మంచి విద్య దనరాగ నేర్చెనె కాదె మాధవా!**

పెద్దిభట్టు (ఈయనే మల్లినాథసూరి అని కొందరు, కాదు అతని సోదరుడని కొందరు) భార్య సాహిత్య విద్యాసరఃపరిపూత. ఒకసారి పెద్ద భట్టు శిష్యులను పరీక్షించాలనుకుంది. 'గురోస్తు కర్ణే సరటః ప్రవిష్టః' – గురువుగారి చెవిలో సరటం (తొండ) దూరింది – అన్న సమస్యనిచ్చింది. వాళ్లు తెల్లమొహం వేసారు. దాన్ని ఆమె నేర్పుగా పూరించింది. ఆమెను చూచి నేర్చుకోండి – అని మన విదుషీకుమారి నొక్కివక్కాణించింది. ఇందలి ఐతిహ్యం నాబుద్ధికి అందలేదు. పండితమిత్రులతో

ప్రస్తావించాను. విఫలమనోరథుడినయ్యాను. ఇది ఈ బాలిక అగాధసారస్వత అధ్యయనానికి ప్రబల నిదర్శనం.

కానీ పెద్దిభట్టు భార్య అపండిత అనీ, తన అందాన్ని వర్ణించమని భర్తను అడిగిందనీ, అందుకాయన – 'మేరు మందర సమాన మధ్యమా / తింత్రిణీదళ విశాలలోచనా / అర్కశుష్క ఫలకోమల స్తనీ / పెద్ది భట్ట గృహిణీ విరాజతే (మేరు, మందర పర్వతాలతో సమానమైన నడుము, చింతాకుల వలె వెడల్పైన కళ్ళు, ఎండిన జిల్లేడు పండ్ల వంటి సుందరమైన చన్నులు కల్గి పెద్దిభట్టు భార్య ప్రకాశిస్తుంది) అని గేలి చేసాడని చాటు శ్లోకాలలో ఒక ఐతిహ్యం ఉంది. కాని మన శారదమ్మ తల్లి ఆమెకా కళంకాన్ని తొలగించి ఆమె ఉపజ్ఞామహిత అని నిరూపించింది.

ఆశ్చర్యం కల్గించే ఇంకొక గాథ చెప్తాను. మహాకవి అల్లసాని పెద్దన మనుచరిత్ర వ్రాస్తూ – ఒకనాడు గర్భిణీ స్త్రీని ఎలా వర్ణించాలా అని ఆలోచిస్తున్నారు. అతని కుమార్తె దాన్ని ఎంత నేర్పుగా వర్ణించిందో గదా! అని శారదాంబ (44వ పద్యం) ఆశ్చర్యపోయింది. కానీ నేను విన్నది గర్భిణీ సురత వర్ణన గురించి. ఆంధ్ర సాహిత్యంలోనే మొదట గర్భిణీ సురత వర్ణన చేసిన కవి పెద్దన. దాన్నెలా వ్రాయాలా అని ఆలోచిస్తుంటే అతని కుమార్తె –

**సీ. మనసు కక్కుతితి మెల్లన లేచి చేతులఁ**

**గాంతుని జబ్బుగాఁ గౌఁగిలించు.** (మను 3-123)

– అన్న పద్యం చెప్పిందని గాథ. ఈ పద్యం ప్రక్షిప్తమన్నారు కొందరు. దీని తర్వాత వరూథినిని మాయాప్రవరుడు విడిచి పెడతాడు. అందువలన శిథిలపద బంధంతో కవి ఈ పద్యం వ్రాసాడు. అంటే వాళ్ళ బంధం శిథిలమవుతుందని చెప్పడం. అందునా గర్భిణీ సురతంలో అతృప్తి. దాంతో అతనికి ఆమె అవసరం తీరిందని. అందువలన శిల్పదృష్టితో చెప్పిన ఈ పద్యాన్ని ప్రక్షిప్తమనరాదు. ఈ పద్యం పెద్దనగారి కూతురిదన్నమాట నిజమైతే ఆమె పేరు, రచనలు దొరక్కపోవడం నిజంగా దురదృష్టం. ఆమెను గుర్తు చేసిన శారదమ్మను అభినందించాలి.

ఈ శతకంలో ఈ కవివరేణ్య – శాస్త్రాలలో ఉన్న విషయాలను కూడా త్రవ్వి పోసింది. స్మృతులలో – వంశం, శీలం, బలం, విద్య – ఈనాల్గింటిలో తనకు ఈడైన వానిని వరించమని బ్రహ్మ స్త్రీకి చెప్పాడు. అతివలది మరచిపోరాదని (25ప.)

హితవు పలికింది. పిల్లలకు రోగాలు రొష్టులు వస్తుంటాయి. వైద్య గ్రంథాలలో వాటికి చికిత్సా విధానం ఉంటుంది. అంగనలు చదువుకొంటే ఆ రహస్యాలు తెలిసికొని ఎందుకు ప్రయోజనం పొందకూడదని (26వ పద్యం) ప్రశ్నించింది.

మగవాడి దేహంలో స్త్రీ సగభాగమంటారు కదా! అందులో పురుషుడి అర్థ దేహం చదువుకుని, స్త్రీ అర్థదేహం అవిద్యతో ఉంటే – అది ఆ దేహానికి పక్షవాతమే కదా! (28వ ప) అని మెత్త మెత్తగా చెప్పింది. భోగపు సానుల పాటలు వింటూ ఇది మేమెక్కడా వినలేదే! ఎంత బాగున్నాయి అని వాళ్లను కీర్తించేకంటే ఇల్లాండ్రు కూడ సంగీతం నేర్చుకుంటే మేలు కదా! (29వ పద్యం) ముదితలు కూడ నాట్యం నేర్చుకోవాలి. నాడు బృహన్నల దగ్గర ఉత్తర కుమార్తె నాట్యం నేర్చుకోలేదా! ఆమె పతివ్రత కాదా (32వ పద్యం) అని సంగీత సాహిత్యాలు విరిబోండ్ల కవసరమని, అవి భోగపు విద్యలు కావని హితవు పలికింది.

స్త్రీలు శ్రుతులు వినకూడదని అంటారు. మనకు ధర్మాలు నిర్ణయించిన మనువు కూతురు దేవహూతి తన కొడుకు కపిలుని వద్ద సాంఖ్యశాస్త్రాన్ని నేర్చుకోలేదా (41వ). కృష్ణుని కీర్తించి మీరాబాయి ఉత్తర భారతంలో ప్రఖ్యాత కాలేదా (43 వ). ఆకాశంలోని నక్షత్రాలెన్ని అని భోజుడు వరాహ మిహిరుని ప్రశ్నిస్తే, అతని కోడలు భాన ఒక గంపనిండా ఇసుక తెప్పించి – ఇన్ని అని గడుసుగా సమాధానం చెప్పిన మేధావిని మన స్త్రీ అని మర్చిపోతే (45వ) ఎలా? అని నిలదీసింది.

మహిళలు తప్పనిసరిగా – చిత్రలేఖనం, బాలచికిత్స, చరిత్ర, భూగోళం, దేశభాష, గణితవిద్యలు నేర్చుకోవాలని (57వ) ప్రబోధించింది. వింజమూరి తిమ్మక్క 'దోలాయాత్ర' అన్న ద్విపద గ్రంథం వ్రాసింది కదా! ఆమె మనకు మార్గదర్శి కాదా! (65వ). ఎప్పుడూ మూగనోము, దయ కుంకుమ వంటి నోములతో పొద్దుపుచ్చకపోతే కాస్త చదువుకుంటే మేలు గదా (66వ). అంటూ వ్రతాలను, నోములను తృణీకరించింది (66వ). ఆడవాళ్లు చదువుకొని ఏం చేయాలి? ఉళ్లేలాలనా, ఉద్యోగాలు చేయాలనా అని అంటారేంటి? విజ్ఞానాన్ని పెంచుకోవడం కోసం చదవాలంటున్నాను(71వ) అని ఎలుగెత్తి చాటింది. ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు కాలదోషం పట్టని సమాధానాల ఖజానా ఈ మాధవశతకం.

చదువుకోకపోవడం వల్లనే మన ఆడాళ్లు ఇంత మర్యాదగా ఒదిగి ఉంటారంటా రేంట్రా బాబూ! అది మన సంస్కృతీ సంప్రదాయాల గొప్పదనం అని తెలుసుకోండ్రా

నాయనా! అని (75ప) ఉద్ఘోషించింది. స్త్రీలకు ఐదుగురు భర్తలున్న ద్రౌపది వంటి పేర్లు పెడితే కొందరివేం పేర్లు? భోగమోళ్ల పేర్లంటారే. అయితే వేలాది మంది పెండ్లాలున్న కృష్ణుని పేరు మీకెలా పవిత్రమైందయ్యా చెప్పండి (81ప). అని పురుష సమాజంపై, వయస్సుకు మించిన మేధతో ఈ బాల కవయిత్రి నిశితమైన ప్రశ్నలు సంధించింది. ఆడవాళ్ల కెందుకీ ఘోషా పద్ధతి. పల్లకీలు, గాడీలు ఎక్కినా ఊపిరాడకుండా తలుపులు మూస్తారు. బుర్ఖాలు వేస్తారు. మాకు ఊపిరాడవద్దా! ఇంత అనాగరికమా (83ప.) అంటూ నాటి సంకుచిత సమాజంపై శిలీముఖాలు సంధించింది.

పూర్వం అమ్మాయిలకు యుక్త వయస్సు వచ్చాక స్వయంవరం చాటించే వాళ్లు. ఆమె వరించిన వరునికిచ్చి పెండ్లి చేసేవాళ్లు. కాని ఇప్పుడేంటి అమ్మాయికి తెలియకుండానే తల్లిదండ్రులు తమకు నచ్చిన వాళ్లకిచ్చి పెండ్లి చేస్తున్నారు (86ప). మరీ అన్యాయంగా డబ్బుకాశపడి డెబ్బై, ఎనభై ఏండ్ల ముసలివాండ్ర కిచ్చి ముక్కుపచ్చలారని పాపలకు పెండ్లిచేసి వాళ్ల గొంతు కోస్తున్నారంటూ (87ప), గురజాడ కంటే ముందే ఆ దురాచారాన్ని ఖండించింది.

ఇదీ పద్యాలుగేండ్ల చిన్నారి వయస్సుకు మించిన ఆవేశంతో నాటి ఇరుకైన సమాజంపై అక్షరాయుధంతో దాడిచేసిన విధానం నాటి విద్యావంతులపై ఇది చాలా ప్రభావం చూపింది. అందువల్లనే ఈ బాల కవయిత్రిని నేను తొలి స్త్రీ వాద రచయిత్రిగా ఘంటాపథంగా చాటుతున్నాను.

స్త్రీ స్వేచ్ఛను ఉద్ఘోషించిన ఈ పద్యగ్రంథంలో కొన్నిచోట్ల లక్షణికాంశాలు కూడా స్వేచ్ఛనే కోరుకున్నాయి. అప్రశస్తమైన వ-మ యతి, బ-మ యతి, క్వార్థ కేకారాలు వంటివి అక్కడక్కడా తగులుతాయి. అవి అంత గణింపదగినవి కాదు కాని ఒకచోట గుడిసెవేటులు (74ప) అన్న పదం ప్రయోగించింది. దాని అసలు రూపం గుడి చేటి. అంటే వేశ్య అని అర్థం. వ్యావహారికంలో గుడిచేటి ముండ అనడం కూడ కద్దు. అలా అనలేక ఈ పాప గుడిసె వేటు - అని తప్పుకుంది. తరచి చూస్తే ఇలాంటివి ఇంకా కొన్ని తగులుతాయి. కానీ ఇప్పటికే పీఠిక పెద్దదయింది.

నిజానికి ఈ శతకానికి ఇంత పీఠిక అక్కర్లేదు. కాని ఈ బాలికా మూర్ధన్య వయస్సుకు మించిన చదువులు చదవడంతో పెద్దపెద్ద పండితులే ఎరుగని ఎన్నెన్నో

గాథలను త్రవ్వింది. దాంతో చాలా భేతాళాలు బయటపడ్డాయి. వాటన్నిటిని తడమకపోతే ఆ బాల శ్రమంతా వృథా అవుతుంది కదా అని వివరించాను. ఒండురెండు చోట్ల నా సందేహాలను తీర్చిన విద్యామిత్రులు ప్రవచన పాంచజన్య బిరుదాంకితులు బ్రహ్మశ్రీ వద్దేపల్లి శ్రీనివాసరావుగారికి నా కృతజ్ఞతలు.

దాదాపు 125 సం॥లు క్రితం ఈ చిన్నారి క్రాంతదర్శిని కాంక్షించిన స్వేచ్ఛా జగత్తు ఇప్పటికీ పూర్తిగా సిద్ధించలేదు. ఇంకా మహిళల పట్ల వివక్ష, అవిద్య కొనసాగుతూనే ఉంది. వీరేశలింగం పంతులు గారిని తమ ఆధ్యాత్మిక గురువుగా గుండెల్లో గుడికట్టుకున్న చలంగారు – 'స్త్రీకి శరీరం ఉంది. దానికి వ్యాయమం ఇవ్వాలి. స్త్రీకి హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి. స్త్రీకి మెదడు ఉంది. దానిని ఆలోచించనివ్వాలి' – అన్నమాటలు సాకారమైనప్పుడే మన శారదమ్మ కలలుగన్న మహితవిద్యాసముదీర్ణమైన మహిళా చైతన్యం అజస్ర సహస్ర నిజప్రభలతో ఉదాత్త సమాజాన్ని ఆవిష్కరిస్తుంది. అస్తు!

**స్త్రియోహి నామ ఖల్వేతా నిసర్గా దేవపండితాః**
**పురుషాణాం తు పాండిత్యం శాస్త్రైరేవో పదిశ్యతే ॥**

– మృచ్ఛకటికం 4 అం. 19 శ్లో.

(పురుషులకు శాస్త్రం చదువుకుంటే పాండిత్యం వస్తుంది. కాని స్త్రీలకు మాత్రం అది సహజంగానే ఉంటుంది).

వేములపాడు — 'ప్రసన్నకవి'
విళంబి భాద్రపద బ॥ పాడ్యమి — **ఉన్నం జ్యోతివాసు**
26-9-2018

క. కులమును గుణమును రూపును
గలిగిన బాలికకు విద్యగలిగినయేనిన్
తలఁపఁగఁ బసిఁడికి వాసన
కలిమియుఁ జెఱకునకుఁ బండుఁ గలుగుటగాదే!

– మల్హణచరిత్ర 1:73

# ఆధునికయుగ ఆలోచనలకు తెరతీసిన
# వేమూరి శారదాంబ 'నాగ్నజితీ పరిణయము'

**– ఆచార్య కాత్యాయనీ విద్మహే**

1881లో పుట్టి పంతొమ్మిదేళ్ల చిన్న వయసులోనే (1899) మరణించిన వేమూరి శారదాంబ పదహారేళ్ళ వయసులో చెప్పిన ప్రబంధం నాగ్నజితీ పరిణయం. శారదాంబ సంగీత సాహిత్య వేత్త, సాంఘిక న్యాయాన్ని ఆకాంక్షించిన సంస్కర్త, న్యాయవాది అయిన దాసు శ్రీరాములు గారి కూతురు. ఆరుగురున్నల చెల్లెలు. స్త్రీ విద్యాభిమాని అయిన శ్రీరాములుగారు బిడ్డకు సంస్కృత తెలుగు సాహిత్యాలు చెప్పించటమే కాక సంగీతంలోనూ శిక్షణ ఇప్పించారు. తొమ్మిదేళ్లకే సంగీత కచేరీలు ఇయ్యగలిగిన స్థాయికి చేరింది. పదునాలుగేళ్లకే పద్యరచన ప్రారంభించింది. 'మాధవ శతకం' ఆమె మహిళాభ్యుదయ దృక్పథానికి సంబంధించిన రచన కాగా 'నాగ్నజితీ పరిణయం' ఆమె ప్రాచీన సాహిత్య పాండిత్య గరిమకు నిలువుటద్దం.

శారదాంబ ఇంటి పేరు పెళ్లి వల్ల 'వేమూరి' అయింది. వేమూరి రామచంద్రరావు ఆమె భర్త. 1888లో వాళ్ళ పెళ్లి అయింది. అప్పటికి శారదాంబ వయసు ఏడేళ్ళు. మరొక ఐదారేళ్లకు కాపురానికి పోయిందనుకొన్నా ఆమె సంసార జీవితం ఐదారేళ్లను మించదు. కాపురానికి వెళ్లిన కాలం, కవితా వ్యవసాయం ప్రారంభించిన కాలం దాదాపు ఒకటే. తొలి చూలు ఆడపిల్ల దుర్గాంబ. మలి చూలు మగబిడ్డ పార్థసారథి. ఈ ప్రసవంలోనే ఆమె మరణించింది. నాగ్నజితీ పరిణయం కృతి భర్త పార్థసారథి. చెన్నైలోని పార్థసారథి కోవెల దేవుడు ఆయన. భర్తతో మద్రాసులో కాపురమున్న కాలంలో శారదాంబ ఈ కావ్యం రాసి ఉంటుందని భావిస్తున్నారు.

కూతురి అకాల మరణాన్ని ప్రస్తావిస్తూ దాసు శ్రీరాములుగారు శ్రీ దేవీ భాగవములో రాసిన ఒక సీస పద్యాన్ని బట్టి 'నాగ్నజితీ పరిణయం' ఆమె 16వ ఏట రాసినట్లు తెలుస్తున్నది. అంటే అది 1896 కావాలి మాధవ శతకాన్ని ఆయన ప్రస్తావించలేదు. కనుక దాని రచనాకాలం తెలియదు. 14వ ఏట నుండి 'ముద్దు ముద్దుగా అల్లిబిల్లిగా పద్యమల్లటం' నేర్చినదని తండ్రి చెప్పిన మాటను బట్టి ఆ

అల్లిక శతకపద్య మాలిక అయినట్లు ఊహించవచ్చు. అది ఆమె మరణానంతరం 1901లో శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారి సంపాదకత్వంలో వచ్చిన కళావతి మాసపత్రికలో మూడు భాగాలుగా అచ్చయింది. నాగ్నజితీ పరిణయం అయినా ఆమె జీవించి ఉండగా అచ్చయిందో లేదో తెలియదు. ప్రచురణకాలం తదితర వివరాలు ముద్రించిన పుటలు లేని ప్రతి మాత్రమే లభ్యమైంది. దాసు శ్రీరాములు గారి వంశ వారసులు పూనుకొని 'మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి'ని ఏర్పాటు చేసి ఆయన సాహిత్యంతో పాటు శారదాంబ గారి ఈ రెండు రచనలు సేకరించి పునర్ముంద్రించారు. స్త్రీల సాహిత్య చరిత్రలో వేమూరి శారదాంబ పేరు జారిపోకుండా 'ఆంధ్రకవయిత్రులు'లో ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కూర్చి పెడితే స్త్రీల సాహిత్య అధ్యయనానికి ఈ విధంగా అరుదైన వనరులు సమకూర్చి పెట్టిన డాక్టర్ దాసు అచ్యుతరావు గారిని అభినందించాలి.

నాగ్నజితీ పరిణయము మూడాశ్వాసాల ప్రబంధం. పద్యాలూ, వచనాలు కలిపి 231 ఉన్నాయి ఈ కావ్యంలో. మూడు ఆశ్వాసాల చివర పునరావృతమయ్యే ఒక పద్యంతో కలిపితే ఆ సంఖ్య 232 అవుతుంది. ఆ పద్యం ఇది.

"భాసురమైన నీవెదద వక్షమునందున శ్రీవె లుంగగా
దాసులకేకొఱంత సతతమ్మును సంతస మూరి శోభితా
వాసులుగారె విశ్వపరిపాలన సుందర రామ శారదా
భ్రాసమకీర్తి పూరిత దిగంతరవైభవ చంద్ర మాధవా."

మాధవుడిని సంబోధించే స్తుతి రూపకమైన ఉత్పలమాల పద్యం ఇది. నీ వక్షస్థలంపై లక్ష్మి విలసిల్లుతుండగా భక్తులకు ఏ కొరతా లేదు. అంతటా సంతోషమే అని చెప్పటం, విశ్వాన్ని పాలించే సుందర రాముడని, వైభవ చంద్రుడిని మాధవుడిని స్తుతించటం ఇందులో విషయాలు. అంతే అయితే ఇది సాధారణ పద్యం. ఇందులో శారదాంబ తన భర్త పేరును నాలుగు పంక్తులలో గర్భితం చేసి చెప్పటం విశేషం. ప్రతి పాదం చివర గణంలో మొదటి రెండక్షరాలు శారదాంబ భర్త వేమూరి రామచంద్రరావు పేరులోని (రావు అన్న తుది భాగాన్ని మినహాయించి) భాగాలను వరుసగా సూచిస్తాయి. గౌరవ చిహ్నమైన శ్రీ తో ప్రారంభించి వె అన్న అక్షరాన్ని కలుపుకున్న భాగాన్ని మొదటి పాదంలో, మూరి అన్న భాగాన్ని రెండవ పాదంలో

రామ అన్న భాగాన్ని మూడవ పాదంలో, చివరి పాదంలో చంద్ర అన్న భాగాన్ని చూడవచ్చు. మాధవ శతకం కూడా ఈ పద్యంతోనే ముగియటం గమనించదగినది.

19వ శతాబ్ది కవయిత్రి వేమూరి శారదాంబ 'నాగ్నజితీ పరిణయము' రచన మధ్య యుగాలలో స్థిరపడిన కావ్యనిర్మాణ పద్ధతిలో సాగింది. ప్రథమాశ్వాసంలో మొదటి 10 పద్యాలు ఈ కావ్యావతారిక వంటివి. ఇష్టదేవతా స్తుతి, కృతి భర్తను నిర్దేశించుకొనటం ఇందులో ప్రధానం. విష్ణువు, లక్ష్మి, శివుడు, పార్వతి, బ్రహ్మ, సరస్వతి, వినాయకుడు సత్యవాక్కును, భద్రతను ఇచ్చి రక్షించాలని కోరుకొంటుంది. తన కృతిని కన్యగా సంభావించి "తిరువలిక్కేణి దివ్యమందిరములోన నింతి రుక్మిణితో సుఖియించుచున్న / నంద సుతుడైన సచ్చిదానంద మూర్తి"ని కృతి భర్తగా ఎంచుకున్నది. ఆ తరువాత ఉన్న కంద పద్యం ప్రత్యేకంగా పరిశీలించదగినది. స్త్రీల కావ్యావతారికలలో మాత్రమే అటువంటి పద్యాలు కనబడతాయి.

**"ఎన్నంగల పొత్తముల నేమిఁ గన్నదాన**
**విన్న దానసుఁ గాను నే నెన్నఁ డైనఁ**
**గన్న వారెల్లఁ గరుణనిందున్న యట్టి**
**యన్ని తప్పుల క్షమియింతురని తలంతు"**

ఏనాడూ చెప్పుకోదగిన పుస్తకాలేమీ చూచినదాన్ని గాను, విన్నదానను గాను, ఈ కావ్యం చూచినా వాళ్ళెవరైనా దయతో ఇందులోని తప్పులన్నీ క్షమిస్తారని తలుస్తాను అని శారదాంబ వినయంగా పాఠకోత్తములను, పండితులను కోరుకొన్నది ఈ పద్యంలో. ఏ మొల్ల కవితా శైలి అలవడిందని శారదాంబను మెచ్చుకొంటారో ఆ మొల్ల నుండీ మొదలు పెట్టి ఏ కవయిత్రి అయినా పాఠకోత్తములకు ఈ రకంగానే విన్నపాలు చేసుకొన్నది. మొల్ల తనకు తెలుగు సంస్కృత భాషలు, పద సంపద, వ్యాకరణ ఛందో అలంకార శాస్త్రాలు – ఏవీ తెలియవని తన కవిత్వంలో తప్పులెంచ వద్దని సాటి కవులను కోరింది. తరిగొండ వెంగమాంబ కూడా తాను గురువుల వద్ద చదువుకోలేదని ఛందస్సు తెలియదని, కావ్యనాటక అలంకార శాస్త్రాల గురించి వినను కూడా లేదని, ఇతిహాసపురాణాలు చదవలేదని పేర్కొనటమే కాదు తనది బాలభాష అంటుంది. నా తప్పొప్పులేరీతిగానైనా గెలిసేయక చిత్తగింపవలయు నని కోరింది.

16వ శతాబ్ది నుండి మూడువందల ఏళ్ళు ముందుకు వచ్చినా సాహిత్య రంగంలో మహిళా కవుల మాట వరుస మారలేదంటే సాహిత్య సామాజిక రంగాలు యధాపూర్వకంగా పురుషుల రంగాలుగా ఉండటం వల్లనే. నన్నయ నుండి ఏ పురుష కవి అయినా తమ ప్రతిభా పాండిత్యాల గురించి చెప్పుకొన్న వాళ్ళే గానీ ఇలా తమకేమీ తెలియదని చెప్పుకోలేదు. ఏ పాండిత్యం లేకుండా కావ్యాలు రాయటం స్త్రీలకు మాత్రం సాధ్యమా అంటే కాదు అనే సమాధానం. వేళ్ళ మీద లెక్కించదగిన సంఖ్యలో మాత్రమే ఉన్న మహిళా కవులు అల్పసంఖ్యాక వర్గంగా పురుషులదైన కావ్య ప్రపంచంలోకి బెదురుబెదురుగా ప్రవేశిస్తున్నారనటానికి, వాళ్ళను ప్రసన్నం చేసుకొనటానికి వాళ్ళ కంటే తామెందులోనూ అధికులం కామని నమ్మబలికి వారి దయను పొందటానికి తాపత్రయ పడుతున్నారటానికి నిదర్శనం. ఇదంతా కవులుగా తమ అస్తితను చాటుకొనే అవకాశాలను కల్పించుకొనటంలో భాగమే. శారదాంబ ఆ వరుసలోని కవయిత్రే.

మన ఇతిహాస పురాణ కావ్య ప్రబంధ సాహిత్యరచన అంతా సూతుడు శౌనకాది మహామునులకు చెప్పిన క్రమాన్నో, శుకుడు పరీక్షిత్తునకు చెప్పిన క్రమాన్నో, వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పిన క్రమాన్నో ప్రస్తావించి ఆ ప్రత్యేక క్రమంలో తాము రాస్తున్నట్లు ఆయా కవులు పేర్కొనటంగా ఉంటుంది. అదొక పద్ధతి. రాసే కవి సర్వానికి తానే కర్తనని అహంకరించకుండా పరంపరాగత మానవానుభవాలను ప్రజలకు అనుస్యూతంగా అందించే సాంస్కృతిక రాయబారిగా తనను తాను వ్యక్తీకరించుకొనటం ఈ పద్ధతిలోని ఒక అందం. ఆ వరుసలోనే శారదాంబ తాను ఒనర్పం బూనిన నాగ్నజితీ పరిణయము కథా క్రమం 'శుక మహర్షి పరీక్షిన్న రేంద్రున కెరింగించిన తెఱంగు' అని చెప్పుకొన్నది.

నాగ్నజితి శ్రీకృష్ణుడి అష్టభార్యలలో ఒకతె. నగ్నజిత్తుడి కూతురు కనుక ఆమె నాగ్నజితి. శ్రీకృష్ణుడితో ఆమె వివాహమైన తీరు 'నాగ్నజితీ పరిణయము' కావ్య కథా విషయం. వేమూరి శారదాంబ కంటే పూర్వం ఈ ఇతి వృత్తంతో కావ్యాలు రాసిన వాళ్ళు ముగ్గురు. రాజవోలు సుబ్బారాయుడు, పల్లారి నరసింహ కవి, వెలిదండ్ల అళగిరి. శారదాంబ సమకాలికులు ముగ్గురు. మాడభూషి నరసింహా చార్యులు, శిష్ట్ల కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీనివాసాచార్యులు.. శారదాంబతో కలిసి

అల్లిక పని చేసింది. కృష్ణుడు కొమ్ములువంచి పట్టితెచ్చి స్తంభాలకు కట్టివేసిన ఏడు ఎద్దులు పరమశివుడి శాపం పొందిన కుబేర అనుచరులన్న కల్పన కూడా అదనమే. అస్థిపంజరం వంటి భాగవత కథను మాంసలం చేసి జీవవంతం చేసింది శారదాంబ.

ఈ క్రమంలో కావ్య లక్షణాలుగా దండి చెప్పిన అష్టాదశ పురాణాలలో నగర వర్ణన, ఉద్యానవనవర్ణన, సూర్యాస్తమయవర్ణన, ఋతువర్ణన, విరహవర్ణన, వివాహ వర్ణన, కుమారోదయవర్ణన, నాయకాభ్యుదయం వంటి వాటికి అవకాశం కల్పించు కొన్నది శారదాంబ. నగరవర్ణనలో భౌగోళిక విశేషాలు జలవనరులు, తోటలు, పంటపొలాలు, పశు సంపద మొదలైన వాటితో పాటు బ్రాహ్మణక్షత్రియ వైశ్య శూద్ర వర్ణాల వారి వర్ణన సర్వసాధారణం. శారదాంబ ప్రత్యేకత ఆ నగర ఇల్లాళ్లను వర్ణించటం, ఆధునిక స్త్రీ సహజ ఆత్మ చేతన నుండి నగరం అన్న తరువాత మహిళలు ఉండరా? వాళ్ళను ఎందుకు ప్రధాన స్రవంతి జనం నుండి మినహాయించారు? అన్న కొత్త ప్రశ్నలతో సాంప్రదాయ నగరవర్ణనకు ఆమె చేసిన కొత్త చేర్పు ఇది. ఆ ఇల్లాళ్లు పతిని దైవంగా  పూజించేవాళ్ళు, అత్తమామలయందు అణకువ చూపే వాళ్లు, బంధుమిత్రులను ఆదరించేవాళ్లు, బీదవాళ్ళను ఆదరించే వాళ్లు, పనులకు బద్ధకించని వాళ్ళు అని ఆమె చేసిన వర్ణన సంప్రదాయ స్త్రీ నమూనాకు భిన్నమైందేమీ కాదు. అదివేరే సంగతి. అయినా సంగీత సాహిత్య విద్యలు తెలిసినవాళ్లుగా వాళ్ళను పేర్కొనటం మాత్రం ఆమె ఆధునిక దృష్టిని సూచిస్తుందని చెప్పక తప్పదు. సుదంత పెరిగిన తీరు వివరించే పద్యాలలో అది మరింత స్పష్టంగా రుజువైంది.

పురాణ ప్రబంధాలలో బాలికలను వర్ణించే వేళ బొమ్మలపెళ్ళిళ్ళు చేయటం, చిలకలకు పాఠాలు చెప్పటం, పాటలు పాడటం, వీణ వాయించటం, బొమ్మలు గీయటం తరచు వాళ్ళ కార్యకలాపాలుగా చెప్పబడ్డాయి. నగ్నజిత్తు కూతురైన సుదంత కూడా ఇవి చేస్తూనే పెరిగింది. అంతవరకే చెప్తే శారదాంబ గురించి చెప్పుకోవల సిందేమీ లేదు. అంతకు మించి సుదంత '..... మృదు కావ్యములన్ బఠియింప నేర్చుగా / పూని సునీతిమంతములఁ బొత్తములన్ రచియింపనేర్చే ...' నని చెప్తుంది కవయిత్రి. కావ్య పఠనా రచనాదులు శారదాంబ అనుభవ విషయాలు. ఆడపిల్లలు అవి నేరుస్తూ పెరగటాన్ని ఆధునిక సంస్కరణ దృక్పథం నుండే ఆమె సంభావించింది.

నాగ్నజితీ పరిణయము కావ్యం ముగింపులో భాగవత మూలానికి భిన్నంగా

శారదాంబ చేసిన ఒక మార్పు ప్రత్యేకం పరిశీలించదగింది. శ్రీకృష్ణుడు భార్యలందరి పట్ల సమతా భావంతో మెలిగాడిన చెప్పిన భాగవతమే ఆయన 'సత్యభామా ప్రియాంకరుడ'ని చెప్తుంది. నాగ్నజితీ పరిణయ కథకు ముగింపుగా ఉన్న 'ఇట్లు హరి నాగ్నజితిం బెండ్లియాడి, యరణముల పుచ్చుకొని, ద్వారకా నగరంబునకు వచ్చి సత్యభామతో గ్రీడించు చుండె' అన్న వాక్యం అదే సత్యమని, సమత్వం భ్రమ అని స్పష్టం చేయనే చేసింది. నాగ్నజితిని పెళ్ళాడి రావటం ఏమిటి? సత్యభామతో క్రీడించటం ఏమిటి? ఈ అసంబద్ధత నాగ్నజితికే కాదు ఆత్మగౌరవం కల ఏ స్త్రీకి అయినా అవమానకరమైనదే. ఈ స్పృహ మెండుగా ఉండటం వల్లనే శారదాంబ ' … జగములెల్ల / నేలుచును దంపతులు సుఖియించి రెలమి' అని నాగ్నజితీ శ్రీకృష్ణుల దాంపత్య జీవితం గురించే చెప్పి ఈ కావ్యాన్ని ముగించింది.

ఆ రకంగా సంప్రదాయ కథలను ఆ చట్రంలోనే అయినా సంస్కరణోద్యమ ప్రభావంతో, సామాన్య లౌకిక స్వీయ జీవితానుభవ జ్ఞానం నుండి అభివృద్ధి చెందిన ఆధునిక దృష్టి కోణంతో స్త్రీలు మార్చి రాయటానికి చేసిన ప్రారంభ ప్రయత్నాలకు ఈ 'నాగ్నజితీ పరిణయ' కావ్యం ప్రాతినిధ్యం వహిస్తుంది. సరళ సుందరమైన పద్య రచన, కథనరీతి శారదాంబ కావ్యలక్షణం. పందొమ్మిదవ శతాబ్ది చివరి భాగంలో తెలుగు కవితాకశంలో మెరుపై మెరిసిన శారదాంబ వారసత్వం 20వ శతాబ్దిలోకి ఎంతగా విస్తరించిందో ఇలాంటి కవులను వెలుగులోకి తెచ్చి అధ్యయనం చేసే క్రమంలో అర్థం అవుతుంది.

**కాత్యాయనీ విద్మహే**

17-02-2017

# కల్యాణ వీణ

– 'ప్రసన్న కవి' **ఉన్నం జ్యోతివాసు**

అది 1880 సంవత్సరం మే నెలలో ఒకరోజు. అది చిత్తూరు జిల్లాలోని గోగునూరు. అది ఒక కుగ్రామం. సమయం మధ్యాహ్నం కావస్తున్నది. వడమటి గాలులు నిప్పులు గ్రక్కుతున్నాయి. బజారులన్నీ నిర్మానుష్యమయ్యాయి. ఆ ఊరు తూర్పు బజారులో ఒక పెద్ద పెంకుటిల్లు ఉంది. ఇంటిముందు విశాలమైన ఖాళీస్థలం. అందులో రెండు పెద్ద పెద్ద వేప చెట్లున్నాయి. ఆ చెట్లనీడలో కొన్ని పశువులు మాగన్నుగా నెమరు వేస్తున్నాయి. ఆ ఇంట పంచలో కూర్చుని నలభై ఏండ్ల బ్రాహ్మణ వితంతువు విసనకర్రతో విసురుకుంటూ ఉంది.

అంతలో బజారులో అటువైపుగా వెళుతూ, ప్రక్కఊరి సాయిబు ఒకతను ఎండదెబ్బకు తట్టుకోలేక ఆ చెట్లనీడదగ్గరకు వచ్చి పై గుడ్డ పరచుకొని పడుకున్నాడు. అతడు పళ్ళపొడి పొట్లాల వ్యాపారి. అతడు ప్రతిరోజు ఉదయాన్నే ఆ చుట్టు ప్రక్కల ఊళ్ళలో పళ్లపొడి పొట్లాలు అమ్ముకొని, ఎండబడే వేళకు తన ఊరు చేరుకునేవాడు. కాని ఆరోజు బాగా ఎండబడింది. వెళ్ళలేక ఆ ఇంటి ముందున్న వేపచెట్ల నీడలో పడుకొని సేదతీరుతున్నాడు. అతనికి దాహంతో నాలుక పిడుచకట్టుకు పోతోంది. పంచలో బ్రాహ్మణ వితంతువు కనబడింది. సంశయిస్తూనే ఆమె వద్దకు వెళ్లి – "అమ్మా! కొంచెం మంచి తీర్థం ఇప్పించడమ్మా !" అని అడిగాడు. ఆమె లోపలకు వెళ్ళి, మరచెంబుతో మంచినీళ్లు తెచ్చిఇచ్చింది. అతని దప్పిక తీరాక ఆమె అతనిని ఏవూరు, ఏం పని చేస్తుంటావని ప్రశ్నలు వేసింది. అతడు తన పేరు, ఊరు, వ్యాపారం గురించి చెప్పి – 'పళ్లపొడి పొట్లాలు కట్టుకోవడానికి ఏమన్నా కాగితాలుంటే ఇవ్వండమ్మా!' అని అడిగాడు. "మా ఖోషాణంలో ఏవో కాగితాల పొత్తులు ఉన్నాయి. పనికొస్తే తీసుకో" – అందామె. అతను ఖోషాణం తీసాడు. దాని నిండా రూపాయల నోట్ల కట్టలు ఉన్నాయి. అతడు గుడ్లు తేలవేశాడు. ఇందులో కాగితాలేవమ్మా – అని అడిగాడు. "ఇవేగా నీవడిగిన కాగితాలు" అందామె. అంతే ! అతని కర్థమయింది ఆమె కేమీ తెలియదని. వెంటనే ఆ నోట్ల కట్టలన్ని తన సంచులనిండా కుక్కుకుని హడావుడిగా వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు ప్రక్కఊరిలో ఉంటున్న ఆమె తమ్ముడు వచ్చాడు. మాటలమధ్యలో ఆమె భోషాణంలోని కాగితం పొత్తులన్నీ పళ్లపొడి వ్యాపారి కిచ్చానని చెప్పింది. తమ్ముడు నిర్ఘాంతపోయాడు. భోషాణం తీసి చూశాడు. అది ఖాళీగా ఉంది. 'అక్కా! బావగారు నీకోసం ఎంతో డబ్బు కూడబెట్టి ఈ పెట్టెలో పెట్టి పోయారు. నీ అజ్ఞానంతో అంతా పోగొట్టుకొన్నావు' – అని బాధపడ్డాడు. ఇదీ ఆనాటి స్త్రీల పరిస్థితి.

ఆమె చదువు కాదు కదా రూపాయినోటును కూడా తన కళ్లతో చూడలేదు. ఆ నాడు రూపాయి నోట్లన్నీ ఇంగ్లండులో తయారయ్యేవి. అవి నేటి వందరూపాయల నోటంత పెద్దవి. వాటిపై ఇంగ్లీషు అక్షరాలేకాని సంస్కృతం కాని, తెలుగు అక్షరాలు కానీ ఉండేవి కావు. అవి డబ్బున్న వారి ఇంట్లోనే ఉండేవి. సామాన్యులకు దమ్మిడీ, కాణీ, బేడ, అణాలు మాత్రమే తెలుసు. అవి ఆడవారిని చిన్న చూపు చూసిన రోజులు. కుటుంబ విషయాలు వారికి తెలియనిచ్చేవారు కాదు. ఆదాయం, ఖర్చు అన్నవి వారికి సంబంధంలేని విషయాలుగా భావించిన కాలం. ఆమె భర్త ఆమె కోసం ఎంతోసంపాదించి పెట్టాడు. కాని ఏనాడూ అది డబ్బని కాని, అది తమ కోసమేనని కాని ఆమగ మహారాజు ఆమెకు చెప్పలేదు. హఠాత్తుగ కాలంచేసాడు.

ఆమె ఎవరోకాదు సాక్షాత్తు మహానటుడు చిత్తూరు నాగయ్య గారి అమ్మమ్మ. అప్పుడే స్త్రీ విద్యగురించి, వితంతు పునర్వివాహాల గురించి కందుకూరి వీరేశలింగం పంతులుగారు ప్రబోధిస్తున్నారు. ఛాందస మేఘాలు దట్టంగా ఆవరించిన నాటి తెలుగు క్షేత్రంలో ఆయన నాటిన సంఘసంస్కరణ విత్తనాలు ఎంత ప్రయత్నించినా మొలకెత్తలేకపోతున్నాయి. దానికితోడు 'వితంతు పునర్వివాహ దుర్వాద నిర్వాపణము' అన్నపేరుతో వేదం వేంకట్రాయశాస్త్రిగారు పంతులు గారి సంఘసంస్కరణ భావాలపై గొప్ప దండయాత్ర చేశారు. చదువుకొన్న ప్రతి పండిత దిగ్గజం ఆ దండయాత్రలో వేదం వారికి సైనికుడయింది. ఒకవిధంగా వారందరితో పంతులుగారు ఒంటరి పోరాటమే చేశారు. ఆ విధంగా వేదం వారి శిబిరంలో చేరిన సైనికులలో మహాకవి దాసుశ్రీరాములు గారు ఒకరు.

క్రీ.శ. 1879 నుండి వేదంవారు పంతులు గారిపై మరీదూకుడుగా వచ్చారు. వితంతు వివాహాలు శాస్త్ర సమ్మతం కావని మధ్యయుగంలో పుట్టిన న్యాయధర్మ శాస్త్రాలను చూపిస్తూ పంతులుగారి భావాలపై తీవ్రంగా దాడిచేశారు. 1883లో

'వితంతూద్వాహ దుర్వాద నిర్వాపణము' – అన్న గ్రంథం వ్రాసి పంతులుగారిని ఉక్కిరిబిక్కిరి చేశారు. ఇది ఆయనకు అంతులేని ఖ్యాతిని తెచ్చిపెట్టింది. మద్రాసు మహాశయులమైత్రి కల్గించింది. క్రైస్తవ కళాశాల (మద్రాసు)లో ఉద్యోగం ఇప్పించింది. దాసుశ్రీరాములు, ఆదిభట్ల నారాయణదాసు, కొక్కొండ వేంకటరత్నం పంతులు వంటి హేమాహేమీల ఆమోదం లభించింది.

ఎందరో వితంతువుల జీవితాలలో దీపం వెలిగించినందుకు ఆగ్రహించిన ఆనాటి సనాతనులు పంతులుగారిని – తెగించిన వాడికి తెడ్డే లింగం – విధవముండకు వీరేశలింగం – అని ఈసడించారు. గోదావరి మండలంలో ఈ సామెతను బాగా వ్యాప్తికి తెచ్చారు. ఆదిభట్ల నారాయణ దాసు వంటివారు పంతులుగారిని పేరుపెట్టిపిలువడానికి కూడ ఇష్టపడలేదు. ఎక్కడైనా ఆయనను ప్రస్తావించవలసి వస్తే 'విచిత్ర వివాహకర్త' అని మాత్రమే సంబోధించేవారు. అంతగా ఆనాటి సమాజం పంతులుగారిని వెలివేసింది. అయినా ఆయన చలించలేదు.

వేదం వారి వ్యాసాలకు, ఉపన్యాసాలకు ప్రభావితులై దాసుశ్రీరాములు గారు 1880 లో 'అనల్ప జల్పితా కల్ప కల్పవల్లి' (అద్భుతమైన మాటలయొక్క అలంకారాలకు, లేదా వైభవాలకు కల్పవృక్షం వంటిది అంటే అద్భుతమైన విషయాలకు నెలవు అనిఅర్థం) పత్రికను స్థాపించారు. చర్చ మూడు పద్ధతులలో నడుస్తుంది అవి – వాదము, జల్పము, వితండము. ఇద్దరి మధ్య సత్యాన్వేషణ కోసం చేసే చర్చ వాదము. మనస్సులో ఒకనిశ్చితమైన అభిప్రాయం పెట్టుకొని ఎదుటి వాదాన్ని ఖండించేది జల్పము. ఏ అభిప్రాయమూ లేకుండా ఎదుటివారు మట్టి అంటే బంగారమని, బంగారమంటే మట్టిఅని వాదించేది వితండము. శ్రీరాములు గారి పత్రిక జల్పమును పోలినది.

ఆ పత్రికలో శ్రీరాములు గారు వితంతు వివాహాలు, స్త్రీ చైతన్యం దేశానికి అరిష్టమన్నారు. అప్పయ్య దీక్షితులు అంతటిపండితుడు తన కూతురుకు వైధవ్యం, ప్రాప్తిస్తే, ఏ రకంగానూ వితంతు వివాహం శాస్త్ర సమ్మతం కాదని బలంగా కన్పిస్తున్నందున, తన పాండిత్య ప్రకర్షతో ఎందరినో ఓడించినప్పటికి, కూతురు వైధవ్యాన్ని మౌనంగా భరించాడే కాని మళ్లీ పెండ్లి చెయ్యలేదని దృష్టాంతం చూపించారు. ఈ పత్రిక వేదం వారికి మరింత ఊపునిచ్చింది.

దాసుశ్రీరాములు గారు మహాకవిపండితుడు మాత్రమే కాదు, గొప్పసంగీత విద్వాంసుడు, వాగ్గేయకారుడు కూడా. ఆయన ఎన్నో పదాలు, జావళీలు, స్వర జతులు, యక్షగానాలు వ్రాసారు. ఆ కృతులను వేశ్యలు అభినయిస్తూ పాడేవారు. అవి ఆంధ్రదేశపు సరిహద్దులు కూడా దాటాయి. ఒరిస్సాలోని బరంపురంలోని నట్టువ కత్తెలు కూడ వాటిని అభినయించేవారు. ఆయనకు నాట్యంలో కూడా చక్కని ప్రవేశం ఉంది. స్వయంగా ముద్రలు పట్టి చేసేవారు. అభినయ దర్పణమనే నాట్యశాస్త్ర గ్రంథం కూడా వ్రాసారు. ఆనాటి ప్రసిద్ధ నాట్య విదుషీమణులు చెదలవాడ రాజారత్నం, పినపాల భవాని మొదలైన వారు ఆయనముందు నాట్యంచేసి తమ తప్పులు దిద్దుకొనేవారు. ఆయన ఎంత మహాకవియో అంతటి సంపన్నుడు. ఎంత సంపన్నుడో అంతగొప్పదాత, కవి పోషకుడు. ఆదిభట్ల నారాయణ దాసు, తిరుపతి వేంకట కవులు, పరిమి శివయ్య శాస్త్రులు, అనంత శయనం వంటి కవులు, కళాకారులను ఆయన ఘనంగా సన్మానించారు.

'అనల్ప జల్పితాకల్ప కల్పవల్లి' పత్రిక స్థాపించిన సంవత్సరానికి అంటే 3.5.1881 శ్రీరాములు గారికి ఒక పాప పుట్టింది. ఆ కడగొట్టు బిడ్డకు శారదాంబ అన్నపేరు పెట్టుకొన్నారు. శ్రీరాములు గారు కమ్మని గొంతుతో పాటలు పాడేవారు. 'శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః' – అన్నట్లుగా ఆ పాటలకు ఆ పసికూన బోసినవ్వులతో ఆదమరచిపోయేది. తానూ పాడాలని ప్రయత్నించేది. నాలుగేండ్లు వచ్చేసరికి ముద్దుముద్దుగా పాడసాగింది. బుడిబుడి నడకలతో, ముద్దు ముద్దు మాటలతో పాటలతో తన చిట్టితల్లి కంటిముందు నడయాడుతూ ఉంటే అంతగొప్ప ఆ వాగ్గేయ కారుడు మురిసిపోయేవాడు. మైమరచిపోయేవారు. తనప్రతిభకు వారసురాలనుకొన్నారు. ఆ ప్రతిభను మొగ్గలోనే త్రుంచివేయడం మహాపాపమని తోచింది. అంతవరకు పత్రికలో హెూరాహెూరీగా పోరాడిన పంతులుగారి ఉద్యమ ప్రభాత కాంతులు బాల శారదమ్మ గీతాలలో శ్రీరాములుగారి హృదయ వనాన్ని వికసింపచేసాయి. అంతే! పంతులు గారికి విధేయులయ్యారు. ఇలా ప్రస్తుతించారు.

**ఉ. ఈశ్వర భక్తి యుక్తుని క్షితీశ్వర మాన్యుఁ బరోపకారి తా**
**శాశ్వత కీర్తిఁ గామముఖ శత్రువిజేత వివేకవర్ధనా**
**ర్థ శ్వసనోపయోగమతి రాయబహద్దరు కందుకూరి వీ**
**రేశ్వరు మంత్రిపుంగవు గవీంద్రు మదింగొనియాడఁ జెల్లదే.**

వేదం వారి శిబిరం నుండి బయటపడ్డారు. ప్రాచీన న్యాయ, ధర్మశాస్త్రాలను హృదయ వైశాల్యంతో నిశితంగా అధ్యయనం చేసారు. విశ్వవార, అపాల, ఘోష, లోపాముద్ర, శశ్వతి వంటి స్త్రీల పేర్లతో ఋగ్వేదంలో ఉన్న సూక్తాలకు ఆ మానవాంగనలే రచయిత్రులని గుర్తించారు. ఈ విస్తృత అధ్యయనంలో విద్య, వితంతు వివాహాలు శాస్త్ర సమ్మతమనుటకు సమాధానం దొరికింది. పంతులుగారి ఉద్యమాన్ని సమర్థిస్తూ ఉపన్యాసాలు చెప్పడం ప్రారంభించారు. తన ముద్దుల పట్టి శారదమ్మను సంగీత సాహిత్యాలలో విదుషీమణిని చేయాలని నిర్ణయించుకొన్నారు.

ఆనాడు సంగీత నాట్యాలు వేశ్యా విద్యలుగా పరిగణింపబడేవి. వాటిని నేర్చుకొన్న కులస్త్రీలను ఆనాటి సమాజం బజారు మనుషులుగా చూసింది. సభలకు వచ్చే స్త్రీలను కూడా అలాగే చూసింది. స్త్రీలు చదువుకున్నా, సభలకు వచ్చినా చెడిపోతారని, విశృంఖలవుతారని ఒక మూఢ నమ్మకం ఉండేది. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' – వంటి ప్రక్షిప్తాలను మనుధర్మ శాస్త్రంలో చేర్చి మనధర్మశాస్త్రాలకు, సమాజానికి మచ్చతెచ్చారు.

తానునమ్మిన సిద్ధాంతాన్ని అక్షరాల ఆచరించి చూపే తత్త్వం శ్రీరాములు గారిది. స్త్రీ సభాప్రవేశాన్ని ఆయన సమర్థించారు. 1899 'మే'లో ఏలూరులో కందుకూరి వీరేశలింగం పంతులు గారి అధ్యక్షతన సాంఘిక చైతన్య సభలు జరిగాయి. ఆ సభలకు శ్రీరాములుగారిని ఉపన్యాసకులుగా పంతులుగారు ఆహ్వానించారు. శ్రీరాములుగారు తమ భార్య జానకమ్మగారితో సహా వచ్చారు. అది సనాతనులకు కంటగింపయింది. కాని పంతులుగారు శ్రీరాములుగారిని మనస్పూర్తిగా అభినందించారు. ఆయనలోని సంస్కరణ భావాలను ప్రత్యేకంగా ప్రస్తావించి ఆలింగనం చేసికొన్నారు. విశేషంగా బహూకరించారు. ఈ 1899 సం॥ పూర్వార్థం ఆయన ఎంత ఆనందాన్ని అనుగ్రహించిందో ఆ ఉత్తరార్థం అంత దుఃఖాన్ని మిగిల్చింది. దానిని తర్వాత ప్రస్తావిస్తాను.

సంగీత సాహిత్య కళా నిష్ణాతులను బజారుమనుషులగా భావించే ఆకాలంలో శ్రీరాములు గారు ఆ సమాజాన్ని త్రోసిరాజని తన కూతురు శారదాదేవికి అమరకోశం నేర్పాడు. రఘువంశ, కుమారసంభవాలు, పంచ కావ్యాలలోని కొన్ని సర్గలు తామే చదువు చెప్పారు. సంస్కృతాంధ్ర ప్రాకృతాలలో ఆమెను విదుషిని చేసారు. స్వీయ అధ్యయనానికి పునాదులు వేసారు. ఆమె ఏకసంథాగ్రాహి.

శ్రీరాములు గారు కూడా ఏకసంథాగ్రాహియే. తన చిన్నతనంలో అంటే 1858 లో నూజివీడు సంస్థానంలో నవరాత్రి ఉత్సవాలు జరిగాయి. అందులో భాగంగా పండిత పరీక్షలు జరిగాయి. ఆ సంస్థాన ఆస్థానకవి మాడభూషి వేంకటాచార్యులు దానికి అధ్యక్షులు. ఆయన ఏకసంథాగ్రాహి, మహాకవి, మహావిద్వాంసులు. మనకు లభిస్తున్న తొలిశతావధానం ఆయనదే. ఆయన ఒరవడే తరువాతి అవధానాలకు ఒజ్జబంతి. ఆయన అపర పండితరాయలు. ఆయన చరిత్రను 'వల్లవీ పల్లవోల్లాస కావ్య' పీఠికలో వివరంగా వ్రాసాను. ఆ పరీక్షలో బాల శ్రీరాములుగారు మహామహా విద్వాంసుల మధ్య ప్రథమునిగా నెగ్గారు. అప్పుడు ఆయన వయస్సు 12 ఏండ్లు. ఆ ప్రతిభకు ఆ తొలిశతావధాని అప్రతిభులయ్యారు. వెంటనే ఆశువుగా

**మ. పది రెండేడుల యీడునం గవితఁ జెప్పంబూని వ్యస్తాక్షరీ**
**విదళిఖ్యాతిఁ బొసంగి లేఖకశత వ్రీడాకరంబైన మే**
**రఁదుదిన్ బద్యములల్లి సద్గణిత హోరాశాస్త్ర సామర్థ్యముల్**
**వెదజల్లందగు దాసు రామకవితాలీలాబ్ధి నోలాడితిన్.**

– అన్నపద్యం చెప్పి ఆలింగనం చేసికొన్నారు. బహుధా బహూకరించారు. ఆ ప్రౌఢ కవికి, ఈ బాలకవికి స్నేహం కుదిరింది. ఆ మహామహుని వద్ద శ్రీరాములు తన సంస్కృత, ప్రాకృత భాషాజ్ఞానానికి మెరుగు పెట్టుకొన్నారు. ఆ విద్యనంతా తన బుజ్జి పాపకు ధారపోశారు. మున్ముమ్మూర్తులా తండ్రి రూపాన్నే కాక ఆయన మేథనుకూడా వారసత్వంగా పొందిన శారదమ్మ తన 5 వ ఏడునుండి 8 వ ఏడు వరకు తండ్రి వద్దనే సాహిత్యాన్ని అధ్యయనం చేసింది. 'సంగీత మపి సాహిత్యం సరస్వత్యా స్తనద్వయమ్' – అన్న న్యాయాన్ననుసరించి శ్రీరాములుగారు తమ బిడ్డకు సంగీతం కూడా నేర్పించాలని తలపోసారు. అంతే ఆ నాటి సంగీత సార్వభౌములు ఈమని వేంకటరత్నంగారిని, కొండూరు నరసింహాచార్యులను వారివారి కుటుంబాలతో సహా రప్పించి, వారిని తమ ఇంట్లో పెట్టుకొని పోషిస్తూ సంవత్సరం పాటు కూతురుకు సంగీతం నేర్పించారు. 9 వ ఏట బాల శారద వీణలో మంచి వైదుష్యాన్ని సంపాదించింది. ఆ తర్వాత రెండేండ్లకు మైసూరు, బెంగుళూరు, మద్రాసు ప్రాంతాలలో బ్రహ్మాండమైన కచేరీలు చేసింది. అపరశారదగా కొనియాడబడింది. సనాతనులు అభిశంసించారు. సంస్కర్తలు అభినందించారు.

తన ఉద్యమానికి కొండంత బలాన్ని ఇస్తున్న శ్రీరాములుగారి ఆచరణను పంతులుగారు ప్రశంసించారు. బాలశారదను ఆశీర్వదించారు.

ఆ రోజులలో రాజమండ్రిలో భక్త చింతామణి శతక కర్త వసురాయకవి గారింట్లో సాహిత్య సమావేశాలు జరిగేవి. అందులో శ్రీరాములుగారి మాట శిరోధార్యంగా ఉండేది. అక్కడ కూడ ఆయన స్త్రీ విద్య, స్త్రీ చైతన్యం, వితంతు పునర్వివాహాలు గురించే మాట్లాడేవారు. అది వసు రాయకవిగారికి కొంత ఇబ్బందిగా ఉండేది. అయినా ఆయన బయటపడేవారుకాదు. ఆయన వేదం వారిని సమర్థించేవారైనప్పటికీ శ్రీరాములుగారికి ఎవ్వరు ఎదురు చెప్పేవారు కాదు.

వేదం వారు, అతని అనుచరులు శ్రీరాములుగారికి ప్రత్యర్థులయ్యారు. సనాతనులు శ్రీరాములు గారి కుటుంబాన్ని దూరంగా పెట్టారు. ఇవేవీ ఆయన ఆత్మస్థైర్యాన్ని దూరం చేయలేకపోయాయి. ఆయన గొప్ప న్యాయవాది. సమాజంలో ఆయనకు మంచి పలుకుబడి ఉంది. సహజంగానే వివేకప్రౌఢి కలవాడు కావడంతో సభలలో వాదాలలో ఆయన మాట ప్రమాణంగా ఉండేది. పైగా ఆయన సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల, ప్రాకృత, పార్శీ మొదలైన భాషలలో నిష్ణాతులై ఆయాభాషలలోని మహాగ్రంథాలను కరతలామలకం చేసికోవడంతో ఆయన నిర్ణయాలు కార్యకారణ సంబంధం కలిగి సహేతుకంగా ఉండేవి.

ఆయన మొదట్లో ఉపాధ్యాయునిగా పనిచేసినా వివిధ రంగాలలో ఉన్నతవిద్యను స్వయం కృషితోనే అభ్యసించారు. ప్రబంధాలు, పురాణాలు, నాటకాలు, శతకాలు, ధర్మశాస్త్ర గ్రంథాలు, కృతులు, జావళీలు, వాదాలు, యక్షగానాలు మొదలైన సాహిత్యప్రక్రియలలో దాదాపు 40 కి పైగా గ్రంథాలు వ్రాసారు. ఆయన మహాకవి, అవధాని, వాగ్గేయ కారుడు, ఉపన్యాసకుడు, విమర్శకుడు, న్యాయవాది, ఉత్తమ ఉపాధ్యాయుడు, సంఘసంస్కర్త, పత్రికా సంపాదకుడు, ధర్మశాస్త్రవేత్త, జ్యోతిష్య శాస్త్ర కోవిదుడు, దేశభక్తుడును. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కీర్తి చంద్రికకు 'దేవీభాగవతం' ఒక శారదరాత్రి.

ఆయన తన వ్యంగ్య హాస్యరచనల ద్వారా సమాజంలో మార్పు తీసుకొని రావాలని అభిలషించారు. నాటి సమాజంలోని కులాలలో ఉన్న వేషభాషలు, ఆచార వ్యవహారాలను వ్యంగ్యంగా వర్ణిస్తూ 'తెలుగునాడు' అన్న కావ్యం వ్రాసారు. ఇది

శ్రీనాథుని క్రీడాభిరామమును బోలినది. ఆనాటి బ్రాహ్మణ సమాజాన్ని వ్యంగ్యంగా అభిశంసించింది. రసజ్ఞులు దీనిని ఆంధ్రవీధి – అనిముద్దుగా పిలుచుకొంటారు. ఇందలి చాలాపద్యాలు రసజ్ఞుల నోళ్లలో ఇప్పటికీ నర్తిస్తున్నాయి. అందలి క్రింది పద్యాన్ని చూడండి.

శా. **అస్పే చూస్పి పషే వొషే చెవుడషే అష్టాగషే యేమిషే**
**విస్పావర్ముల వారి బుఱ్ఱినష యావిస్పాయ కిస్పారుషే**
**విస్సంచెంతటివాడె యేళ్లు పదిషే వెయ్యేళ్ల కీదేషమా**
**ఒస్సే బుఱ్ఱికి యీడషే వొయిషుకేముంచుందిలే మంచివొ**
**ర్సెస్సేయుందురు శ్రోత్రియోత్తమ పదస్త్రీలాంధ్ర దేశంబునన్.** 16వ పద్యం

ఇది శ్రోత్రియ స్త్రీలు ష కార యాసతో మాట్లాడే విధానంపై మెత్తని ఎత్తిపొడుపు, బాల్యవివాహాలపై హేళన.

ఉ. **లేవరు 'లెందు లెంద'నిన లేచిన వారయినన్ దటాలునం**
**బోవరు, పోవుచున్ నిలిచి పోదుము పోదుము త్రోయ కుండటం**
**చీవరునందు గేస్తునలయింతురు పెండిలిలో సదస్య సం**
**భావననాఁడు చూడవలె బాపన సాములు సాములన్నియున్.** 10వ పద్యం.

పెండ్లిళ్లలో 'బాపన సాముల సాములను' వ్యంగ్యంగా కళ్లకు కట్టినట్లు చూపించిన ఈ పద్యాన్ని చదివి శిరఃకంపముచేసి చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు – 'కుమాళ్ల పెళ్లిళ్ల సదస్యంలో అనుభూతమైన విషయాన్ని ఈ పద్యంలో చక్కగా చిత్రించారు కవిగారు. ఎందరు కవులు సదస్యాలు (చేయకపోయినా) చూసి ఉందరు? ఒక్కరేనా యిట్టి పద్యాన్ని వ్రాయగలిగినారా? దీన్ని బట్టే నేను ఈయన్ని అపర శ్రీనాథుడుగా భావిస్తాను' – అన్నారు.

రస నికషోపలాలైన ఈ పద్యాలు నాటి బ్రాహ్మణ సమాజానికి దర్పణాలు. ఆ సమాజంలో మార్పులు రావాలని ఆయన బలంగా కోరుకొన్నారు. 'ఆంధ్రవీధి' అనబడే ఈ 'తెలుగునాడు' తర్వాతి భాగాలు కూడ రాసి ఉంటే అవి గురజాడవారి కన్యాశుల్కాన్ని మించిపోయేవి. ఒకసారి విశ్వనాథ సత్యనారాయణ గారు అబ్బూరి వరదరాజేశ్వరరావుతో దాసు శ్రీరాములుగారి గురించి మాట్లాడుతూ – 'ఆయన చేతిలో పద్యం నలిగినట్లు మరెవ్వరి దగ్గరా నలగలేదు. మీ నాన్న గురజాడ అప్పారావు

గారి గురించి రాసారు గాని శ్రీరాములు గారి గురించి ఒక్కముక్కా రాయలేదు. ఏదో పొరపాటు జరిగిఉంటుంది. వీను శ్రీరాములు, అప్పారావు తెలుగు సంసారాన్ని కూలంకషంగా పరిశీలించారు. దురదృష్టవశాత్తు శ్రీరాములు ఆంధ్రవీధి రెండవభాగం రాయలేదు. రాస్తే కన్యాశుల్కం, తెలుగునాడు చిరస్థాయిగా ఉండవలసిన రచనలు. అవి సమకాలీనం కూడ" – అన్నారు.

గురజాడ అప్పారావు – 'సొంతలాభం కొంత మానుక, పొరుగు వాడికి తోడుపడవోయ్, దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అని ముత్యాల సరాలలో గొంతెత్తక ముందే దాసు శ్రీరాములు గారు –

సీ. **పొరుగు వారికి మేలు పొందరాదంటివా**
**ఇరుగు వారికి నీవు పొరుగువాడు**
**ఇరుగువారికి మేలు హెచ్చరాదంటివా**
**పొరుగువారికి నీవు ఇరుగువాడు**
**ఇరుగు బొరుగున మేలెనయరాదంటివా**
**యిరుగు బొర్గునకీవ యిరుగు బొరుగు**
**ఇరుగు బొరుగు నీవు నెనయరాదంటివా**
**ఇంకనెవ్వరికి మేలెనయ వచ్చు.**

గీ. **ఎల్లరకు మేలు గోరుట చెల్లుగాని**
**తనకు మేల్పరలకు గీడు దలపరాదు**
**అనిపలుకు దాసురాముడిడ్డచ్చ తెనుగు**
**కబ్బమందమునిండ జక్కట్లదండ.**

– అని ఉద్ఘాటించారు. ఇటువంటి మేల్తరమైన ఆయన అభ్యుదయ భావాలకు అక్షరాలా వారసురాలు శారదాదేవి. ఆమెను ముద్దుగా శేషమాంబ అని పిల్చుకొనేవారు. అది ఆయన నాయనమ్మ పేరు. పదవ ఏట నుండి బాల శారద పద్యసాధన ప్రారంభించారు. 14వ ఏట 'మాధవ శతకం' వ్రాసారు. తొలికృతిలోనే ఆమె ప్రకృతి, సాహిత్యాకృతి విశాలంగా ద్యోతకమయ్యాయి. స్త్రీ విద్య, చైతన్యం, గురించి, ఆమె ఎలుగెత్తి చాటారు. ఆ పద్యాలుగేళ్ల బాలిక పెద్ద ఆరిందిలా చెప్పిన ఈ పద్యాలు విస్మయం కల్గిస్తాయి. స్త్రీలకు సహజంగా నగలపై మోజు. ఈ పద్యాన్ని

చూస్తే ఆ ప్రభావం నుండి శారదాంబగారు కూడా బయటపడలేదేమోనని అనిపిస్తుంది. కాని ఆమెకు నగలపట్ల అలంకారం పట్ల అంత మోజులేదు.

మ. **తలదువ్వంగను నొక్కగంట మరిపెట్టన్ సొమ్ములం గంట చీ**
**రెల గట్టంగను బొట్టుపెట్టనగు నీరెండుం దగన్ గంట యీ**
**యిలలోనెందరు స్త్రీలు తీరుబడిగా నీలీల గావింతు రిం**
**దులలో గొంచెము సేపు విద్య కొరకు జూపట్టదే మాధవా !** (68దవ)

అద్దానికి ఆడపిల్లకు చాలా దగ్గరి చుట్టరికం ఉంది. దాని ఎదురుగా కూర్చుని, గంటసేపు తలదువ్వుకొంటారు. గంటసేపు నగలు పెట్టుకుంటారు. ఒక పట్టాన దేనినీ నచ్చరు కదా ! చీరకొకగంట బొట్టుకొక గంట అంటూ కాలాన్ని విచ్చలవిడిగా ఖర్చుచేస్తారు. చదువుకొనడానికి ఒక గంటన్నా కేటాయిస్తే బాగుండేది కదా అని ఆమె పెదవి విరుపు.

చ. **చదువనివార లా చదువు చాలని వారి వివాహమైనచో**
**నది సరియౌనుగాని జడివినట్టి వివేకులు జ్ఞానశూన్యయౌ**
**మదవతిఁ బెండ్లియాడ నొకబండికి గుఱ్ఱము దున్నఁగట్టగా**
**నొదవిన యెట్టులుండు నటులొప్పుచునుండును గాదె మాధవా.** (47 దవ)

చదువుకోని వారు చదువుకోని వాళ్లను పెండ్లి చేసికొంటే పర్వాలేదు. ఎందుకంటే దొందూ దొందే. కాని ఒక చదువుకొన్నవాడు చదువులేని మొద్దును చేసికొంటే – ఒక బండికి గుఱ్ఱాన్ని, దున్నను కట్టి నడిపినట్లుంటుందిం. వారి సంసారం – అని శారదగారు మెత్తమెత్తని చురకలు వేసారు. 'తెలుగునాడు' శ్రీరాములు గారు ఆనాటి బ్రాహ్మణ సమాజాన్ని ఎలా ఎండగట్టారో, ఈ శతకంలో శారదాంబగారు స్త్రీల బలహీనతలను అలా ఎండగడుతూనే స్త్రీ విద్యావశ్యకతను ఇంచుమించు ప్రతిపద్యంలోను ఎలుగెత్తి చాటారు. ఆనాటి స్త్రీల దుర్భర స్థితులను కూడ కళ్లకు కట్టినట్లు చూపించారు. వాళ్లకు చదువుకొనే బుద్ధిపుట్టించమని మాధవుడిని వేడుకొన్నారు. పురాణేతిహాసాలలో చరిత్రలలో కన్పించని స్త్రీ వివక్ష ఈ కాలంలో ఎందుకు చూపిస్తున్నారని ఆ మాధవుడిని నిలదీసారు. 1895 లోనే స్త్రీ అవిద్య, వివక్షల గురించి ఆమె ఇంత ఆక్రోశించినా ఈ 21 వ శతాబ్దంలోకూడ ఈ స్థితిలింతా మారలేదు. 2014లో నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, 17 సం॥ల

బాలిక మలాల చదువుకొనేటప్పుడు తాను అనుభవించిన స్త్రీ వివక్షను, అవమానాలను ప్రస్తావిస్తూ తనను చదివించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సాంకేతిక యుగంలో కూడా స్త్రీ వివక్షపట్ల ఆమె ఆవేదన చెందారు.

మాధవ శతకంలోని స్త్రీవిద్య, సంస్కారాలు కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారికి ముచ్చట గొలిపాయి. ఆయన సనాతన భావజాలములోని వాడైనా తన కూతురు విశాలాక్షిని చదివించి, కవయిత్రిని చేసారు. తన కళావతి పత్రికలో మాధవశతకాన్ని సీరియల్‌గా వేశారు. ఆనాటి అభ్యుదయ వాదులు, పండితులు ఆ బాలిక వైదుష్యానికి విస్తుపోయారు. ఆమె భావిని గూర్చి గొప్పలు తలపోసారు. ఆమె అప్పుడప్పుడు వ్రాసిన పద్యాలు, వ్యాసాలు, పాటలు ఆనాటి పత్రికలు జనానా, జ్ఞానోదయం –లలో అచ్చయ్యాయి. కవయిత్రిగా, వైణికురాలిగా ఆమె పేరు ప్రతిష్ఠలు దేశంలో ఖ్యాతికెక్కాయి. తండ్రికి తగ్గ తనయ అని లోకం కొనియాడింది.

అయితే అంతకుముందే అంటే 1888 లో శ్రీరాములుగారి కీర్తిప్రతిష్ఠలు విని వారితో వియ్యమందాలని వేమూరి రామన్న, నాగమ్మగార్లు, ఉత్సాహపడ్డారు. రామన్న గారు గుంటూరు జిల్లాలోని బాపట్ల తాలుకాకు తహసీల్దారు. వారిది బాగా కలిగిన కుటుంబం. అప్పుడు శారదాదేవి వయస్సు 8 ఏండ్లు. అది బాల్యవివాహమవుతుంది. శ్రీరాములుగారు అంగీకరించలేదు. బంధుమిత్రులచేత గట్టిగా చెప్పించారు. పెళ్లిచేసినా కాపురానికి ఇప్పుడే పంపమని, యుక్త వయసు వచ్చాకే పంపుతామన్న షరతుమీద శ్రీరాములుగారు అంగీకరించారు. వీరేశలింగం పంతులు గారు వారించారు. కాని అప్పటికే నిర్ణయాలు చెయ్యిదాటిపోయాయి. రామన్న దంపతుల రెండవ కుమారుడు రామచంద్రరావు గారితో శారద వివాహం శాస్త్రోక్తంగా ఘనంగా జరిగింది. పండితులందరూ ఆశీర్వదించారు. పంతులుగారు మాత్రం రాలేదు.

రజస్వలానంతరం 1895లో వియ్యంకుల పట్టుదల వలన శారదాదేవి కాపురానికి వెళ్లారు. అక్కడ వారిదే పైచేయి అయింది. భర్త వేమూరి రామచంద్రరావుగారికి ఉద్యోగం మద్రాసులో కావడంతో భార్యాభర్తలు అక్కడ ట్రిప్లికేన్‌లో కాపురం పెట్టారు. అప్పటికే ఆమె సంగీత సాహిత్యవిదుషీమణిగా ఖ్యాతికెక్కారు. అత్తమామల కది నచ్చలేదు. అందరూ కలసి ఆమె వీణను

అటకెక్కించారు. తాను స్త్రీలకు ఏ స్వేచ్ఛ కావాలని మాధవశతకంలో ఆక్రోశించిందో అదే ఇప్పుడు ఆమెకు కరువయింది. అత్తింటి ఆరళ్లు అధికమయ్యాయి. అయినా ఆమె తన కుటుంబాన్ని అమితంగా ప్రేమించింది. 1897లో ట్రిప్లికేన్‌లో పార్థసారథి మందిరంలో కూర్చుని 'నాగ్నజితీపరిణయ' ప్రబంధం వ్రాసింది. అప్పటికి ఆమె నిండుగర్భిణి. 1896లో ఒక పాప పుట్టింది. ఆమె పేరు దుర్గాంబ. ఆ పాపను చూసుకొంటూ భాగవతం పారాయణం చేస్తూ రోజులు భారంగా వెళ్లదీస్తూ ఉండేది. 1899 లో ఆమె ద్వితీయ గర్భం దాల్చింది.

1899 పూర్వార్థం దాసుశ్రీరాములుగారికి మహదానందాన్ని మిగిల్చితే ఉత్తరార్థం దుర్భర విషాదాన్ని మిగిల్చిందని ఇంతకుముందు ప్రస్తావించాను. ఆవిషాదం ఏమిటంటే – 1899 సెప్టెంబరు ప్రాంతంలో నైజాం ప్రాంతంలో వరంగల్ దగ్గర మతపరమైన ఆచారవ్యవహారాల గురించి పెద్ద పెద్ద వివాదాలు వచ్చాయి. శాస్త్రపరంగా వాటిని సమన్వయించి తీర్పు చెప్పగల ధర్మశాస్త్ర పారంగతుని కోసం అక్కడిపండితులు ఎందరినో విచారించారు. దేశం నలుమూలల నుండి శ్రీరాములుగారే అందుకు సమర్థులని సమాధానం వచ్చింది. వారి ఆహ్వానం మేరకు శ్రీరాములుగారు దాదాపు నాల్గు నెలలపాటు వరంగల్లు ప్రాంతంలో ఉండవలసి వచ్చింది. శాస్త్ర సమ్మతమైన వారి వివాదాన్ని పరిష్కరించడానికి ఆయన ఎంతో శ్రమించారు. ఆయన సమన్వయాలను అక్కడి పండితపరిషత్తులు తృప్తిగా తలలూపాయి. ఆయనను ఘనంగా సత్కరించాయి. ఆయన అక్కడ ఉన్నప్పుడే నెలలు నిండిన శారదను కాన్పుకోసం అత్తమామలు పుట్టింటికి పంపించారు. సత్కారాలు అందుకొని శ్రీరాములుగారు కూతురును చూసుకోవడానికి సొంతూరుకు బయలుదేరారు. ఆయన ఇల్లు చేరుకోకముందే అంటే 1899 డిసెంబరు 26వ తేదీన శారదాంబ దుర్భరమైన ప్రసవవేదనను అనుభవిస్తూ మగబిడ్డను ప్రసవించి, తండ్రి కడచూపుకు కూడనోచుకోకుండా దయనీయంగా కన్నుమూసింది. దాంతో శ్రీరాములుగారు హతాశులయ్యారు. ఆ మహావిజ్ఞాన ఖనికి లోకమంతా దుః ఖమయంగా తోచింది. నైరాశ్యం ఆవరించింది. చాలా కాలంపాటు ఆ దిగులు నుండి ఆయన తేరుకోలేకపోయారు.

ఆ అయోధ్యరామయ్యకు కూతురు ఉందోలేదోకాని దాసుశ్రీరామయ్య కూతురు గురించి మాత్రం నాటి అభ్యుదయ వాదులు ఎన్నో కలలు కన్నారు. అపర శారద

కావలసిన శారదాంబ కీర్తిశేషురాలు శారదాంబ కావడం దురదృష్టకరమని కందుకూరి వీరేశలింగం పంతులుగారు శ్రీరాములును ఓదార్చారు. ఆ తర్వాత కొంతకాలానికి ఆయన భార్యప్రోద్బలంతో, దైవ ప్రేరణతో 1900 సం॥లో దేవీభాగవత పురాణాన్ని 7800 పద్యగద్యాలలో తెనిగించారు.[1] 1907లో అది అచ్చయింది. ఇందులో తన గారాల పట్టి శారదాంబ కోసం కార్చిన కన్నీళ్లు వెచ్చగా ఒక సీసపద్యంలో ఇలా ఘనీభవించాయి.

**సీ.** **తన తొమ్మిదవయేట ననుపమానప్రజ్ఞ**
**నింపుగావీణ వాయింపనేర్చి**
**తన పదియవయేట సునిశితంబగు బుద్ధి**
**దా కొల్పె నేకసంథగ్రహణము**
**తన చతుర్దశ శరత్తున ముద్దుముద్దుగా**
**నల్లిబిల్లిగ ఁ బద్యమల్లనేర్చి**
**తనదు పదార్వ వత్సరమున నగ్నజి**
**జ్జా వివాహప్రబంధంబు సెప్పె**
**గీ.** **తనదు పందొమ్మిదవ వర్షమునను మర్త్య**
**భావమును మాని శాశ్వత బ్రహ్మలోక**
**సిద్ధిఁగనె శారదాంబ నా చిన్ని కూతు**
**ననుదినంబును మఱువక యాత్మనుంతు.** దేవీ భాగవతం, పుట 3

తన సంగీత సాహిత్యాలకు, అభ్యుదయ భావాలకు తన బిడ్డ వారసురాలవుతుందని ఆయన గంపెడాస పెట్టుకొన్నారు. ఆమె తుదిశ్వాసతో అవన్నీ అడియాసలయ్యాయి. 1901 లో కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు శ్రీరాములుగారిని

[1] ఇదిలా ఉంటే – గోరుచుట్టు మీద రోకటి పోటులా శ్రీరాములుగారి రెండవకొడుకు నారాయణరావు 1905 సెప్టెంబరులో విషజ్వరంతో మరణించారు. శ్రీరాములు గారికిది అశనిపాతమయింది. నారాయణరావుగారు మంచికవి, నాటకకర్త. ఆర్నాల్డ్ దొరగారి "దలైట్ ఆఫ్ ఏషియా" ననుసరించి "సంగీత రసతరంగిణి" అన్న పేరుతో 'బుద్ధనాటకం' వ్రాసారు. 3వ అంకం సగం వ్రాసి ఆయన గతించారు. మిగిలిన 4 అంకాలను శ్రీరాములు గారు పూరించారు. 1907లో ప్రకటించారు. ఆంధ్ర సాహిత్యంలో తండ్రీకొడుకులు కలసివ్రాసిన తొలికృతి ఇదే కావచ్చును.

కలిసారు. మాటల మధ్యలో శారదాంబ ప్రస్తావన రావడంతో ఆమె స్మృతిపట్ల తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె రచనలు ప్రచురిస్తామని చెప్పారు. తన కలావతి పత్రికలో మాధవశతకం ప్రచురించారు. ఆ తర్వాత సంవత్సరం శ్రీపాదవారో, మరెవ్వరో నాగ్నజితీ పరిణయాన్ని కూడ ప్రచురించారు.

**సాహిత్యంలో నాగ్నజితి :** శ్రీకృష్ణులవారి అష్టమహిషులలో రుక్మిణీ, సత్యభామలకే పలుకుబడి ఎక్కువ. మిగతా రాణులకు సాహిత్యంలో కూడ అంత ప్రసిద్ధిలేదు. కానీ క్షీణయుగం మాత్రం అష్టమహిషుల కళ్యాణ తోరణాలతో వసంతాలాడింది. అందుకు పౌరోహిత్యం వహించిన కవులు పాతబడిన కవిసమయాలతో కొత్తపెండ్లి మండపాలు కట్టారు. అవన్నీ రసజ్ఞులను అలరించలేక పోయాయి. అందువల్ల నాగ్నజితి వివాహసాహిత్యం కొంచెమే లభించింది. లభించినంతవరకు ప్రస్తావిస్తాను.

1. సుదంతా పరిణయము – రాజవోలు సుబ్బారాయకవి (17వ శతాబ్దం ఉత్తరార్థం)
2. నాగ్నజితీ పరిణయము – వల్లూరి నరసింహకవి (18 వ శతాబ్దము)
3. సుదంతా పరిణయము – వెలిదండ్ల అళగిరి (18వ శతాబ్దము)
4. వల్లవీ పల్లవోల్లాసము – మాడభూషి నరసింహాచార్యులు (19వ శతాబ్దము)
5. వల్లవీ పల్లవోల్లాస భాణము – శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి (19వ శతాబ్దము)
6. వల్లవీ పల్లవోల్లాసము – శ్రీనివాసాచార్యులు (19వ శతాబ్దము)
7. నాగ్నజితీ పరిణయము – వేమూరి శారదాంబ (19వ శతాబ్దము)

రాజవోలు సుబ్బారాయుడిగారి ద్విపద కావ్యం కాలగర్భంలో కలిసిపోయింది. వల్లూరి నరసింహం కృతికి బ్రౌనుపండితుడు వ్రాయించిన వ్రాతప్రతులు రెండు ప్రాచ్యలిఖిత భాండాగారం(చెన్నై)లో ఇప్పటికీ అచ్చుకునోచుకోక, అసూర్యంపశ్యలు గానే ఉన్నాయి. అళగిరి కావ్యంకూడా ఆస్థితిలోనే అక్కడే ఉంది. మాడభూషి వారి కావ్యం 1894లో ఒకసారి అచ్చయింది. ఇది చాలా ప్రౌఢకావ్యం. రెండవసారి నాపరిష్కరణలో విపుల పీఠికతో 2015లో మిత్రులు శ్రీ రావిమోహనరావు ముద్రించారు. శ్రీనివాసాచార్యుల కృతి అచ్చయినా ఇపుడు ప్రతులు దొరకవు. 1902 ప్రాంతంలో శారదాంబగారి కావ్యం అచ్చయింది.

విష్ణు, నారదీయ, భాగవత, గరుడ, పద్మ పురాణాలు విష్ణుకథలను వర్ణించాయి. మోక్ష ప్రదాలైన ఈ పురాణాలకు సాత్విక పురాణాలని పండిత లోకంలో ప్రసిద్ధి ఉంది. ఈ పురాణాలలో 'నాగ్నజితీ పరిణయము' రేఖామాత్రంగానే ఉంది కాని అందులో కథలేదు. భాగవతం మాత్రమే నాగ్నజితి పెండ్లిని 25 శ్లోకాలలో (దశమస్కంధము ఉత్తరభాగము 58వ అధ్యాయము 31వ నుండి 55వ శ్లోకము వరకు) వర్ణించింది. దానిని అనుసరించే పోతన దీనిని 19 పద్యగద్యాలలో (ఉత్తరభాగము 126 నుండి 144వ పద్యం వరకు) కథనం చేసాడు. నాగ్నజితి వివాహ సాహిత్యానికి మూలమిదే అందలి కథను చూడండి.

**భాగవత నాగ్నజితి :** కోసల రాజ్యాన్ని నగ్నజిత్తు మహారాజు పరిపాలిస్తున్నాడు. అతని కూతురు నాగ్నజితి. గొప్ప సౌందర్యవతి. అతని పశుసంపదలో ఏడుమదించిన కోడెలున్నాయి. వాటిని అణచిన వానికి తనకూతురునిచ్చి పెండ్లి చేస్తానని ప్రకటించాడు మహారాజు. ప్రయత్నించిన రాజులు పరాజితులయ్యారు. అది విని కృష్ణుడు తన పరివారముతో కోసలకు వెళ్లాడు. తొలి చూపులోనే నాగ్నజితి కృష్ణుడిని ప్రేమించింది. కృష్ణుడు మహారాజుతో – నేను సౌజన్యంతో నీ కూతురును కోరుకొంటున్నాను – అన్నాడు. ఆయన నవ్వి – నాబిడ్డకు నీకంటే తగిన భర్త ఎవరు దొరుకుతారు. సూర్యుడు చీకట్లను జయించినంత తేలిగ్గా శత్రువులను జయించిన యోధుడివి నీవు. ఈ కోడెలను జయించి నా కూతురును చేపట్టమని అర్థించాడు. చిరునవ్వుతో పై వస్త్రాన్ని నడుముకు కట్టుకొని ఏడురూపాలతో కొండల వంటి ఆ కోడెలను కుమ్మి నేలపై పడవేసాడు. మహారాజు సంతోషంతో నాగ్నజితి కృష్ణుల పెండ్లి వైభవంగా జరిపించాడు. ఇది తెలిసి గతంలో ప్రయత్నించి పరాజితులైన రాజులు అసూయతో కృష్ణునిపైకి దండెత్తారు. అర్జునుడు వారిని మట్టి కరిపించాడు. వధూవరులు ద్వారకకు వచ్చారు. సుఖంగా ఉన్నారు. ఇదీ సంస్కృతాంధ్ర భాగవతాలలో నాగ్నజితి పెండ్లికథ. ఈ కథను శారదాంబగారు ఇలా నిర్వహించారు.

**కథా సంగ్రహము :** పూర్వం కోసల రాజ్యం సిరిసంపదలతో తులతూగుతూ ఉండేది. అందమైన ఉపవనాలతో, పంటకాలువలతో, నదీప్రవాహాలతో రమణీయంగా ఉండే ఆ నగరాన్ని చూస్తే భూదేవి తన నిజరూపంతో వచ్చి అక్కడ నివశిస్తూ ఉన్నదా అన్నంత అందంగా ఉండేదానగరం. ఆ నగరానికి మహారాజు నగ్నజిత్తు. ఆయన పట్ట మహిషి మోహినాంగి. ఆమె అంగరాజు తనూజ. ఆమె

అందాలరాశి, పరమసాధ్వి, ఎప్పుడూ భర్తను సేవిస్తూ ఉండేది. ఆ దంపతులకు బిడ్డలు లేరన్న వెలితి తప్ప ఇంకే కొరతలేదు. ఒకసాయంత్రం ఆ దంపతులు ఉద్యానవన విహారానికి వెళ్ళారు. అక్కడ యోగ్యసంతాన కలితయై ఉన్న ఒక అరటిచెట్టును చూచి నగ్నజిత్తు – 'ఈ అరటి చెట్టు పిల్లల గుంపుతో ఎంతఅందంగా ఉందోచూడు' అన్నాడు. ఆ మాటలకు ఆమె ముఖం చిన్నబోయింది. 'ఎంత సంపద ఉన్నా ఏమిలాభం? బిడ్డలు కలవారి అదృష్టమే అదృష్టము' – అన్నది ఆమె విచారంగా. ఆ రాత్రి మోహనాంగి తన కాళ్ళు పడుతూ ఉంటే నగ్నజిత్తు – 'పూర్వజన్మలో ఏ పాపం చేసుకొన్నామో, ఇప్పుడు బిడ్డలు లేకుండా అలమటిస్తున్నాము. బిడ్డలు లేనివారికి పుణ్యగతులుండవని పెద్దలంటారు. తండ్రి ఋణం తీర్చడానికి కొడుకు ఉండాలి. నా దిగులంతా అదే' అని విచారించాడు.

మరునాడు నగ్నజిత్తురాజు కొలువుదీరాడు. ఆ సభకు నారదుడు వచ్చాడు. ఆయనకు అర్ఘ్యపాద్యాదులిచ్చి గౌరవించారు. 'మునీంద్రా! నీరాకతో మా ఇల్లు పావనమైనది' – అనిపూజించారు. తమ మనసులోని కోర్కెను వెలిబుచ్చారు. తృప్తి చెందిన నారదుడు 'సంవత్సరంపాటు సంతాన గౌరీ వ్రతాన్ని నియమనిష్ఠలతో చేయండి. సంతానం కలుగుతుందని' తరుణోపాయం చెప్పారు. సంవత్సరం పాటు రాజదంపతులు దానిని నియమ నిష్ఠలతో ఆచరించారు. భూరిదక్షిణలు ఇచ్చారు. భోజనాలు పెట్టారు. ముత్తైదువులకు చీరలు, రవికలు, నగలు పెట్టారు. వారివ్రతం ఫలించింది. దేవి కరుణించింది. ఒకనాటి రాత్రి ప్రత్యక్షమై – "నీకొక కొడుకును, కృష్ణుడిని పెళ్లాడ గలిగిన కూతురును అనుగ్రహిస్తున్నాను". అని ఆశీర్వదించి అంతర్ధానమయింది.

మోహనాంగికి నెలమసలింది. ఆరవ మాసంలో ఆమెకు సీమంతం చేసారు. నవమాసాల తర్వాత ఒక పాప, ఒక బాబు పుట్టారు. నగరమంతా పండుగ చేసికొంది. నగ్నజిత్తు ఆనందానికి అవధులు లేవు. బ్రాహ్మణులకు భూరిదానాలను ఇచ్చాడు. బిడ్డలకు జాతకాలు రాయించాడు. పదిరాత్రులు గడిచాక ఘనంగా బారసాల జరిపించాడు. కొడుకుకు సుముఖుడు, కూతురుకు సుదంత అని నామకరణం చేయించాడు. అన్నప్రాశనం చేయించాడు. – ఇదీ ప్రథమాశ్వాసము.

సుదంత బాల్యం ఆటపాటలతో గడిచిపోయింది. ఆమె వీణనేర్చుకొంది. కావ్యాలు చదువుకొంది. చక్కని ప్రబంధాలు వ్రాయడం నేర్చుకొంది. యౌవనం

వచ్చింది. కూతురుకు తగిన పెండ్లి సంబంధం కోసం మహారాజు ప్రయత్నాలు మొదలు పెట్టాడు. వసంత ఋతువు వచ్చింది. ఒక వసంతోత్సవం రోజు నారద మహర్షి వచ్చాడు. మహారాజు భార్యాబిడ్డలతో మహర్షిని పూజించాడు. 'స్వామీ! తమ అనుగ్రహం వల్ల సంతానం కలిగింది. ఈ బిడ్డకు తగిన సంంధం కూడ చెప్పి పుణ్యంకట్టుకో'మని అర్థించాడు. దేవకీసుతుడు కృష్ణుడు నీబిడ్డకు తగిన వరుడని నారదుడు స్వామిలీలలను వర్ణించాడు. ఇంకొన్ని రోజులకు నీ నగరానికి సప్తమద వృషభాలు వస్తాయి. అవి తోటలు, వనాలు, మందపాలు కూల్చుతాయి. ప్రజలు నీకు మొరపెట్టుకొంటారు. ఆ ఆబోతులను ఎవడు కట్టిపడవేస్తారో ఆ ధీరునకు నా కూతురునిచ్చి పెండ్లి చేస్తానని ప్రకటించు. ఆ స్వయంవరానికి రాజులందరు వస్తారు. కాని శ్రీకృష్ణుల వారు మాత్రమే వాటిని కట్టిపడవేస్తాడు. ఇదీస్వామిని ఇక్కడికి రప్పించే ఉపాయమని చెప్పి నారదుడు ఆ దంపతుల వద్ద సెలవు తీసికొన్నాడు.

ఈ కథంతా సుదంత తన చెలి ఇందుమతికి చెప్పింది. 'అయినా ఎక్కడి నందనందనుడు? ఎక్కడినేను? అతనికి నా మీద ప్రేమ ఎలా కలుగుతుంది? ఇదంతా నిజమవుతుందా? ఆ సారసాక్షుని వక్షమునందు ఎడబాయకుండా ఎప్పుడూ లక్ష్మీదేవి ఉంటుందట. ఆమె ఎంత పుణ్యం చేసికొందో' – అని నిట్టూర్చింది. అందుకు ఇందుమతి నవ్వుతూ – 'ఆ కృష్ణుడే నీ భర్త అని పార్వతీదేవే చెప్పింది. కనుక చింతవద్దు. నేను ఏదో విధంగా శ్రీకృష్ణుని కలిసి నీపని చక్కబెడతాను' – అంటూ సుదంతను వనంలోకి తీసుకొని వెళ్లింది. సుదంత విరహంలో పడింది. ఇందుమతి ఓదార్చింది.

ఆ మరునాడు యోగివేషం ధరించి ఇందుమతి ద్వారకకు వెళ్లింది. ద్వారపాలకులు స్వామికి యోగి ఆగమనం నివేదించారు. స్వామి ఎదురువెళ్లి ఆ యోగికి అభివాదం చేసి లోపలకు తీసుకొనివెళ్లారు. 'యోగీశ్వరా ! మీ పేరేమిటి? మీ ఆశ్రమం ఎక్కడ? మీరు ఎక్కడెక్కడ సంచరించారు. మీరు చూసిన విచిత్రాలు చెప్పండి' – అని అడిగాడు కృష్ణుడు. అప్పుడు యోగి శ్లేషతో తన వివరాలు తెలిపి – 'ఈ ప్రపంచంలో నీకు తెలియని విచిత్రాలు ఏముంటాయి. అయినా అడిగావు కనుక చెబుతాను విను. కోసలరాజు నగ్నజిత్తుకు గౌరీదేవి అనుగ్రహం వల్ల 'సుముఖుడు' అన్నకొడుకు, 'సుదంత' అన్న కూతురు పుట్టారు. వారికి యుక్తవయస్సు వచ్చింది. అందులో సుదంత ఒప్పులకుప్ప, వయ్యారిభామ. ఒకనాడు నారదుడు

వచ్చి శ్రీకృష్ణుడే ఆమెకు తగిన వరుడని చెప్పి వెళ్లిపోయాడు. అప్పటి నుండి ఆమె నిన్ను మనసంతా నింపుకొని ఎదురుచూస్తూఉంది. ఇదీ నేను విన్నసంగతి. నీకు చెప్పదగినది కనుక చెప్పాను. ఆపైన నీచిత్తము ఆమె భాగ్యము' – అన్నాడు. 'నారదుడు చెప్పాక ఇక తప్పుతుందా' – అన్నాడు కృష్ణుడు. యోగికి వీడ్కోలు చెప్పాడు. ఇదీ ద్వితీయాశ్వాసము.

కొన్నాళ్లకు కోసలకు భయంకరంగా రంకెలు వేస్తూ ఆబోతులు వచ్చాయి. వనాలను, మండపాలను నాశనం చేసాయి. రాజమార్గంలో వెళ్లి జనాలను కొమ్ములతో చీల్చేసాయి. పంటపొలాలను నాశనం చేసాయి. ఒకటనేమిటి? అంతా అతలాకుతలం చేసాయి. బయటకు రావాలంటేనే జనాలు భయపడ్డారు. వెళ్లి మహారాజుకు విన్నవించారు. ఆయన వాటిని అణచివేయిస్తానని ఊరడించి పంపించాడు. ఏడు కోడెలను కట్టిపడవేసిన వానికి తన కూతురు సుదంత నిచ్చి పెండ్లి చేస్తానని చాటించాడు. ఆ స్వయంవరానికి రాజకుమారులంతా వచ్చారు. కృష్ణుడూ వచ్చాడు. మహారాజు ఆయనను సాదరంగా ఆహ్వానించాడు. అందరికి విడిది ఏర్పాటు చేయించాడు.

ఒకనాడు నగరం బయట విశాలమైన మండపానికి రాకుమారులందరినీ పిలిపించాడు మహారాజు. 'ఆ ఏడు కోడెలను ఎవరు కట్టివేస్తారో వారికి నా కూతురుతో వివాహం చేస్తాను. ఇవిగో పగ్గాలు. ఇవిగో గొలుసులు. ఇవిగో కోలలు. ఏవి కావాలంటే అవితీసుకోండి. కోడెలు వచ్చే సమయమయింది. సిద్ధంకండి.' – అన్నాడు మహారాజు. బ్రహ్మాండం బ్రద్దలయ్యేటట్లు రంకెలు వేస్తూ గిత్తలు ఆ మండపానికి వచ్చాయి. వాటి ఆర్భాటము చూసి రాజులు బిత్తరపోయారు. 'బతికుంటే బలుసాకు తినవచ్చు అనుకొన్నారు'. అయినా ఆశచావక కొందరు ముందుకు వచ్చారు. భయపడి కాళ్లాడక వెనక్కువచ్చారు. కొందరు కట్టాలని ప్రయత్నించారు. అవి కొమ్ములతో కుమ్మడంతో యోజనం అవతలపడ్డారు.

అప్పుడు కృష్ణుడు లేచాడు. కోడెలకెదురువెళ్లాడు. ఏడురూపాలతో వాటి నెదుర్కొని పట్టి కట్టిపడవేసాడు. ప్రజలంతా హర్షధ్వానాలు చేసారు. సుదంత పులకించిపోయింది. వరమాల స్వామి మెడలో వేసింది.

కృష్ణుడు స్థంభానికి కట్టివేసిన ఏడుకోడెలు ఏడుగురు యక్షులుగా మారిపోయారు. అందరూ ఆశ్చర్యపోయారు. ఆ యక్షులు స్వామిని స్తోత్రం చేసి తమ కథను విన్పించారు. 'స్వామీ ! మేము కుబేరుని అనుచరులము. మాపేర్లు గుహ్యుడు, పేరుడు, గూబరుడు, గోళుడు, గుహాస్యుడు, కురూరుడు, నంది. ఒకనాడు వృషభవాహనుడై పరమశివుడు కుబేరుని చూడడానికి వచ్చాడు. లోపలికివెళ్లడానికి దారిని యిమ్మని అడిగారు. మేము మిడిసిపాటుతో – 'నవనిధులకు రాజు మా నాయకుడు. నీచమైన ఎద్దు నెక్కి వచ్చిన హీనుడెవ్వడ'ని మేము హేళన చేసిత్రోసేసాము. దానికి కోపించిన భృంగి ఎద్దులై మీరు అడవుల్లో తిరగండని శపించాడు. తప్పు తెలిసికొని మేము అతని కాళ్లపై పడ్డాము. శాంతించిన భృంగి – 'నారాయణుడు భూభారం తగ్గించడానికి కృష్ణునిగా అవతరిస్తాడు. ఆ స్వామి మిమ్మల్ని కట్టిపడవేసి నప్పుడు మీకు శాపవిమోచన మవుతుందని' తరుణోపాయం చెప్పాడని చెప్పి యక్షులు మరలా స్వామిని స్తుతించి వీడ్కోలు తీసికొన్నారు. ఇదంతా ప్రజలు నోళ్లప్పగించి చూసారు.

మహారాజు – 'రాజకుమారులారా ! నా కుమార్తె సుదంతను శ్రీకృష్ణునికిచ్చి పెండ్లి చేయడానికి నిశ్చయించాను. మీరంతా ఈ వేడుకను చూచి నన్ను కృతార్థుడిని చేయవలసినది.' అని కోరాడు. బంధుమిత్రులకు శుభలేఖలు పంపాడు. అందరూ వచ్చారు. పెండ్లి 5 రోజులపాటు ఘనంగా జరిగింది. పెండ్లికివచ్చిన రాజులందరినీ మహారాజు ఘనంగా సత్కరించాడు. వధూవరులకు కట్నకానుకలు ఘనంగా చదివించాడు. కూతురు అత్తవారింటికి బయలుదేరింది. తల్లికి కన్నప్రేగు కదిలింది. కన్నీళ్లతో కూతురుకు సుద్దులు చెప్పింది. ఇందుమతి మొదలైన చెలికత్తెలు ఆత్మీయంగా కౌగిలించుకొన్నారు. కన్నీళ్లతో వీడ్కోలు పలికారు. నూతన వధూవరులతో, పరివారంతో రథం ద్వారకకు పరుగులు తీసింది. దారిలో అసూయాగ్రస్తులైన రాజులు కృష్ణుడిని ఎదిరించారు. పరాజితులయ్యారు. వధూవరులు ద్వారకలో సుఖించారు. ఇది తృతీయాశ్వాసము.

**మూలకథకు మార్పులు కూర్పులు :** ఇదీ ఈ కావ్యంలోని కథ. మూలంలో 25 శ్లోకాలలో ఉన్న కథను కవయిత్రి 235 పద్యగద్యాలకు పెంచారు. కథలో కొన్ని కల్పనలు చేసారు. వర్ణనలు పరిమితం చేసారు. ఒక చక్కని కథా కావ్యంగా మలిచారు.

**మూలకథకు కవయిత్రి చేసిన మార్పులు కూర్పులు :**

1. మూలంలో నగ్నజిత్తు భార్యపేరులేదు. ఆమె పేరు మోహనాంగి అని, ఆమె అంగదేశ రాజకుమారి అని కవయిత్రి కల్పించారు.

2. మూలంలో నగ్నజిత్తుకు సంతానం లేదని లేదు. సంతానం లేదని కవయిత్రి కల్పించారు.

3. మూలంలో నారదుని పాత్రలేదు. సంతానంకోసం నగ్నజిత్తు దంపతులకు సంతానగౌరీవ్రతం ఆచరించమని నారదుడు చెప్పినట్లుగా కవయిత్రి కల్పించారు. ఇది ఆనాటి సమాజం సంతానకోసం ఆచరించిన వ్రతాలలో ఒకటై ఉండవచ్చును.

4. మూలంలో నగ్నజిత్తుకు కొడుకులేదు. కవయిత్రి అతనికి సుముఖుడు - అన్న కొడుకును అనుగ్రహించారు.

5. మూలంలో ఇందుమతి పాత్రలేదు. ఇందుమతి, ఆమె రాయబారము అంతా కవయిత్రి సృష్టే.

6. మూలంలో నాగ్నజితి పేరు సత్య అని ఉంది. అష్టమహిషీ కళ్యాణ ద్విపద కావ్యంలో (రచన: తాళ్లపాక తిరువేంగళనాథుడు) నాగ్నజితికి సత్యకీర్తి, సుదంత అన్న నామాంతరాలున్నాయి. ఈ కవయిత్రి నాగ్నజితిని సుదంత అనే వ్యవహరించారు. ఈ కావ్యంలో ఎక్కడా నాగ్నజితీ అన్నపేరే కన్పించదు. కానీ కావ్యానికి నాగ్నజితి పరిణయం అని పేరుపెట్టడం ఒక గడుసుదనం.

7. మూలంలో నగ్నజిత్తు, కృష్ణుల సంభాషణ దాదాపు 7 శ్లోకాల (56 వ అద్యాయం 38వ శ్లోకం నుండి 44 వ శ్లోకం వరకు)లో ఉంది. అందులో ముఖ్యమైనవి చూడండి.

   **నరేంద్రయాచ్ఞా కవిభిర్వి గర్హితా**
   **రాజన్య బంధోర్నిజ ధర్మవర్తినః**
   **తథాపి యాచే తవ సౌహృదేచ్ఛయా**
   **కన్యాం త్వదీయాం నహిశుల్కదా వయమ్.**

'మహారాజా ! స్వధర్మాన్ని పాటించే క్షత్రియులు ఇతరులను ఏమీ యాచింప గూడదని ప్రాజ్ఞులు చెబుతారు. అయినా నీ స్నేహం కోరుతు ఎటువంటి శుల్కాన్ని

చెల్లించకుండా నేను నీ కూతురు నాగ్నజితిని అర్థిస్తున్నాను.' – అని కృష్ణుడు అడిగాడు. అందుకు మహారాజు ఇలా అన్నాడు.

**కోఽన్యస్తేఽభ్యధికో నాథ కన్యావర ఇహేప్సితః**
**గుణైక ధామ్నో యస్యాంగే శ్రీర్వ సత్యనపాయినీ**
**కిం త్వస్మాభిః కృతః పూర్వం సమయః సాత్వతర్షభ**
**పుంసాం వీర్య పరీక్షార్థం కన్యావర పరీప్సయా ॥**

"జగన్నాథా! నీవు సకల సద్గుణ సంపన్నుడవు. జగన్మాత లక్ష్మీదేవి ఎప్పుడూ నీ వక్షస్థలం నందే నివసిస్తూ ఉంటుంది. నా కూతురుని చేసికోవాలని ఎంతోమంది కోరుకొంటున్నారు. కాని వాళ్లలో నీ వంటి గుణవంతు డెవరున్నారు. నా బిడ్డను చేసికోవాలనుకొన్నవారి బలపరాక్రమములు పరీక్షించడానికి ఇంతకు ముందే మేమొక ప్రతిజ్ఞ చేసియున్నాము – అంటూ ఆ తర్వాత శ్లోకాలలో దానిని వివరించాడు. అష్టమహిషీ కల్యాణ ద్విపదకావ్యంలో కూడ ఈ సంభాషణ యథాక్రమంగా ఉంది. 'వల్లవీపల్లవోల్లాస' కావ్యంలో కూడ మాడభూషి కవి – కృష్ణుడు అర్జునాదులతో కోసలకు వచ్చాక – నగ్నజితిని తనకిచ్చి పెండ్లిచేయమని అర్జునుడితో రాయబారము పంపుతాడు. అక్కడా ఇదే క్రమము. స్వయంవరం ప్రకటించాక మరలా ఈ సంభాషణ శోభాకరము కాదని కాబోలు ఈ బాలకవయిత్రి ఈ శ్లోకాలను త్రోసిరాజన్నారు. ఈ సంభాషణను విడిచిపెట్టారు. స్వయంవరానికి బలపరీక్ష ముందుగా నిర్ణయింపబడ్డాక కృష్ణుడు శుల్కం చెల్లించకుండా కన్యను అర్థించడం కూడ సముచితం కాదు.

8. మూలంలో నగ్నజిత్తు పశుసంపదలో మదించిన ఏడుకోడెలు ఉన్నట్లుగా ఉంది. కవయిత్రి వాటిని భృంగి శాపాన్ని అనుభవిస్తున్న యక్షులని వారి పేర్లతో సహా చెప్పారు. ఈ ఫ్లాష్‌బ్యాక్ కథ నాకు ఏపురాణంలోను తగలలేదు. ఇది కూడ కవయిత్రి కల్పన అని సందేహంగా ఉంది. ఈకార్యకారణ సంబంధం వలన కథాబంధం బలపడింది.

9. వధూవరులు ద్వారక వస్తున్నప్పుడు అసూయగ్రస్తులైన రాజులు కృష్ణుడిని ఎదుర్కొన్నారు. అప్పుడు వారిని అర్జునుడు పారద్రోలినట్లు మూలంలో ఉంది. ఈ కావ్యంలో అసలు అర్జున పాత్రలేదు.

ఇదీ ఈ కావ్యంలో ఈ బాల కవయిత్రి చేసిన ప్రధానమైన మార్పులు. నాగ్నజితి పెండ్లి కథ వంటిదే నీలపెండ్లికథ. ఎర్రన హరివంశం దీనిని సవిస్తరంగా కథనం చేసింది. అందలి నీలపెండ్లి కథ ఏమిటంటే –

**హరివంశంలో నీలపెండ్లి కథ :** విదేహరాజ్యంలో కుంభకుడు అన్న గొల్లరాజు ఉండేవాడు. అతని చెల్లెలు యశోద. అతనికి భార్య ధర్మద వలన శ్రీరాముడు, నీళాదేవి పుట్టారు. పూర్వం తారకాసురునితో జరిగిన యుద్ధంలో విష్ణువు కాలనేమి ఏడుగురు కొడుకులను సంహరించాడు. ఆ పగతో కాలనేమి కొడుకులు కుంభకుని ఇంట్లో ఏడు మద వృషభాలుగా జన్మించారు. కృష్ణునిపై పగబట్టారు. ఊరును పాడు చేసారు. వాటి బాధలు పడలేక ప్రజలు రాజుకు మొరపెట్టుకొన్నారు. రాజును కుంభకుని పిలిపించి వాటిని అదుపులో పెట్టుకోమన్నాడు. కుంభకుడు ఎన్ని యుక్తులు పన్నినా అవి అలివికాలేదు. ఇంతలో బలరామకృష్ణులు విదేహకు వచ్చారు. అది తెలిసి ఆబోతులు నగరాన్ని రచ్చరచ్చ చేసాయి. వాటిని చంపిన వానికి తనకూతురు నీలనిచ్చి పెండ్లి చేస్తానని కుంభకుడు ప్రకటించాడు. కృష్ణుడు ముందుకు వచ్చాడు. పూర్వ వైరం గుర్తువచ్చి ఆబోతు రూపాలలో ఉన్న కాలనేమి కొడుకులు ఉగ్రులై కృష్ణుని మీదకు దూకారు. కృష్ణుడు వారితో పోరాడి నేలకూల్చాడు. నీలాకృష్ణుల పెండ్లి వైభవంగా జరిగింది.

ఈ కథ సంస్కృత హరివంశంలో లేదు. సంస్కృత భాగవతంలోని నాగ్నజితి కథను ఎర్రన నీలపెండ్లికథగా 55 పద్యగద్యాలలో (హరివంశము పూర్వభాగము 6వ ఆశ్వాసం 120 వ పద్యంనుండి 174వ పద్యం వరకు) రస స్ఫోరకంగా కథనం చేసాడు. ఆబోతుల కయ్యానికి కార్యకారణ సంబంధం పటిష్ఠంగా చెప్పాడు. కథలోని ఈ జిగిబిగి భాగవత నాగ్నజితి కథలోలేదు. అష్టమహిషీ కళ్యాణ కావ్యంలోని నాగ్నజితి కథలోనులేదు. సంస్కృతాంధ్ర భాగవతాల ననుసరించిన మాడభూషి నరసింహాచార్యుల నాగ్నజితి కథలోకూడా ఇది పేలవంగానే ఉంది. కాని బాలశారదాంబ గారు భృంగి శాప వృత్తాంతాన్ని కల్పించి కథను కొంత పటిష్ఠంచేసారు.

**వర్ణనలు :** ఈ కావ్యాన్ని శారదాంబగారు కథా ప్రధానకావ్యంగా వ్రాసారు. రచనలలో అభ్యుదయభావాలు ప్రతిఫలించాలని వీరేశలింగం పంతులుగారు ఎంత

ఉద్ఘోషించినా కవులు సంప్రదాయము పరిధిని దాటిరాక స్త్రీ అంగాంగ వర్ణనలతో, వెర్రిమొర్రి విరహాలతో ఒళ్లు విరుచుకొంటున్న ప్రబంధాలను వ్రాస్తున్న కాలమది. అవి కాంతాసమ్మిత కావ్యాలు కావు. వాటిని పరిహరిస్తూ అవసరమైన మేరకు ఆరోగ్యకరమైన వర్ణనలు చేస్తూ శారదాంబగారు ఈ కావ్యాన్ని కాంతా సమ్మితంగా వ్రాసారు. అందలి వర్ణనలు చూడండి.

1. పుర వర్ణన - 11 పద్యాలు (1వ ఆశ్వాసం 11 నుండి 21 వ పద్యం వరకు)
2. నగ్నజిత్తు వర్ణన - 2 పద్యాలు (1వ ఆశ్వాసం 22, 23 పద్యాలు)
3. మోహనాంగి వర్ణన - 4 పద్యాలు (1వ ఆశ్వాసం 24 నుండి 27 వ పద్యం వరకు)
4. వనవర్ణన - 1 పద్యం (1 ఆశ్వా. 29)
5. సుదంత యౌవనం - 3 పద్యాలు (2వ ఆశ్వా. 6 నుండి 8 వ పద్యం వరకు మరియు 2 వ ఆ. 66 వ పద్యం)
6. వసంత వర్ణన - 3 పద్యాలు (2వ ఆశ్వా. 9నుండి 11 వ పద్యం వరకు)
7. శ్రీకృష్ణ వర్ణన - 2 పద్యాలు (2వ ఆశ్వా. 21, 22)
8. సుదంత విరాళి - 3 పద్యాలు (2వ ఆశ్వా. 43 నుండి 45 వ పద్యం వరకు)
9. ఇందుమతి యోగి వేష వర్ణన - 1 పద్యం (2 వ ఆశ్వా. 55 వ పద్యం)
10. వృషభ విజృంభణము - 4 పద్యాలు (3 వ ఆశ్వా. 3 నుండి 6 వ పద్యం వరకు)
11. వివాహ వర్ణన - 6 పద్యాలు (3వ ఆశ్వా. 65 నుండి 70 వ పద్యం వరకు)

మితిగల వర్ణనలతో కథాప్రధానంగా సాగేసైలిని పురాణశైలి అని అనడం ఒక అభిప్రాయంగా సాహిత్య లోకంలో కన్పిస్తుంది. ఆ విధంగా చూస్తే ఇది ఒక లఘుపురాణ ఖండమని చెప్పవచ్చును. ప్రథమ ప్రయత్నంలో ప్రతికవీ తన పాండిత్యాన్ని ప్రదర్శించాలనుకొంటాడు. ప్రౌఢసమాస గ్రథనంతో పాఠకులను ఉక్కిరి

బిక్కిరి చేస్తాడు. కాని ఈ కవయిత్రి ఆ పుంత త్రొక్కలేదు. అందువల్ల కావ్యం మృదుమధురపాకంలో పడింది.

ఇందలి వర్ణనలు సహజ సుందరమైనవి. అవతారికలోని బ్రహ్మస్తుతిని చూడండి.

క. **తనగరితమోము చందురుఁ**
**గని భయమందిన స్వపీఠ గర్భములకుఁ బ్రీ**
**తినిఁ జేయఁగ వాణిని వా**
**క్కున నుంచిన ధాత మమ్ముఁ గూరిమినేలున్.** నాగ్నజితి 1–5

చంద్రునికి పద్మానికి విరోధము. ఆ పునాదిపై ఈ ఉత్ప్రేక్షా సౌధమును కవయిత్రి నిర్మించారు. బ్రహ్మదేవుని అర్ధాంగి సరస్వతి. ఆమె ముఖం చంద్రునివలె అందంగా ఉంది. తన ప్రియురాలి ముఖమనే చందమామను చూసి భయపడిన తామర గద్దియ (స్వపీఠ గర్భముల)కు (భయంలేదని చెబుతున్నట్లుగా) ఆమెను బ్రహ్మతన నాల్కపై నిల్పుకొన్నాడు. ఆ స్వామి మమ్ములను రక్షించుగాక – అని అర్థం. ఇది ఒక చక్కని కల్పన.

అట్లే కోసల నగరాన్ని వర్ణించే సీసపద్యం చూదండి.

సీ. **సకలంబులగు వృక్షజాతులు గల తోఁట**
**లను గొప్పలవు నరణ్యముల తోడ**
**తేటలౌ తియ్యని నీటికాలువలుగా**
**నలరు నదీప్రవాహముల తోడ**

గీ. **ధారుణీదేవి నిజరూపధారిణియయి**
**యచట నివసించి యున్నదో యనఁగనొప్పు.** నాగ్నజితి 1 – 11

కోసల నగరంలో అందమైన వనాలేకాక, నగరసమీపంలో పెద్దపెద్ద అరణ్యాలు కూడ ఉన్నాయి. ఆ అడవుల వలన వీచే చల్లని గాలులకు నింగిలోని మబ్బులు చల్లబడి, నెలకు నాల్గువానలు కురిసి, నదులు జీవనదులయ్యాయి. వాటి మధుర పంటజలాలు భూములను సస్యశ్యామలం చేస్తుఉంటే, భూదేవి నిజరూపంతో అక్కడ నివసిస్తూ ఉందా అని అన్పిస్తుందట. ఎంత ఆహ్లాదకరమైన వర్ణన ! కాని నేటి

మనిషి అడవులను నరికి వేయడంతో ప్రకృతి సమతౌల్యం దెబ్బతిన్నది. గ్లోబల్ వార్మింగ్ పెరిగింది. ప్రతి ఊరులోను కనీసం సామాజిక వనాలనన్నా పెంచడం నేటి మనిషి కర్తవ్యం.

ఆ నగరపు కోటపై ఉన్న సాలభంజికలు,

ఉ. **ఆ నగరంపు గోటపయి నందము నొప్పెడి సాలభంజికా**
**శ్రేణుల నీడలెంతయును జిత్రిత ఖేయ జలంబు లోపలన్**
**గానఁగ రాఁగ నప్పురపు నాణెముఁ జూడఁగ నాగకన్యకల్**
**పూని రసాస్థలిన్ వెడలి భూమికి వచ్చిన మాడ్కిఁ దోఁచెడిన్.** 1-12

కోసల నగరపు కోటమీద వరుసగా సాలభంజికలు చెక్కబడ్డాయి. కోట చుట్టూలోతైన అగడ్త ఉంది. అందలి నీళ్లలో ఆ సాలభంజికల నీడలు అందంగా కన్పిస్తున్నాయి. అవి ఎలాఉన్నాయంటే – ఆనగరం అందం చూడడానికి పాతాళలోకం నుండి పనికట్టుకుని వచ్చిన నాగకన్యల లాగఉన్నాయట.

కోసల నగరంలోని హర్మ్యాలు,

గీ. **తేజరిల్లెడి పట్టణ రాజకీర్తి**
**యనెడి గంగ యురగపురి కరిఁగి నిండి**
**యుప్పరమునకుఁ బొంగఁగ నుబుకు బుగ్గ**
**లనఁగఁదోచెడి నచ్చటి హర్మ్య చయము.** (1-13)

కోసల నగర రాజుల కీర్తి అనేగంగ పాతాళలోక మంతానిండి, ఆకాశానికి పొంగగా ఉబికిన నీటి బుగ్గల్లాగ ఆనగరంలోని హర్మ్యాలు శోభిస్తున్నాయని కవయిత్రి అందంగా ఉత్ప్రేక్షించారు. కీర్తి, యశస్సులను సమానార్థకాలుగా భావిస్తుంటారు. కాని –

**'దానాది ప్రభవా కీర్తిః**
**ప్రతాపాది భవం యశః'**

– దాన ధర్మాల వల్ల వచ్చే పేరుప్రతిష్ఠలను కీర్తి అని, ప్రతాప పాండిత్యాల వల్ల వచ్చే పేరుప్రతిష్ఠలను యశస్సు – అని అంటారని మల్లినాధసూరి తన వాదనలలో అందలి సూక్ష్మాన్ని విప్పిచెప్పాడు.

కోసల నగరంలోని రాజకుమారులు – 'ప్రేయసీ హృదయ చోరులు నింక కడున్ మనోహరా కారులు' – అని శారదాంబ వర్ణించారు. సాధారణంగా ప్రబంధకవులు రాజకుమారులను 'మానినీ మన్మథులని' వర్ణిస్తుంటారు. కాని ఈ రచయిత్రి స్త్రీ కనుక భార్యల హృదయాలను దొంగిలించినవారు. అంటే వారి స్వచ్ఛమైన ప్రేమకు పాత్రులైన వారని అపురూపంగా చిత్రించింది. స్త్రీ హృదయం ఎప్పుడూ భర్త ప్రేమను కాంక్షిస్తుంది. స్త్రీల రచనలలోనే ఇటువంటి అమూల్యమైన అనుబంధాలు అర్థంగా తగులుతాయి. ఈ పద్యంలో భార్యాభర్తల అనుబంధాన్ని ప్రదర్శిస్తే క్రింది పద్యంలో అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాలాఆత్మీయంగా చిత్రించింది చూడండి.

ఉ. **ఆ పురమందుఁ గాఁపులు స్వయంకృషి పల్లను బండుధాన్యముల్**
**గోపుర పంక్తి మాదిరిగఁ గుప్పలు వైవఁగ వానిఁదాఁకుచుం**
**బ్రాపునఁజేరియున్న వెలిమబ్బులఁ జూడఁగ దవ్వుఁగంపకై**
**దాపున నున్న చెల్లెలగు దైవత గంగ యనంగ దోఁచెడిన్.** (1-17)

ఈ పద్యంలో చాలా అరుదైన మంచి కుటుంబ సంప్రదాయం ఉంది. శూద్రులు విష్ణు మూర్తి పాదం నుండి పుట్టారు. గంగాదేవి కూడా ఆ స్వామి పాదం నుండే పుట్టింది. కనుక శూద్రులకు, గంగాదేవికి అన్నాచెల్లెండ్ర అనుబంధం ఉంది. ఆ నగరంలోని శూద్రులు చెమటలు చిందించి ధాన్యాన్ని పండించారు. కుప్పనూర్చి ధాన్యాన్ని పంట కళ్లంలో బాగా ఎత్తుగా రాసులు పోసారు. అవి ఎత్తైనగోపురాల లాగ ప్రకాశిస్తున్నాయి. ఆ కుప్పలపైన చేరిన దూదిపింజెల వంటి తెల్లని మబ్బులను చూస్తుంటే – తొలిగంపధాన్యం కోసం వచ్చిన వారిచెల్లెలు గంగాదేవిలాగ ఉన్నాయట. ఇప్పుడు కనబడదం లేదుకాని – ఒకనాడు తెలుగునాట రైతులు తాము పండించిన ధాన్యం పంటకళ్లంనుండి ఇంటికి తరలించే ముందు – ఆ రాశి నుండి తొలి గంప ధాన్యంగా కొంత ధాన్యాన్ని తమ చెల్లికో, అక్కకో ఆత్మీయంగా అందించే సంప్రదాయం ఒకటి ఉంది. మరుగున బడ్డ నాటి సంప్రదాయాన్ని పెకలించిన ఈ కవయిత్రికి మనం కృతజ్ఞతలు చెప్పాలి. అరుగురు అన్నల ప్రేమానురాగాల వర్షంలో తడిసి ముద్దయిన ఈ కృతికర్త్రి తన అనుభూతిని ఆత్మీయంగా ఈ పద్యంలో చిత్రించింది.

ఈ కావ్యంలో చెప్పుకోదగినది ఇందుమతీ రాయబారము. రాయబారం నడిపేవ్యక్తికి శాస్త్రంతోపాటు చాలా వ్యవహారశైలి, లౌక్యము, లోకజ్ఞానము బాగా

తెలిసిఉండాలి. ఇవన్నీ కలబోసిన వ్యక్తిత్వం గల తిక్కన సోమయాజిగారు భారతంలో సంజయరాయబారము, శ్రీకృష్ణ రాయబారాలను చాలా ఉదాత్తంగా నిర్వహించారు. నైషధంలో హంసరాయబారము కూడా బాగానే ఉంటుంది కాని – ఆంధ్రసాహిత్యం మొత్తం మీద తిక్కనకు ఎదురొడ్డి సమస్కంధంగా నిలబడ్డవాడు పింగళిసూరన గారు ఒక్కరే. 'ప్రభావతి ప్రద్యుమ్న' కావ్యంలో 'శుచిముఖిని' – తిక్కనకు ఒక ఆకు ఎక్కువ చదివాడా అన్నంత ఉన్నతంగా నిర్వహించాడా మహాకవి. ఆంధ్రసాహిత్య పారమ్యాన్నంతా ఆపోసన పట్టిన సాహితీ అగస్త్యులు ఆచార్య పింగళి లక్ష్మీ కాంతంగారు. ఆ మహనీయులను అంచనావేసిన అమృత వాక్యాలు ఇక్కడ స్మరణీయాలు చూడండి.

"ఆంధ్ర కవులలో నిరుపమాన ప్రతిభా సాకల్యము గల కవి తిక్కన సోమయాజి. ఆయన యొక యుగ నిర్మాత. ఒక పరమ గురువు. ఒక శిల్పాచార్యుడు. ఈ త్రివిధాత్మక శక్తియే యాయన ప్రతిభాసాకల్యమునకు తార్కాణ, ఇందుమొదటి దానిలో శ్రీనాథుడు, రెండవ దానిలో పోతనయు, మూడవ దానిలో సూరనయు తిక్కన ద్వితీయులు. శిల్పచాతురిలో శారదాదేవి దిద్దిన సూరనదే పైచేయి అనిపించు లక్షణములు క్వాచిత్కముగ సూరన కవిత్వమున కలవు. ఇందుకు కారణము భారత మనువాదమును, కళాపూర్ణోదయము స్వతంత్రమునగుటయే" – ఆంధ్రసాహిత్య చరిత్ర పుట 398.

ఆ మహాకవులు నిర్దేశించిన ఈ ప్రౌఢవాగ్వివేక విలసనమును అనంతర కవులు అంత సమర్థవంతంగా నిర్వహించలేకపోయారు. తపతీ సంవరణములోని చిలుక, చారుచంద్రో దయములోని చిలుక, వల్లభీపల్లవోల్లాసములోని హంస – ఇత్యాదిగా గల ప్రాచీన ప్రబంధాలలో పిట్టలు నిర్వహించిన రాయబారాలన్నీ ప్రణయబారాలే. ఇవన్నీ పాఠకులకు వెగటు గొలిపే శిరోభారాలే. చతురత లేక అవి అంతగా రాణించలేక పోయాయి. ఈ కావ్యంలో ఈ పదహారేళ్ల పసిరచయిత్రి కూడ ఇందుమతీ రాయబారాన్ని నిర్వహించారు. అదీ సాధారణమైనదైనా, ఆమె వయసు రీత్యా యోచిస్తే మేల్తరమైనదే. ఇందుమతి శ్రీకృష్ణునితో తనను తాను శ్లేషలో పరిచయం చేసికొన్న విధానం ముచ్చటగొలుపుతుంది. చూడండి.

గీ. **అయ్య! చక్కంగ మారహాస్యంబునెల్ల**
**వినఁదగును యోగమార్గంబు గనుమ! హంస**

గతిదెలిసి శుకవాక్యసంగతి నటించి
ఇచ్చ నుద్యానములను జరింతుమేము. (2-61)

అయ్యా! మా రహస్యాన్ని చెబుతాను విను (అంటే నాగ్నజితి పెండ్లి విషయమై రహస్యంగా మాట్లాడదానికి వచ్చాననడం). హంసవంటి మనోహరమైన నడకలతో, చిలుక వంటి ముద్దు ముద్దు పలుకులతో ఎప్పుడూ ఉద్యానవనాలలో విహరిస్తూ ఉండేవాళ్లము. నీకు మా చెలి నాగ్నజితిని కూడు మార్గము (యోగమార్గము) కలదని తెలిసికొనుము – అని ఇందుమతి పరంగా అర్థం.

అయ్యా ! మా రహస్యాన్ని చెబుతాను విను (అంటే ఒక్కొక్క యోగి ఒక్కొక్కమార్గాన్ని అనుసరిస్తాడు. కనుక నా పద్ధతిని కూడా చెబుతాననడం). యోగుల పద్ధతుల నెరిగి, శుకమహర్షి తత్త్వమార్గాన్ని అధ్యయనం చేసి స్వేచ్ఛగా ఆకాశ మార్గంలో (ఉత్+యానము) చరిస్తూ ఉండే ఋషులము మేము అని ఋషి పరంగా అర్థం.

ఆ.వె. ఏడనైన మేము నాదువారము యిందు
మతి మదాఖ్య సుమ్ము మాన్యచరిత!
లలిత మమ్ము గోసల క్ష్మాశ్రయులముగా
దెలిసికొమ్ము కృష్ణ! దేవదేవ ! (2-62)

మేము ఆడవాళ్లము. నా పేరు ఇందుమతి. మేము కోసల దేశానికి చెందిన వాళ్లము – అని ఇందుమతి పరంగా అర్థం.

లోక కళ్యాణం కోసం మేము అన్నిచోట్లు సంచరిస్తూ ఉంటాము. ఇప్పుడు నేను 'మతిమంతుడు' అను పేరు గలవాడను. సన్యాసి లక్షణాలను (గోన లక్ష్మాశ్రయులము) ఆశ్రయించిన వారము – అని ఋషి పరంగా అర్థం.

ఇలా తనను తాను చమత్కారంగా పరిచయం చేసికొని ఇందుమతి తొలి పరిచయంలోనే శ్రీకృష్ణుడిని తన మాటలకు ఆకర్షితుడిని చేసికొంది. కోసల రాజదంపతులు, వారి సంతానం గురించి వివరించి, నాగ్నజితి అందాన్ని, హృదయాన్ని ఒకే ఒక్క పద్యంలో బహుచమత్కారంగా వర్ణించింది.

సీ. కనకాంగి యని చాలఁ గొనియాడఁగా వచ్చు
నాయకి యని యనందగును సుమ్ము

**కీరవాణి యటంచుఁ గీర్తింపఁగా వచ్చు**
**నందమైన వరాళి యనంగ నొప్పు**
**కళ్యాణి యనుచు వక్కాణింపఁగా నొప్పు**
**వన్నుగ శ్యామగాఁ నెన్నవచ్చు**
**సింహేంద్ర మధ్యమాంచిత యనఁగాదగు**
**నొప్పైన లలితగాఁ జెప్పవచ్చు**

**గీ. శ్రవణములు శ్రీలు మేఘరంజనలు కురులు**
**నాభిపున్నాగ మక్షి కర్ణాటకంబు**
**జెరవుర ! దానిమోహనాకారమెన్నఁ**
**బెదవిఁ గదలింప రాగము లొదవుచుండు.** (2-66)

ఆమె బంగారు రంగు దేహం కలది. ఆమెశ్శృంగార రసావలంబినము (నాయిక) కల్గిన పడుచు. ఆమె మాటలు చిలుక పలుకుల వలె ముద్దులు మూటగడుతుంటాయి. నొసలు (వరాళి) అందంగా, విశాలంగా ఉంటుంది. కళ్యాణ గుణములు కలిగినది. ఆమె పదహారేళ్ల వయస్సు (శ్యామ అంటే పరిపూర్ణ యౌవనవతి అని కొందరు) కలది. ఆమె నడుము సింహం నడుమువలె సన్నగా ఉంటుంది. ఆమె శరీరమే కాదు హృదయము కూడా మృదువైనది. చెవులు శ్రీకారమును బోలిఉంటాయి. కురులు కరిమబ్బువలే నల్లగా ఉంటాయి. ఆమె నాభి పున్నాగ పువ్వువలే ఉంటుంది. కన్నులు కర్ణాటకాలు (అంటే చెవుల వరకు వ్యాపించిన విశాలనేత్రాలు అని). ఆ సౌందర్యరాశి పెదవి కదిపితే రాగరంజిత మవుతాయి. అంటే ఆమెపెదవులు ఎర్రనివని అర్థం.

ఇక్కడ చెప్పబడిన - కనకాంగి, నాయకి, కీరవాణి, పంతువరాళి, కళ్యాణి, శ్యామ, సింహేంద్ర మధ్యమము, లలిత, శ్రీ, మేఘరంజన, పున్నాగ, కర్ణాటక - ఇవన్నీ రాగాలపేర్లు. ఈ రాగాలతో ఆమె నాగ్నజితి వర్ణనను శ్లేషలో చేసింది. కథానాయిక సంగీతశాస్త్ర విదుషీమణి అని కూడ గడుసుగా స్ఫురింపజేసింది.

**జెరవుర ! దాని మోహనా కారమెన్నఁ**
**బెదవిఁ గదిలింప రాగము లొదువు చుండు.**

ఈ పద్యపాదాలలో చాలా అర్థాలు స్ఫురిస్తున్నాయి. ఆమె అందమైన రూపాన్ని

ఎవరు వర్ణించాలనుకొన్నా రాగాలు ఒలుకుతాయి. ఆ అందాలరాశి మాట్లాడటానికి పెదవులు కదిపినా రాగాలు పలుకుతాయి. అంటే ఆమె మాటలు అంత మధురంగా ఉంటాయని అర్థం. ఇక్కడ సాహిత్యానికి సంగీతాన్ని ముడివేసి ఈ బాలకవయిత్రి చక్కని స్వారస్యం చూపించారు. ప్రౌఢభావాలొలికించారు.

మాధవ శతకంలో ప్రతిపద్యంలోను స్త్రీ విద్యను ఘంటాపథంగా చాటిన ఈ గ్రంథకర్త్రి ఈ కావ్యంలోను దానిని వదిలిపెట్టలేదు. కోసల నగరంలోని ఇల్లాండ్రు–

**పరగ సంగీత సాహిత్య సరణి దెలసి**
**పనుల యందును బ్రాల్మాలం కను జరింత్రు.** (1–20)

– అని సంగీత సాహిత్య విద్యలనభ్యసించి, విద్యవలన సాధించిన వివేకప్రౌఢితో సమర్థవంతంగా కార్యకలాపాల నిర్వహిస్తుంటారని వర్ణించింది. తన కావ్య కథానాయికకు కూడ –

ఉ. **వీణియ చేతబట్టుకొని వీనుల పండువుగాఁగ నింపుగా**
**గానము సేయనేర్చె మృదు కావ్యములన్ బఠియింప నేర్చెగా**
**పూని సునీతిమంతములఁ బొత్తములన్ రచియింపనేర్చె న**
**ప్మానిని చిత్రలేఖనము మానుగ జేయఁగ నేర్చెనెంతయున్.** (2–4)

సుదంత వీణను మీటుతు వీనులవిందుగా గానం చేస్తుండేది. ఆ గానమాధుర్యానికి రాళ్లు కూడ కరిగిపోతాయి. మధుర కావ్యాలను అధ్యయనం చేయడమే కాకుండా పండిత సభలలో కమ్మగా పాడుతుండేది కూడా. పండిత సమ్మతమైన గ్రంథాలను కూడవ్రాయడం నేర్చుకొంది. అంతేకాదు అందమైన చిత్రాలనుగీయడం కూడ నేర్చుకుంది. – అంటూ తన ప్రతిభలన్నిటిని తన కావ్యనాయికకు ఆపాదించింది.

రఘువంశంలో కాళిదాసు – 'చతస్రశ్చతురర్ణ వోపమాః తతార విద్యాః' (రఘు 3–30). చతుస్సముద్రాల వంటి చతుర్విద్యలను రఘువు నేర్చుకొన్నాడని వర్ణించాడు. చతుర్విద్యలంటే – 'అన్వీక్షకీ, త్రయీ, వార్తా, దండనీతిః చతస్రో రాజవిద్యాః' – అని కామందక నీతిశాస్త్రం చెబుతుంది. 1. అన్వీక్షకి – అంటే తర్కం, వేదాంతం (ఆధ్యాత్మిక విద్య), 2. త్రయీ – అంటే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము 3. వార్తా – అంటే ఔపయోగిక కళలు, విద్యలు – వ్యవసాయం,

వాణిజ్యం, ఔషధ విజ్ఞానం మొదలగునవి. 4. దండనీతి – అంటే రాజ్యపరిపాలనా విధానం. ఇదీ సమగ్రమైన విద్యాస్వరూపం. పూర్వం రాజకుమారులు, మంత్రి కుమారులు ఇలాంటి సమగ్ర విద్యనే అభ్యసించేవారు. ఈనాటి విద్యార్థులు వీటిలో త్రయీ, దండనీతి విద్యలకు ఆధునికపు ముసుగులో కొత్తకొత్త పేర్లు పెట్టుకొని అధ్యయనం చేస్తున్నారు.

ఈ కావ్యనాయిక వార్తా విద్యలో నిష్ణాతురాలయింది. ప్రాచీన కావ్యాలలో స్త్రీలు పెండ్లి చేసికొన్న తర్వాత కూడ తమ భర్తల దగ్గరో, ఇతర గురువుల దగ్గరో విద్యాభ్యాసం చేసినట్లుగా కన్పించింది. అజుడు తన భార్య ఇందుమతిని గురించి – 'ప్రియశిష్యా లలితే కళావిధౌ'(రఘు 8–67); లలిత కళలలో తనకు ప్రియశిష్యురాలు అని అంటాడు. 'మాళవికాగ్నిమిత్ర' కథానాయిక గణదాసుడనే నాట్యాచార్యుని వద్ద సంగీతాభినయాలను నేర్చుకొంటుంది. కానీ వివాహానంతరం ఈ కావ్యకర్త్రి తన విద్యలను **నారివాగు** కడపెట్టవలసిన స్థితి ఏర్పడడం విచారకరం.

రఘువంశంలో లక్ష్మణ, శత్రుఘ్నులు – 'సమ్యగారాధితా విద్యాప్రబోధ వినయావివ' – బాగా అభ్యసించిన విద్యవలన పుట్టు తత్త్వజ్ఞాన, ఇంద్రియ జయములవలె పుట్టారని కాళిదాసు వర్ణించాడు. అంటే విద్యయొక్కఫలం కేవలం బ్రతుకనేర్పిన జ్ఞానమేకాదు ధర్మదృష్టి, ఇంద్రియ నిగ్రహం కల్గిన నీతివంతమైన నడవడిక కూడ. అందువల్లనే శారదమ్మగారు విద్యమాత్రమే స్త్రీకి అమూల్యమైన అలంకారమని బలంగా ప్రబోధించారు. కాని నేటి విద్యా విధాన మాహాత్మ్యము ఏమిటో కాని నేటి విద్యాహీనులకన్నా విద్యావంతులే ఇంద్రియలౌల్యులుగా, అవినీతిపరులుగా కన్పిస్తున్నారు.

కండ చెక్కర కలిపిన మంచినీళ్లు పానకమవుతాయి. అదేవిధంగా విభావ, అనుభావ, సంచారి భావాలతో నిండిన కావ్యరసం మాధుర్యాన్ని కల్గిస్తుంది. పానకంలో కండచెక్కెర, ఏలకులు, మిరియాలపొడి మొదలైనవి కలిసి మరింత రుచిని కల్గిస్తాయి. అదేవిధంగా సహృదయులస్థాయిని విభావ, అనుభావ, సంచారి భావాలు కలిసిన కావ్యం మాధుర్యాన్ని కల్గిస్తుంది. అటువంటి రసం ఈ కావ్యంలో ఏదీ అంటే చప్పున చెప్పడం కష్టం. స్థూలదృష్టికి శృంగార రసం అన్పిస్తుంది కానీ ఇందులో అదెక్కడా పోషించబడలేదు. ప్రభావతీ ప్రద్యుమ్నకావ్యాన్ని పింగళిసూరన

కూడా కథప్రధానంగా వ్రాసి, శృంగార రసపోషణ కోసం 5 వ ఆశ్వాసమంతా సంభోగ శృంగారాన్ని విచ్చలవిడిగా దృశ్యమానం చేయవలసివచ్చింది. కథా ప్రధానమైన కావ్యాలకు ఇది తప్పదు.

ప్రబంధాలలో కథ పెండ్లి నడకనడుస్తుంది. రెక్కపట్టుకొని లాగినా నడవదు. విసుగు పుట్టిస్తుంది. ఈగ్రంథంలో కథతోపాటు పాఠకుడు కూడా పరుగులు తీయాల్సిఉంటుంది. ప్రబంధ కథ టీవీసీరియల్‌లా ప్రతి కదలికను చిత్రిస్తుంది. ఈ గ్రంథంలో కథతీసే పరుగులకు ఎన్నో దృశ్యాలు కళ్లకు అందవు.

పెండ్లి అయిన కూతురును అత్తవారింటికి పంపేటప్పుడు బాధతో తల్లిదండ్రులు కొన్ని సతీధర్మాలు, నీతులు చెబుతారు. తెలుగునాట ఇది ఒక సంప్రదాయం. ఇది కావ్యాలలో కూడా కన్పిస్తుంది. దమయంతి అత్తవారింటికి వెళ్లునపుడు తండ్రి ఆమెకు బుద్ధులు (శృంగార నైషధం 7-8,9) చెబుతాడు. శకుంతల కాపురానికి వెళ్లేటప్పుడు కణ్వమహర్షి బోధించిన సతీధర్మాలు శాకుంతల కావ్యానికే (శృంగార శాకుంతలము 4-71 నుండి 82వ పద్యం వరకు) అలంకారాలు. అనంతర ప్రబంధాలలో వీటి జాడలు అంతగా కన్పించవు. వల్లభీ పల్లవోల్లాసంలో ఆ ఊసే కనిపించదు. శారదాంబగారు మూడుపద్యాలలో మోహనాంగి చేత కూతురుకు చక్కని నీతులు చెప్పించారు. పేదవాళ్లను ఆదరించమని, పనివాళ్లపట్ల ప్రేమానురాగాలు చూపించమని ప్రత్యేకంగా చెప్పించారు. ఇది సమాజం పట్ల బాధ్యత, గౌరవం, అనురాగాన్ని ప్రదర్శించే ఉదాత్త సంస్కార విశేషము. రాధికా సాంత్వనంలో తల్లి కూతురుకు 'కాయజోపనిషత్తు'లను బోధించి కామశాస్త్రోపాధ్యాయిని అయింది. కాని శారదాంబగారి మోహనాంగి ఉపనిషత్తుల సారాన్ని బోధించి సమాజానికి ఆచార్యత్వం వహించింది.

ఈ గ్రంథంలో ఒకటి, రెండుచోట్ల పూర్వకవుల అనుసరణలు కన్పిస్తాయి. శ్రీకృష్ణుడు కపట యోగిని కుశల ప్రశ్నలు వేయు సందర్భంలో -

క. **ఎందుండి యొచటి కేఁగుచు**
**నిందుల కేతెంచినార లిది తెల్పుడు.** (2-58)

- అన్నపద్యం మనుచరిత్రలోని 'ఎందుండి యెందుఁబోవుచు, నిందుల కేతెంచినార లిపుడు' (మనుచరిత్ర 1-61) పద్యాన్ని బోలివుంది. అల్లే కోసల నగర వర్ణనలోని -

ఉ. **వీరులు, నీతిచారులు, గభీరులు, ధీరులు, సర్థికోటి మం**
**దారులు, ఖడ్గధారులును, ధర్మవిచారులు, వజ్రహారులున్.** (1-15)

అంటూ సాగిన రాజకుమారుల వర్ణన, మొల్లరామాయణంలోని –

ఉ. **రాజులు కాంతియందు, రతిరాజులు రూపమునందు వాహినీ**
**రాజులు దానమందు, మృగరాజులు విక్రమకేళియందు.**
(బాలకాండ 11 పద్యం)

అన్న పద్యాన్ని స్ఫురింపజేస్తుంది.

**లాక్షణికాంశాలు :** శారదాంబగారు సంప్రదాయాన్ని మన్నించినప్పటికి, ప్రాచీన కవుల వలే అక్కడక్కడ కొన్ని స్వచ్ఛంద ప్రయోగాలు చేసారు చూడండి. కోసల నగర కోటను వర్ణిస్తూ –

సీ. **కోటరూపునందన్నుఁగొల్చుచు నుండెడి**
**డంబగు చక్రవాళంబు తోడ.** (1-11)

ఇందులో ద్వితీయ దళంలో 'డ' కు –'ళ' కు యతి పడింది. అప్పకవి

గీ. **పెద్దలాకును దనకు నభేదమగుట**
**ళళలకు నభేద మట్లన కలుగు కతన**
**క్షితిని మూఁడవ సరళంబు యతులఁ బ్రాస**
**ములను లఘ్వలఘు లకారములకు నిలుచు.** (అప్ప 3-93)

పెద్ద, లేద దొడ్డ 'లా' – అంటే 'ళ' కారము. మూడవ సరళము అంటే – 'డ' కారము. లఘు, అలఘు లకారాలు అంటే – 'ల' కార, 'ళ' కారాలు. "ళ కారానికి, 'డ' కారానికి అభేదం కనుక, అలాగే ల, ళ లకు అభేదం కనుక – 'డ' కారము, – 'ల', 'ళ' లతో యతి ప్రాసలు వేసికోవచ్చని అప్పకవి నిర్ణయించాడు. ఈ సంప్రదాయం (అంటే ల–డలకు అభేదం చెప్పడం) యమకం వంటి అలంకారాల విషయంలో కన్పిస్తుంది. దీనిని అనుసరించే అప్పకవి వంటి లాక్షణికులు 'ల–డ' లకు అభేదం చెప్పి ఉంటారు. అప్పకవి ప్రకారం శారదాంబగారి 'ళ–డ' యతి అంగీకార్యము.

అప్పకవీయ తృతీయాశ్వాసానికి 'గురుబాల దీపిక' – అన్న వ్యాఖ్యవ్రాసిన మహాలాక్షణికులు వంతరాం రామకృష్ణారావుగారు దీనిని అంగీకరించలేదు. "అప్పకవి

ల, ళ లకు ద కారమునకు యతిమైత్రి నంగీకరించుట సరికాదు. ఈ యభేదత్వము కొన్నిచోట్ల రూపభేదములేర్పడుటకుఁగారణమగును" – అని (గురుబాల దీపిక పుట 197) ఖండించారు. అప్పకవి ఇచ్చిన ల–ద ప్రాస ప్రయోగాలకు రూపాంతరాలను (జలనిధి–జడనిధి', వ్రీళ–వ్రీడ; వెలలదు వెడలదు ఇత్యాదులు) చూపించి 'ల–ద' లకు యతి ప్రాసలు చెల్లవని చెప్పారు. కాని దిద్దడానికి వీలులేని, రూపాంతరములేని ప్రయోగం ఒకటి తిరుపతి వేంకట కవుల దేవీ భాగవతంలో కన్పిస్తుంది.

**మ. వెలయాంధ్రెక్కద! కూర్మలెక్కద! దయా విశ్వాస భావమ్ము లె**
**కద ! లోలో తలపోయ నేరకిటు మౌఢ్యంబూనఁగా జెల్లనే.**

– దేవీభాగవతము 1–338.

శారదాంబగారు రేఫలను, శకట రేఫలను కలిపారు. కాని అప్పకవి దీనిని అంగీకరించలేదు. అప్పకవి అభిప్రాయాన్ని ప్రస్తావిస్తూ మహాపండితులు రావూరి దొరస్వామి శర్మగారు – 'నణలు, రలలు, లడలు, చసలు, యహలు – ఇత్యాది వర్ణములు ..... సవర్ణములు కావు. ఇట్టి వానికి యతిమైత్రి, మరిఇందుఁగొన్నిటికి ఁబ్రాసమైత్రియు వెలయుచుండఁగా, సవర్ణములై లఘ్వలఘుచ్చారణ మాత్రభేదముగల 'రఱ'ల కేల యతిప్రాసమైత్రి ఘటింపరాదో"– అని ఆశ్చర్యాన్ని (అప్పకవీయ భావప్రకాశిక పుట 67) ప్రకటించారు. ఈ విధంగా లాక్షణికులు ల–డల యతిప్రాసమైత్రి పట్ల, రేఫ శకటరేఫల మైత్రి పట్ల భిన్నాభిప్రాయాలు ప్రకటించారు.

బిందుపూర్వక ప, బ లకు మ కారంతో యతిమైత్రి చెల్లుతుంది. బిందుపూర్వకమైన – య, ర, ల, వ, శ, ష, స, హ – లకు కూడ మ కారంతో యతి చెల్లుతుందని మ కార విరామము దగ్గర అప్పకవి (అప్పకవీయమ 3–76) నిర్ణయించారు. కాని ప, బ లకు మ కారంతో యతి చెల్లదు. శారదాంబగారు ఈ యతిని (అంటే ప, బ, మ యతి) 5 చోట్ల (2–28, 64, 35; 3–4, 53) ప్రయోగించారు.

**ఉ. ఆమహనీయుఁడేద కదునల్బుఁడ నేనిట నేడఁజూడ మా**
**భామిని ఁ బెండ్లి యాడు నను మాట పొసంగునె యా మురారి.** (2–28)

ఇది లక్షణ సమ్మతం కాదు. బిందుపూర్వక య, ర, ల, వ, శ, ష, స, హ – లకు మకార యతిమైత్రిని కూడ వంతరాం వారు ఖండిచారు. అవి అర్థ

మకారోచ్చారణాలని, వాటికి మకారంతో యతిపొసగదని (గురుబాలదీపిక పుట 190) తెల్పి చెప్పారు.

అప్పకవి – 'ము' అక్షరానికి పు, ఫు, బు, భు లతో యతిమైత్రి – అక్కడక్కడ పూర్వ రచనలలో ఉందని (అప్పకవీయము 3–72) చెప్పాడు. ఈ యతికి 'ము' కార యతి అని పేరు పెట్టాడు. పూర్వకవుల ప్రయోగాలను ఇచ్చాడు. స్వీయ ఉదాహరణను ఇవ్వలేదు. ఇతర లాక్షణికులు దీనిని పోలికవడి అని చక్కటి వడి అని పిలిచారు. కానీ ఏ లాక్షణికుడూ 'మె' అక్షరానికి పె, బె లతో యతి చెప్పలేదు. శారదాంబగారు ప్రయోగించారు.

**గీ. అత్తింటికిని జాలబుద్ధి ఁగలిగి**
**మెలఁగి యందఱించే మంచిపేరు గనుమ!** (3–73)

– ఇది లాక్షణిక సమ్మతం కాదు.

ద–డ లకు యతిమైత్రి, ప్రాసమైత్రి కలదని అప్పకవి (అప్పకవీయము 3–264) కొంచెం లోతుగా చెప్పాడు. ఇది ఒక్కొక్క వ్యాఖ్యాతకు ఒక్కొక్క విధంగా అర్థమయింది. 'డ' కారానికి 'ద' కారమాదేశంగావచ్చునపుడు ద, డ లకు యతి కూర్చవచ్చునని, దానిని ఆదేశయతి అంటారని అప్పకవి చెప్పాడని, కాని ఇక్కడ ఆదేశం లేదు కనుక ఈ 'ద–డ' యతి గ్రాహ్యం కాదని రావూరి దొరస్వామి శర్మగారు (భావప్రకాశిక 183) వ్యాఖ్యానించారు. సంస్కృత పదాది 'డ'కారానికి కొన్నిసార్లు 'ద'కారాదేశమవుతుందని అప్పకవే (అప్పకవీయము 2–148) చెప్పాడని, కొన్నిసార్లు 'ద' కారానికే 'డ'కారమగు తుందని అది రావూరి వారి కర్థంకాలేదని వంతరాంవారు (గురుబాలదీపిక పుట 242) వ్యాఖ్యానించారు.

శారదాంబగారు రెండుచోట్ల (1–44, 3–4) ఈయతిని (ద–డ యతి) ప్రయోగించారు.

**ఉ. డెందము నెల్ల నిశ్చలత దీనజనావళి పోషిమైన గో**
**విందుని మీదనే నిలిపి.** (1–44)

ప్రాచీన కవులు ఈ యతిని అరుదుగా ప్రయోగించారు. ద–చ ప్రాసగురించి అప్పకవి అంత లోతుకు దిగలేదు. ఇదికూడ ప్రాచీనులలో చాలా అరుదుగా కన్పిస్తుంది.

త వర్గానికి చెందిన ద-ధలకు; ట - వర్గానికి చెందిన - ట, డ లకు ప్రాసమైత్రి కలదని, అది స్వ వర్గజ ప్రాసమని అప్పకవి(అప్పకవీయము 3-145) చెప్పాడు.

శారదాంబగారు -

**గీ. స్వేద పీడితులగువారి బాధ దీర్ప**

- అని 'ద-ధ'లకు ప్రాసయతి వేసారు. అప్పకవి 'ద-ధ' ప్రాసకు లక్ష్యంగా నన్నయ పద్యం - 'ఉ కాదనకిట్టి సాటియుపకారము' (ఆదిపర్వము 2-200) - అన్న పద్యాన్ని చూపించారు. అందలి 'ద-ధ' ప్రాసలో అపపాఠముందని, దానిని చూచి అనంతర కవులు భ్రమ ప్రమాదాలకు గురై ఆ ప్రాసను ప్రయోగించారని, దానిని అప్పకవి అంగీకరించాదని, అది అగ్రాహ్యమని వంతరాం రామకృష్ణారావు గారు ద-ధ ప్రాసను, ట-డ ప్రాసను నిరాకరించారు.

శారదాంబగారు మరియొక చోట (1-57) 'స-ష' ప్రాస ప్రయోగించారు. ఇది అప్పకవికి సమ్మతమే. కొందరు వ్యాఖ్యాతలు కూడదన్నారు. మరియొకచోట (2-63) శారదాంబగారు అప్రశస్తమైన 'వ-మ' ప్రాస ప్రయోగించారు.

**క. నీవెఱుంగ నట్టి చిత్రము**
**లేమున్నవి చూడంగ నిఖిలేశ్వర!** (2-63)

దీనిని - 'చిత్రము లేవున్నవి' అని దిద్దితే ప్రాస పొసగుతుంది.

క్రింది పద్యంలో మూడవ పాదంలో యతిసందేహంగా ఉంది.

**మ. అనినా సంయమినాథుండిట్లనియె లోకాధీశ ! నే జెప్పు దా**
**నిని నత్యంతము భక్తితోడను మహానిష్ఠన్ శుచిం జేయు మిం**
**కను సంవత్సరమాచరింపంగ వలెన్ సంతాన గౌరీవ్రతం**
**బని లోకంబున దానినంద్రు.** (1-50)

ఇందలి 3 వ పాదంలో - బిందు పూర్వక క కారానికి, ద్రుతపూర్వకమైన సకారంతో యతిమైత్రి కుదిరింది. ఇది అనునాసిక యతి అవుతుందా? లేక యతి భంగమా?

చిమ్మిక (2-11), ఎల్లప్రజలు (1-53) వహించము (2-42) వంటి

స్వచ్ఛంద ప్రయోగాలు కొన్ని ఈ కావ్యంలో కన్పిస్తున్నాయి. రేఫ సంయుక్తాక్షరానికి ముందున్న అక్షరం గురువు అవుతుంది. కాని క్రిందసీసపాదంలో గురువు కాలేదు.

సీ. **రమణీయ శ్రీ వత్స లాంఛనుండు.** (2–22)

ఈ పాదంలో శ్రీకి ముందున్న 'య' గురువైతే గణభంగం జరుగుతుంది. నన్నానంద కావ్యపీఠికలో ప్ర, హ్ర, గ్ర – ఇత్యాది రేఫ సంయుక్తాక్షరాలకు ముందున్న అక్షరం వికల్పంగా లఘువు అవుతుందని, పూర్వకవులలో ఈ ప్రయోగాలు అరుదుగా కన్పిస్తాయని విపులంగా వివరించాను. అయితే వట్రుసుడికి ముందున్న అక్షరం గురువు కావడం ఒక్క పెదపాటి ఎఱ్ఱన 'మల్హణ చరిత్ర'లోనే కన్పిస్తుంది. చూడండి.

మ. **కరుణాంభోధి సమాన మానవిలసత్కల్యాణ కల్యాణభూ**
**ధరధైర్యాస్పద చిత్త చిత్తజసమంత స్వాంత భూరికృపా**
**కర సౌందర్య విశేష .....**

రెండవ పాదంలో 'భూరికృపా'– లో వట్రుసుడికి ముందున్న 'రి' గురవయింది. ఇది లక్షణ సమ్మతం కాదు. ఆధునికులలో మహాకవి దుర్భాక రాజశేఖర శతావధాని గారు 'పుష్పావతి' – అన్న కావ్యంలో అటువంటి ప్రయోగమే చేసారు. నళినీరంజనుడు అనేవాడు మోహనుడిని 'దుర్మతీ' – అని తిడతాడు. అప్పుడు మోహనుడు –

మ. **ఎవడా దుర్మతి! నీవె దుర్మతివి! నీవేక్రోధి! నీవే విరో**
**ధివి! నీవేఖర! నీవెశుక్లవు! విరోధికృత్తువీవే! పరా**
**భవవీవే .....**

– అంటూ సంవత్సరాల పేర్లతో నిందిస్తాడు. ఇక్కడ రెండవ పాదంలో వట్రుసుడికి ముందున్న 'ధి' గురువయింది. దీనిని విశ్వనాథవారు –

"ఇది పొరపాటు కాదు. మోహనుని (కావ్యంలోని పాత్ర) పాండిత్యము దీని వలన వ్యక్తమగుచున్నది. అతడు గురులఘు విభేద మెఱుగని వాడని తెలియుచున్నది. పాత్రయొక్క గుణమును, మనోలక్షణమును వ్యంగ్య భూతములు చేయుటకు నిట్టి రచన చేసిన సంస్కృతాంధ్ర కవులెవ్వరు లేరు. షేక్స్పియరు కూడ నిట్టిశిల్పమును చేసెనో లేదో తెలియదు. 'ఎశ్కిలీస్' అను గ్రీకు నాటక కర్త యిట్టి శిల్పమును చేసెను" – అని సమర్థించి ప్రశంసించారు. శిల్పదృష్టి కలవారే ఇటువంటి అందాలను సృష్టించగలరు.

**విశేష వృత్తాలు :** ఈ గ్రంథంలో రెండు విశేష వృత్తాలు ఉన్నాయి. అవి –

**1. తురంగ ప్రయాతము (1–76) :** ఇది సుగంధి వృత్తము. పూర్వకవులు దీనిని శాలిని, చామర, ప్రశాంతి, శాంతి, హంసయాన అన్నపేర్లతో ప్రయోగించారు. శారదాంబ గారు తురంగ ప్రయాతము – అన్న పేరుపెట్టారు. దీని గణాలు – 'ర–జ–ర–జ–ర'. 9 వ అక్షరం యతిస్థానం.

**2. పంచ చామరము (2–74) :** 'లఘుర్గురుర్నిరంతరం యదా సపంచ చామరః' – అన్నారు. అనుష్టుప్పులోని ప్రమాణికిది రెట్టింపు. దీనికి గణాలు జ–ర–జ–ర–జ–గ. 10 వ అక్షరం యతిస్థానం.

ఈ గ్రంథంలో ఇంకొక విశేషపద్యం ఉంది. అది ఉత్సాహము. కావ్యాలంకార చూడామణి, అప్పకవీయము దీనిని వృత్తమని చెప్పాయి కాని ఇది వృత్తము కాదు. జాతి పద్యము ఇందులో ప్రతిపాదంలో 7 సూర్యగణాలు, ఆపైన ఒక గురువు ఉంటాయి. 5 వ గణం మొదటి అక్షరం యతిస్థానం.

**పరిష్కరణ :** 1902 లో అచ్చయిన ఈ గ్రంథ ప్రతులు ఇప్పుడు ఎక్కడా లభించవు. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో చీకటి పేరుకుపోయిన మారుమూల అరలో, ముందువెనుక అట్టలు పోయి, ముద్రణాసంవత్సరం తెలిపే రెండవ పేజీకూడపోయి – అనాదరణకు గురై, చీకిపోయి శిథిలావస్థలో ఉన్న ఆనాటి అచ్చుప్రతి ఒకటి ఉంది. గ్రంథపాలకుల దయాదాక్షిణ్యాల వలన దీనికొక ప్రతికృతి (xerox) పుట్టింది. అదే ఈ ముద్రణకు ఆధారం. ఇందులో అపురూపమైన శారదాంబగారి ఛాయాచిత్రం కూడ ఉంది. ఇందులో అచ్చుతప్పులు మిక్కుటము. తప్పొప్పులు పట్టికలు లేవు. అచ్చుతప్పులు చాలావరకు దిద్దాను. ఒందురెందు నాకన్నుగప్పినవి ఉంటే ఉండవచ్చును. నేను చేసిన కొన్ని ముఖ్యమైన సవరణలను ప్రస్తావిస్తాను.

**1. గీ. ఎదుట నున్నవారినేఁ గనుల గనదు**
**కనిన వారికి తగిన మన్ననల మఱచు.** (2–53)

ఈ పద్యంలో మొదటి పాదం ఆటవెలెది. మిగతా మూడుపాదాలు తేటగీతి. అందువలన మొదటి పాదాన్ని –

'తన ఎదుట నున్న వారినేఁగనుల గనదు' –

అని దిద్ది తేటగీతిని చేసాను.

**2.క. .... .... శ్రీశు ధ**

**సంజయ సారథి పరాశర గణవిరోధీ.** 2–15 ముద్రిత ప్రతిలోని ఈ పాదాలను

**క. ... ... శ్రీశౌ! ధ**

**సంజయ సారథి ! నరాశనగణ విరోధీ.** అని దిద్దాను.

**3.ఉ. అంతియె దానికిన్ ఫలమునందుచు నుంటిమియివ్విధంబునన్.** (1–41)

ఇక్కడ 'ఉంటిమి యివ్విధంబునన్' అని విసంధి జరిగింది. 'ఉంటి మివ్వి ధంబునన్' – అని దిద్దితే గణభంగమవుతుంది. అందువలన –

**'అంతియె దానికిన్ ఫలము నందుచు వందుచు నుంటి మివ్విధిన్'** – అని సవరించాను.

ప్రతి ఆశ్వాసాంతంలోను 'భాసురమైన నీవెడద వక్షము నందున' – అన్న పద్యంలో తన భర్తకు, కృతిభర్తకు అభేదం కల్పిస్తూ శారదాంబగారు **'శకటబంధం'**లో ఒక ఉత్పలమాల పద్యం వ్రాసారు. ఇందలి ఒక వరుసను కలిపితే 'శ్రీ వెమూరి రామచంద్ర' – అన్న ఆమె భర్తపేరు వస్తుంది. ఆమె పాండితీశబలత సాహిత్య ఆత్మీయతలే కాదు ఆమె కౌటుంబిక పారమ్యత కూడ అందంగా భాసిస్తుంది. అనుబంధంలో దాని చిత్రం ఇచ్చాను. బంధ నిర్మాణంలో సహకరించిన సాహిత్యమిత్రులు శ్రీవైద్యం వేంకటేశ్వరాచార్యుల గారికి నా కృతజ్ఞతలు.

**ఆంధ్రసాహిత్యంలో శారదాంబస్థానం :** పదహారేళ్ల బాలిక వ్రాసిన కావ్యమిది. విజ్జిక, శీల, మారిల, మోరిక – అన్నవారు ప్రాచీనకాలంలో సంస్కృతంలో ప్రౌఢకావ్యాలు, నాటకాలు వ్రాసిన మహాకవయిత్రులు; వారి పేరు ప్రతిష్ఠలకు అసూయచెందిన ధనదేవుడు అన్న పండితుడు – 'స్త్రీలు కవిత్వం చెబితే చెప్పవచ్చునేమోగాని, పండిత చర్చలకు, విద్వద్గోష్ఠులకు వారు సమర్థులు కారు. పురుషులే అందుకు సమర్థులని' తన అక్కసును వెళ్లగ్రక్కాడు.

కాని రాజశేఖరుడు – 'స్త్రియోపి కవీభవేయ సంస్కారోహ్యాత్మని సమవైతి నస్త్రైణం పౌరుషం వా విభాగ మపేక్షతే' – స్త్రీ లెందుకు కావ్యాలు వ్రాయకూడదు.

సంస్కారం హృదయధర్మం. దానికి స్త్రీ పురుష విభాగాలేమిటి? - అని నిలదీసాడు. తన భార్య, మహాకవయిత్రి అయిన అవంతీసుందరి అభిప్రాయాలను గౌరవించాడు. అంతేకాదు సంస్కృతంలో ప్రథమ, మరియు మహాకవయిత్రిగా భావించబడుతున్న విజ్జికను - 'సరస్వతీవ కర్ణాటీ విజయాంకాజయత్యసౌ, యా విదర్భ గిరాంవాసః కాళిదాసాదనంతరమ్' - రమణీయమైన వైదర్భీశైలిలో గ్రంథాలు వ్రాసిన కాళిదాసు తర్వాత స్థానమలంకరింప'దగిన దీమె ఒక్కతియే' - అని గౌరవించాడు. దండి 'సర్వశుక్లా' అని సరస్వతిని వర్ణిస్తే, విజ్జిక - 'నీలోత్పలదళశ్యామాం విజ్జికాం మమ జానతా, వృథైవ దండినా ప్రోక్తం సర్వశుక్లా సరస్వతీ - నల్లకలువలవలె శ్యామవర్ణం గల నాగురించి తెలియక దండి సరస్వతిని 'సర్వశుక్లా' - అని అమాయకంగా వర్ణించాదని తన విద్యాప్రాగల్భ్యాన్ని ప్రకటించింది.

తెలుగులో తొలి కవయిత్రి నన్నయభట్టు సహాధ్యాయి, నారాయణ భట్టు కూతురు కుప్పాంబ అనీ, రంగనాథ రామాయణ కర్త గోనబుద్ధారెడ్డి కూతురు కుప్పాంబిక అనీ రెండు అభిప్రాయాలున్నాయి. గంగాదేవి, తిమ్మక్క, మొల్ల, నాచి, తిరుమలాంబ, శారద, త్రివేణి, రామభద్రాంబ, మధురవాణి, కృష్ణాజి, రంగాజమ్మ ముద్దుపళని, తరిగొండ వెంగమాంబ మొదలైన సుప్రసిద్ధులైన మహాకవయిత్రుల సరసన నిలువదగినవారు శారదాంబగారు. కాని విధి బలీయము. ముగ్ధదశలోనే రాలిపోయారు. అందువలన ఆంధ్ర సాహిత్య చరిత్రలలో ఆమెకు కనీసం ఒక చిన్న పీటకూడ దక్కలేదు.

శతక కవుల చరిత్ర (వంగూరు సుబ్బారావు)లో ఆమె 'మాధవ శతకానికి' కూడ స్థానం దొరకలేదు. దానికి రివైజుడు ఎడిషన్‌వేసి, పీఠికవ్రాసిన నిడదవోలు వేంకట్రావుగారు అనుబంధములోని అకారాద్య నుక్రమణికలో ఆమెపేరు, మాధవ శతకమును ఉచ్ఛరించారు. వంగూరివారు వదలిన ఇతర శతక కవులను శతక కవుల చరిత్ర ఐదవ భాగంలో రాద్దామని ఆయన తలపెట్టారు. కాని అది కార్యరూపం దాల్చలేదు. ఈ విధంగా జీవితంలోనే కాక సాహిత్యజీవితంలోను ఆమె కీర్తి చంద్రికలను కారుమబ్బులు క్రమ్మివేసాయి. దాసుశ్రీరాములుగారి వారసులు కాస్త ఆలస్యంగానైనా ఆగాధజీమూతాల అడుగున మిసుకుమిసుకు మంటున్న ఆమె వెన్నెలలను వెలికి తీస్తున్నందుకు వారిని అభినందించాలి.

శ్రీరాములు గారి మునిమనుమలు దాసుశ్రీరాములు స్మారకసమితి - అన్న సంస్థను స్థాపించి, లభ్యమైన ఆయన రచనలను అచ్చువేస్తున్నారు. ఆ సంస్థ గౌరవ కార్యదర్శి డా. అచ్యుతరావు గారు NGRI (National Geographysical Research Institute) లో శాస్త్రవేత్త (Scientist) గా రిటైరైనా విశ్రాంత జీవితాన్ని సాహిత్య సేవలో గడుపుతూ ధన్యులవుతున్నారు. శ్రీరాములుగారి సాహిత్యాన్ని వెలికి తీయడంలోను, మసక బారుతున్న ఆయన తేజస్సుకు చికిలి పట్టించడములోను ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారు. అంతేకాక యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాదులో 'దాసు శ్రీరాములు బంగారుపతకం (Gold Medal) ఏర్పాటు చేసారు. 2014 నుండి ప్రతి సంవత్సరం (MA) తెలుగు సంప్రదాయ సాహిత్యంలో ప్రథమస్థానం పొందిన విద్యార్థికి దానిని ప్రదానం చేస్తున్నారు. కేవలం పేరు ప్రతిష్ఠలకోసం కొయ్యకలాలను పట్టుకొని కొక్కిరి బిక్కిరి రచనలు చేస్తూ పైరవీలతో పురస్కారాలు పొందుతూ బడాయిలు పోతున్న ఈ తుంటరి కాలంలో, జేబుడబ్బును వెచ్చిస్తూ తమ పూర్వుల రచనలు ముద్రిస్తూ, భాషలో ప్రతిభ చూపిస్తున్న సాహిత్య విద్యార్థులకు పురస్కారాన్ని అందిస్తూ - అచ్యుతరావుగారు చేస్తున్న చాకిరీ ఖరీదు కట్టలేనిది. సాహిత్య సమాజానికి ఆదర్శప్రాయమైనది.

స్త్రీ విద్య, స్త్రీ చైతన్యం అంటూ సుమారు నూటపాతికేళ్లనాడు కంఠోక్తిగా చాటిన సరస్వతీ సామ్రాజ్య యువారిణి శారదాంబగారి దార్శనికతను వినుతిస్తూ ఇలా ముగిస్తాను.

**ఆ.వె.** **వనిత విద్యయే ప్రపంచాభివృద్ధికి**
**మొదటిమెట్టటంచు పూని చాటి**
**వేగుచుక్క యయ్యె వెలది జగత్తుకు**
**సాధుగణ కదంబగు శారదాంబ**

**శ్లో.** **పురుషవద్ యోషితోఽపి కవీభవేయుః**
**సంస్కారోహ్యాత్మని సమవైతి న స్త్రైణం పౌరుషం**
**వా విభాగ మపేక్షతే, శూయన్తే, దృశ్యన్తేఽపిచ**
**రాజపుత్ర్యో మహామాత్య మహితరో గణికాః**
**కౌతకి భార్యాశ్చ శాస్త్రప్రహత బుద్ధయః కవయశ్చ.**

- రాజశేఖరుని కావ్యమీమాంస

(పురుషులవలె స్త్రీలు కూడ కవులు కావచ్చును. సాహిత్య సంస్కారము ఆత్మ నిష్ఠమైనదే కాని అది స్త్రీ, పురుష వివక్ష చూపదు. రాజపుత్రికలు, మంత్రిపుత్రికలు, గణికలు, కౌతుక వంతులుగ వారి భార్యలు మొదలుగా గల అనేక మంది శాస్త్రప్రహత బద్ధులై, కవులై ఉన్నారని విన్నాము. ప్రస్తుతం ప్రత్యక్షంగా చూస్తున్నాము).

<table>
<tr><td>హేమలంబి<br>మాఘ శుద్ధపాడ్యమి<br>18.01.2018</td><td align="right">ప్రసన్నకవి<br>ఉన్నం జ్యోతివాసు<br>వేములపాడు</td></tr>
</table>

మహిళా సంక్షేమమే మాధవశతకము - డా. పూసల రజనీ గంగాధర్.

సాహితీ కిరణం, నవంబర్ 2019

# మహిళా సంక్షేమార్థకమే మాధవ శతకము



కవి తన గురించి గాక మహిళా సంక్షేమాన్ని కోరుతూ మాధవుని వేడుకోవడం ఈ శతకంలోని ప్రత్యేకత. సాధారణంగా నన్ను రక్షించుమంటూ భగవత్ప్రార్థన చేయడం సహజం. కానీ మహిళలు ఏమి చేయాలో ఏమి చేస్తున్నారో ఏమి చేయకూడదో అనే విషయాలను స్త్రీ సంక్షేమాన్ని కాంక్షించి మహిళా పక్షపాతిగా ఈ శతకం వ్రాయడం.ముఖ్యంగా మహిళలు చదవదగిన భక్తి సహిత చైతన్య శతకం.మాధవా అనే మకుటంతో ఉత్పలమాల చంపకమాల,శార్దూల, మత్తేభ వృత్త పద్యాలతో సున్నితంగా సుందరంగా తీర్చిదిద్దిన ఈ శతకం సంప్రదాయ కవిత్వంతో సంప్రదాయంగా శ్రీతో ప్రారంభించి దశావతార స్తుతితో ముగించడం శతకానికి మరింత శోభనిచ్చింది. ప్రముఖమైన కొన్ని పద్యాలకు చిత్రలేఖనం, భక్తి కీర్తనలు, వాటికి రాగాల పేర్లను సూచిస్తూ పాఠకుని రంజింపచేసేలా రచించడం కవయిత్రి రచనా నైపుణ్యం. ఇందులోని మరోప్రత్యేకత చిత్రకవిత్వం. శకటబంధ గర్భితోత్పలమాల పద్యంలో కవయిత్రి గారి భర్త పేరువచ్చేలా వ్రాయడం. ఆధునిక కవులు ప్రాచీన కవుల చిత్రకవిత్వాన్ని ఆస్వాదించేవిధంగా ఉంది. సంప్రదాయ కవిత్వంలో "తీరుబడిగా, రొప్పుచు, కొంగుజార, ఇసుక గోడ, తడిక కంత, సాయము, సైతము,జోరువాన, గాలిహోరు" వంటి వ్యావహారిక పదాలను ప్రయోగించడం కవయిత్రి నేర్పరితనానికి నిదర్శనం." నందసుతా ! రమాధవ ! వినందగు నామొఱ ప్రేమతోడ, గో/ విందా ! దయానిధీ ! నృహరి ! విష్ణు ! ముకుంద ! సమస్త రక్షకా ! / సుందర హైమచేల ! మధుసూదన ! రమ్యగుణా ! త్రివిక్రమా ! / పొందుగ బుద్ధిశాలినిగ బ్రోవుము శ్రీధర ! శూర మాధవా ! " అంటూ మాధవుని కున్న పర్యాయ పదాలతో ఉత్పలమాల పద్యాన్ని రచించడం వంటి ప్రయోగాలెన్నో ఉన్న ఈ మాధవ శతకము ముఖ్యంగా ఆధునిక ఔత్సాహిక పద్యకవులు తప్పక చదువదగిన ఒక మంచి పుస్తకం. ప్రాచీన కవుల పద్యరచనా విధానానికి ఈ శతకం దర్పణం వంటిది. స్త్రీలు తమ విలువైన సమయాన్ని ఎలా దుర్వినియోగం చేసుకొంటున్నారో ఈ ఒక్క పద్యం చదివితే చాలు.మహిళలలో మార్పురావచ్చు."తలద్రువ్వంగను నొక్క గంట, మరి పెట్టన్ సొమ్ములం గంట, చీ / రెలగట్టంగను, బొట్టుబెట్టనగు నీ రెండుం దగన్ గంటయీ / యిలలో నెందరు స్త్రీలు తీరుబడిగా నీలీల గావింతు రిం / దులలో గొంచెము సేపు విద్యకొరకుం జూపట్టదే మాధవా ! " .పుస్తకం హస్తభూషణం - శతకం మస్తకభూషణం .తక్షణమే కొని చదవండి.

**వెల 100 /- రూ, రచన -వేమూరి(దాసు )శారదాంబ, ప్రతులకు - డా ॥ దాసు అచ్యుతరావు, ఫ్లాట్ నెం- 201 శ్రీ సాయిరామ్ ఆదిత్యా రెసిడెన్సీ,ఇంజనీర్స్ కాలని.ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్ -500073.ఫోన్ -040-23734864మరియు అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు.**

**సమీక్షకులు - డా ॥ పూసల రజనీగంగాధర్,హైదరాబాద్, 9290680605**

చారిత్రక ప్రాధాన్యం కలది ఈ మాధవ శతకము - ఆచార్య ముదిగొండ శివప్రసాద్.

ఆంధ్రభూమి, నవంబర్ 30, 2019

# చారిత్రక ప్రాధాన్యం గలది ఈ మాధవ శతకము

'తెలుగునాడు' పేరుతో వచ్చిన పద్య కృతికి చారిత్రక ప్రాధాన్యం వుంది. దీనిని రచించినవారు దాసు శ్రీరాములుగారు. ఇందులో 19వ శతాబ్దము నాటి సాంఘిక రాజకీయ సామాజిక పరిస్థితుల చిత్రణ చేయబడింది. ఇలా మరికొన్ని భాగాలు వారు రచించాలని ప్రయత్నించారు కాని విప్ర కుల స్థుల ఆచార వ్యవహారాలతోనే ప్రథమ భాగం ముగిసింది. ఆ తర్వాతివి రాలేదు.

దాసు శ్రీరాములుగారు సంధి యుగానికి చెందినవారు. అప్పటికే పాశ్చాత్య సభ్యత దేశాన్ని ఆక్రమించుకుంది. ప్రాచీన వైదిక ఆచారాలు మసక బారాయి. ముదికరణాలు రాము గుడి ముందట కూర్చొని కొత్తగా వచ్చిన ఎఫ్ఏ, బిఏలలోని మంచి చెడ్డలు చర్చించుకుంటూ ఉండేవారు.

శ్రీరాములుగారు 1846 నుండి 1908 వరకు జీవించారు. వీరికి ఆరుగురు మగ పిల్లల తర్వాత ఒక ఆడపిల్ల జన్మించింది. ఆమెకు శారదాంబ అని పేరు పెట్టారు. ఈమెను బాల్యంలో శేషమ్మ అని కూడా శ్రీరాములుగారు పిలుచుకుంటూ ఉండే వారు. శేషమాంబ శ్రీరాములుగారి నాయనమ్మ. కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో శారదాంబ దాసు శ్రీరాములు, జాన కమ్మ దంపతులకు 1881 మే 3వ తేదీన జన్మిం చింది. పూవు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు ఆను వంశికంగా (జెనిటిక్) శారదాంబకు కవితా సౌర భవం వచ్చింది. ఈమె ఏకసంథాగ్రాహి. మధు రంగా పాటలు గానం చేస్తూ ఉండేది.

1888లో ఆమెకు వేమూరి రామచంద్రరావుతో వివాహం జరిగింది. ఆనాటి జనాన పత్రిక, స్త్రీ జనా భ్యుదయ పత్రిక వంటివానిలో ఆమె వ్యాసాలు విమర్శలు కవితలు ప్రచురిస్తూ ఉండేవారు. 19వ శతాబ్దంలో స్త్రీ వివక్ష ఎక్కువగా ఉండేది. లలిత కళలు కేవలం ఒకే కులానికే పరిమితం. స్త్రీ విద్య లేనే లేదు. ఈ దశలో శారదాంబ తన సమకాలీన సమాజంలోని స్త్రీల స్థితిగతులను చిత్రిస్తూ ఒక శతకం వ్రాసింది. దానిపేరే మాధవ శతకము. ఇది బహుకాలముగా అలభ్యము. ఇటీవల దాసు అచ్యు తరావుగారి పూనికతో దాసు శ్రీరాములుగారి స్మృత్యర్థం తీసుకువస్తున్న గ్రంథం ముద్రింపబ డింది. లేకుంటే ఇది కాలగర్భంలో కలిసిపోయి ఉండేది.

ఈమె తన 16 సంవత్సరాల వయస్సులోనే నాగ్నజితీ పరిణయము అనే ప్రౌఢ ప్రబంధాన్ని సంతరించటం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. మంచివారిని దేవుడు తొందరగా తన దగ్గరికి తీసు కొనిపోతాడన్నట్లు శారదాంబ తన 19వ ఏటనే ప్రసవ వేదనలో కన్నుమూయటం ఒక దైవఘటన. పేరుకు తగ్గట్లే శారదాంబ చదువుల సరస్వతి.

"తన తొమ్మిదవ యేట / ననుపమాన ప్రజ్ఞా / నింపుగా వీణ వాయింప నేర్చె/ తన పదియవ యేట / సునిశితంబకు బుద్ధి / దాగొల్పె నేకసంతగ్ర హణము/ తన చతుర్దశ శరత్తున / ముద్దు ముద్దుగా/ నల్లి చిల్లిగ పద్యమల్ల నేర్చె / తనదు పదునార్వ / వత్సరమున నాగజిజ్ఞా /వివాహ ప్రబం ధము సెప్పె / తనదు పందొమ్మిదవ వర్షమునను/ మర్త్య భావమును మాని శాశ్వత బ్రహ్మలోక సిద్ధి గనె/ శారదాంబ నా చిన్ని కూతు / నను దినం బును మఱువక నాత్మనుండు"- ఇది దాసు శ్రీరా ములుగారు తన దేవీ భాగవతములో తన కుమార్తె గురించి వాసుకున్న ఎలిజీ.

ఈ పద్యంవలన నూరేండ్ల నాటి శారదాంబ గారి జీవన వృత్తము ఈ తరం వారికి పరిచయమ వుతున్నది.

శ్రీమతి శారదాంబ పోయాక రెండేండ్లకు అనగా 1901లో కళావతి అనే స్త్రీ జన సంబంధ మైన మాస పత్రికలో ఈ పద్యములు ప్రచురింపబ డినవి. అనగా ఇది జరిగి 120 సంవత్సరాలు దాటి నవని సారాంశము.

ఆనాడు జనానా, శ్రీబాలిక, స్త్రీ హితబోధిని (సతీ హితబోధిని) వంటి పత్రికలు నడుస్తూ ఉండేవి. ఇందులో వృద్ధ వివాహం, బాల్య వివాహం, కన్యాశుల్కం, వరశుల్కం, స్త్రీ విద్య, సతీ సహగమనం వంటి ఎన్నో సమస్యలు ఆనాటి సమా జంలో ఉన్నాయి. ఈ శతకంలోనివి వ్యస్త పద్యాలే అయినప్పటికీ అంతస్సూత్రం ఇదే.

పద్యముల సంఖ్య 101. మాధవా అన్నది మకుటం. అన్నీ వృత్తాలే. మొదటి ఆరు పద్యాలు చివరి ఐదు పద్యాలు దశావతార స్తుతి మినహా యిస్తే తక్కినవన్నీ స్త్రీ జన సంబంధులే.

ముందు శ్రీరామానుగ్రహం కోసం ప్రార్థించిన పద్యాలున్నాయి.

"శ్రీ రమణీ మనోహర సుశీల సుశీల నిజాశ్రిత కష్ట భంజనా" అని ప్రారంభమై 'సారస నేత్ర దాదగు విచారములెల్లను తీర్చి మాధవా' అని ప్రార్థించుట కన్పడుతుంది.

ఈ విచారములు వైయక్తికం కావచ్చు. సామూ హికమూ కావచ్చు. ఎందుకంటే ఆమెది కూడా బాల్యవివాహమే.

(మిగతా సోమవారం)

**-ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్**

**పఠనీయం**

**మాధవ శతకము**

రచన - శ్రీమతి వేమూరి శారదాంబ,

వెల:రూ.100/-,

ప్రతులకు:

అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు.

## నాటి స్త్రీ జీవితానికి దర్పణం - ఆచార్య ముదిగొండ శివప్రసాద్

## ఆంధ్రభూమి, డిసెంబర్ 2, 2019

# నాటి స్త్రీ జీవితానికి దర్పణం

ఆనాటి స్త్రీలు జానపద గేయాలు పాడుకునే వారు. రోకటి పాటలు శ్రమ నివారణకు పాడేవారు. ఎవరైనా ప్రశస్తమైన వ్యక్తిని గురించి చెప్పాలంటే "అతని శేముషిని రోళ్ల రోకళ్ల పాడిరి" అని గుంటూరు జిల్లాలో ఒక నానుడి ఉంది. మరి శారదాంబ దృష్టిలో రోకటి పాటలు కాక రామాయణ భారత భాగవతాది గ్రంథమాలను అధ్యయనం చేయగల పాండిత్యమే విద్య అని భావించినట్లు తోస్తున్నది.

బాల చికిత్స, చరిత్ర, భూగోళం, లెక్కలు, లలిత కళలు స్త్రీలు అభ్యసించాలని ఆమె భావించింది (57వ పద్యం)

32వ పద్యంలో ఆమెఒక ప్రశ్న వేసింది. భారతంలో ఉత్తర నాట్యం నేర్చుకోలేదా? అలాంటప్పుడు స్త్రీలు నాట్యం నేర్చుకుంటే తప్పేమిటి? అది ఒక కులానికే ఎందుకు పరిమితం చేశారు? అని శారదాంబ తార్కికంగా ప్రశ్నించింది.

ఈమెపైన సమకాలీన కందుకూరి వీరేశలింగం వంటి సంఘ సంస్కర్తల ప్రభావం ఉన్నదేమో తెలియదు. గురజాడ పుత్తడిబొమ్మ పూర్ణమ్మ వ్రాయటం, కాళ్లకూరి నారాయణ వరవిక్రయం, చింతామణి మధుసేవ అనే నాటకాలు వ్రాయటం గుర్తుచేసుకోవలసి వుంది. ఏదైనా ఒక గ్రంథం ఒక కాలంలో అవతరిస్తే దాని అవసరం సమాజంలో వుండి ఉన్నది అని చారిత్రకంగా గమనించాలి.

దేవహూతి వేద శాస్త్రపారంగతులు. లీలావతి గణితశాస్త్ర పారంగతురాలు. నరకుని చంపిన సత్యభామ గురించి తెలయనివారెవరు? ఇలా ఆమె ఉదాహరించిన పౌరాణిక చారిత్రక నాయకులు ఆ ఆకాంక్షకు దర్పణం పడుతున్నవి. వింజమూరి తిమ్మక్క ద్విపదలో డోలాయాత్ర రచించింది అని 65వ పద్యంలో పేర్కొన్నది. ఇక కుమ్మరి మొల్ల రామాయణం సుప్రసిద్ధమే. తరిగొండ వెంగమాంబ పేరు తెలియనివారెవరు?

తొమ్మిదవ పద్యంలో ఆమె పౌరాణిక దైవాలను గుర్తుచేసింది. బ్రహ్మ సరస్వతిని నాలుకపై ఉంచుకున్నాడు. విష్ణువుహృదయంలోను శివుడు గంగను నెత్తికెక్కించుకున్నాడు. అర్ధ శరీరం ఇచ్చాడు. ఇలాంటి భారతీయ సమాజంలో స్త్రీలకు గౌరవం లేకపోవటం ఏమిటి అని ప్రశ్నించింది.

> **పఠనీయం**
>
> **మాధవ శతకము**
>
> రచన - శ్రీమతి వేమూరి శారదాంబ,
>
> వెల:రూ.100/-,
>
> ప్రతులకు:
>
> అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు.

73వ పద్యంలో చదువుకున్న స్త్రీలు చెడిపోతారు అంటున్నారు. మరి చదువుకున్న పురుషులు చెడిపోతారా అని ప్రశ్నించింది.

ఒకప్పుడు కూచిపూడి భాగవతులు ఆ అగ్రహారంలో జన్మించిన పదహారు గోత్రములవారే ఉండేవారు. క్రమంగా వెంపటి చినసత్యం వంటివారు జాతి కుల మత వివక్ష లేకుండా నృత్యం నేర్పించారు. గోదావరి జిల్లాలలో పెద్దాపురం వంటి ప్రాంతాలల్లో భోగ స్త్రీలు లలిత కళలో ప్రవీణులై ఉండేవారు. వివాహాలల్లో వారు మేజువాణీ చేయటం పరిపాటి. కాని నేడు అందరూ నృత్య గీతములు అభ్యసిస్తున్నారు.

అంటే 1900 ప్రాంతంలో శారదమ్మ మాధవ శతకము వ్రాసిన నాటి సామాజిక పరిస్థితులకు నేటి పరిస్థితులకు పోలిక లేదు. ఆనాడు ఎఫ్ఏ బిఏ చదివిన మహిళలు లేరంటే అతిశయోక్తి కాదు. ఈ పరిస్థితికి కారణాలు చాలా ఉన్నాయి.

స్వామి దయానంద సరస్వతి స్త్రీలకు కూడా యజ్ఞోపవీతం వేసి వేదమంత్రాలు చదివించే ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. వీరేశలింగం పంతులు గారు ఉన్నవ లక్ష్మీనారాయణగారు స్త్రీ విద్యను ప్రారంభించారు. శారదమ్మ అత్తగారింటికి వెళ్లిన తర్వాత రచనలు చేసినట్లు ఆధారాలు లేవు. ఈనాడు అత్తగారింటికి వెళ్లిన స్త్రీలు తమ బాల్యంలో నేర్చుకున్న నాట్యాన్ని వదిలిపెట్టడం చూస్తూనే ఉన్నాము. ఇదొక కఠోర వాస్తవం.

శ్రీమతి కొటికలపూడి సీతమ్మ ఐదవ ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహిస్తూ స్త్రీ విద్యకై పాటుపడిన పత్రికలకు రచనలు చేసిన మహిళలకు కృతజ్ఞతలు చెప్పింది. పేరు ప్రస్తావించకపోయినా ఈ నుతి శారదాంబకు కూడా అందుతుంది. ఈ గ్రంథానికి ప్రొఫెసర్ బేతవోలు రామబ్రహ్మం, ప్రొఫెసర్ కోత్యాయని, శ్రీ ఉన్నం జ్యోతివసు రాసిన పీఠికలు శ్రేష్ఠంగా ఉన్నాయి. వేదమూర్తి సత్యావేకర్ భారత జాతి పతనానికి రెండు కారణాలు చెప్పారు. మొదటిది ప్రజలు జగత్తును నిర్లక్ష్యం చేసి మోక్ష పురుషార్థం వెంట పడటం, రెండు సమాజంలో సగంమందిగా వున్న స్త్రీ శక్తిని నిర్లక్ష్యం చేయటం. జ్యోతివసు స్త్రీ దూషణ చేసిన హామ్లెట్ నుండి కొన్ని పంక్తులు తన పీఠికలో ఉదాహరించారు. దానికి మూలం జెనిసిస్‌లో స్త్రీ వలన పురుషుడు చెడిపోయాడు అనే పాశ్చాత్య పౌరాణిక విశ్వాసం. ఇది భారతీయం కాదు. ఇక విద్య రెండు రకాలు ఒకటి లౌకికము, రెండవది పరావిద్య. లౌకిక విద్యలు ఉదర పోషణార్థం ఉపయోగపడేది. పరావిద్యలో భారతీయ స్త్రీలు వెనుకబడి ఉండలేదు. దాసు శ్రీరాములుగారు స్వయంగా కవి న్యాయవాది సంఘ సంస్కర్త. ఆయన భావాలను కుమార్తె బాల్యంలోనే పుణికిపుచ్చుకున్నది.

రఘువంశంలో ఇందుమతి, వివాహానంతరం భర్త వద్ద విద్య నభ్యసించిన వైనం జ్యోతివసు గుర్తుచేశారు.

శారదమ్మ కవితా వైభవం - దశావతార వర్ణన

ఇవి కృత్యంతములోని పద్యాలు- వరుసగా పదివృత్తములు దేవతా స్తుతికి పరిమితము.

"సోమకుడెల్ల వేదముల / చోరత నెత్తుకుపోవ వానితో / వేమరు బోరి చంపి మరి/ వేదములెల్లను దెచ్చి బ్రహ్మకున్ / నే మములతో నొసంగితివి / నీరజనాభ! సువర్ణచేల! యీ / పామరురాలి బ్రోవ మది / భారమె యోఝష రూప మాధవా" ఇందు మత్స్యావతార గాథ స్ఫురింపజేయబడింది.

కీర్తనలు: గౌరీ / పురారి సుందరి / మురారి సోదరీ! / సారసలోచన నాదు / కోరిక లీగదే"

మరొక కీర్తన/ పాపవిమోచనీ/ నీ ప్రాపుచేరితి

కోపమేలనాదు/ వెతకును బాపి బ్రోవవే

ఇందులో శారదమాత అనే పదం ద్వారా కీర్తన నామాంకితం చేసింది.....

కొంచెం సేపు విద్యకొరకుంచూపట్టుదే మాధవా" - 68 పేజీ...

ఇది దాసుశ్రీరాములుగాగరి శైలీ విన్యాసమే. మరి ఆత్మా వై పుత్రికానామాసి అనుకుందామా?!

(సమాప్తం)

-ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్

ఆంధ్రభూమి
సోమవారం, 2 డిసెంబర్ 2019

# 'మాధవ శతకం'– మహిళావిద్యకు శతమానం

క్రీ.శ. 1881–99 సం.ల మధ్యన చిరుజీవిత కాలం బ్రతికిన వేమూరి(దాసు) శారదాంబ వ్రాసిన వంద పద్యాల కూర్పుగా ఈ మాధవశతకం 1901 నాటి 'కలావతి' పత్రికలో ప్రచురింపబడినది. పురుష ప్రయత్నం లోపించినచోట మరోదారి కన్పడక 'మాధవుడ్ని' మరోసారి ఆమంత్రణం చేస్తూ ఆత్మిక స్పృహతో మహిళా విద్యకు బీజం వేయటం ఈశతకంలో జరిగింది. ఈమె కంటె మునుపు భక్తితోపాటు, కుటుంబ విషయాలను ప్రస్తావించిన మహిళా శతకాలున్నాయి గానీ, స్త్రీజనవికాసానికై స్త్రీవిద్యను కోరుకున్న శతకాలలో ఇదే మొదటిదని చెప్పవచ్చు. సామాజిక సంబంధాలు బలపడే విధంగా మానవ ప్రబోధాత్మకమైన సాంఘికశతకంగా 'మాధవశతకాన్ని పేర్కొనవచ్చు. కవయిత్రి ఇంటిబడిలోనే సంస్కృతాంధ్ర గ్రంథాభ్యాసం చేయటంతో పొందిన జ్ఞానశక్తిచే స్త్రీ విద్యావశ్యకతను గుర్తించింది. స్త్రీలచదువంటే చెవులు మూసుకునే నాటి సమాజంలోఉన్న పెద్దలలో, తల్లిదండ్రులలో, భర్తలలో, ఆడపిల్లలలో స్త్రీవిద్యకు సంబంధించిన ఆలోచనలను ప్రశ్నలను రేకెత్తింపజేసిన శతకమిది. స్త్రీవిద్యకు సంబంధించిన సమాజతప్పిదాలను పాఠకహృదంతరాళంలో నాటుకునేటట్టు చేసిన రచనయిది. స్త్రీవిద్యకు ప్రధాన ఆటంకమయిన బాల్య వివాహాల గుట్టు రట్టుచేసిన శతకమిది. పురుషులతో పాటు స్త్రీలకు సమానమైన విద్యావకాశాలు లేనందుకు వేలెత్తి చూపిన శతకమిది. గృహ నిర్వహణను, శిశు పోషణాన్ని, స్త్రీలు మరింత సమర్థవంతంగా నిర్వహించటానికి గాని 'కరణేషు మంత్రి'గా భార్య ఉండాలన్నా గాని స్త్రీ విద్య అవసరమని చెప్పింది. సంసారరథం సజావుగా నడవాలంటే విద్యావంతులైన భర్తతో సమానంగా విద్యావంతురాలైన భార్యలుకూడా ఉండాలని గుర్తించమంది. నాటి స్త్రీలకు శాస్త్రజ్ఞానం అందుబాటులో లేక పోయినా, శిశుపోషణ విజ్ఞానం, బాలచికిత్స, చరిత్ర, భూసమాచారం తెలిసి ఉండాలని చెప్పింది. దేశభాషలను స్త్రీలు నేర్చుకోవాలనీ. చదువుకున్న పురుషులు దుష్టులు కానప్పుడు స్త్రీలు చదువుకుంటే దుర్గుణులెట్లవతారని సమాజ సంస్కృతిని ప్రశ్నకు పెట్టిన శతకమిది. అంతేకాక 'మహాకవి దాసు శ్రీరాములు' పుత్రికగా శారదాంబ

" తరుణులు విద్య నేర్చిన స్వతంత్రము లిమ్మను చుండ్రటంచునం
దురెయది కల్లదాము దగునో యెవి పూనగనెవ్వి గూడదో
యెరిగియె పొందుచుంద్రు గద యెప్పుడు గూడను బాగ విద్యలన్
గరచిన వారు గాన నిది న్యాయమె జెప్పగ చూడ మాధవా!"– (ప.79)

అని సామాజిక న్యాయాన్ని ప్రశ్నకు పెట్టింది.

స్త్రీలు స్వతంత్రులవుతారనే భయం పురుషులలో ఉందనీ, అది అసత్యమనీ, అన్యాయమనీ కవయిత్రి ధైర్యంగా చెప్పిన శతకమిది. ఏది మంచియో ఏది చెడ్డదో తెలుసుకునే విచక్షణాజ్ఞానం స్త్రీలకు విద్యవలన ఏర్పడుతుందనీ ఆలోచించమని, చెప్పిన మాధవ శతకం మహిళా విద్యకు 'దిక్సూచి' వంటిది. ఈమె వ్రాసిన మరొక పద్య కావ్యం 'నాగ్నజితీపరిణయము'లో నాయిక చదువుకున్నదేగాక రచయిత్రిగా చేసి వర్ణించిన నవకల్పనతో కూడినది. మరో ప్రపంచానికి దారులు తీసిన రచనగా ఇన్నాళ్ళ నుండి విస్మృతికి గురి అయిన ఈశతకాన్ని 'మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి హైద్రాబాదు వారు' 2017లో పుస్తకరూపంలోకి తేవటం ప్రశంసనీయమనీ, నేటికీ స్త్రీలలో విద్యాశాతం మిథ్యగా ఉన్నరోజులలో ఈశతకాన్ని పాఠ్యాంశంగా పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పక తప్పదు.

డా:జె.కనకదుర్గ

చరవాణి:9491140299

## అరుదైన పద్యరచనలు: మాధవశతకము, నాగ్నజితీ పరిణయము.

**ఆంధ్రజ్యోతి, అక్టోబర్ 18, 2019**

వ్యాసపీఠం

# అరుదైన పద్య రచనలు

ప్రబంధ రచన చేపట్టిన మహిళలను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. శతకాలు రాసిన మహిళల్లో ప్రాచుర్యం పొందినవారు కూడా తక్కువ. వందేళ్ళ కిందట... ఇంట్లో గట్టిగా మాట్లాడడానికే సంశయించే పరిస్థితులు ఉన్న రోజుల్లో పద్నాలుగేళ్ళ వయసులోనే పద్యాలు, పదహారేళ్లకే ప్రబంధాన్నీ ఒక మహిళ రచించడం విశేషమే. అయితే సాహితీ చరిత్రలో ఆమె గురించి తగిన ప్రస్తావన లేకపోవడం దురదృష్టం. 1881లో జన్మించి, పంథొమ్మిది ఏళ్ళు మాత్రమే జీవించి, 1899లో ఈ లోకాన్ని విడిచి వెళ్ళిన వేమూరి (దాసు) శారదాంబ రచనలను మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి ఈ మధ్య వెలుగులోకి తెచ్చింది. శారదాంబ జీవన గమనం అత్యంత ఆసక్తికరం. కవి అయిన తండ్రి దాసు శ్రీరాములు స్ఫూర్తితో పద్యాలు అల్లడం మొదలుపెట్టిన శారదాంబ ఆ రోజుల్లోనే స్త్రీ విద్య, మహిళాభ్యుదయం, మహిళలపై సమాజం, పురుషులు చూపే వివక్షలపై వ్యాసాలు రాశారు. ఏడేళ్ళ వయసులోనే ఆమెకు వివాహం అయింది. భర్త కూడా ఆమెను ప్రోత్సహించారు. శారదాంబ రచించిన 'మాధవ శతకా'న్ని 'స్త్రీజన క్షేమార్థ భగవత్ప్రార్థనా పద్యాలు'గా పేర్కొన్నారు. మహిళా స్వేచ్ఛ గురించి ఆమె ఎంతగానో పరితపించారు. అనవసరమైన ఆడంబరాల కోసం కాకుండా విద్యార్జనతోనే మహిళలకు ఉన్నతి కలుగుతుందని విస్పష్టంగా చాటిచెప్పారు. వారిలో ఆ వివేచనా, పరిణతి కలిగించాలని మాధవ దేవుణ్ణి ప్రార్థించారు. వందేళ్ళ తరువాత కూడా ఆమె ప్రస్తావించిన అనేక సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. ఆ విధంగా 'మాధవ శతకము' ఇప్పటికీ నిత్యనూతనమే! ఇక 'నాగ్నజితీ పరిణయము' శారదాంబలోని పాండితీ పటిమను ఆవిష్కరిస్తుంది. శ్రీకృష్ణుని అష్టభార్యల్లో నాగ్నజితి ఒకరు. వారి పరిణయ గాథను ప్రబంధంగా మలచడంలో శారదాంబ చాతుర్యం ప్రస్ఫుటమవుతుంది. 'మాధవ శతకము' 1901లో 'కలావతి' పత్రికలో ప్రచురితమయింది. 'నాగ్నజితీ పరిణయము' ప్రథమ ముద్రణ 1902లో జరిగింది. మళ్ళీ ఇన్నేళ్ళ తరువాత ఈ రచనలు మరోసారి ముద్రణకు నోచుకున్నాయి. పద్య సాహిత్యాన్ని ఇష్టపడే భక్తజన హృదయులకు ఇవి చక్కని విందు.




**మాధవ శతకము,** పేజీలు: 64, వెల: రూ. 100; **నాగ్నజితీ పరిణయము,** పేజీలు: 120, వెల: రూ. 150; రచన: **వేమూరి (దాసు) శారదాంబ;** ప్రచురణ: దాసు శ్రీరాములు స్మారక సమితి, ప్రతులకు: డా. దాసు అచ్యుతరావు, 040-23734864, araodasu@gmail.com

ఆంధ్రజ్యోతి హైదరాబాద్ • శుక్రవారం 18 అక్టోబరు 2019

**నాగ్నజితీపరిణయము - డా. జె. నరసింహ ప్రసాద్.**

**ఆంధ్రభూమి, డిసెంబర్ 18, 2019**

# నాగ్నజితి పరిణయము

మహాకవి, గొప్ప సంగీత విద్వాంసులు, వాగ్గేయకారులే కాక ఏకసంథాగ్రాహి. సంపన్నుడే గాక గొప్ప దాత కూడా ఐన శ్రీదాసు శ్రీరాములు గారి మేధను వారసత్వంగా పొంది ఆరుగురు అన్నల తరువాత కుమార్తెగా, శ్రీరాములు, జానకమ్మలకు 1881లో జన్మించారు శారదాంబ. తన నాయనమ్మ గారి పేరును శేషమాంబ అని ముద్దుగా పిలుచుకొనేవారు శ్రీరాములు. ఆనాటి సంప్రదాయాల ప్రకారం శారదాంబకు ఏడు సంవత్సరాల వయసులోనే వేమూరి రామచంద్రరావుతో 1888లో వివాహం జరిగింది. శారదాంబ తన 5వ ఏటనుంచే తండ్రివద్దనే సాహిత్యాన్ని అధ్యయనం చేశారు.

శారదాంబ పెళ్లి అయిన ఆరు సంవత్సరాలకు కాపురానికి వెళ్లారు. సాహిత్య సాంగత్యం చేసిన కాలం దాదాపు ఐదు ఏళ్ళకు మించవు. తొలి చూలు ఆడ బిడ్డ, మలిచూలు మగబిడ్డకు జన్మనిచ్చి ప్రసవంలోనే అకాల మరణం పొందినది. అప్పటికి ఆమెకు పంతొమ్మిది సంవత్సరాల వయస్సు. శ్రీరాములు శ్రీదేవీ భాగవతములో వ్రాసిన ఒక సీస పద్యాన్ని బట్టి నాగ్నజిత్ పరిణయమును శారదాంబ తన 16వ ఏట వ్రాసినట్లు తెలుస్తున్నది. ఈ కృతిని చెన్నైలోని పార్థసారథి కోవెల దేవునకు అంకితమిచ్చినది. భర్తతో మద్రాసులో కాపురం చేస్తున్న కాలంలోనే శారదాంబ ఈ కావ్యాన్ని రాశారు అని భావించవచ్చు. ఈమె సంగీత సాహిత్య విదుషీమణి అయినా అత్తమామల ఆరళ్ళకు గురైనది. తాను స్త్రీలకు ఏ స్వేచ్ఛ కావాలని మాధవ శతకంలో కోరుకున్నదో దానికే కరువైనది.నాగ్నజిత్ పరిణయము మూల భాగవతమున రేఖామాత్రముగా దశమ స్కంధములో 31వ శ్లోకము నుంచి 55వ శ్లోకము వరకు వర్ణించబడినది. ఈ కథను శారదాంబగారు 235 పద్య గద్యాలకు పెంచి మూల కథకు కొన్ని మార్పులు చేర్పులు సమకూర్చి వ్రాశారు.

పఠనీయం

**నాగ్నజితి పరిణయం**
**ఫోన్ నెం.040-23734864**

ఏడు ఆబోతులను భృంగి శాపాన్ని అనుభవిస్తున్న యక్షులని కల్పించిన కథను పటిష్టపరిచారు. అసలు కథలో లేని నారదుని నాగ్నజిత్తు కొడుకును, ఇందుమతి రాయబారాన్ని సృష్టించి కావ్యాన్ని రక్తికట్టించారు. కావ్యంలో నాగ్నజిత్ అనే పేరు చెప్పకుండా కావ్యానికి నాగ్నజితి పరిణయం అని పేరు పెట్టడం బాల శారదాంబ గడుసుదనానికి ఒక నిదర్శనం.అవతారికలోని బ్రహ్మస్తుతిలో ఉత్ప్రేక్షా అలంకారాన్ని నిర్మించారు. కోసల నగరాన్ని వర్ణించే సీస పద్యంలో 'సకలంబులగు వృక్షజాతులు గల తోటలను గొప్పలవు నరణ్యముల తోడ', 'ధారుణీదేవి నిజరూపధారిణి యయియచట నివసించియున్నదో యనగ నొప్పు'- భూదేవి నిజరూపంతో అక్కడ నివశిస్తుందా అని అనిపిస్తుందట. ఎంతటి ఆహ్లాదకరమైన వర్ణన. సాధారణంగా ప్రబంధకవులు రాజకుమారులను మానసీమన్మథులని వర్ణిస్తారు. కాని శారదాంబ, భర్తలు భార్యల హృదయాలను దొంగిలించుతారు అని స్వచ్ఛమైన ప్రేమకు పాత్రులని అపురూపంగా చిత్రిస్తూ 'ప్రేయసీ హృదయచోరులు నింక కడుస్ మనోహరాకారులు' అని వర్ణించారు. ఇక అన్నా చెల్లెళ్ళ అనుబంధాన్ని 'ఆ పురమందు గాపులు స్వయంకృషి... చెల్లెలగు దైవత గంగ యనంగ దోచెడిన్' అనే పద్యంలో ఆరుగురు అన్నల ప్రేమానురాగాల బంధాన్ని తన అనుభూతిని ఆత్మీయంగా విపులీకరించారు. తరిగొండ వెంగమాంబ, కృష్ణాజి మొదలైన సుప్రసిద్ధ మహాకవయిత్రుల సరసన నిలువదగినవారు శారదాంబ. పదహారేళ్ళ ప్రాయంలోనే ఇంతటి గొప్ప కావ్యాన్ని వ్రాసిన ధన్యజీవి. డా. దాసు అచ్యుతరావు ఎన్‌జిఆర్‌ఐలో శాస్త్రవేత్తగా పనిచేసి రిటైరై విశ్రాంత జీవితాన్ని సాహిత్య సేవలో గడుపుతున్న ధన్యులు. మూడు తరాల బంధుత్వంతో ముత్తాతగారి కుమార్తె అయిన శారదాంబగారి పంతొమ్మిదవ శతాబ్ది చివరి భాగంలో వ్రాసిన కావ్యాలను వెలికితీసి నేటి సాహితీ పాఠకులకు అందించడం ఎంతో గొప్ప విషయం. వీరి కృషి అసమానం. శ్రీ దాసు శ్రీరాములు స్మారక సమితి ఏర్పాటుచేసి సొంత ఖర్చుతో తన పూర్వీకుల రచనలు ముద్రిస్తూ భాషలో ప్రతిభ చూపిస్తున్న సాహిత్య విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న వీరి కృషి శ్లాఘనీయం. నేటి సమాజానికి వీరు నిజమైన మార్గదర్శకులు.

**- జొన్నాభట్ల నరసింహప్రసాద్**